సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 343

శనివారం 26-8-2023



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



నీరజ్ మెరిసె..

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లోకి అర్హత.. క్వాలిఫయింగ్‌లో టాప్ - 13లో



19,300 దిగువకు నిఫ్టీ

సెన్సెక్స్ 366 పాయింట్లు నష్టం.. వడ్డీ రేట్ల పెంపు ఆందోళనలు - 13లో


SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



చంద్రుడిపై 'ప్రజ్ఞాన్' నడకలు

చందమామ దక్షిణ ధ్రువం ఉపరితలంపై ల్యాండర్ నుంచి రోవర్ ప్రజ్ఞాన్ బయటకు వస్తోన్న దృశ్యాలను ఇస్రో విడుదల చేసింది.

వివరాలు 6లో ▸



'మణిపూర్' కేసులు అసోంకి బదిలీ

మణిపూర్ హింసాకాండ కేసుల విచారణ నుంచి సీబీఐని తప్పించి వాటిని అసోం హైకోర్టుకు సుప్రీం కోర్టు బదిలీ చేసింది.

వివరాలు 6లో ▸



భారత్‌తో చర్చించామన్న డ్రాగన్

ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాలపై భారత్‌తో తమ ప్రధాని చర్చలు జరిపినట్లు చైనా వెల్లడించగా..దాన్ని భారత్ ఖండించింది.

వివరాలు 6లో ▸



ట్రంప్ అరెస్ట్.. విడుదల

అధ్యక్ష ఎన్నికల ఫలితాల తారుమారు ఆరోపణల కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ అరెస్టయి.. విడుదలయ్యారు.

వివరాలు 6లో ▸




వర్సిటీ భవనాల నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్. శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న సీఎం జగన్ తదితరులు

గిరిజనుల్లో విద్యా కాంతులు

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి శంకుస్థాపనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ఈ విశ్వవిద్యాలయం వీరి జీవితాల్లో గొప్ప మార్పునకు నాంది
- రూ.830 కోట్ల ప్రాజెక్టును మూడేళ్లలో జాతికి అంకితం చేస్తాం
- గిరిజనులకు నాలుగేళ్లుగా అన్ని విధాలా అండదండలు.. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలలో తోడ్పాటు
- నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేశాం

2 లో

- మూడు వైద్య కళాశాలలు వేగంగా నిర్మాణం.. ఐటీడీఏల పరిధిలో ఐదు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు
- విలేజ్ క్లినిక్‌లు.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్.. 3,22,538 ఎకరాలకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు..
- రాజకీయంగా, సామాజికంగానూ అండలం.. ఇచ్చిన హామీలు నెరవేర్చి మాట నిలుపుకున్నాం

ఈ ఘనత మోదీ, జగన్‌లదే

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు ఘనత ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం వైఎస్ జగన్‌లకే దక్కుతుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసించారు. శుక్రవారం వర్సిటీ ఏర్పాటుకు సీఎం జగన్‌తో కలిసి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.

2 లో

ఫ్యాక్ట్ చెక్



'అసైన్డ్' రాబందు నీతి రాగాలు!

- 'మీరెలా దళిత బంధువు జగన్?' అంటూ రామోజీరావు కవ్వింపు
- పొరుగు రాష్ట్రంతో పోల్చుతూ తమ నిర్వాకాలను కప్పిపుచ్చే యత్నం
- అసత్యాలతో బుకాయిస్తే బంధువు కాకుండా పోతారా?
- మరి నవరత్నాలు అక్కడెందుకు లేవని ఈనాడుకు రాసే ధైర్యముందా?

3 లో

సచివాలయాల ఉద్యోగులకు
పదోన్నతులు

- కేటగిరి–1 హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు.. ఇప్పటికే పలువురి చేతికి పదోన్నతి పత్రాలు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో మొత్తం 19 కేటగిరీల ఉద్యోగులు
- ఇందులో 17 కేటగిరీల పదోన్నతి చానల్ విధివిధానాలు ఖరారు
- తుది దశలో మిగతా రెండు కేటగిరీల విధివిధానాల ఖరారు



- మండల వ్యవస్థ ఏర్పాటైన 13 ఏళ్ల తర్వాత ఉద్యోగాల భర్తీ
- 'ఎస్ఆర్' రూపకల్పనకు ఏళ్ల సమయం
- 23 ఏళ్ల తర్వాత పదోన్నతులు

2 లో

24 మంది సభ్యులతో టీటీడీ నూతన పాలక మండలి




పొన్నాడ సతీష్ (బీసీ)



యానాదయ్య (బీసీ)



శేషుబాబు (బీసీ)



అశ్వత్థనాయక్ (ఎస్టీ)



తిప్పేస్వామి (ఎస్సీ)

పాలక మండలిలో పలు రాష్ట్రాల ప్రముఖులకూ చోటు

కమిటీని ఖరారు చేసిన సీఎం వైఎస్ జగన్

రాష్ట్రం నుంచి ఎంపికైన సభ్యుల్లో నలుగురు బీసీలు, ఒక ఎస్సీ, ఎస్టీ

- వివరాలు 10లో

రాష్ట్రానికి ప్రతిష్టాత్మక జైవిక్ ఇండియా అవార్డు



పల్నాడు జిల్లా అత్తలూరుపాలెంలో ఆర్గానిక్స్ షాప్

- పెద్ద ఎత్తున ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్నందుకు గుర్తింపు
- అత్తలూరుపాలెం ఎఫ్‌పీవో, బాపట్ల జిల్లా మహిళా రైతు పద్మజకు కూడా.. ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ ప్రకటన
- 7న న్యూఢిల్లీలో అవార్డులు ప్రదానం

14 లో

క్లుప్తంగా...

28న చిత్తూరు జిల్లా నగరిలో సీఎం పర్యటన
జగనన్న విద్యా దీవెన నిధులను జమ చేయనున్న ముఖ్యమంత్రి

సాక్షి, అమరావతి: ఈ నెల 28న సీఎం వైఎస్ జగన్ చిత్తూరు జిల్లా నగరిలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి ఆయన నగరి చేరుకుంటారు. అక్కడ జగనన్న విద్యా దీవెన పథకానికి సంబంధించి నిధులను జమ చేసి బహిరంగ సభలో ప్రసంగిస్తారు. కార్యక్రమం అనంతరం తాడేపల్లికి చేరుకుంటారు.

క్యాన్సర్ రోగి పట్ల సీఎం పెద్ద మనసు
అప్పటికప్పుడు రూ.3 లక్షల సాయం


సీఎం జగన్‌కు తన గోడు వెళ్లబోసుకుంటున్న సరస్వతి


చెక్కు అందిస్తున్న మంత్రి బొత్స

దత్తిరాజేరు : క్యాన్సర్‌తో బాధ పడుతున్న ఓ మహిళ పట్ల సీఎం జగన్ పెద్దమనసుతో స్పందించారు. మరడాం హెలిప్యాడ్ వద్ద విజయనగరం జిల్లా కొండదాడికి చెందిన సరస్వతి సీఎంను కలిసి తన కష్టాలు చెప్పుకుంది. తల్లిదండ్రులిద్దరూ క్యాన్సర్‌తో మృతి చెందారని, తను కూడా క్యాన్సర్‌తో బాధపడుతున్నానని, ఆస్పత్రి, ఇతరత్రా ఖర్చులకు ఇబ్బంది పడుతున్నానని, ఆదుకోవాలని వేడుకుంది. స్పందించిన సీఎం రూ.3 లక్షల సాయంతో పాటు ఉచిత వైద్యం అందించాలని కలెక్టర్ నాగలక్ష్మిని ఆదేశించారు. ఈ మేరకు కొద్ది గంటల్లోనే బాధితురాలికి మంత్రి బొత్స సత్యనారాయణ రూ.3 లక్షల చెక్కు అందజేశారు.

ఇది విప్లవాత్మక మార్పు



కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం మరువలేనిది. రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న సమయానికి 561 ఎకరాల భూమిని అప్పగించింది. యూనివర్సిటీకి అవసరమైన రోడ్డు, విద్యుత్, తాగునీటి సదుపాయం కోసం పూర్తి సహకారం అందిస్తోంది. సాలూరు ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీ రావటం విప్లవాత్మక మార్పునకు సంకేతం. గిరిజన ప్రాంత విద్యార్థులకు ఇదొక వరం.

– కట్టమణి, వైస్ చాన్సలర్, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం

పారిశుద్ధ్యంలో కాకినాడకు జాతీయ గుర్తింపు
ఇండియా స్మార్ట్ సిటీస్ అవార్డ్స్‌లో రెండో స్థానం



సాక్షి, న్యూఢిల్లీ/కాకినాడ: ఇండియన్ స్మార్ట్‌ సిటీ అవార్డ్స్–2022లో కాకినాడ స్మార్ట్‌సిటీ దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. స్మార్ట్‌ సిటీస్ మిషన్, కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఇండియా స్మార్ట్ సిటీస్ అవార్డ్స్ పోటీ విజేతలను కేంద్ర గృహ పట్టణ వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ కూనల్ కుమార్ ఢిల్లీలో శుక్రవారం ప్రకటించారు. ఇందులో పారిశుద్ధ్యం విభాగంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో కాకినాడకు ద్వితీయ స్థానం దక్కింది. పారిశుద్ధ్యం విభాగంలో తొలిస్థానంలో ఇండోర్ (గోబర్ధన్ బయో–సీఎన్జీ ప్లాంట్) మూడు, నాలుగు స్థానాల్లో అహ్మదాబాద్ (ఇంటింటికీ చెత్త సేకరణ పర్యవేక్షణ) , చండీగఢ్ (పర్యవేక్షణ నియంత్ర, డేటా సేకరణ) నిలిచాయి. జాతీయ స్మార్ట్ సిటీ అవార్డును ఇండోర్ గెలుచుకోగా..కేంద్రపాలిత ప్రాంతాల్లో చండీగఢ్‌కు దక్కింది. రాష్ట్రస్థాయి అవార్డుల్లో వరుసగా మధ్యప్రదేశ్, తమిళనాడు, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌లు నిలిచాయి. సెప్టెంబర్ 27న ఇండోర్‌లో నిర్వహించే కార్యక్రమంలో విజేతలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులను అందజేస్తారు. దేశవ్యాప్తంగా 100 స్మార్ట్‌సిటీలు ఉండగా ఈ అవార్డులకు 39 స్మార్ట్‌సిటీలు పోటీ పడ్డాయి. అవార్డుల కోసం 54 ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకున్నారు. కాగా, అవార్డు రావడంపై అధికారులు, సిబ్బందిని కాకినాడ స్మార్ట్‌సిటీ సీఈవో, ఎండీ నాగనరసింహారావు అభినందించారు.

గిరిజనుల్లో విద్యా కాంతులు

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి శంకుస్థాపనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఈ విశ్వవిద్యాలయం వీరి జీవితాల్లో గొప్ప మార్పునకు నాంది


సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్


సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, విజయనగరం : కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం స్థాపన ద్వారా గిరిజనుల జీవితాల్లో గొప్ప మార్పునకు నాంది పలికామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. గిరిజనుల్లో విద్యాకాంతులు నింపే ఈ ప్రాజెక్టును రూ.830 కోట్ల ఖర్చుతో మూడేళ్లలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలం చినమేడపల్లిలో ప్రతిష్టాత్మక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శాశ్వత భవనాల నిర్మాణానికి, ఇతర మౌలిక వసతుల కల్పనకు శుక్రవారం ఆయన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అందుకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. అంతకు ముందు విశాఖపట్నం విమానాశ్రయంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి ఘనంగా స్వాగతం పలికి, ఆయనతో కలిసి నేరుగా చినమేడపల్లికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలంలోని మరడాం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఈ విశ్వవిద్యాలయం వచ్చిందని, రాష్ట్రంలో రెండవ సెంట్రల్ వర్సిటీ అని చెప్పారు. గిరిపుత్రుల జీవితాల్లో ఉన్నత విద్యాకాంతులు నింపడానికి రాబోయే రోజుల్లో ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గిరిజన మిత్రుడిగా, గిరిజన పక్షపాతిగా మన గిరిజనులు ప్రపంచంతో పోటీపడేలా గొప్ప అడుగుకు బీజం పడబోతోందని చెప్పారు. తనను నిరంతరం గుండెల్లో పెట్టుకున్న గిరిజన జాతికి మీ తమ్ముడిగా, అన్నగా, బిడ్డగా రుణపడి ఉంటానన్నారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

> గిరిజనులు స్వచ్ఛమైన మనసు కలిగిన కల్మషం లేని మనుషులు. తరతరాలుగా వారిని పేదరికం వెంటాడుతోంది. ఇప్పటికీ మిగతా ప్రపంచంతో సమం కాని జీవన ప్రమాణాలు వారివి. వారి జీవితాలను మార్చే విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో బాహ్య ప్రపంచంతో అడుగులు వేసే విషయంలో ఇంకా వెనుకబడే ఉన్నారు. ఈ నాలుగేళ్ల పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలతో పాటు, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వారిని గుండెల్లో పెట్టుకుని అడుగులు వేశాం. నాలుగేళ్లలో 58.39 లక్షల గిరిజన కుటుంబాలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.16,805 కోట్ల లబ్ధి చేకూర్చామని చెప్పడానికి గర్వపడుతున్నాను.

నాలుగేళ్లుగా గుండెల్లో పెట్టుకున్నాం

- ఈ నాలుగేళ్లలో గిరిజనుల అభివృద్ధి కోసం అన్ని విధాలా కృషి చేశాం. వారిని గుండెల్లో పెట్టుకున్నాం. అన్ని విధాలా అండగా నిలబడ్డాం. వారిని తోటి ప్రపంచంలో నిలబెట్టే సంకల్పంతో అడుగులు ముందుకు వేశాం.
- తరతరాలుగా నిర్లక్ష్యానికి గురైన నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సోదరుల కోసం ప్రాథమిక విద్య మొదలు ఉన్నత విద్య వరకు అన్ని దశల్లోనూ అండగా నిలుస్తున్నాం. మీడియం నుంచి మౌలిక సదుపాయాల వరకు అన్నింటిలోనూ ఈ నాలుగేళ్లలో విప్లవాత్మక మార్పులతో అడుగులు ముందుకు వేశాం.
- గిరిపుత్రుల అభివృద్ధి పట్ల మనందరి ప్రభుత్వం ఎంతో బాధ్యతగా, దూరదృష్టితో వ్యవహరిస్తోంది. వారి విద్యా సాధికారత కోసం, తోటి పోటీ ప్రపంచంలో గెలవాలని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చాం. 3వ తరగతి నుంచి సబ్జెక్టు టీచర్ అనే కాన్సెప్ట్ అమలవుతోంది. నాడు–నేడుతో వారు చదువుతున్న స్కూళ్ల రూపురేఖలు పూర్తిగా మారాయి. విద్యాకానుకతో బడిపిల్లల రూపాన్ని, బైలింగువల్ విధానంతో వారి టెక్ట్స్ బుక్స్‌నూ మార్చగలిగాం.
- ఆరో తరగతి నుంచి ప్రతి క్లాస్ రూమ్‌ను డిజిటలైజ్ చేస్తున్నాం. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ)లను ఏర్పాటు చేస్తున్నాం. 8వ తరగతి పిల్లలందరికీ ట్యాబ్స్ ఇచ్చే కార్యక్రమం ఒక్క మన రాష్ట్రంలోనే జరుగుతోంది. కల్యాణమస్తు, షాదీ తోఫా కార్యక్రమాలను చదువును ప్రోత్సహించేలా తీసుకొచ్చాం. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత విద్యలో విద్యా దీవెన, వసతి దీవెన తీసుకొచ్చాం.
- మెరుగైన చదువులు, కరిక్యులమ్‌లో మార్పులతో పిల్లలకు విద్యను అందుబాటులోకి తెచ్చిన ఘనత ఒక్క ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే దక్కుతుంది. విదేశీ విద్యా దీవెనలో భాగంగా ప్రపంచంలోని టాప్ 50 వర్సిటీల్లోని 21 ఫ్యాకల్టీలకు వర్తింపజేస్తున్నాం. మొత్తంగా 350 కాలేజీల్లో సీటు సంపాదించుకుంటే చాలు రూ.1.25 కోట్ల వరకు మన పిల్లలకు అండగా నిలుస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే.

రాజకీయంగానూ పెద్దపీట

- నా ఎస్టీలు.. అనే పదానికి అర్థం చెబుతూ గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వనంతగా గిరిజనులకు రాజకీయ పదవులిచ్చి నా పక్కనే పెట్టుకున్నాను. ఏ నామినేటెడ్ పదవి, ఏ నామినేటెడ్ కాంట్రాక్టు తీసుకున్నా నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 శాతం కేటాయించేలా చట్టం చేసి అమలు చేస్తున్నాం. మొట్టమొదట గిరిజన చెల్లెమ్మకు, తర్వాత గిరిజన అన్నకు కేబినెట్‌లో డిప్యూటీ సీఎం పదవిని ఇచ్చి నా పక్కన కూర్చోబెట్టుకున్నాను. గత ప్రభుత్వానికి భిన్నంగా.. రాజ్యాంగబద్ధమైన ట్రైబల్ అడ్వైజరీ కమిటీని కూడా నియమించాం.
- నా ఎస్టీల కష్టాలు, కన్నీళ్లు తెలిసిన మనిషిగా వారికి మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీని మనసా వాచా కర్మణా త్రికరణశుద్ధితో అమలు చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గిరిజన తండాల్లో నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. ఇలా ఇప్పటి వరకు 4.58 లక్షల గిరిజన కుటుంబాల ప్రయోజనం కోసం రూ.410 కోట్లు ఖర్చు చేశాం.

ఆరోగ్య పరిరక్షణలోనూ శ్రద్ధ

- గిరిజన ప్రాంతంలో చిన్నపిల్లల దగ్గర నుంచి బాలింతలు, గర్భవతుల వరకు ఆరోగ్య పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం. సంపూర్ణ పోషణ ప్లస్, చిన్న పిల్లలకు గోరుముద్ద స్కీమ్‌లతో వారు తీసుకునే ఆహారంలో మార్పులు తీసుకురాగలిగాం. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యం అందడం లేదన్న పరిస్థితిని పూర్తిగా మార్చేశాం. ప్రతి గిరిజన గ్రామంలో విలేజ్ క్లినిక్‌లు కనిపిస్తున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమం అమలు జరుగుతోంది.

ప్రతి అడుగూ గిరిజనుల బాగు కోసమే

- గిరిజనుల కోసం ఇంతగా తపించిన ప్రభుత్వం ఏదీ లేదు. 1,53,820 కుటుంబాలకు మేలు చేస్తూ 3,22,538 ఎకరాలను ఆర్వోఎఫ్ఆర్ డీకేటీ పట్టాలు వారి చేతికి అందించింది కూడా మీ బిడ్డ ప్రభుత్వమే. పెట్టుబడి ఖర్చుల కోసం రైతు భరోసా సొమ్ము కూడా మీ బిడ్డ ప్రభుత్వమే ఇస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో మన పిల్లలు 1.30 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులుగా కనిపిస్తున్నారు. ఇందులో నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారే ఏకంగా 84 శాతం కనిపిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని 497 సచివాలయాల్లో పని చేస్తున్న 100 శాతం ఉద్యోగులు నా గిరిజన తమ్ముళ్లు, చెల్లెమ్మలే.
- నవరత్నాల్లోని ప్రతి పథకాన్నీ నా గిరిజనులకు వర్తింపజేసేలా అడుగులు వేశాం. అవినీతి, వివక్షకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో అమలు చేస్తున్నాం. మీ బిడ్డ బటన్ నొక్కుతుంటే నేరుగా నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు వెళ్లిపోతున్నాయి. నాలుగేళ్ల పాలనలో 36.12 లక్షల గిరిజన కుటుంబాలకు ప్రయోజనం కలిగిస్తూ రూ.11,548 కోట్లు డీబీటీ ద్వారా ఇచ్చాం. నాన్ డీబీటీ అంటే ట్యాబ్‌లు, ఇళ్ల పట్టాలు, విద్యా కానుక, సంపూర్ణ పోషణ, గోరుముద్ద వంటివి కలుపుకుంటే 22.26 లక్షల కుటుంబాలకు మరో రూ.5,257 కోట్ల మేలు కలిగింది. మొత్తంగా డీబీటీ, నాన్ డీబీటీ కలుపుకుంటే 58.39 లక్షల గిరిజన కుటుంబాలకు రూ.16,805 కోట్ల లబ్ధి చేకూరింది.
- సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వల్ల గొప్ప మార్పు జరగబోతోంది. దీన్ని మన ప్రాంతానికి మంజూరు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు అభినందనలు.

ఈ ఘనత మోదీ, జగన్‌లదే

- సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ ఏర్పాటుపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- రాష్ట్రంలో విద్యా సంస్కరణలు, సంక్షేమాభివృద్ధి పథకాలు భేష్



సాక్షి ప్రతినిధి, విజయనగరం: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు ఘనత ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకే దక్కుతుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసించారు. శుక్రవారం వర్సిటీ ఏర్పాటుకు సీఎం జగన్‌తో కలిసి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన ఈ ప్రాంతానికి రావడం పట్ల గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. విజయవంతమైన చంద్రయాన్–3 ప్రయోగానికి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట వేదిక కావడం సంతోషకరం అన్నారు. ఇలాంటి రాష్ట్రంలో గిరిజనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అభినందనీయం అని చెప్పారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమష్టి కృషితో రూ.800 కోట్లతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం సాకారమవుతోందన్నారు. 561 ఎకరాల భూమి, విద్యుత్తు, రోడ్డు, నీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సీఎం జగన్ చొరవ తీసుకొని ముందుకు వచ్చారని తెలిపారు. 21వ శతాబ్దానికి ఆధునిక దేవాలయమైన ఈ విశ్వ విద్యాలయం సాలూరు గిరిజన ప్రాంతంలో ఏర్పాటవ్వడం వల్ల పొరుగునున్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని గిరిజనులతో సామాజిక అనుబంధం ఏర్పడుతుందన్నారు.

గిరిజనుల ప్రగతికి దోహదం

ఇక్కడ ప్రసిద్ధి గాంచిన అరకు కాఫీ, నల్ల మిరియాలు, తేనె, పనస, పైనాపిల్ తదితర అటవీ పంటలపై పరిశోధనకు ఈ వర్సిటీ ద్వారా అవకాశం ఏర్పడుతుందని కేంద్ర మంత్రి చెప్పారు. క్రీడా సామర్థ్యాలు, నైపుణ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు దోహదం చేస్తుందన్నారు. ఒడిశాలో ఉన్న యూనివర్సిటీతో ఈ వర్సిటీ భాగస్వామ్యమైతే దేశంలో గిరిజనుల ప్రగతిని ఎంతో ముందుకు తీసుకెళ్ల వచ్చని ఆకాంక్షించారు. ఛత్తీస్‌గఢ్, రాయ్‌పూర్ నుంచి ఒడిశా మీదుగా విశాఖ, గంగవరం పోర్టులను కలిపే గ్రీన్‌ఫీల్డ్ హైవే, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోనే ట్రైబల్ వర్సిటీ ఉండటం కలిసొచ్చే అంశమన్నారు. రాష్ట్రంలో ఆంగ్ల భాష ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ, స్థానికంగా ప్రజల మాతృభాషనూ ప్రోత్సహిస్తూ బోధనలో బైలింగ్వల్ టెక్ట్స్ బుక్స్‌ను ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

కళ్లెదుటే అభివృద్ధి

- భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి గిరిజన ప్రాంతంలోకి వెళ్తుంటే మనం గిరిజనుల కోసం ఏం చేశామో కళ్లెదుటే కనిపిస్తోంది. గిరిజనులకు ప్రత్యేక జిల్లా, ప్రత్యేక యూనివర్సిటీ, వైద్య, ఇంజనీరింగ్ కాలేజీ ఇస్తామని హామీ ఇచ్చాం. దాన్ని నిలబెట్టుకుంటూ ఒకటి కాదు.. రెండు జిల్లాలు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం ఏర్పాటు చేశాం. ఇవాళ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశాం.
- రూ.వెయ్యి కోట్లతో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో మెడికల్ కాలేజీ కడుతున్నాం. మన్యం జిల్లా పార్వతీపురంలో మరో మెడికల్ కాలేజీ వేగంగా నిర్మాణమవుతోంది. గిరిజన ప్రాంతానికి గేట్‌వేగా ఉన్న నర్సీపట్నంలో ఇంకో కాలేజీ కడుతున్నాం.
- కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణం మన కళ్ల ముందే కనిపిస్తోంది. గిరిజన తండాలో జనాభా 500 ఉంటే గ్రామ పంచాయతీగా మార్పు చేస్తామని చెప్పిన మాట నిలబెట్టుకుంటూ.. ఇప్పటికే 165 గిరిజన గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేశాం. ప్రతి ఐటీడీఏ పరిధిలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని మాట ఇచ్చాం. ఆ ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, ఏలూరు జిల్లా బుట్టాయగూడెం, ప్రకాశం జిల్లా దోర్నాలలో రూ.250 కోట్లు ఖర్చుతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మాణంలో ఉన్నాయి.
- ఎస్సీ, ఎస్టీల నుంచి సేకరించిన అసైన్‌మెంట్ భూములకు, ఇతర పట్టా భూముల కంటే 10 శాతం ఎక్కువ పరిహారం ఇస్తామన్న మాట నిలబెట్టుకుంటూ 2021 మే 19న జీవో 109 జారీ చేశాం. ప్రత్యేక ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేశాం.

సచివాలయాల ఉద్యోగులకు పదోన్నతులు

- కేటగిరి–1 హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు
- ఇప్పటికే పలువురి చేతికి పదోన్నతి పత్రాలు



ఇతని పేరు కె.పూర్ణచంద్ర. నాలుగేళ్ల క్రితం అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ఊటుకూరు సచివాలయం గ్రామ ఉద్యాన సహాయకుడిగా నియమితులయ్యారు. నెల క్రితం రాయచోటి మండలంలో కేటగిరి–1 హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. 2019 ఉద్యోగ నియామక రాత పరీక్షలో సంబంధిత కేటగిరిలో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో, ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు.



పల్నాడు జిల్లా వినుకొండ రూరల్ మండలం కోటప్పనగర్‌కు చెందిన పులి శ్రీధర్‌రెడ్డిది వ్యవసాయ కుటుంబ నేపథ్యం. 2019లో బొల్లాపల్లి మండలం వడ్డెంగుంటలో గ్రామ ఉద్యాన సహాయకుడిగా నియమితులయ్యారు. 20 రోజుల క్రితం తెనాలి హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. తాను పీహెచ్‌డీ చేస్తున్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చిందని, అప్పట్లో ఇవి పర్మినెంట్ ఉద్యోగాలు కావని కొందరు బెదరగొట్టారని శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వంపై నమ్మకంతో దరఖాస్తు చేసుకోవడంతో మంచి జరిగిందన్నారు. తన భార్య కూడా గ్రామ ఉద్యాన సహాయకురాలిగా పనిచేస్తోందన్నారు. కాగా, అప్పట్లో ఇతను రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు, ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రథమ ర్యాంకు దక్కించుకున్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా పలువురు పదోన్నతులు పొందారు.

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల పదోన్నతికి నిర్దేశించిన ఉద్యోగం

ఉద్యోగి కేటగిరి	శాఖ	పదోన్నతి తర్వాత పొందే ఉద్యోగం
అగ్రికల్చర్ అసిస్టెంట్	వ్యవసాయ	అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్
పంచాయతీ సెక్రటరీ (గ్రేడ్–5)	పంచాయతీరాజ్	గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శి
డిజిటల్ అసిస్టెంట్	పంచాయతీరాజ్	గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శి
హార్టికల్చర్ అసిస్టెంట్	వ్యవసాయ	కేటగిరి–1 హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్
సెరికల్చర్ అసిస్టెంట్	వ్యవసాయ	టెక్నికల్ అసిస్టెంట్ (సెరికల్చర్)
గ్రామ పశు సంవర్ధక సహాయకులు	పశు సంవర్ధక	వెటర్నరీ వ్యాక్సినేటర్ అండ్ ఎన్యుమరేటర్
ఫిషరీస్ అసిస్టెంట్	పశు సంవర్ధక, మత్స్య	అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్
విలేజి సర్వేయర్ (గ్రేడ్3)	రెవెన్యూ	విలేజ్ సర్వేయర్ (గ్రేడ్ –2)
విలేజ్ రెవిన్యూ ఆఫీసర్ (గ్రేడ్–2)	రెవెన్యూ	విలేజ్ రెవిన్యూ ఆఫీసర్ గ్రేడ్ –1
ఏఎన్ఎం(గ్రేడ్ –3) లేదా వార్డు హెల్త్ సెక్రటరీ	వైద్య	మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్
గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి	హోం	సీనియర్ మహిళా సంరక్షణ కార్యదర్శి1
వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ	మున్సిపల్	జూనియర్ అసిస్టెంట్ (రెగ్యులర్ లైన్)
వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ	మున్సిపల్	వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ
వార్డు శానిటేషన్ సెక్రటరీ (గ్రేడ్–2)	మున్సిపల్	వార్డు శానిటేషన్ సెక్రటరీ గ్రేడ్–1
వార్డు ఎమినిటీస్ సెక్రటరీ (గేడ్–2)	మున్సిపల్	వార్డు ఎమినిటీస్ సెక్రటరీ (గేడ్–1)
వార్డు ప్లానింగ్ సెక్రటరీ (గ్రేడ్–2)	మున్సిపల్	వార్డు ప్లానింగ్ సెక్రటరీ (గ్రేడ్–1)
వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ(గ్రేడ్–2)	మున్సిపల్	వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ (గ్రేడ్–1)

సాక్షి, అమరావతి : నాలుగేళ్ల కిందట సచివాలయాల్లో గ్రామ ఉద్యాన అసిస్టెంట్ (విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్)గా నియామకమైన వారిలో కొందరు నెల క్రితం అదే శాఖలో మండల స్థాయిలో కేటగిరి–1 హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. కొత్త బాధ్యతల్లో చక్కగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో కేటగిరి–1 హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టులు 53 ఖాళీ ఉండగా, ఆ పోస్టులన్నింటినీ విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లతో భర్తీ చేసే ప్రక్రియను ఉద్యానవన శాఖ నెల రోజుల క్రితమే చేపట్టింది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన.. శ్రీకాకుళం జిల్లాలో పది మంది, గుంటూరు జిల్లాలో ఒకరు , వైఎస్సార్ జిల్లాలో ఇద్దరు, కర్నూలు జిల్లాలో ముగ్గురు, చిత్తూరు జిల్లాలో ఇద్దరు చొప్పున నెల క్రితమే పదోన్నతులు పొందగా, మిగిలిన జిల్లాల్లోనూ 35 మందికి పదోన్నతుల ప్రక్రియ పురోగతిలో ఉంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 19 కేటగిరి ఉద్యోగులు పని చేస్తుండగా, అందులో 17 కేటగిరి ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలను సైతం ప్రభుత్వం ఖరారు చేసింది. అంటే.. ఆ 17 కేటగిరి గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాలకు సంబంధించిన పదోన్నతులకు నిర్దేశించిన బాధ్యతల్లో ఖాళీలు ఏర్పడగానే, ఎప్పటికప్పుడు సచివాలయాల ఉద్యోగులకు అవకాశం దక్కుతుంది. మిగిలిన రెండు కేటగిరి ఉద్యోగుల పదోన్నతుల విధివిధానాల ఖరారు తుది దశలో ఉన్నట్టు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికార వర్గాలు వెల్లడించాయి.



మండల వ్యవస్థలో 13 ఏళ్లకు ఎంపీడీవో నియామకం

నాలుగేళ్ల క్రితం వైఎస్ జగన్ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాల నియామకం చేపట్టినప్పుడు ఓర్వలేని ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు ఇవేవీ శాశ్వత ఉద్యోగాలు కావని, ప్రభుత్వం మారితే ఆ ఉద్యోగాలు ఊడతాయేమోనని భయపెట్టాయి. ఆ మాటలు నమ్మని నిరుద్యోగులు అప్పట్లో ఏకంగా 21 లక్షల మందికి పైగానే దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో ఉద్యోగాలు పొందిన వారిలో దాదాపు అందరూ ఏడాది కిందట ప్రొబేషన్ ఖరారు కూడా పూర్తి చేసుకొని అందరు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే పే స్కేలుతో కూడిన వేతనం అందుకుంటున్నారు. వీరిలో ఇంకొందరు మండల స్థాయిలో పని చేసేందుకు పదోన్నతులు కూడా పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1986లో మండల వ్యవస్థ ఏర్పాటైనప్పుడు ఆ మండలాల్లో పని చేసేందుకు ఉద్దేశించిన కీలక స్థాయి ఎంపీడీవోల ఉద్యోగాలకు తొలివిడత 13 ఏళ్ల తర్వాత 1999లో నియామకాలు జరిగాయి. ఆ తర్వాత ఎంపీడీవోలు పదోన్నతులు పొందడానికి సంబంధించిన సర్వీసు రూల్స్‌కు సైతం 2022 వరకు అతీగతీ లేదు. అప్పుడు ఎంపీడీవోగా నేరుగా ఉద్యోగం పొందిన వారికి సైతం 23 ఏళ్ల తర్వాత గానీ పదోన్నతి దక్కలేదు.

ఉద్యోగాల భర్తీ ఓ రికార్డు

సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో కొత్తగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, రెండు నెలల వ్యవధిలోనే ఏకంగా 1.34 లక్షల కొత్త ప్రభుత్వ ఉద్యోగాలను సృష్టించడం ఒక రికార్డు. ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వెనువెంటనే పూర్తి చేయడం మరో రికార్డు. ప్రభుత్వ స్థాయిలో ఒక కొత్త శాశ్వత పోస్టు మంజూరు చేయాలంటే నెలలు, ఏళ్లు పడుతుంది. కానీ, అధికారంలోకి వచ్చిన వెంటనే 1,34,524 కొత్త ఉద్యోగాలను ప్రభుత్వం మంజూరు చేయడం.. ఒకే విడతలో వాటి భర్తీకి నోటిఫికేషన్.. ఏకంగా 21,69,529 మంది దరఖాస్తు.. 35 రోజుల్లోనే రాత పరీక్షల నిర్వహణ.. ఆ తర్వాత 11 రోజులకే ఫలితాల వెల్లడి.. ఇలా అన్నీ చకచకా జరిగిపోయాయి.

సమస్యల పరిష్కారంపై దృష్టి



గ్రామ సచివాలయాల్లో పనిచేసే వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సంబంధించి పదోన్నతుల ప్రక్రియకు విధివిధానాలు ఖరారు కావాల్సి ఉంది. ఆయా శాఖల ఆధ్వర్యంలో అందుకు సంబంధించిన ప్రక్రియ తుది దశలో ఉంది. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో అంత పెద్ద సంఖ్యలో పని చేస్తున్న 1.34 లక్షల మంది ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై ఎప్పటికప్పుడు ఆయా శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతోనూ సమావేశాలు నిర్వహిస్తున్నాం.

– లక్ష్మీశ, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్

100 శాతం జీఈఆర్ సాధించాలి

పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్



సాక్షి, అమరావతి: దేశంలో విద్యార్థుల నమోదులో నూరు శాతం స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) సాధించిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఆకాంక్షించారు. సెప్టెంబర్ 2005 నుంచి ఆగస్టు 2018 మధ్య జన్మించినవారంతా రాష్ట్రంలోని ఏదో ఒక పాఠశాల/కాలేజీలో నమోదై ఉండాలన్నారు. ఇందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం విద్యాశాఖ అధికారులతో ప్రవీణ్ ప్రకాశ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో చేరికలపై చర్చించారు. వచ్చే నెల సెప్టెంబర్ 4 నాటికి రాష్ట్రంలోని బడి ఈడు పిల్లలంతా ఏదో ఒక పాఠశాలలో చేరి ఉండాలన్నారు. వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, జూనియర్ కాలేజీ లెక్చరర్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, జిల్లా అధికారులు, కలెక్టర్లు సమన్వయంతో పనిచేసి నూరు శాతం నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. నూరుశాతం జీఈఆర్ సాధన అంశాన్ని తాను సవాలుగా తీసుకుంటున్నట్టు తెలిపారు. విద్యార్థుల విషయంలో స్థానికంగా నమోదైన అంశాల్లో తప్పులు ఉంటే తన ఉద్యోగానికి రాజీనామా చేస్తానని చాలెంజ్ విసిరారు. జీఈఆర్ సాధించడంలో ఎక్కడా పొరపాట్లు జరగకూడదని.. డేటా అంతా పూర్తి పారదర్శకంగా ఉండాలని కోరారు. జూలై రెండో వారంలో గుడివాడలో ఒక వలంటీర్ 100 శాతం జీఈఆర్ సాధించారని, ఇప్పుడు 63,993 మంది వలంటీర్లు తమ పరిధిలో 100 శాతం జీఈఆర్ సాధించారని గుర్తు చేశారు.

నేడు విశాఖ జిల్లాలో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ పర్యటన

సాక్షి, అమరావతి: విశాఖ జిల్లాలో 29 మంది ఎంపీలతో కూడిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ శనివారం పర్యటించనుంది. పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామ సచివాలయంతో పాటు అదే జిల్లాలోని ఆనందపురం మండలం కొంత్యాం, చందక గ్రామాల్లో పర్యటించి అక్కడ చేపడుతోన్న పనులను పరిశీలించనుంది. ఏపీతో పాటు తమిళనాడు, మహారాష్ట్రల్లో క్షేత్రస్థాయిలో గ్రామీణాభివృద్ధి శాఖ చేపడుతోన్న కార్యక్రమాలను పరిశీలించేందు కు శనివారం నుంచి ఈ నెల 31 వరకు ఎంపీల బృందం పర్యటించనుంది. ఇందులో భాగంగా వైఎస్సార్ జగనన్న భూరక్ష, భూ సర్వే కార్యక్రమంలో గ్రామ కంఠాల పరిధిలోని ఇళ్ల యజమానులకు కొత్తగా యాజమాన్య హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించనుంది.

'అసైన్డ్' రాబందు నీతి రాగాలు!

'మీరెలా దళిత బంధువు జగన్?' అంటూ రామోజీ కవ్వింపు

- అసైన్డ్ భూములపై దళితులకు హక్కుల నుంచి ఎస్సీ కాంపోనెంట్‌లో అగ్రస్థానం దాకా సీఎం జగన్ కృషి ఫలితమే



సాక్షి, అమరావతి: పేదల అసైన్డ్ భూములను రాబందులా ఆక్రమించి ఫిలింసిటీ కోట కట్టుకున్న ఈనాడు రామోజీ దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా నీతులు వల్లించడం విస్మయం కలిగిస్తోంది! ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎస్సీలకు సమున్నత స్థానంతోపాటు అసైన్డ్ భూములపై హక్కులు కల్పించి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలు స్పష్టంగా కనిపిస్తున్నా ‹మీరెలా దళిత బంధువు జగన్?› అని బరితెగింపు కథనాలను రామోజీ నిస్సిగ్గుగా ప్రచురించారు. దేశమంతా ప్రశంసిస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలను పొరుగు రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదని అడిగే ధైర్యం రామోజీకి ఉందా? ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారు? అని టీడీపీ పెద్దలు దురహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తే రామోజీ కలం కదల్లేదు ఎందుకు? దళితులు శుభ్రంగా ఉండరని, వారికి చదువు రాదని, అయినాసరే సూపరింటెండెంట్లు అయిపోతారంటూ నాటి మంత్రి ఒకరు తమ పెత్తందారీతనాన్ని బయటపెట్టుకుంటే రామోజీ ఎక్కడ నక్కారు? రాజకీయాలు మీకెందుకు? అంటూ దళితులనుద్దేశించి నాటి టీడీపీ ఎమ్మెల్యే పరుష పదజాలంతో చేసిన వ్యాఖ్యలు రామోజీ మరచిపోయినా ప్రజలు మరువరు. రాజధాని అమరావతి ప్రాంతంలో చంద్రబాబు సర్కారు దళితులను భయపెట్టి భూములను కాజేయడం నిజం కాదా? వ్యవసాయ భూమి ఉన్న దళితులకు కనీసం మోటారు కనెక్షను కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టింది నిజంకాదా? ఎస్సీ కార్పొరేషన్ రుణాల పేరుతో పారదర్శకతకు పాతరేసి అయినవారికి కాంట్రాక్టులు కట్టబెట్టిన ఘనత గత ప్రభుత్వానిది కాదా? ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను చంద్రబాబు సర్కారు నిర్లక్ష్యం చేయడంతో పేదలపైన దళితులపై పెనుభారం పడలేదా? ఉన్నత చదువులు, వైద్యానికి పేదలు దూరం కాలేదా? ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి పథకానికి తూట్లు పొడవటంతో దళిత బిడ్డల చదువులు అర్థాంతరంగా నిలిచిపోలేదా? దళితులకు కనీసం ఒక్క ఇంటి పట్టా అయినా గత ప్రభుత్వం పంపిణీ చేసిందా?

నాలుగేళ్లలో అంతకు మించి..

పొరుగు రాష్ట్రంలో రూ.10 లక్షల చొప్పున దళిత బంధు పథకం కింద సాయం అందిస్తున్నట్లు ఒక పోలిక తెచ్చే ప్రయత్నాన్ని ఈనాడు చేసింది. ఆయా రాష్ట్రాల్లో ఆర్థిక పరిస్థితులు, ప్రాధాన్యతలను అనుసరించి బడ్జెట్ కేటాయింపులు ఉంటాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వివిధ వృత్తుల్లో వున్న ఎస్సీ కుటుంబాలకు డీబీటీ, నాన్ డీబీటీతో అంతకంటే ఎక్కువ లబ్ధి చేకూర్చింది. ఐదేళ్లలో టీడీపీ సర్కారు ఎస్సీల కోసం రూ.24,677.63 కోట్లు ఖర్చు చేయగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలోనే రూ.38,445.35 కోట్లను డీబీటీ ద్వారా 1,31,05,372 మంది దళితులకు నేరుగా పారదర్శకంగా అందించింది. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ వాహనమిత్ర, జగనన్న చేదోడు, వైఎస్సార్ నేతన్న నేస్తం, వైఎస్సార్ మత్స్యకార భరోసా, వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ బీమా, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ లాంటివి ఇందులో ఉన్నాయి. ఇక **పరోక్ష** నగదు బదిలీ ద్వారా జగనన్న తోడు, జగనన్న గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న విద్యాకానుక, ఇళ్ల స్థలాల పంపిణీ, తదితర పథకాలతో ఇప్పటివరకు 68,62,813 మంది లబ్ధిదారులకు మరో రూ.21,475 కోట్ల మేర సాయం అందింది. ఇళ్ల స్థలాల పంపిణీ, ఇంటి నిర్మాణాల ద్వారా దళిత కుటుంబాలకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరింది. రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షలకుపైగా ఇళ్ల పట్టాలిస్తే అందులో 6,36,732 మంది దళిత వర్గాలకు చెందిన అక్కచెల్లెమ్మలే ఉన్నారు. దీనిద్వారా ఆయా కుటుంబాలకు రూ.10,949 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఇక వారి కోసం 4,18,646 ఇళ్ల నిర్మాణాల రూపంలో మరో రూ.10,949 కోట్ల లబ్ధి చేకూరుతోంది. చరిత్రలో ఈ స్థాయిలో దళితులకు ఏ ప్రభుత్వమూ అండగా నిలబడలేదు.



లోపాలను సరిదిద్ది విదేశీ విద్యా పథకం

విదేశీ విద్యా పథకం రద్దైందని, బెస్ట్ అవైలబుల్ పథకం లేదని, పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమాలు లేవంటూ ఈనాడు అవాస్తవాలను కుమ్మరించింది. విదేశీ విద్యా పథకంలో లోపాలు, అక్రమాలను నివారించి ఆ స్థానంలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెచ్చింది. ప్రతిభ ఉన్న విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించేలా, ప్రతిష్టాత్మక కాలేజీల్లో సీటు సాధించిన వారికి పూర్తి స్థాయిలో ఫీజులు చెల్లిస్తూ పథకాన్ని సమున్నతంగా తీర్చిదిద్ది అమలు చేస్తున్నారు. అభ్యర్థులు ఎంచుకోదగ్గ 21 కోర్సుల్లో క్యూఎస్ ర్యాంకింగ్, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంక్‌ల ప్రకారం 50 ఉత్తమ ర్యాంకుల గల విద్యాసంస్థలలో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు గరిష్టంగా రూ 1.25 కోట్లు/ట్యూషన్ ఫీజు100 శాతం చెల్లించేలా పథకాన్ని గొప్పగా మార్చి అమలు చేస్తున్నారు. మిగిలిన వర్గాలకు రూ.కోటి గానీ ట్యూషన్ ఫీజు గానీ (ఏది తక్కువ అయితే అది) చెల్లిస్తున్నారు. ఈ స్థాయిలో విదేశీ విద్యకు గత ప్రభుత్వం భరోసా ఇవ్వగలిగిందా? కనీస ప్రమాణాలు పాటించని పాటించని స్కూళ్లకూ బెస్ట్ అవైలబుల్ స్కీంను గత ప్రభుత్వంలో అమలు చేశారు. ఇప్పుడు ఆ స్కూళ్ల కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియంలో చదువులు అందుతున్నాయి. అత్యుత్తమంగా తరగతి గదులను డిజిటలైజ్ చేస్తున్నారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు అందిస్తున్నారు. బైలింగ్యువల్ టెక్ట్స్‌బుక్స్, డిక్షనరీ, యూనిఫారం, షూలతో విద్యాకానుక అందిస్తున్నారు. నాడు–నేడు ద్వారా స్కూళ్లన్నీ సర్వాంగ సుందరంగా మారుతున్నాయి.

స్టడీ సర్కిళ్లపై తప్పుడు ప్రచారం

పోటీ పరీక్షల కోసం ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ కోచింగ్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తోంది. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో స్టడీ సర్కిల్‌లున్నాయి. తిరుపతి స్టడీ సర్కిల్‌లో బ్యాంక్ పీఓ పరీక్షల కోచింగ్ కార్యక్రమాన్ని నూతన భవనంలో ప్రారంభించారు. సివిల్ సర్వీస్ పరీక్షల కోచింగ్ ప్రోగ్రామ్ విశాఖపట్నం బ్రాంచ్‌లో ప్రారంభించారు. గ్రూప్ 1 సేవల కోచింగ్ విజయవాడలో ప్రారంభమైంది. మరి రామోజీ వీటిని తెలుసుకుంటున్నారా?

- గత ప్రభుత్వం విద్యోన్నతి పథకం కింద 9,775 మంది అభ్యర్థులను శిక్షణ కోసం ప్రైవేట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లకు పంపగా ఒక అభ్యర్థి మాత్రమే ఎంపికయ్యారు. ఆ పథకాన్ని సవరించి సివిల్స్ సర్వీస్ పరీక్షకు ఏపీ స్టడీ సర్కిల్‌లోనే ఇప్పుడు కోచింగ్ ఇస్తున్నారు.
- రాష్ట్రంలో 27 ఎస్సీ, ఎస్టీ పథకాలు నిర్వీర్యం అయ్యాయంటూ ఈనాడు చేసిన మరో ఆరోపణ అవాస్తవం. షెడ్యూల్డ్ కులాల లబ్ధిదారులకు స్థిరమైన జీవనోపాధి కోసం ప్రభుత్వం రూ.133.67 కోట్లతో 2,300 ఎస్సీలకు ఫోర్ వీలర్ మినీ ట్రక్ మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ వాహనాలను రేషన్ సరుకుల డోర్ డెలివరీ కోసం అందించింది.
- గత ప్రభుత్వాలు కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌కు 30 శాతం నిధులు వినియోగించినట్టు ఈనాడు బాకా ఊదుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంతకు మించి ఖర్చు చేసిందన్నది వాస్తవం. 2019–20 నుంచి 2022–23 వరకు ఎస్సీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కోసం షెడ్యూల్డ్ కులాల కాంపోనెంట్‌లో క్యాపిటల్ కింద రూ.3,440.15 కోట్లను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రోడ్లు భవనాలు, గ్రామీణ నీటి సరఫరా, మైనర్ ఇరిగేషన్, పురపాలక, మహిళా శిశు సంక్షేమ తదితర శాఖలు ఖర్చు చేశాయి.
- రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన విప్లవాత్మక భూ సంస్కరణలతో పెద్దసంఖ్యలో ఎస్సీలు లబ్ధి పొందారు. అసైన్డ్ భూముల మీద 33.29 లక్షల ఎకరాల భూములపై వారికి యాజమాన్య హక్కులు కల్పించారు. ఇది ఆయా కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడుతోంది.

ఎస్సీ కాంపోనెంట్‌లో టాప్

ఎస్సీ కాంపొనెంట్ అమల్లో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. దేశంలోని 20 రాష్ట్రాల్లో ఎస్సీ కాంపొనెంట్ కింద చేసిన ఖర్చు కన్నా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో చేసిన ఖర్చే అధికంగా ఉంది. ఎస్సీ కాంపొనెంట్ ద్వారా దేశవ్యాప్తంగా 12.41 లక్షల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటైతే మన రాష్ట్రంలోనే 8.54 లక్షల సంఘాలు ఏర్పాటయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో విడుదల చేసిన నివేదికలోని గణాంకాలు ఇవి. షెడ్యూల్డ్ కులాల కాంపోనెంట్‌కు గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ.33,625.49 కోట్లు ఖర్చు చేయగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలోనే రూ.59,936.48 కోట్లు వెచ్చించింది.

	టీడీపీ హయాంలో		వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో	
ఎస్సీలకు (బడ్జెట్ ఖర్చులు రూ.కోట్లలో)	33,625		59,936.48	
	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
సామాజిక పింఛన్‌లు	8,66,835	4,415.04	11,79,020	13,072.44
ఇళ్ల పట్టాలు	---	----	6,36,732	15,918
గృహనిర్మాణం	---	---	4,18,646	10,949
డీబీటీ/వ్యక్తిగత బెనిఫిట్ స్కీమ్స్	21,43,853	8,844	1,31,05,372	38,445.35
ఎంప్లాయిమెంట్				
సచివాలయాల సిబ్బంది	---	---	28,267 (మొత్తం ఉద్యోగాల్లో 23 శాతం)	
వలంటీర్లు	---	---	69,528 (మొత్తం వలంటీర్లలో 27 శాతం)	
బ్యాక్‌లాగ్ ఖాళీలు	---	---	301	

సెల్ఫ్‌హెల్ప్ ఎంప్లాయిమెంట్ స్కీమ్

టీడీపీ హయాంలో...	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
పేదరికంపై గెలుపు పథకం (రూ.లక్ష వరకు సబ్సిడీ)	2,02,414	2,726
వైఎస్సార్‌సీపీ హయాంలో		
వైఎస్సార్ చేయూత (ఏటా రూ.18,750), వైఎస్సార్ ఆసరా(పొదుపు సంఘాల రుణాల మాఫీ)	23,17,558	7,075.29

ఎస్సీలకు భూములకు సంబంధించిన లబ్ధి

	లబ్ధిదారులు	ఎకరాలు
ఎస్సీలకు భూముల కొనుగోలు పథకం, 22ఏ జాబితా నుంచి మినహాయింపు	14,223	16,213.51
అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ	3,57,805	5,37,719

(ఎస్సీ మహిళా లబ్ధిదారులకు అవసరమైనప్పుడు భూములను విక్రయించడానికి పూర్తి హక్కులు కల్పించారు. ఎస్సీ మహిళా లబ్ధిదారులు బ్యాంకు రుణాలు, రైతు భరోసా, వైఎస్ఆర్ జలకళ, పంట బీమా పొందగలరు. అసైన్డ్ భూముల డీనోటిఫికేషన్ తర్వాత, భూమి హోల్డర్లు తమ భూములపై ఫ్రీహోల్డ్ హక్కులు పొందుతారు. పట్టా భూములతో సమానంగా తమ భూములను అన్యాక్రాంతం చేసుకునే అవకాశాన్ని ప్రస్తుత ప్రభుత్వం కల్పించింది.)

మన ప్రభుత్వాస్పత్రులకు అరుదైన గౌరవం



- విశాఖ ఛాతీ, మానసిక ఆస్పత్రులకు ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు
- దేశంలో ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు పొందిన తొలి ప్రభుత్వ మానసిక ఆస్పత్రిగా రికార్డు
- రాష్ట్ర ప్రభుత్వ కృషికి దక్కిన ప్రతిఫలం



విశాఖ ఛాతీ ఆస్పత్రి

నాలుగేళ్లుగా సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలోని ఛాతీ, సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రి, మానసిక ఆరోగ్య ఆస్పత్రులకు అరుదైన గౌరవం లభించింది. రోగులకు అందిస్తున్న అత్యుత్తమ వైద్య సేవలకు గానూ నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్, హెల్త్‌కేర్ ప్రొవైడర్స్(ఎన్‌ఏబీహెచ్) గుర్తింపు దక్కింది. తద్వారా దేశంలోనే ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు పొందిన తొలి ప్రభుత్వ మానసిక ఆరోగ్య ఆస్పత్రిగా విశాఖ మానసిక ఆస్పత్రి రికార్డును కైవసం చేసుకుంది. ఈ గుర్తింపు 2027 ఆగస్టు తొమ్మిదో తేదీ వరకు అధికారికంగా ఉంటుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న ఈ రెండు ఆస్పత్రులకు ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు కోసం వైద్య, ఆరోగ్య శాఖ దరఖాస్తు చేసింది. దీంతో ఆస్పత్రుల్లో తనిఖీల అనంతరం ఎన్‌ఏబీహెచ్ నిర్దేశించిన మేరకు సేవలు అందించడంతోపాటు నిబంధనలు, మార్గదర్శకాలను అమలు చేస్తుండటంతో గుర్తింపు ఇచ్చారు. ఈ మేరకు ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లకు శుక్రవారం సమాచారం అందించారు.

దేశంలో నాణ్యమైన వైద్యసేవల కల్పన, ఆస్పత్రుల్లో నాణ్యత ప్రమాణాల పర్యవేక్షణ కోసం క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎన్‌ఏబీహెచ్‌ను నెలకొల్పింది. ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు ఇచ్చేందుకు ఒక రోగి ఆస్పత్రిలోకి అడుగు పెట్టినప్పటి నుంచి వైద్యం చేయించుకుని తిరిగి వెళ్లే వరకు అందిస్తున్న సేవలు, భద్రత, ఆస్పత్రి నిర్వహణ, వైద్యులు, సిబ్బంది పనితీరు అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. రోగుల సేవల్లో భాగంగా ఆస్పత్రిలో ఫ్రెండ్లీ, ఆహ్లాదకర వాతావరణం, సెక్యూరిటీ, శానిటేషన్ పక్కాగా నిర్వహణ, ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెందకుండా చేపట్టిన చర్యలు, ఆస్పత్రుల నుంచి వెలువడే వ్యర్థాలను సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదా? అనే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగంలోనే ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సదుపాయాల కల్పనపై సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గత నాలుగేళ్లలో వసతుల కల్పన నుంచి వైద్యుల నియామకం వరకు అన్ని విధాలుగా ఆస్పత్రులను బలోపేతం చేసింది. దీంతో రాష్ట్రంలోని 443కు పైగా ప్రభుత్వాస్పత్రులకు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్వాష్) గుర్తింపు లభించింది. ఎన్‌క్వాష్ గుర్తింపులో దేశంలోనే ప్రస్తుతం ఏపీ మొదటి స్థానంలో ఉంది. తాజాగా విశాఖలోని ఛాతీ, మానసిక ఆస్పత్రికి అరుదైన ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు లభించింది. ఇది రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో చేసిన కృషికి దక్కిన గౌరవమని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

ప్రతిష్టాత్మక గుర్తింపు దక్కింది

ఆస్పత్రికి 150 ఏళ్ల చరిత్ర ఉంది. 300 పడకలు ఉన్న ఈ ఆస్పత్రిలో మానసిక వ్యాధులతో బాధపడే వారికి చికిత్స అందిస్తున్నాం. ఈ ఆస్పత్రిలో పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ సేవలందించేలా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ తరుణంలో అత్యంత ప్రతిష్టాత్మక ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు దక్కడం విశేషం. ఎన్‌ఏబీహెచ్ పొందిన దేశంలోనే తొలి ప్రభుత్వ రంగ మానసిక ఆస్పత్రి మన రాష్ట్రానికి చెందినది కావడం ఎంతో గర్వంగా ఉంది.

– డాక్టర్ రామిరెడ్డి, సూపరింటెండెంట్, విశాఖ మానసిక ఆస్పత్రి

అన్ని ఆస్పత్రులకు నేషనల్ సర్టిఫికేషన్

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రమాణాలను పెంచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నది సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. అందుకు తగ్గట్టుగా సంస్కరణలు చేపట్టాం. పీహెచ్‌సీ నుంచి బోధనాస్పత్రుల వరకూ అన్ని స్థాయిల్లోని ఆస్పత్రులను, వాటిల్లోని విభాగాలను ఎన్‌క్వాష్, లక్ష్య, ముస్కాన్, ఎన్‌ఏబీహెచ్ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్ది సర్టిఫికేషన్ చేయిస్తున్నాం. ఈ క్రమంలోనే విశాఖలోని ఛాతీ, మానసిక ఆస్పత్రులకు ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు వచ్చింది.

– ఎంటీ కృష్ణబాబు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ

31 వరకు వైఎస్సార్ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి: వైఎస్సార్ లైఫ్ టైమ్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ 2023 పురస్కారాలకు దరఖాస్తుల గడువు ఈ నెల 31తో ముగియనున్నట్లు ఐ అండ్ పీఆర్ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారాల తరహాలోనే ప్రజా సేవలో విశిష్ట సేవలను అందించి ప్రతిభ కనబరిచిన వ్యక్తులు, సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ లైఫ్ టైమ్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులతో సత్కరిస్తుందని చెప్పారు. దరఖాస్తుదారులు తమ విజయాలు, సేవలపై ఒక పేజీకి మించకుండా సమాచారాన్ని ఇవ్వడంతో పాటు ఫోన్ నంబర్, ఈ–మెయిల్, చిరునామాలను పొందుపరచాలన్నారు. దరఖాస్తులను సంబంధిత విభాగాలతో పాటు, secy& political@ ap.gov. in మెయిల్‌కు పంపాలన్నారు. ప్రజా సేవలో విశిష్ట సేవలతోపాటు కళలు, సామాజిక సేవ, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసిన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీస్, స్పోర్ట్స్, తదితర రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వ్యక్తులు, గ్రామాల్లో, మురికివాడల్లో పనిచేస్తూ సరైన గుర్తింపు పొందని రాష్ట్రానికి చెందిన వ్యక్తుల్లో పొలిటికల్ ఎన్జీవోలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, చరిత్రలో పేరొందిన సంస్థలు, సంఘాలు దరఖాస్తుకు అర్హులని వివరించారు.

తాబేలు తన అంగాలను ఉపసంహరించుకున్నట్లుగా,
అతడు ఇంద్రియాలను విషయ వస్తువుల నుండి ఎప్పుడు
ఉపసంహరించుకుంటాడో అప్పుడు ప్రజ్ఞ నిలకడగా ఉంటుంది.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 26 ఆగస్టు 2023

ప్రిగోజిన్ ఉత్థాన పతనాలు!


కిరాయి సైన్యం అధిపతి యెవ్‌గనీ ప్రిగోజిన్ బుధవారం విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడని రెండు రోజుల తర్వాత రష్యా అధికారికంగా ధ్రువీకరించింది. రెండు నెలల క్రితం తిరుగుబాటు ప్రకటించి మాస్కోవైపు శతఘ్నులతో దూసుకెళ్లిన ప్రిగోజిన్ అధ్యక్షుడు పుతిన్ మినహా ఇతర ఉన్నత స్థాయి నాయకగణంపై విమర్శలు గుప్పిస్తూ వచ్చాడు. కానీ ఉన్నట్టుండి జూన్ 23న నేరుగా తన కిరాయి సైనికులతో మాస్కో దిశగా దండయాత్రకు తరలివెళ్లి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బహుశా పుతిన్ మినహా మిగిలినవారిపైనే తాను ఆగ్రహిస్తున్నట్టు నమ్మించగలుగుతున్నానని ప్రిగోజిన్ భ్రమపడి వుండొచ్చు. ఈ అలజడి పుతిన్‌ను భయోత్పాతంలో ముంచిందనీ, ఆయన అజ్ఞాతానికి పోయారనీ ప్రచారం జరిగింది. ఆ మర్నాడు మీడియాతో మాట్లాడిన పుతిన్, ప్రిగోజిన్‌ను 'నమ్మక ద్రోహి'గా అభివర్ణించారు. ఇలా ప్రకటించటం మరణ శాసనమేనని అప్పట్లో చాలామంది జోస్యం చెప్పారు. రష్యాలో లేదా విదేశాల్లో ఉంటూ విమర్శలు గుప్పించే రాజకీయ ప్రత్యర్థులు కావొచ్చు, దేశ రహస్యాలను వేరే దేశాలకు విక్రయించినవారు కావొచ్చు పుతిన్ దృష్టిలో నమ్మక ద్రోహులే. ఆ హిట్ లిస్ట్‌లోని వారిలో తప్పనిసరై ఒకరిద్దరిని జైల్లో పడేశారు తప్ప ఇంతవరకూ ఎవరినీ ప్రాణాలతో వదల్లేదు. ఇతరేతర అంశాలైతే వేరుగానీ, నమ్మక ద్రోహాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించబోనని గతంలో పుతిన్ చేసిన ప్రకటనను ప్రిగోజిన్ వ్యవహారంలో కొందరు గుర్తుచేశారు. నిజానికి బెలారస్ మధ్యవర్తిత్వంతో ప్రిగోజిన్ శాంతించారని, అతనికీ, ప్రభుత్వానికీ అంగీకారం కుదిరిందని ప్రకటన వచ్చినప్పుడు ప్రిగోజిన్‌కు రోజులు దగ్గరపడినట్టేనని చాలామంది అనుకున్నారు. అదే సమయంలో పుతిన్ అతన్ని క్షమిస్తారన్న విశ్లేషణలూ వచ్చాయి. ఎందుకంటే ఉక్రెయిన్‌పై ఏడాదిన్నర క్రితం దురాక్రమణ యుద్ధం మొదలెట్టాక రష్యా చేజిక్కించుకున్న పెద్ద నగరం బఖ్‌మూత్. వేరే నగరాలు చిక్కినట్టే చిక్కి చేజారగా, బఖ్‌మూత్ మాత్రం ఇంకా రష్యా నియంత్రణలోనే ఉంది. ఈ విజయం నిస్సందేహంగా ప్రిగోజిన్‌దే. అందుకే అతన్ని మళ్లీ తన దారికి తెచ్చుకుని ఉక్రెయన్‌ను ముప్పుతిప్పలు పెట్టడానికి పుతిన్ వినియోగించుకుంటారని భావించారు. కానీ ప్రిగోజిన్ తలరాతను పుతిన్ అప్పటికే వేరే రాశారు. తన 23 యేళ్ల ఏలుబడిలో పుతిన్ కఠినాత్ముడన్న పేరు తెచ్చుకోవటానికే మొగ్గుచూపారు. కానీ ప్రిగోజిన్ విషయంలో దాన్నంతటినీ తాత్కాలికంగానైనా దిగమింగి అతను క్షేమంగా వెళ్లిపోవటానికి అంగీకరించి, ఆ ఇమేజ్‌ను పోగొట్టుకున్నారు. చివరకు క్రెమ్లిన్‌లో అతని కిరాయి సైన్యంతో సమావేశమైనప్పుడు అందులో ప్రిగోజిన్ సైతం పాల్గొనటానికి పుతిన్ అనుమతించారు.

ఈ ఆధునిక కాలంలో కూడా రాజ్యాలు తమ మనుగడ కోసం కిరాయి సైన్యాలపై ఆధారపడటం వింతగానే ఉంటుంది. అమెరికాలో పోలీసు విధులు కాంట్రాక్టులకు ఇచ్చే అలవాటున్నా సైన్యం విషయంలో ఆ విధానం పెట్టుకోలేదు. ఆఫ్రికా ఖండంలో ప్రస్తుతం అనేక దేశాలు ప్రిగోజిన్ సేవలను వాడుకుంటున్నాయి. వాస్తవానికి పాశ్చాత్య దేశాల మీడియా చాన్నాళ్లుగా ప్రిగోజిన్ గురించి కథనాలు వెలువరిస్తున్నా ఆ సైన్యం ఉనికిని పుతిన్ ధ్రువీకరించలేదు. ఆఫ్రికా ఖండ దేశాల్లో అతని సైనికుల ఆగడాలపై అనేకానేక కథనాలు వచ్చాయి. ఆఖరికి ఉక్రెయిన్ దురాక్రమణ యుద్ధ సమయంలోనూ కిరాయి సేనల ఉనికిని రష్యా అధికారికంగా అంగీకరించలేదు. తమ చట్టాలు ప్రైవేటు సైనిక కంపెనీలను అంగీకరించబోవన్నదే పుతిన్ చెబుతూవచ్చిన జవాబు. కానీ జూన్ 23 నాటి తిరుగుబాటు ఈ వ్యవహారాన్ని బజారున పడేసింది. మాస్కోలో మాఫియా తరహా రాజ్యం నడుస్తోందన్న పాశ్చాత్య మీడియా ప్రచారానికి బలం చేకూర్చింది. రెండు దశాబ్దాలపైగా పుతిన్ అటువంటి రాజ్యాన్నే నడుపుతున్నారనడానికి ఆయన వ్యతిరేకుల అనుమానాస్పద మరణాలను చాలామంది ఉటంకిస్తుంటారు. పుతిన్ అవినీతిపై కథనాలు రాస్తున్న మహిళా జర్నలిస్టు అనా పొలిటికోవ్‌స్కియాను 2006లో కాల్చిచంపారు. ఫెడరల్ సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తూ 2006లో బ్రిటన్ పరారైన అలెగ్జాండర్ లిత్వినెంకో లండన్‌లోని దుకాణంలో రేడియో ధార్మిక పదార్థం కలిసిన టీ తాగి మరణించారు. పుతిన్ అధికారానికి రావటానికి తోడ్పడిన బోరిస్ బెరిజోవ్‌స్కీ ఆయన ఆగ్రహానికి గురై బ్రిటన్ వెళ్లిపోయినా 2013లో అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. 2015లో బోరిస్ నెమ్ట్సోవ్ అనే భౌతిక శాస్త్రవేత్తను క్రెమ్లిన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిచంపారు. ఒకప్పుడు పుతిన్‌కు సన్నిహితంగా మెలిగి తర్వాత అతనికి బద్ధ వ్యతిరేకి అయిన అలెక్సీ నవాల్నీ సైతం 2020లో ఒక రేడియో ధార్మిక పదార్థం బారినపడ్డారు. ఆయన చచ్చి బతికాడనుకుంటే ఇప్పుడు నిరవధికంగా జైల్లో మగ్గుతున్నాడు.

చట్టసభలూ, ఇతర వ్యవస్థలూ సజావుగా పనిచేస్తున్నట్టు కనబడే రాజ్యాల్లో నియంతలు బయల్దేరి వాటిని భ్రష్టుపట్టించటం, అధికారంలో శాశ్వతంగా కొనసాగేట్టు చూసుకోవటం కొత్తేమీ కాదు. కానీ పుతిన్ తీరే వేరు. రాజ్య వ్యవస్థలకు సమాంతరంగా చట్టాలతో సంబంధం లేకుండా పటిష్టమైన సొంత వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని వాటిద్వారా వ్యతిరేకులను అణచివేసే విధానం ఆయనది. ఇది అత్యంత ప్రమాదకరమైనది. ఒకప్పుడు జర్మనీ నియంత హిట్లర్‌ను మట్టికరిపించే క్రమంలో 87 లక్షల మంది సైనికులతో సహా దాదాపు 2 కోట్ల 70 లక్షలమంది ప్రాణాలు పోగొట్టుకున్న దేశానికి ఈ పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించివుండరు. ఏదేమైనా ప్రిగోజిన్ ఉత్థాన పతనాలు వర్తమాన ప్రపంచ దుఃస్థితికి అద్దం పడతాయి.

నవభారత జయధ్వానం

విశ్లేషణ



శ్యామ్ శరణ్

చంద్రుడి మీద దిగడానికి ప్రయత్నించిన రష్యాకు చెందిన లూనా–25 విఫలమై, కొన్ని రోజుల క్రితం పేలిపోయిన సమయంలోనే చంద్రయాన్–3 విజయవంతమైంది. భారతదేశాన్ని అభివృద్ధి చెందుతున్న శక్తిగా భావిస్తున్న అంతర్జాతీయ అవగాహనను ఇది బలపరుస్తుంది. చంద్రయాన్–3 విజయం భారతదేశ ప్రతిష్ఠతో పాటు, బ్రిక్స్ భాగస్వాముల మధ్య మన దేశ స్థితిని మెరుగుపరుస్తుంది. ఆర్థిక, సాంకేతిక సామర్థ్యాలు లేకుండానే భారతదేశం అగ్రగామి శక్తిగా నటిస్తున్నట్లు చైనా భావిస్తుంటుంది. భారత శాస్త్రీయ, సాంకేతిక నైపుణ్యానికి సంబంధించిన ప్రదర్శనలను– అవి అణు, అంతరిక్ష రంగాలైనా, ఐటీ విజయాలైనా చైనా ఆశ్చర్యంతోనే స్వీకరించింది. ఇతర దేశాల నుండి 'అరువు' తెచ్చుకున్నవిగా వాటిని కొట్టిపారేసింది. చంద్రయాన్–3 సాధించిన అత్యుత్తమ విజయాన్ని కూడా ఇదే పద్ధతిలో కొట్టివేయడం కష్టం.

ఉత్కంఠ వీడిపోయింది. నిర్దేశించిన రోజు, సమయం, ప్రదేశంలో చంద్రుని ఉపరితలంపై ల్యాండ్ అయిన చంద్రయాన్–3 సాధించిన మహాద్భుతమైన విజయం పట్ల భారతదేశం సంబరాలు చేసుకుంటోంది. ప్రపంచ నాయకత్వ చిహ్నాలలో సాంకేతిక పురోగతి ఒకటి. అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. చంద్రుని దక్షిణ ధ్రువం వద్ద చంద్రయాన్–3 ల్యాండ్ అయింది. అన్వేషణ కోసం ప్రత్యేకంగా సవాలు విసిరేటటువంటి, పెద్దగా అర్థం చేసుకోని స్థలాన్ని ఎంచుకున్న ఏకైక అంతరిక్ష దేశం భారత్. చంద్రుని అసలైన తత్వం ఇప్పటికీ కలిగి ఉన్నది దాని ధ్రువ ప్రాంతాలు మాత్రమే అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దాని ఉపరితలం చాలా వరకు పెద్ద, చిన్న గ్రహ శకలాల శిథిలాలతో కప్పబడి ఉంది. ఈ శకలాలు వెయ్యేళ్లపాటు చంద్రునిపై పెనుదాడి చేసి, దానిపై పొరలు పొరలుగా పేరుకుపోయాయి. చంద్రుడి లోపలి నీటి కోసం వెతకడంతో సహా 'ప్రజ్ఞాన్ రోవర్' చేయబోయే ప్రయోగాలు, మనకు సమీపంలోని ఖగోళ పొరుగు గురించిన కొత్త జ్ఞానాన్ని వెల్లడిస్తాయి. సున్నితంగా ఉన్న మన సొంత భూగ్రహం చరిత్ర, తయారీలపై మన అవగాహనకు కూడా ఇది సాయపడుతుంది.



ప్రజ్ఞాన్ రోవర్ పంపిన చంద్రుడి ఉపరితల ఫొటో

ఎదుగుతున్న శక్తి

ప్రధాని నరేంద్ర మోదీ బ్రిక్స్ దేశాల (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) శిఖరాగ్ర సదస్సు కోసం దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో ఉన్నప్పుడు, యాదృచ్ఛికంగా అంతరిక్ష పరిశోధనలో ఈ గొప్ప విజయం లభించింది. చంద్రయాన్–3 విజయం భారతదేశ ప్రతిష్ఠతో పాటు, బ్రిక్స్ భాగస్వాముల మధ్య మన దేశ స్థితిని మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థికంగా, సాంకేతికంగా సామర్థ్యం ఉన్న దేశాల సమూహంగా మొత్తం బ్రిక్స్ ప్రభావాన్ని కూడా ఇది ఇతోధికంగా పెంచుతుంది.

చంద్రుడి మీద దిగడానికి ప్రయత్నించిన రష్యాకు చెందిన లూనా–25 విఫలమై, కొన్ని రోజుల క్రితం పేలిపోయిన సమయంలోనే చంద్రయాన్–3 విజయవంతమైంది. ఇప్పటికే అంతరిక్ష ప్రయోగాల్లో అనుభవజ్ఞ దేశంగా ఉన్న రష్యా తన మూన్ ల్యాండింగ్ ప్రాజెక్ట్‌ను భారతదేశం ప్రారంభించిన కొన్ని రోజులకే ప్రారంభించడం యాదృచ్ఛికమే కావొచ్చు. అయినా రష్యా వైఫల్యం, భారత్ విజయాలను పక్కపక్కనే అంచనా వేయడం జరుగుతుంది. వనరుల పరంగా, అధునాతన అంతరిక్ష శక్తిగా దాని హోదాను కొనసాగించడంలో రష్యా వైఫల్యాన్ని దాని క్షీణత, అసమర్థతా లక్షణాలుగా చూస్తున్నారు. అంతరిక్ష ప్రయోగం అనేది అత్యంత ప్రమాదకరమైన, ఖరీదైన అన్వేషణ. 2019 సెప్టెంబరులో చంద్రయాన్–2 చంద్రుని ఉపరితలంపై కూలిపోయినప్పుడు భారతదేశం కూడా నిరాశకు గురైంది. ఇప్పుడు రష్యా తన ఎదురుదెబ్బను అధిగమించి అంతరిక్ష రంగంలో మళ్లీ తన శక్తి పుంజుకోదని నమ్మడానికి ఎటువంటి కారణం లేదు. అయినా దృక్కోణాలు ముఖ్యమవుతాయి. భారతదేశాన్ని అభివృద్ధి చెందుతున్న శక్తిగా, రష్యాను క్షీణిస్తున్న శక్తిగా భావిస్తున్న అంతర్జాతీయ అవగాహనను ఇది బలపరుస్తుంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాల సరసన సమానమైన ర్యాంక్‌లో తాను లేనందున, ఉక్రెయిన్ యుద్ధం ఆ స్థానాన్ని ఏ విధంగానూ దెబ్బతీయలేదనే భావనను ఎదుర్కోవడానికి రష్యా ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టినట్లయితే, అది తన ప్రయత్నంలో విఫలమైంది. రష్యన్ మీడియాలో కూడా, విఫలమైన మూన్ మిషన్ అందుకున్న పరిమితమైన కవరేజీని చూసినట్లయితే, దాని రాజకీయ, మానసిక తిరోగమనం చాలా స్పష్టంగా తెలుస్తోంది.

చైనా వైఖరి మారేనా?

ప్రపంచ ఆర్థిక, సాంకేతిక శక్తిగా చైనా ఎప్పుడూ భారతదేశాన్ని చిన్నచూపు చూస్తోంది. ఆర్థిక, సాంకేతిక సామర్థ్యాలు లేకుండానే భారతదేశం అగ్రగామి శక్తిగా నటిస్తున్నట్లు చైనా భావిస్తుంటుంది. భారతదేశ శాస్త్రీయ, సాంకేతిక నైపుణ్యానికి సంబంధించిన ప్రదర్శనలను– అవి అణు, అంతరిక్ష రంగాలైనా, ఐటీ విజయాలైనా చైనా ఆశ్చర్యంతోనే స్వీకరించింది. ఇతర దేశాల నుండి 'అరువు' తెచ్చుకున్నవిగా వాటిని చైనా కొట్టిపారేసింది. అయితే చంద్రయాన్–3 సాధించిన అత్యుత్తమ విజయాన్ని కూడా చైనా ఇదే పద్ధతిలో కొట్టివేయడం కష్టం. బహుశా భారత్ సాధించిన ఈ విజయంతో చైనా తన అహంకారాన్ని తొలగించుకుని, నమ్రతతో కాకపోయినా మర్యాదపూర్వకంగా వ్యవహరించాల్సిన దేశంగా భారత్‌ను పరిగణించవచ్చు. ఒకరినొకరు సమానంగా చూసుకుంటేనే ఇరు దేశాలు తమ సంబంధాలను మరింత మెరుగుపరచుకోగలవు. చంద్రయాన్–3 విజయానికి చైనా ఎలా స్పందిస్తుందనేది, తూర్పు లదాఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ వద్ద హింసాత్మక ఘర్షణల తర్వాత భారతదేశం పట్ల దాని వైఖరిలో ఏమైనా మార్పు ఉందా అనేది సూచిక అవుతుంది.

చంద్రయాన్–3 ప్రాజెక్టులో విజయం రాబోయే జీ20 శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్య దేశంగా భారత్ హోదాను పెంచుతుంది. శిఖరాగ్ర సమావేశానికి ఇప్పటికే లభిస్తున్న విస్తృత ప్రచారం నేపథ్యంలో, చంద్రయాన్–3 భారత్ కీర్తి ప్రతిష్ఠలకు మరో పార్శ్వాన్ని జోడిస్తుందనడంలో సందేహం లేదు. శిఖరాగ్ర సదస్సు చర్చల సమయంలో, భారతదేశ స్వరం ఎక్కువ దృష్టిని ఆకర్షిస్తుంది. దాని వివిధ కార్యక్రమాలు గౌరవప్రదంగా పరిగణించబడతాయి. అయితే ఇవన్నీ తదనంతర చర్యలలో ప్రతిఫలిస్తాయో, లేదో చూడాలి.

దూరదృష్టి ఫలితం

భారతదేశం కోసం, దాని అభివృద్ధి వ్యూహం కోసం తగిన పాఠాలు ఉన్నాయి. ఇప్పుడు చంద్రయాన్–3 సాధించినదంతా కూడా దేశం పేదగా ఉండి, అభివృద్ధి చెందుతున్నదైనప్పటికీ... అత్యాధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే శ్రేష్ఠమైన సంస్థలను స్థాపించాలనే తొలితరం నాయకుల దూరదృష్టి ఫలితమే. భారతదేశ అణు కార్యక్రమాన్ని అభివృద్ధి చేసిన అటామిక్ ఎనర్జీ కమిషన్‌ను 1948లోనే తొలి ప్రధాన మంత్రి నెహ్రూ ఛైర్మన్‌గా ఏర్పాటైంది. అప్పటి రాజకీయ నాయకత్వం ఈ అధునాతన శాస్త్రీయ సాధనకు ఇచ్చిన అధిక ప్రాముఖ్యతను ఇది ప్రతిబింబిస్తుంది.

వాస్తవానికి, అంతరిక్ష పరిశోధనను సుప్రసిద్ధ శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయి నేతృత్వంలో 1961లో ఏర్పాటు చేసిన ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ అని పిలిచే డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటమిక్ ఎనర్జీకి అప్పగించారు. దీని తర్వాత 1972లో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ఏర్పాటైంది.

ఆటమిక్ ఎనర్జీ కమిషన్ నమూనాలో ఇండియన్ స్పేస్ కమిషన్‌ను ప్రధానమంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ రెండు కమిషన్లు భారతదేశ అధునాతన శాస్త్ర, సాంకేతికతకు మూలస్తంభాలుగా నిలిచి, గణనీయమైన స్వయంప్రతిపత్తిని అనుభవిస్తున్నాయి. అంతేకాకుండా వీటికి బాగా నిధులు సమకూరుస్తున్నారు కూడా. ఈ ముందస్తు, దూరదృష్టితో కూడిన నిర్ణయాలు, భారతీయ శాస్త్రవేత్తలు, సాంకేతిక రంగ కార్మికుల కృషి వల్ల ఇప్పుడు భారతదేశం చేపట్టిన తాజా అంతరిక్ష యాత్ర విజయవంతమైంది.

వ్యాసకర్త విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రకృతి ధర్మం



కుటుంబానికి అశుభం తెచ్చారని భావించే ఇళ్లల్లో ఇవ్వాళ (వరలక్ష్మీ వ్రతం రోజు) పీరియడ్స్ వచ్చిన అమ్మాయిలకు రెండు నిమిషాల ప్రార్థన! నిజంగా మీకూ, మీ వాళ్లకూ వరలక్ష్మీ వ్రతం వరాలు ఇవ్వాలనుకుంటే, రుతుస్రావంలో ఉన్న మహిళలను చీడలా చూడకండి. – చిన్మయి శ్రీపాద, గాయని

అలా అనవచ్చా?



మణిశంకర్ అయ్యర్‌కు కాంగ్రెస్ పార్టీ అన్నీ ఇచ్చింది. అయినప్పటికీ ఎన్నికలు దగ్గరలో ఉన్న ప్రతిసారీ పార్టీని దెబ్బతీసే ప్రకటనలు చేస్తారు. 'పీవీ నరసింహారావు భారతదేశ మొదటి బీజేపీ ప్రధానమంత్రి' అని ఆయన వ్యాఖ్యానించాల్సింది కాదు.

– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

సాహో భారత్



ఇండియా అభివృద్ధి పథంలో ఉందని చెప్పడానికి చంద్రయాన్–3 మిషన్ విజయవంతం కావడం మరో ఉదాహరణ. తరువాతి పదేళ్లకు వివిధ దేశాల వృద్ధి రేట్లను అంచనావేస్తూ నేను గతంలో విడుదల చేసిన ఆర్థికారోగ్య సూచీలో ఇండియా 7 శాతంతో పైస్థానంలో ఉంది. 1984 ప్రాంతంలో డెంగ్ జియావోపింగ్ నాయకత్వంలోని చైనాను ఇది గుర్తుచేస్తోంది. ఇండియాకు అభినందనలు. – రే డాలియో, ఇన్వెస్టర్

భారీ నష్టం



హిమాలయాల్లోని భారీ జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు విపరిణామాలకు దారితీస్తాయి. వాటిని హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్‌లో ఎక్కడ నిర్మించినా; బీజేపీ, కాంగ్రెస్ హయాంలలో ఎవరు అనుమతించినా! – రామచంద్ర గుహ, చరిత్రకారుడు

అంతరంగం



చెప్పాలంటే, ఉద్ధవ్ ఠాక్రేకు రథసారథ్యం వహించాలని శరద్ పవార్ నిర్ణయించుకున్నారు. తన సైన్యాన్ని మాత్రం మోదీ కోసం పోరాడటానికి పంపారు. – టోనీ జోసెఫ్, రచయిత

ఔషధ రంగ అభివృద్ధికి ఆకాశమే హద్దు!

అభిప్రాయం



టి.కె. అరుణ్

సమకాలీన ఆర్థిక విధాన రూపకల్పన విషయంలో 'లైసెన్సింగ్' అనేది ఒక చెత్త పదం. కానీ, స్వయం ప్రకటిత స్వేచ్ఛా – మార్కెట్ ఛాంపియన్ల నుండి విమర్శలను దృష్టిలో ఉంచుకొని అయినా కేంద్ర ప్రభుత్వం ఔషధాల ఎగుమతికి లైసెన్సింగ్‌ను తప్పనిసరిగా ప్రవేశపెట్టాలి. ప్రపంచ ఫార్మసీగా మంచిపేరున్న భారత్ నుంచి స్వేచ్ఛగా ఇతర దేశాలకు ఔషధాల ఎగుమతిని అనుమతించడం అభిలషణీయం కాదు. భారతదేశం ఫార్మారంగంలో సాధించగలిగింది ఎంతో ఉంది. ఇప్పుడు అది తన సామర్థ్యంలో స్వల్ప భాగాన్నే ఉపయోగిస్తోందని చెప్పవచ్చు. నిజానికి జనరిక్ ఫార్మా పరిశ్రమ ఒక్కటే ఇప్పుడున్న పరిమాణానికి పది రెట్లు విస్తరించగలదు.

జూలై 28న, చెన్నైకి చెందిన ఓ కంపెనీ తయారు చేసి, ఇరాక్‌కి ఎగుమతి చేసిన 'కోల్డ్ అవుట్' అనే దగ్గు సిరప్‌లో ఆమోదయోగ్యమైనదిగా భావించే దానికంటే 21 రెట్లు ఎక్కువ స్థాయిలో ఇథైల్ గ్లైకాల్ ఉందని బ్లూమ్‌బెర్గ్ సంస్థ నివేదించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఆమోదయోగ్యమైనదిగా గుర్తించిన అమెరికా ఆధారిత ల్యాబ్‌లో ఈ పరీక్ష జరిగింది.

ఈ సంవత్సరం ఏప్రిల్‌లో మార్షల్ దీవుల్లో, మైక్రోనేషియాలో దగ్గు సిరప్, 'గుయిఫెనెసిన్' టీజీకి చెందిన కలుషిత నమూనాలను డబ్ల్యూహెచ్‌ఓ కనుగొన్నట్టు బ్లూమ్‌బెర్గ్ నివేదించింది. ఈ సిరప్‌ను భారతీయ ఫార్మాస్యూటికల్ సంస్థ క్యూపీ ఫార్మాకెమికల్స్ తయారు చేసింది. సిరప్‌లో 'ఆమోదించలేని మొత్తంలో డైథైలీన్ గ్లైకాల్, ఇథిలీన్ గ్లైకాల్ కలుషితాలు' ఉన్నాయనీ, వీటిని వినియోగించినప్పుడు మానవులకు అవి విషపూరితమైనవిగా మారతాయనీ ఈ నివేదిక పేర్కొంది. మరో బ్లూమ్‌బెర్గ్ నివేదిక (ఆగస్టు 1) ప్రకారం, ఒక భారతీయ ఔషధ ఉత్పత్తి సంస్థ, తక్కువ నాణ్యత గల అబార్షన్ మాత్రలను ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేసే లాభాపేక్షలేని సంస్థకు విక్రయించింది. గాంబియా, ఇండోనేషియా, ఉజ్బెకిస్తాన్‌లలో మరణాలకు దారి తీసిన ఘటనలను, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో వినియో గదారుల కంటిచూపును దెబ్బతీసేందుకు దారితీసిన భారతీయ ఫార్మా ఎగుమతిదారుల గత లోపాలను ఇటువంటి కథనాలు చాలా వరకు వివరిస్తాయి.

భారతదేశం తన ఫార్మా పరిశ్రమ ప్రతిష్ఠను దిగజార్చుకోలేదు. ఎయిడ్స్ వ్యాధి నివారణకు సంబంధించి తక్కువ ధరకు మందులను తయారు చేసి ఆఫ్రికాలో లక్షలాది మంది ప్రజల ప్రాణాలను కాపాడిన చరిత్ర భారతీయ ఫార్మా రంగానికి ఉంది. అంతర్జాతీయ బహుళజాతి మందుల తయారీ సంస్థలు వసూలు చేసే ధరలతో పోల్చితే భారతీయ మందుల ధర చాలా తక్కువగా ఉంది. దీంతో ప్రజాగ్రహానికి గురైన ఆ యా ఔషధ కంపెనీలు తమ ధరలను భారతదేశం అందించే స్థాయికి తగ్గించాయి.

ప్రపంచ ఔషధ మార్కెట్ విలువ లక్ష కోట్ల (ట్రిలియన్) డాలర్లు. భారతదేశ ఔషధాల తాజా ఎగుమతి విలువ సంవత్సరానికి 25 బిలియన్ డాలర్లు. ఈ రంగంలో భారతదేశం ఎంతో సాధించగలిగిన సామర్థ్యం కలిగి ఉంది. జనరిక్ ఫార్మా పరిశ్రమ ఒక్కటే ప్రస్తుత పరిమాణం కన్నా దేశంలో కనీసం 10 రెట్లు సులభంగా విస్తరించి ఉద్యోగాల కల్పన, పన్నుల ఆదాయం, తిరిగి పెట్టుబడి పెట్టగల లాభాలను పెంచగలదు.



కొందరు చిన్న ఆపరేటర్లకు తాము ఎగుమతి చేసేఇ మందుల నాణ్యతను పరీక్షించగలిగే సామర్థ్యం అంతగా లేకపోయినా ఎగుమతులు చేస్తున్నారు. ఇందువల్ల మార్కెట్‌లకు నాసిరకం మందులు సరఫరా అయ్యి ఈ రంగంలో మనకున్న పేరు ప్రఖ్యా తులు దెబ్బతింటున్నాయి. అటువంటివారిని అడ్డుకొనాలి.

భారతదేశం ఔషధ ఉత్పత్తి ప్రక్రియలపై, తుది ఉత్పత్తిపై కఠినమైన నాణ్యతా నియంత్రణను ఏర్పాటు చేయాలి. ఒక ప్రధాన సమస్య ఏమిటంటే నాణ్యతా నియంత్రణ ప్రమాణాలు రాష్ట్రం రాష్ట్రానికీ మారుతూ ఉంటాయి. ముందు దీన్ని సరిచేయాలి. నాణ్యతా నియంత్రణకు అన్ని రాష్ట్రాలలో, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఏకరీతి ప్రమాణాలను, ప్రామాణిక ప్రోటోకాల్‌లను కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలి.

భారత దేశంలో దాదాపు 3,000 ఫార్మా కంపెనీలు, 10,000 తయారీ యూనిట్లు ఉన్నాయి. ఇవన్నీ కలిసి 2021లో రూ. 3.36 లక్షల కోట్ల విలువైన ఔషధాలను ఉత్పత్తి చేశాయి. ఈ కంపెనీలలో టాప్ 50 సంస్థలు మొత్తం ఆదాయంలో 75 శాతం వాటాను కలిగి ఉన్నాయి. అంటే మిగిలినవి చిన్న కంపెనీలన్నమాట. వాటిలో కొన్ని భవిష్యత్తులో సిప్లా, సన్ ఫార్మా వంటి పెద్ద సంస్థలుగా అభివృద్ధి చెందవచ్చు. కానీ వాటిలోనే కొన్ని నకిలీ డ్రగ్స్‌ను ఉత్పత్తి చేసే రకం సంస్థలు కూడా ఉండవచ్చు. ఇవి చేసే తప్పులకు జరిమానా, జైలు శిక్ష విధించే బదులుగా డబ్బుల జరిమానాతో సరిపెట్టేలా చట్ట సవరణ జరిగిందనే వార్తలు రావడం ఆందోళనకరం.

ఔషధాల ఎగుమతులకు సంబంధించి భారతదేశం తప్పనిసరిగా లైసెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలి. కనీసం రూ. 1,000 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలను మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించాలి. ప్రతీ సరకుల ఎగుమతుల కన్‌సైన్‌మెంటులోని సరుకు నాణ్యతను తప్పక తనిఖీ చేయాలి. భారతదేశ సొంత అక్రిడిటేషన్ బోర్డులోనూ, డబ్ల్యూహెచ్‌ఓ ద్వారా గుర్తింపు పొందిన ప్రామాణికమైన నాణ్యతా సంస్థలోనూ ఈ నమూనాలను పరీక్షించాలి.

దీని అర్థం, చిన్న కంపెనీలు ఫార్మా రంగంలోకి ప్రవేశించడాన్ని భారతదేశం నిషేధిస్తుందనా? కానే కాదు. వారు చిన్న సంస్థలను ప్రారంభించవచ్చు. దేశీయ విపణిలో విక్రయించవచ్చు, నాణ్యత నియంత్రణను నిర్వహించే పెద్ద ఎగుమతిదారులకు విక్రయించవచ్చు. పైగా విక్రయాల అర్హతను, విక్రయాల పరిమాణ సామర్థ్యాన్ని సాధించి ఆ తర్వాత ఎగుమతి చేయడం ప్రారంభించవచ్చు.

ఫార్మా ఎగుమతులలో కఠినమైన నాణ్యతా నియంత్రణను అనుసరించడం ద్వారా, మనం స్వేచ్ఛా–మార్కెట్ ప్రాథమిక మూలసూత్రంలోని చిన్న భాగాన్ని మాత్రమే కోల్పోతాము. కానీ గెలుచుకోవడానికి మనకు లక్ష కోట్ల డాలర్ల ఫార్మా మార్కెట్ ఉందని గ్రహించడం చాలా ముఖ్యం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మార్పునకు తలొగ్గాల్సిందే!

సందర్భం



బలభద్రపాత్రుని రమణి

ఇరవై మూడేళ్ల క్రితం రచయితగా సినిమా ఇండస్ట్రీకి వచ్చినప్పటి నుంచీ ఇండస్ట్రీలో వస్తున్న మార్పులనూ, నిశ్శబ్దంగా నిష్క్రమిస్తున్న కొన్ని విలువలనూ, క్రమశిక్షణనూ చూశాను. కథా, స్క్రీన్ ప్లే, మాటలూ వేరే వారి చేత రాయించిన డైరెక్టర్లు సంవత్సరానికి 9 సినిమాలు చేస్తూ, 100కు పైగా చిత్రాలు తీయడం చూశాను. డైరెక్షన్‌తో పాటూ పైన పేర్కొన్న పనులనూ చేసినట్లు తన ఒక్కరి పేరు వేసుకుంటూ తక్కువ సంఖ్యలో సినిమాలు తీసిన కొత్త తరం దర్శకులనూ చూశాను. ప్రతి 10 ఏళ్లకీ ఒక ట్రెండ్ సెట్టింగ్ డైరెక్టర్ వస్తూనే ఉంటారు. వారి ప్రతిభకి ఆశ్చర్యపోతూనే ఉంటాం. బాపు 'ముత్యాల ముగ్గు', విశ్వనాథ్ 'శంకరా భరణం', జంధ్యాల 'శ్రీవారికి ప్రేమలేఖ', రాంగోపాల్ వర్మ 'శివ', సుకుమార్ 'ఆర్య', శేఖర్ కమ్ముల 'హ్యాపీ డేస్', తరుణ్ భాస్కర్ 'పెళ్లి చూపులు' ఆ యా దశాబ్దాల్లో సినిమాలకి కొత్త బాటలు వేశాయి. ఎంతో మంది కొత్త తరహా కథలతో సినిమా వ్యాకరణం కొద్ది కొద్దిగా మారుస్తూ వచ్చారు.



ఇప్పుడు హీరో అక్కర లేకుండా చిన్న బడ్జెట్‌లో కొన్ని మంచి సినిమాలు వస్తున్నాయి. కథాబలం ఉన్న సినిమాలు కూడా అక్కడక్కడా వస్తున్నాయి. కానీ పెద్ద పెద్ద బడ్జెట్ సినిమాలు కొన్నింటిలో కొత్త కథలు ఉండటం లేదు. పాన్ ఇండియా మూవీస్ తెర మీదకొచ్చాక ఆ యా భాషలలో సినిమాలు విడుదల చెయ్యడానికి అన్య భాషా నటులు కుడా ఉండేలా జాగ్రత్తపడుతున్నారు. ఆకాశంలో హెలీకాప్టర్స్, నీటిలో సబ్ మెరైన్స్, 1000 మంది వచ్చినా హీరో ఒక్కడే వాళ్లని ఖండ ఖండాలుగా చీల్చి చెండాడుతూ మొహం అంతా నెత్తురోడుతూ, హై రేంజ్ ఆర్‌ఆర్‌తో కాల రుద్రుడిలా నిప్పులు చిమ్ముతూ ఎగురుతూ ఫైట్స్ చేయడం... క్లైమాక్స్ అయిపోయాక మళ్లీ ఫ్రెష్‌గా హీరోయిన్ మెడలో తాళి కడ్తూ ఖరీదైన కాస్ట్యూమ్స్‌లో!

ఇవే కథలు కొంచెం చిన్న బడ్జెట్స్‌లో అప్పటి అగ్ర హీరోలతో చిన్నప్పుడు చూశాం. ఇద్దరు హీరోయిన్స్‌తో ఫ్యామిలీ స్టోరీస్ కుడా చాలా చూశాం. ఏం చూసినా కథ ఉండేది. ఇప్పటి న్యూ ఏజ్ ట్రెండ్ మాత్రం కథ అవసరం లేదు. జీవితం గురించి ఏ ఆలోచనా లేకుండా తాగుతూ, జోకులేస్తూ, అల్లరిచిల్లరగా గడిపేసే ముగ్గురో, నలుగురో యువకుల ఇతివృత్తం ఆధారంగా సినిమాలు వస్తున్నాయి. తల్లి తండ్రులని లక్ష్య పెట్టకపోవడం, తాగడం, బూతులు మాట్లాడడం, చివరికి తమ పనుల వల్ల చిక్కుల్లో ఇరుక్కొని బయటపడడం... మొత్తం మీద ఇప్పటి ట్రెండ్ ఇది.

2019లో నేను నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీ మెంబర్‌గా ఉన్నప్పుడు 66వ నేషనల్ అవార్డ్స్‌లో 'మహానటి' సినిమాలో నటనకు గాను కీర్తి సురేశ్‌కు బెస్ట్ ఏక్ట్రెస్ అవార్డు రావడం, 2021 సంవత్సరంలో 69వ నేషనల్ అవార్డ్స్ జ్యూరీ మెంబర్‌గా ఉన్నప్పుడే అల్లు అర్జున్‌కి 'పుష్ప' సినిమాకి గాను 'బెస్ట్ ఏక్టర్' అవార్డు రావడం నాకు ఆనందదాయకం. నేను జ్యూరీలో ఉండగా మొదటిసారి మన తెలుగు సినిమా హీరో ఒకరికి బెస్ట్ ఏక్టర్ అవార్డు రావడం నా భాగ్యం. నేను జ్యూరీలో ఉన్న ఏడే ఓ లిరిక్ రైటర్‌గా చంద్రబోస్‌కు నేషనల్ అవార్డు రావడం ఇంకా ఆనందం. జ్యూరీ డ్యూటీ అనేది థ్యాంక్ లెస్ జాబ్. తాము అనుకున్న వారికి రాకపోతే తిట్టడానికి చాలా మంది సిద్ధంగా ఉంటారు.

నా చిన్నతనం నుండీ వస్తున్న నేషనల్ అవార్డ్స్‌ని గమనిస్తే అప్పుడు సహజత్వానికీ, బడుగు జీవితాల కష్టాలకీ, ప్రాంతీయ కట్టుబాట్లూ అలవాట్లూ, సమస్యలూ ఉన్న చిత్రాలకి ఎక్కువగా పెద్ద పీట వేసే వారు. ఇప్పుడు కాలంతో బాటు మారుతూ పాపులర్, కమర్షియల్ సినిమాలకి కూడా వారి పెర్ఫార్మెన్స్, వివిధ రంగాలలో నైపుణ్యం బట్టి అవార్డ్స్ వస్తున్నాయి. మార్పుని ఆహ్వానించాలి. విలువలను కోల్పోకూడదు. భారతదేశం అంటేనే సంస్కృతీ సంప్రదాయాలకి ఆలవాలం కదా!

వ్యాసకర్త రచయిత్రి,
69వ జాతీయ సినిమా అవార్డుల జ్యూరీ మెంబర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.దశమి రా.7.03 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** మూల రా.3.46 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ప.12.20 నుండి 1.52 వరకు, తదుపరి రా.2.15 నుండి 3.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.46 నుండి 7.27 వరకు, **అమృతఘడియలు:** రా.9.34 నుండి 11.07 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.17.

తెలంగాణ

దాల్చిన చెక్కతో ప్రొస్టేట్ కేన్సర్ నివారణ!

జాతీయ పోషకాహార సంస్థ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: భారతీయులు వంటకాల్లో తరచూ ఉపయోగించే దాల్చిన చెక్క ప్రొస్టేట్ కేన్సర్ నివారణకు దోహదపడుతుందని హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) జరిపిన అధ్యయనం తేల్చింది. దాల్చిన చెక్కతో మన ఆరోగ్యానికి ఎన్నో మేళ్లు జరుగుతాయన్నది చాలాకాలంగా తెలిసిన విషయమే. ఎన్ఐఎన్ తాజా అధ్యయనం ఈ విషయాన్ని మరోసారి రుజువు చేసింది. దాల్చిన చెక్కలోని చైనామాల్డీహైడ్, ప్రొసైనాడిన్ బీ–2లను ఎలుకలకు అందించినప్పుడు ప్రాథమిక దశలోని ప్రొస్టేట్ కేన్సర్‌పై సానుకూల ప్రభావం చూపినట్లు తెలిసింది. అధ్యయనంలో భాగంగా శాస్త్రవేత్తలు ఎలుకలకు 16 వారాలపాటు దాల్చిన చెక్క, దాంతోపాటు చైనామాల్డీహైడ్, ప్రొసైనాడిన్ బీ–2లను అందించారు. ఆ తరువాత ఈ ఎలుకలకు ప్రొస్టేట్ కేన్సర్ వచ్చేలా చేశారు. దాల్చిన చెక్క, దాంట్లోని రసాయనాలను ఆహారంగా తీసుకున్న 60–70 శాతం ఎలుకల్లో కేన్సర్ లక్షణాలేవీ కనిపించలేదు. ఈ పదార్థాలు శరీరంలోని ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను సమర్థంగా తట్టుకోగలగడం వల్లనే వాటికి కేన్సర్ సోకలేదని భావిస్తున్నట్లు ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ అయేషా ఇస్మాయిల్ తెలిపారు. ప్రొస్టేట్ గ్రంథిలో కేన్సర్ కణాల వ్యాప్తి కూడా తక్కువగా ఉన్నట్లు తమ పరిశీలనలో తెలిసిందన్నారు. అంతేగాకుండా... ఎముకల్లోని ఖనిజాల మోతాదు ఎక్కువైందని, ఎముకలు బలహీనమయ్యే ప్రమాదం తగ్గిందని వివరించారు. ప్రొస్టేట్ కేన్సర్ నివారణలో దాల్చిన చెక్క ఉపయోగపడగలదన్న విషయం ఎలుకల్లో రుజువైనప్పటికీ మనుషుల్లో వాడకానికి సంబంధించి మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉందని సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్.హేమలత తెలిపారు. 'కేన్సర్ ప్రివెన్షన్ రీసెర్చ్' జర్నల్ తాజా సంచికలో ఈ పరిశోధన వివరాలు ప్రచురితమయ్యాయి.


పుష్పాలతో అమ్మవారికి నివేదిస్తున్న అర్చకులు


వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ భూమన దంపతులు, భక్తులు

తిరుచానూరులో శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం

బంగారు చీరతో శ్రీపద్మావతి అమ్మవారి దర్శనం
- స్వర్ణరథంపై ఊరేగిన శక్తిస్వరూపిణి
- హాజరైన టీటీడీ చైర్మన్ దంపతులు

తిరుచానూరు(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం శ్రీవరలక్ష్మీ వ్రతం శాస్త్రోక్తంగా జరిగింది. అమ్మవారు బంగారు చీరతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సహస్రనామార్చన, నిత్యార్చన, మూలమూర్తులకు, ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీపద్మావతీ అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించిన ఆస్థాన మండపానికి వేంచేపు చేసి పద్మపీఠంపై ఆశీనులను చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోత్తర శత నామావళి నిర్వహించారు. అమ్మవారిని తొమ్మిది గ్రంథులతో(నూలుపోగు) అలంకరించారు. ఒక్కో గ్రంథిని ఒక్కో దేవతకు గుర్తుగా ఆరాధించారు. 12 రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. అనంతరం మహా మంగళ హారతితో వరలక్ష్మీ వ్రతం ముగిసింది. సాయంత్రం అమ్మవారు స్వర్ణరథంపై ఆశీనులై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి రథాన్ని లాగేందుకు మహిళలు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి దంపతులు, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్ పాల్గొన్నారు.



రూ.31.25 లక్షల కరెన్సీతో 'శ్రీముసలమ్మ' ముస్తాబు

తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక గ్రామ దేవత శ్రీముసలమ్మను వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని రూ.31.25 లక్షల కరెన్సీ నోట్లతో శుక్రవారం ధనలక్ష్మీదేవిగా ముస్తాబు చేశారు. ఈ అలంకరణలో రూపాయి నుంచి రూ.500 నోటు వరకూ వినియోగించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. - కడియం

చైనా ముందు మోకరిల్లిన మోదీ సర్కారు: అసదుద్దీన్

సాక్షి, హైదరాబాద్: భారతదేశ భూభాగాన్ని అక్రమిస్తున్న చైనా ముందు నరేంద్ర మోదీ సర్కార్ మోకరిల్లుతోందని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. లద్దాఖ్ సరిహద్దులో ఏం జరుగుతుందో దేశప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒవైసీ మాట్లాడుతూ ప్రధాని మోదీ సరిహద్దు వాస్తవ పరిస్థితుల గురించి దేశాన్ని అంధకారంలో ఉంచుతున్నారని దుయ్యబట్టారు. భారత వీర సైనికులు 40 నెలలుగా సరిహద్దులో చైనీయులకు భయపడకుండా నిలబడ్డారని, మరి మోదీ ఎందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఎదురొడ్డి నిలబడలేకపోతున్నారని ప్రశ్నించారు. సరిహద్దు వివాదం మోదీ వ్యక్తిగత విషయం కాదని, దీనిపై పార్లమెంట్‌లో ప్రత్యేకంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఒవైసీ అన్నారు. కాగా, ది కశ్మీర్ ఫైల్స్ చిత్రం అవార్డుకు ఎంపిక చేయడం పట్ల అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ది కశ్మీర్ ఫైల్స్ జాతీయ సమైక్యతను పెంపొందించే చిత్రమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ తమ మిత్రపక్షమే అని, పోటీ ఫ్రెండ్లీగానే ఉంటుందని, పోటీ చేయని స్థానాల్లో సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

విశాఖలో 'ఇండియా ఆన్ ద మూన్' భారీ ర్యాలీ



ఎంవీపీకాలనీ (విశాఖపట్నం): 'ఇండియా ఆన్ ద మూన్' పేరుతో విశాఖపట్నంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులు 400 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఇండియా మూన్ మిషన్ చంద్రయాన్–3 సక్సెస్ కావడంతో భారత్‌కు అంతర్జాతీయ ఖ్యాతి లభించిందన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని యువత శాస్త్ర విజ్ఞానం వైపు దూసుకెళ్లాలన్నారు. ఈ మిషన్‌లో ఏయూ ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన పూర్వ విద్యార్థి ప్రాతినిధ్యం వహించడం ఏయూకు గర్వకారణం అన్నారు.

బాబు పగటి కలలు నెరవేరే ప్రసక్తే లేదు

1,062వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాష్ట్రంలో పేద వర్గాలను అణగదొక్కి అందలం ఎక్కాలని బాబు కంటున్న పగటి కలలు నెరవేరబోవని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,062వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. విభజించి పాలించు అని బ్రిటీష్ సిద్ధాంతాన్ని పాటిస్తున్న చంద్రబాబు రాష్ట్రంలో అన్ని వర్గాల్లోనూ కులమతాల చిచ్చురేపుతున్నాడని ధ్వజమెత్తారు. తన హయాంలోఅధికారాన్ని అడ్డుపెట్టుకుని అన్ని వ్యవస్థల్లో తన సామాజిక వర్గాన్ని చొప్పించిన చంద్రబాబు వారికి ఆర్థికంగా అండగా నిలిచాడనేది నగ్నసత్యమన్నారు. మార్గదర్శి పేరుతో రూ.లక్షల కోట్లు దోచిన రామోజీ ఆగడాలే అందుకు నిదర్శనమన్నారు. ప్రజలను మోసం చేసిన రామోజీని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎక్కడా గెలవలేని లోకేశ్, పవన్‌కళ్యాణ్ అనవసర విషయాలపై మాట్లాడుతుండటం సిగ్గుచేటని, ప్రజా సమస్యలపై పోరాటం చేయలేని వీరిని నాయకులుగా అంగీకరించేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకుంటే కులవాదులు అడ్డుపడుతున్నారని, బాబుకు మళ్లీ ఘోర పరాజయం తప్పదన్నారు. నాయకులు ఈపూరి ఆదాం, కుమార్, కుంటా రాజు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు జోన్లుగా విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ

హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక విభాగాన్ని ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఇప్పటివరకు రాష్ట్రంలో ఉన్న రెండు జోన్లను నాలుగు జోన్లకు పెంచింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలతో కూడిన జోన్–1ను ఏర్పాటు చేసింది. రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన రీజియన్–2 పరిధిలోకి తూర్పు గోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలను చేర్చింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో గుంటూరు కేంద్రంగా రీజియన్–3ని ఏర్పాటు చేసింది. కర్నూలు కేంద్రంగా ఉన్న రీజియన్–4 పరిధిలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలను చేర్చింది. తదనుగుణంగా రీజనల్ ఫైర్ ఆఫీసర్లు, ఇతర పోస్టులను గుర్తించింది. ఈ మేరకు కొత్తగా ముగ్గురు అదనపు డైరెక్టర్లు, నలుగురు ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారులను నియమిస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగుల వివరాలు..
ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారులు : జోన్–1: డి.నిరంజన్‌రెడ్డి, జోన్–2: ఈ.స్వామి, జోన్–3: ఎంఏక్యూ.జిలాని, జోన్–4ఎం.భూపాల్‌రెడ్డి.

అమ్మకు బహుమతిగా చందమామపై భూమి!

- వినూత్నంగా ఉండాలన్న ఆలోచనతో ఓ కుమార్తె కానుక
- అంతర్జాతీయ చట్టాల ప్రకారం చంద్రుడిపై ఎవరికీ హక్కుల్లేవు
- అయినా ఓ వెబ్‌సైట్ పెట్టి భూములను అమ్ముతున్న లూనార్ రిజిస్ట్రీ సంస్థ

గోదావరిఖని (రామగుండం): తల్లిపై ప్రేమతో వినూత్న కానుక ఇవ్వాలని ఆ కుమార్తె భావించింది. అదీ సాదాసీదాగా కాకుండా అందరూ చెప్పుకొనేలా ఉండాలనుకుంది. ఇందుకోసం ఏకంగా చందమామపైనే ఎకరం భూమిని కొనుగోలు చేసి తల్లికి బహుమతిగా అందించింది. ఈ విషయం తెలిసి అందరూ నోరెళ్లబెడుతున్నారు. చందమామపైనే భూమిని కొనవచ్చా అని చర్చించుకుంటున్నారు.

అమెరికాలో ఉద్యోగం చేస్తూ..

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి సుద్దాల రాంచందర్, వకుళాదేవి దంపతుల పెద్ద కుమార్తె సాయి విజ్ఞత. ఆమె అమెరికాలోని ఐయోవాలో ఫైనాన్సియల్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నారు. మదర్స్ డే సందర్భంగా వినూత్న కానుక ఇవ్వాలని భావించిన ఆమె.. లూనార్ రిజిస్ట్రీ వెబ్‌సైట్‌లో ఓ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ఎకరం భూమిని కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. రూ.35 లక్షలు చెల్లించి తన తల్లి వకుళాదేవి పేరిట దానిని రిజిస్టర్ చేయించానని వివరించారు. ఈ మేరకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు కూడా వచ్చేశాయన్నారు.

చంద్రుడిపై భూములపై హక్కు ఎవరిది?

1967లో కుదిరిన అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం.. చందమామ సహా అంతరిక్షంలోని సహజ ఉపగ్రహాలు, గ్రహాలు, నక్షత్రాలపై ఏ వ్యక్తికీ, దేశానికీ హక్కులు ఉండవు. కానీ ఇంటర్నేషనల్ లూనార్ ల్యాండ్ రిజిస్ట్రీ (ఐఎల్ఎల్ఆర్), లూనా సొసైటీ ఇంటర్నేషనల్‌తోపాటు పలు ఇతర సంస్థలు వెబ్‌సైట్లు పెట్టి చందమామపై భూములను అమ్ముతున్నాయి. చంద్రుడిపై మానవులు ఆవాసాలు ఏర్పర్చుకోవడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందో కూడా తెలియదు. అయినా చాలా మంది వినూత్నంగా ఉంటుందనో, భిన్నమైన బహుమతి ఇవ్వాలనో, సరదాకో చంద్రుడిపై భూములను కొనుగోలు చేస్తున్నారు. బాలీవుడ్ దివంగత నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ గతంలో చంద్రుడిపై భూమిని కొన్నట్టు చెప్పారు. షారూఖ్‌ఖాన్ వీరాభిమాని ఒకరు ఆయనకు చంద్రుడిపై స్థలాన్ని కొని బహుమతిగా ఇవ్వడం గమనార్హం.

మనుబోలు–గూడూరు మధ్య రైల్వే ఫ్లైఓవర్ ప్రారంభం


మనుబోలు–గూడూరు మధ్యలో జోన్‌లోనే అతి పొడవైన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ)/మనుబోలు: విజయవాడ డివిజన్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు–తిరుపతి జిల్లా గూడూరు మధ్య మూడవ రైల్వే లైను పనుల్లో భాగంగా గూడూరు సమీపంలోని పంబలేరు నదిపై రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) నిర్మించిన పొడవైన రైల్వే ఫ్లైఓవర్‌ను శుక్రవారం ప్రారంభించారు. మనుబోలు–గూడూరు మధ్య సుమారు 10 వరకూ కాలువలు, ఏర్లు ఉన్నాయి. వీటిలో గూడూరు సమీపంలోని పంబలేరు పెద్దది. దీంతో పాటు సమీపంలోని కొన్ని కాలువలను కలుపుకుని 2.2 కిలోమీటర్ల దూరంతో అతి పొడవైన రైల్వే ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ఈ రైల్వే ఫ్లైఓవర్ దక్షిణ మధ్య రైల్వేలో 7వ పెద్ద ఆర్‌వోఆర్‌గా నిలిచిందని రైల్వే అధికారులు తెలిపారు. జోన్‌లో అతి పొడవైన ఆర్‌వోఆర్ కూడా ఇదేనని పేర్కొన్నారు. దీని నిర్మాణంలో హైగ్రేడ్ కాంక్రీట్, స్ట్రక్చరల్ స్టీల్‌ను ఉపయోగించినట్లు తెలిపారు. ఈ సింగిల్ లైన్ వంతెన రెండు దిశలలో రైళ్ల కదలికల కోసం రూపొందించారు. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రైళ్ల రాకపోకలను సులభతరం చేయడానికి ఈ ఫ్లైఓవర్ ఉపకరిస్తుంది. ఈ ఫ్లైఓవర్ వల్ల గూడూరు స్టేషన్ మీదుగా విజయవాడ నుంచి రేణిగుంట, చెన్నై మధ్య ఏకకాలంలో నడిచే రైళ్ల రాకపోకలకు ఇక అంతరాయం ఉండదు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైల్వే ఫ్లైఓవర్‌ను నిర్మించడంలో కృషి చేసిన రైల్వే అధికారులు, ఆర్‌వీఎన్ఎల్ సంస్థ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు



వెంకటగిరి రూరల్(తిరుపతి జిల్లా): కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ బోగీలో ఒక్కసారిగా పొగలు వచ్చిన ఘటన వెంకటగిరి రైల్వేస్టేషన్ సమీపంలోని పెరియవరం వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. రైల్వే అధికారుల కథనం మేరకు... తిరుపతి నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు ఏసీ బోగీలో ఒక్కసారిగా పొగలు వచ్చాయి. గమనించిన ప్రయాణికులు భయంతో బోగీలోని చైన్ లాగారు. రైలు ఆగిపోవడంతో వెంటనే రైల్లోనుంచి దిగేశారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు పొగ వచ్చిన బోగీని పరిశీలించి మరమ్మతులు నిర్వహించారు. ఈ మేరకు పెరియవరం వద్ద కృష్ణా ఎక్స్‌ప్రెస్ సుమారు 20 నిమిషాల పాటు ఆగిపోయింది. వెంకటగిరి నుంచి గూడూరు వరకు కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు నెమ్మదిగా వెళ్లినట్లు అధికారులు తెలియజేశారు.

భద్రతా చర్యలపై అప్రమత్తత అవసరం

- రాష్ట్ర ఫ్యాక్టరీస్ డైరెక్టర్ దంతులూరి చంద్రశేఖర్ వర్మ

ఉక్కునగరం (విశాఖ): స్టీల్ ప్లాంట్‌లోని విభాగాల్లో భద్రతా చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఫ్యాక్టరీస్ డైరెక్టర్ దంతులూరి చంద్రశేఖర్ వర్మ చెప్పారు. స్టీల్ ప్లాంట్ హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌కు శుక్రవారం ఆయన విచ్చేశారు. ఆయనకు ప్రాజెక్ట్స్ సీజీఎం ప్రవీణ్‌కుమార్, ఉక్కు భద్రతా విభాగాధిపతి డి.రామ్‌ప్రసాద్, జీఎంలు ప్రశాంతబాబు, ఎం.ఎస్.ఎన్.రాజు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లోని భద్రతా చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో ప్లాంట్‌లో అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా శూన్య ప్రమాదాల స్థాయికు తీసుకురావాలన్నారు. భద్రతా నియమాలు, ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఆయన పలు సూచనలు చేశారు. జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శంకరరెడ్డి, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు, ఉక్కు జోనల్ సేఫ్టీ ఆఫీసర్ బయ్యే మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండను ఢీకొన్న ఐషర్


- ఇద్దరు మృతి.. 11 మందికి గాయాలు
- క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం


ఘటనా స్థలంలో సుజాత మృతదేహం


ఘటనా స్థలంలో లక్ష్మి మృతదేహం

చిట్వేలి: బ్రేక్ ఫెయిలవడంతో ఐషర్ వాహనం కొండను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. అన్నమయ్య జిల్లా చిట్వేలి సమీపంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి రైల్వేకోడూరుకు క్యాటరింగ్ కోసం ఐషర్ వాహనంలో 13 మంది బయలుదేరారు. చిట్వేలి–రాపూరు ఘాట్ రోడ్డులో చిట్వేలి మండల పరిధిలోని మూడో మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో వాహనం కొండను ఢీకొట్టింది. ప్రమాదంలో నెల్లూరుకు చెందిన సుజాత (52), లక్ష్మి (37) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన 11 మంది గాయాలపాలయ్యారు. వారిని రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరు మహిళల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ భాస్కర్ సురక్షితంగా బయటపడ్డాడు.

వెంగమాంబకు పుష్పాంజలి



తిరుమల: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబకు శుక్రవారం ఆమె వంశీయులు ఘనంగా పుష్పాంజలి ఘటించారు. తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో వెంగమాంబ 206వ వర్ధంతి కార్యక్రమం టీటీడీ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగమాంబ వంశీయులు విశ్వమూర్తి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

జనశక్తి నేతలు కూర రాజన్న, అమర్ అరెస్ట్

- పోలీసుల అదుపులో మరో ముగ్గురు
- గురువారం అరెస్టు.. శుక్రవారం సాయంత్రం విడుదల

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జనశక్తి నేతలు కూర రాజన్న, అమర్‌తోపాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు రోజుల విచారణ అనంతరం విడుదల చేశారు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గాజువాక సమీపంలోని ఓ బత్తాయి తోటలో ఆల్ ఇండియా కిసాన్ సంయుక్త మోర్చా రెండు రోజుల సమావేశం నిర్వహిస్తుండగా గురువారం మధ్యాహ్నం అందించిన సమాచారం మేరకు పోలీసులు రెక్కీ నిర్వహించి అరెస్ట్ చేశారు. సుమారు 3గంటల పాటు ఆ తోటలోనే విచారించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారుల సూచన మేరకు జిల్లా కేంద్రంలోని డీటీసీకు తరలించారు. శుక్రవారం జిల్లా పోలీసు అధికారుల ముందు ప్రవేశపెట్టారు. అరెస్ట్ అయిన వారిలో కూర రాజన్న, అమర్‌తో పాటు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన మరో ముగ్గురు రైతు నాయకులు ఉన్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా జరగబోయే రైతు ఉద్యమాల గురించి చర్చించేందుకు రెండు రోజులపాటు ఇక్కడ సమావేశాలు పెట్టుకున్నట్లు చెబుతున్నారు. అదుపులోకి తీసుకున్న తరువాత వీరి వద్ద ఉన్న బ్యాగులను క్షుణ్ణంగా పోలీసులు పరిశీలించగా ఎలాంటి ఆయుధాలు లభించలేదని తెలిసింది. అమర్‌కు సంబంధించిన బ్యాగులో ఒక లేఖ లభ్యమైనట్లు సమాచారం. సమావేశాలు ఎందుకు పెట్టుకున్నారు.. భవిష్యత్తులో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేయబోతున్నారా.. రాబోయే ఎన్నికల సందర్భంగా ఏదైనా కుట్ర పన్నారా అనే అంశాలపై విచారించినట్లు తెలిసింది. శుక్రవారం సాయంత్రం వారిని పోలీసులు వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అనంతరం తమను కలిసిన విలేకరులతో కూర రాజన్న, అమర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు సమావేశం పెట్టుకుంటే పోలీసులు తమను అన్యాయంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. తమ సంఘం నిషేధితం కాదని, అలాంటప్పుడు తమను ఎందుకు ఇబ్బందులు గురిచేస్తున్నారో పోలీసులకే తెలియాలన్నారు.

తెలంగాణ

జైతీర్థ్ జోషికి రాయల్ ఏరోనాటికల్ సొసైటీ ఫెలోషిప్

సాక్షి, హైదరాబాద్: నగరంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ (డీఆర్‌డీఎల్) ప్రోగ్రాం డైరెక్టర్ జైతీర్థ్ ఆర్.జోషికి రాయల్ ఏరోనాటికల్ సొసైటీ ప్రతిష్టాత్మక ఫెలోషిప్ లభించింది. డీఆర్‌డీఎల్‌లో జైతీర్థ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ (ఐఐఎం)కి అందించిన విశేష కృషికి ఈ ఫెలోషిప్‌ను అందుకున్నారు. ఏరోస్పేస్ సిస్టమ్స్, మెటీరియల్స్ ఇంజినీరింగ్, నాన్–డిస్ట్రక్టివ్ టెస్టింగ్ టెక్నాలజీల్లో జోషి కృషి చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ అడ్మినిస్ట్రేషన్ సేఫ్టీ సెక్యూరిటీ ఇన్‌స్పెక్షన్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఏఎస్ఎస్ఐఎస్‌టీ)కి చెందిన పరిశ్రమ ప్రముఖులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా జైతీర్థ్‌ను సత్కరించినట్లు డీఆర్‌డీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది.

సాంస్కృతిక సంబంధాల మెరుగుతోనే ఆర్థిక వృద్ధి

- నేడు వారణాసి జీ20 డిక్లరేషన్ ప్రకటన
- జీ20 సదస్సులో కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి

(వారణాసి నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)
సాంస్కృతిక సంబంధాలు మెరుగుపడటం ద్వారా దేశాల మధ్య ఆర్థిక, దౌత్యపరమైన పురోభివృద్ధి సాధ్యమని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. భారత్ నుంచి ఎన్నో విలువైన పురాతన విగ్రహాలు, వెలకట్టలేని అతి పురాతన విగ్రహాలు దేశం దాటి వెళ్లాయని, వాటిని తిరిగి భారత్‌కు తేవడానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వారణాసిలో జరుగుతున్న జీ20 సాంస్కృతిక శాఖల మంత్రులు, అధికారుల సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2014 ముందు ప్రభుత్వాలు విదేశాల నుంచి కేవలం 13 పురాతన విగ్రహాలను దేశానికి తిరిగి రప్పిస్తే, మోదీ అధికారంలోకి వచ్చాక దాదాపు 400 పురాతన విగ్రహాలను రప్పించి ఆయా రాష్ట్రాలకు అప్పగించిన విషయాన్ని గుర్తుచేశారు. జీ20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాలు, పలు అంతర్జాతీయ సంస్థలు ఈ సదస్సులో పాల్గొన్నాయని, అందరి సమ్మతితో శనివారం వారణాసి జీ20 డిక్లరేషన్ ప్రకటిస్తామని మంత్రి వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం అధికారుల స్థాయిలో జరిగిన చర్చల్లో సానుకూల స్పందన వచ్చిందన్నారు. విలేకరుల సమావేశంలో ఆ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖీ, ఆ శాఖ కార్యదర్శి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ టూరిజం క్లబ్స్‌దే కీలక పాత్ర

విద్యార్థుల్లో వివేకం పెంపొందించేందుకు యూత్ టూరిజం క్లబ్స్ కీలక పాత్ర పోషిస్తాయని కిషన్‌రెడ్డి అన్నారు. 'సాంస్కృతిక విరాసత్ స్పర్ధ –2023'లో భాగంగా యువ టూరిజం క్లబ్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భారత భవిష్యత్తు అంతా విద్యార్థులదేనని, అందుకు అధ్యాపకులు, ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో అందిస్తున్న కృషి ఎనలేనిదన్నారు. 99 శాతం విద్యపై దృష్టి పెడితే.. కనీసం ఒక్క శాతమైనా పాఠ్యేతర అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. స్పోర్ట్స్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో గానీ, ఇతర సామాజిక సేవా కార్యక్రమాల్లో గానీ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో సేవా తత్పరతతోపాటు దేశం పట్ల అవగాహన పెంచే లక్ష్యంతోనే 'యువ టూరిజం క్లబ్స్'ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతీ ఇంట్లో కుటుంబసమేతంగా పర్యాటక క్షేత్రాలను సందర్శించాలంటే.. ఎక్కడకు వెళ్లాలో నిర్ణయించేది ఆ కుటుంబంలోని చిన్నారులు, విద్యార్థులేనని అన్నారు. అందుకే వారికి దేశంలోని, సమీపంలో ఉన్నటువంటి పర్యాటక క్షేత్రాలపై, ప్లాస్టిక్ రహిత పర్యాటకాన్ని ప్రోత్సహించడంపై అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

అసైన్డ్ భూములపై సర్వ హక్కులు!

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ప్రకటించనున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

సాక్షి, హైదరాబాద్/ చేవెళ్ల: రాష్ట్రంలోని దళిత, గిరిజన ఓటర్లను తమ వైపు తిప్పుకొనేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈసారి తమకు అధికారమిస్తే.. గతంలో వారికి అసైన్ చేసిన భూములపై సర్వహక్కులు కల్పిస్తామని, ఆ భూములను అమ్ముకోవడం సహా అన్నిరకాల యాజమాన్య హక్కులను అనుభవించవచ్చని హామీ ఇవ్వనుంది. ఈ మేరకు శనివారం చేవెళ్ల వేదికగా జరగనున్న 'ప్రజాగర్జన'సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించనున్నారు.

భూముల అంశమే ప్రధానంగా..

కాంగ్రెస్ తమ డిక్లరేషన్‌లో ఎస్సీ, ఎస్టీలకు భూపంపిణీ అంశాన్నే ప్రధానంగా ప్రస్తావించనున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు వివిధ రూపాల్లో పేదలకు అసైన్ చేసిన భూముల్లో.. ఎస్సీ, ఎస్టీలకు చెందిన 24 లక్షల ఎకరాలపై వారికి పూర్తిస్థాయిలో యాజమాన్య హక్కులు కల్పిస్తామని ప్రకటించనున్నట్టు వివరిస్తున్నాయి. అదే విధంగా రాష్ట్రంలోని గిరిజన, ఆదివాసీలు సాగుచేసుకుంటున్న 12 లక్షల ఎకరాల భూములకు అటవీ హక్కుల చట్టం అమలు ద్వారా పట్టాలు అందజేస్తామని.. వాటిపై కూడా గిరిజనులకు సర్వహక్కులు కల్పిస్తామని హామీ ఇవ్వనున్నట్టు వెల్లడిస్తున్నాయి.

అదనపు ఆర్థిక సాయంతో..

బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన దళితబంధు పథకం కింద రూ.10 లక్షలు ఇస్తుండగా.. తాము రూ.12 లక్షలు ఇస్తామని, గిరిజన బంధు కూడా అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించనున్నట్టు తెలిసింది. దళితులు, గిరిజనులకు ఇళ్లు కట్టుకునేందుకు రూ.6 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇవ్వనున్నట్టు సమాచారం. ఇప్పటికే రాష్ట్రంలోని పేదలందరికీ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల చొప్పున ఇస్తామన్న కాంగ్రెస్.. ఎస్సీ, ఎస్టీలకు మరో రూ.లక్ష అదనంగా ఇవ్వనుంది. ఇక ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులన్నీ భర్తీ చేస్తామని.. విద్య, వైద్య రంగాల్లో దళిత, గిరిజనులకు ప్రాధాన్యత కల్పించి సంక్షేమ పథకాలను అమలు చేస్తామనే హామీలు కూడా ప్రకటించనున్నట్టు సమాచారం.

నేడు 4 గంటలకు 'ప్రజాగర్జన'సభ

చేవెళ్లలో ప్రజాగర్జన సభ శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితుడు దామోదర రాజనర్సింహ తదితరులు హాజరుకానున్నారు. ఈ సభ వేదికగా ఖర్గే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటిస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. బెంగళూరు నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రానున్న ఖర్గే.. అక్కడి నుంచి నేరుగా చేవెళ్ల వెళ్లి బహిరంగసభలో పాల్గొంటారని తెలిపాయి.

క్లుప్తంగా...

భారత్‌లో జరిగే జీ20 భేటీకి పుతిన్ దూరం



మాస్కో: వచ్చే నెలలో భారత్‌లో జరిగే జీ20 శిఖరాగ్ర సమావేశంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాల్గొనడం లేదు. ఉక్రెయిన్‌లో ఏడాదికి పైగా కొనసాగుతున్న స్పెషల్ మిలటరీ ఆపరేషన్‌పైనే ఆయన దృష్టంతా ఉందని శుక్రవారం రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ తెలిపింది. దీంతోపాటు బిజీ షెడ్యూల్ ఉన్నందున అధ్యక్షుడు పుతిన్ ఢిల్లీకి వెళ్లడం లేదని పేర్కొంది. అధ్యక్షుడు పుతిన్ జీ20 సమావేశంలో వర్చువల్‌గా పాల్గొనే విషయం తర్వాత ఖరారవుతుందని క్రెమ్లిన్ ప్రతినిధి పెష్కోవ్ చెప్పారు. సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో జీ20 దేశాల నేతల సమావేశాలు ఢిల్లీలో జరగనున్నాయి. తాజాగా జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన బ్రిక్స్ భేటీకి కూడా పుతిన్ వెళ్లలేదు.

బెయిల్ ఇస్తే బ్యాడ్మింటన్ ఆడుతున్నారు

లాలూ బెయిల్ రద్దు చేయాలని సుప్రీంకెక్కిన సీబీఐ

న్యూఢిల్లీ: దాణా కుంభకోణం కేసులో అయిదేళ్ల శిక్ష అనుభవిస్తూ అనారోగ్య కారణాలతో బెయిల్‌పై బయట ఉన్న ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు సీబీఐ ఝలక్ ఇచ్చింది. వైద్య చికిత్స కోసం బెయిల్‌పై బయటకు వచ్చిన లాలూ హాయిగా బ్యాడ్మింటన్ ఆడుకుంటున్నారని, వెంటనే ఆయన బెయిల్ రద్దు చేయాలని శుక్రవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జార్ఖండ్ హైకోర్టు అనారోగ్య కారణాలతో ఆయనకు బెయిల్ ఇచ్చిన తీర్పు కాపీని, లాలూ బ్యాడ్మింటన్ ఆడుతున్న వీడియోని అదనపు సొలిసిట్ జనరల్ ఎస్.వి. రాజు సుప్రీంకు సమర్పించారు. తదుపరి విచారణని అక్టోబర్ 17కి న్యాయస్థానం వాయిదా వేసింది.

కేరళలో ఘోర ప్రమాదం

వయనాడ్: కేరళలోని వయనాడ్ జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. జీపు లోయలో పడిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న 9 మంది మహిళలు ప్రాణాలు కోల్పోయారు. వారంతా టీ తోటల్లో పనిచేసే కార్మికులే. వలాద్–మక్కిమల రహదారిలో శుక్రవారం సాయంత్రం 3.30 గంటలకు ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో జీపులో డ్రైవర్‌తో సహా మొత్తం 14 మంది ఉన్నారు. ప్రైవేట్ టీ ఎస్టేట్‌లో పని ముగించుకొని ఇళ్లకు తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు చెప్పారు. జీపు లోయలో పడిపోయి 9 మంది మహిళలు మరణించడం పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంతాపం ప్రకటించారు.

జపాన్‌లో 12 ఏళ్ల క్రితం భూకంపం, సునామీ ధాటికి దెబ్బతిన్న ఫుకుషిమా దైచీ అణు విద్యుత్ కేంద్రం నుంచి వ్యర్థ జలాలను పసిఫిక్ మహాసముద్రంలోకి విడుదల చేయడం ఆందోళన రేపుతోంది. చైనా, దక్షిణ కొరియాతో పాటు స్వదేశంలో కొన్ని సంస్థల అభ్యంతరాలను బేఖాతర్ చేస్తూ జపాన్ ప్రభుత్వం రేడియో ధార్మిక జలాలను విడుదల చేస్తోంది. ఈ నీటి విడుదల ఎంత వరకు సురక్షితం ? జపాన్ వాదనలేంటి ? నిపుణులు ఏమంటున్నారు ?



అణుజలం.. ఆందోళన స్వరం

ఫుకుషిమా ప్లాంట్ నుంచి పసిఫిక్ సముద్రంలోకి వ్యర్థ జలాల విడుదల వివాదాస్పదం

2011, మార్చి 11. జపాన్‌ను తీవ్ర భూకంపం కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై 9.0గా నమోదైన ఈ తీవ్ర భూకంపంతో సునామీ ముంచెత్తింది. చెర్నోబిల్ అణు ప్రమాదం తర్వాత అంతటి విధ్వంసం జరిగింది. ఫుకుషిమా అణు విద్యుత్ ప్లాంట్‌లోని మూడు అణు రియాక్టర్లలోని కూలింగ్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. దీంతో అణు రియాక్టర్లను చల్లార్చడం తప్పనిసరి అయింది. అప్పట్నుంచి భారీగా అణు వ్యర్థ జలాలు పేరుకుపోయాయి. ప్రమాదం జరిగిన పన్నెండేళ్లకు ఐక్యరాజ్య సమితికి చెందిన ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఏఈఏ) అనుమతితో జపాన్‌లోని టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టెప్కో) అణు జలాలను శుద్ధి చేసి పసిఫిక్ మహాసముద్రంలోకి విడుదల చేసే వివాదాస్పద కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. అణుజలాలతో సముద్రంలో జీవజాలం ప్రమాదంలో పడుతుందని, పర్యావరణానికి, మానవాళి ఆరోగ్యానికి ముప్పు ఉంటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నా జపాన్ ఆగడం లేదు. జపాన్ నుంచి దిగుమతయ్యే సముద్ర ఉత్పత్తులపై చైనా నిషేధం విధించింది. జపాన్, దక్షిణ కొరియాలో ఈ జలాల విడుదల ఆపాలంటూ నిరసనలు పెరుగుతున్నాయి.

ప్లాంట్‌లో పేరుకుపోయిన వ్యర్థ జలాలు 13.4 కోట్ల టన్నులు

రేడియో ధార్మిక జలాలను శుద్ధి చేసినా మిగిలిపోతున్న ట్రిటియం మూలకం

నీటిలో ట్రిటియం గాఢతను తగ్గించి వదలడం వల్ల ముప్పు లేదంటున్న జపాన్

ప్రమాదకరమైన స్ట్రాంటియం–90, కార్బన్–14 మూలకాలు ఉన్నాయంటున్న నిపుణులు

వ్యర్థ జలాలు ఎంత ఉన్నాయి ?

- ఫుకుషిమా–దైచీ అణు విద్యుత్ కేంద్రం ధ్వంసమైనప్పట్నుంచి అణు రియాక్టర్లను నిరంతరం చల్లగా ఉంచడానికి రోజుకి 170 టన్నుల నీటిని వాడాల్సి వస్తోంది.
- 13.4 కోట్ల టన్నుల వ్యర్థ జలాలు ఇప్పటికే పేరుకుపోయాయి.
- 1,046 ట్యాంకుల్లో వ్యర్థజలాలను భద్రపరిచారు.
- ఈ అణు జలాలను శుద్ధి చేసి వాటిలో రేడియో ధార్మికత తగ్గించి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.
- విద్యుత్ ప్లాంట్ నుంచి సముద్రంలోకి ఒక కిలోమీటర్ సొరంగం తవ్వి ఆ మార్గం ద్వారా వదులుతున్నారు.
- ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి ఏకంగా 30 ఏళ్లు పడుతుందని ఒక అంచనా
- 2024 మార్చి నాటికి 31వేల టన్నులకు పైగా జలాలను సముద్రంలోకి పంపాలని నిర్వాహక సంస్థ టెప్కో ప్రణాళికలు వేసింది.

అణు జలాల శుద్ధి ఇలా..!

- రేడియో ధార్మికత కలిగిన వ్యర్థ జలాలను దశల వారీగా శుద్ధి చేస్తారు. అడ్వాన్స్‌డ్ లిక్విడ్ ప్రాసెసింగ్ సిస్టమ్ (ఎల్‌పీఎస్) ద్వారా తొలి దశలో శుద్ధి చేస్తారు.
- జలాల్లో ఉన్న 62 రకాల రేడియో ధార్మిక మూలకాలను ఎల్‌పీఎస్ శుద్ధి చేస్తుంది. కానీ ట్రిటియం మూలకాన్ని మాత్రం అది ఫిల్టర్ చేయలేదు.
- అందుకే నీటిలో ఈ ట్రిటియం మూలకాల సాంద్రతను తగ్గించడానికి నీళ్లను మరింతగా డైల్యూట్ చేసే ప్రక్రియ చేపట్టింది టెప్కో. ట్రిటియం సాంద్రతను జాతీయ భద్రతా ప్రమాణాలు నిర్దేశించిన ప్రమాణాల కంటే 40% తక్కువగా నీటిని డైల్యూట్ చేస్తోంది.

జపాన్ ఏమంటోంది ?

ప్రపంచంలో ఏ అణు ప్లాంట్ అయినా వ్యర్థ జలాలను సముద్రంలోకి వదిలి పెట్టడం సాధారణంగా జరిగేదేనని ఇప్పుడే ఎందుకు వివాదాస్పదం చేస్తున్నారని జపాన్ ప్రశ్నిస్తోంది. సెసియం–137, స్ట్రాంటియం–90 కంటే ట్రిటియం వల్ల ముప్పు తక్కువేనని జపాన్‌లో నిపుణుల అభిప్రాయంగా ఉంది. ''ట్రిటియం మూలకాలున్న నీళ్లని డైల్యూట్ చేసి సముద్రంలోకి విడిచిపెట్టడం వల్ల ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పేమీ లేదు. అణుబాంబుల్ని పరీక్షించిన తర్వాత విడుదలయ్యే రేడియో ధార్మికత కన్నా శుద్ధి చేసిన అణు జలాల ద్వారా సముద్రంలో కలిసే రేడియో ధార్మికత అతి తక్కువ. ఇది కూడా కాలక్రమంలో క్షీణించిపోతుంది. దీని కోసం ఆందోళనలు అవసరం లేదు''అని వియన్నా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన రేడియాలజిస్టు జార్జ్ స్టెయిన్‌హాజర్ అభిప్రాయపడ్డారు. పొల్యూషన్‌కి సొల్యూషన్ అంటే డైల్యూషన్ అని ఇంగ్లిషులో అంటారని నీటిని శుద్ధి చేస్తూ పోతే హానికరం కాదని స్పష్టం చేశారు.

ఆ జలాలు విషతుల్యమేనా ?

ప్రపంచంలో ఇతర దేశాలు సముద్రంలోకి అణు జలాలు విడుదల చేసినా వారు తీసుకున్న జాగ్రత్తలు జపాన్ తీసుకోవడం లేదని పర్యావరణ పరిరక్షణ వ్యవస్థ గ్రీన్‌పీస్ ఆరోపిస్తోంది. ఈ వ్యర్థ జలాల్లో అత్యంత ప్రమాదకరమైన స్ట్రాంటియం–90 సహా మూలకాలున్నాయంటోంది.

మరో మార్గం లేదా ?

జపాన్ ప్రభుత్వం, టెప్కో అత్యంత వేగంగా, తక్కువ ధరకి అయిపోతుందని సముద్రంలోకి అణుజలాలను పంప్ చేస్తున్నారని పర్యావరణ వేత్తలు ఆరోపిస్తున్నారు. ఈ జలాల నిల్వకి మరిన్ని ట్యాంకుల్ని ఏర్పాటు చేయాలని, లేదంటే మరిగించి ఆవిరి రూపంలో వదుల్చుకోవాలని సూచిస్తున్నారు. ట్యాంకుల్లో నిల్వ ఉంచడాన్ని జపాన్ వ్యతిరేకించింది. భూకంపాలు అధికంగా వచ్చే ఆ ప్రాంతంలో ట్యాంకుల్లో భద్రపరిస్తే లీకయి భూగర్భంలో కలిస్తే మరింత ప్రమాదకరమని అంటోంది. ఇక నీళ్లను ఆవిరిగా మార్చడం, సముద్రంలోకి విడుదల చేయడం మధ్య పెద్దగా తేడాలేదని వాదిస్తోంది. మొత్తమ్మీద ఈ నీటి విడుదల కార్యక్రమం ముున్ముందు ఎలాంటి ఉద్రిక్తతల్ని పెంచుతుందో వేచి చూడాలి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ల్యాండర్ నుంచి చంద్రుడిపైకి ప్రజ్ఞాన్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా)/బెంగళూరు: చంద్రయాన్–3 మిషన్‌లో భాగంగా చందమామ దక్షిణ ధ్రువం ఉపరితలంపై విజయవంతంగా అడుగుపెట్టిన ల్యాండర్ విక్రమ్ నుంచి ఆరు చక్రాలతో కూడిన రోవర్ ప్రజ్ఞాన్ బయటకు వస్తున్న వీడియోను, ఫొటోలను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శుక్రవారం అధికారికంగా విడుదల చేసింది. వీటిని 'ఎక్స్'లో షేర్ చేసింది. ఈ వీడియో, ఫొటోలను విక్రమ్‌లోని ల్యాండర్ ఇమేజర్ కెమెరా వీటిని చిత్రీకరించింది. ఈ నెల 23న సాయంత్రం 6.04 గంటలకు ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడి ఉపరితలంపై పాదం మోపిన సంగతి తెలిసిందే. ల్యాండింగ్ పూర్తయ్యాక 4 గంటలకు.. అంటే ఈ నెల 23న రాత్రి 10.04 గంటలకు ల్యాండర్ తలుపులు తెరుచుకున్నాయి. రోవర్ నెమ్మదిగా బయటకు వచ్చింది. ప్రజ్ఞాన్ ప్రస్తుతం చందమామ ఉపరితలంపై తన ప్రయాణం నిరాటంకంగా సాగిస్తోంది. రోవర్ ప్రజ్ఞాన్ ల్యాండింగ్ సైట్ నుంచి ఇప్పటిదాకా 8 మీటర్లు ప్రయాణించినట్లు ఇస్రో ప్రకటించింది. అందులోని పేలోడ్స్ సైతం పని చేయడం మొదలైందని వెల్లడించింది. ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్ మాడ్యూల్, రోవర్‌లోని అన్ని పేలోడ్స్ చక్కగా పని చేస్తున్నాయని హర్షం వ్యక్తం చేసింది.



చంద్రుడి ఉపరితలంపై దిగిన ల్యాండర్ నుంచి బయటకు వస్తున్న రోవర్ ప్రజ్ఞాన్

మన భూభాగాన్ని చైనా కాజేసింది

కార్గిల్/న్యూఢిల్లీ: మన భూభాగాన్ని చైనా కాజేసిన విషయం లద్దాఖ్‌లోని ప్రతి ఒక్కరికీ తెలుసునని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అంగుళం భూమి కూడా ఆక్రమణకు గురికాలేదంటూ ప్రధాని మోదీ చెబుతున్న మాటలు అబద్ధమని ఆయన విమర్శించారు. ఈ నెల 17 నుంచి లద్దాఖ్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నేత శుక్రవారం ఇక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. 'వారం రోజులుగా లద్దాఖ్‌లో బైక్‌పై పర్యటిస్తున్నా. లద్దాఖ్ వ్యూహాత్మక ప్రదేశం. భారత్‌కు చెందిన వందలాది కిలోమీటర్ల ప్రాంతాన్ని చైనా లాక్కున్న విషయం పాంగోంగ్ సరస్సు వద్దకు వెళ్లినప్పుడు అర్థమయ్యింది. ఇక్కడి భూమిని అంగుళం కూడా చైనా ఆర్మీ ఆక్రమించుకోలేదంటూ ప్రధాని మోదీ చెప్పిందంతా పూర్తిగా అసత్యం. ప్రధాని నిజం చెప్పలేదు, చైనా మన భూభాగాన్ని కబ్జా చేసిందనే విషయం లద్దాఖ్‌లోని ప్రతి ఒక్కరికీ తెలుసు'అని రాహుల్ అన్నారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలన్న డిమాండ్‌కు ఆయన మద్దతు ప్రకటించారు. చైనా ఆక్రమణలతోపాటు లద్దాఖ్ ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడతానన్నారు. రాహుల్ అంతకుముందు ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకాన్ని సందర్శించారు. 1999 ఇండో–పాక్ యుద్ధంలో అమరులైన జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. లద్దాఖ్‌లో పర్యటన ముగించుకున్న రాహుల్ బైక్‌ను వదిలి, కారులో శ్రీనగర్ చేరుకున్నారని, శనివారం తిరిగి ఢిల్లీకి చేరుకుంటారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.



కార్గిల్‌లో స్థానికులతో రాహుల్ గాంధీ సెల్ఫీ

ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం

ప్రధాని మోదీ, గ్రీసు ప్రధానమంత్రి కిరియాకోస్ తీర్మానం

- రెండు దేశాల వాణిజ్యం 2030 నాటికి రెండింతలు కావాలని ఆకాంక్ష
- మోదీకి గ్రీసు ప్రతిష్టాత్మక గౌరవం ప్రదానం

ఏథెన్స్: తమ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి, వివిధ కీలక రంగాల్లో పరస్పరం సహకరించుకోవడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ, గ్రీసు ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సొటాకిస్ ఒక అవగాహనకు వచ్చారు. గ్రీసు రాజధాని ఏథెన్స్‌లో శుక్రవారం ఇరువురు నేతలు ఉన్నత స్థాయి చర్చలు జరిపారు. ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకోవాలని, రెండు దేశాల మధ్య పరస్పర వాణిజ్యాన్ని 2030 నాటికి రెండింతలు చేసుకోవాలని తీర్మానించుకున్నారు. రాజకీయ, రక్షణ, ఆర్థిక అంశాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించారు. రక్షణ, షిప్పింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ, సైబర్ స్పేస్, విద్య, సాంస్కృతికం, పర్యాటకం, వ్యవసాయం తదితర ముఖ్యమైన రంగాల్లో భారత్–గ్రీసు నడుమ మరింత సహకారం అవసరమని మోదీ, కిరియాకోస్ అభిప్రాయపడ్డారు. ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్(ఐఎస్ఏ)లోకి గ్రీసుకు ప్రధాని మోదీ స్వాగతం పలికారు. ఈ మేరకు భారత్–గ్రీసు ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశాయి.

మోదీకి 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ హానర్'

గ్రీసుకు చెందిన ప్రతిష్టాత్మక 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ హానర్' ప్రధాని నరేంద్ర మోదీకి లభించింది. గ్రీసు అధ్యక్షురాలు కటెరీనా ఆయనను ఈ గౌరవంతో సత్కరించారు. ఈ ఆర్డర్ ఆఫ్ హానర్‌ను గ్రీసు ప్రభుత్వం 1975లో నెలకొల్పింది. తొమ్మిదేళ్లలో వివిధ దేశాలు మోదీని అత్యున్నత పురస్కారాలతో సత్కరించాయి. ఇందులో గ్రీసు ఆర్డర్ ఆఫ్ హానర్ కూడా చేరింది.

చంద్రయాన్–3.. మానవాళి విజయం

చంద్రయాన్–3 విజయం కేవలం భారత్‌కే పరిమితం కాదని, ఇది ప్రపంచంలోని ప్రజలందరికీ చెందుతుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఆయన శుక్రవారం ఏథెన్స్‌లో గ్రీసు అధ్యక్షురాలు కాటెరీనా ఎన్ సాకెల్లారోపౌలౌతో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయానికొచ్చారు. చంద్రయాన్–3 మిషన్‌పై అధ్యక్షురాలు కటెరీనా ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ ప్రతిస్పందిస్తూ.. చంద్రయాన్ ఘనత మొత్తం మానవాళికి చెందుతుందని చెప్పారు.



గ్రీస్ అధ్యక్షురాలు కటెరినా నుంచి పురస్కారం అందుకుంటున్న ప్రధాని మోదీ

ఏథెన్స్‌లో మోదీకి ఘన స్వాగతం

ఒక రోజు పర్యటన నిమిత్తం ప్రధాని మోదీ దక్షిణాఫ్రికా నుంచి శుక్రవారం గ్రీసు రాజధాని ఏథెన్స్‌కు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో మోదీకి గ్రీసు విదేశాంగ మంత్రి జార్జి గెరాపెట్రిటిస్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రీసులో నివసిస్తున్న భారతీయులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మోదీకి సాదర స్వాగతం పలికారు. భారత ప్రధానమంత్రి గ్రీసులో పర్యటించడం గత 40 సంవత్సరాల్లో ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

మోదీ, జిన్‌పింగ్ భేటీపై చైనా, భారత్ మాటల యుద్ధం

న్యూఢిల్లీ: బ్రిక్స్ సదస్సులో పాల్గొనడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్ వెళ్లారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ఆయన కాసేపు విడిగా మాట్లాడారు. భారత్–చైనా సంబంధాలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, తాజా పరిణామాల గురించి ఇరువురు నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. అయితే, ఇండియా విజ్ఞప్తి చేయడం వల్లే మోదీతో జిన్‌పింగ్ మాట్లాడారని చైనా ప్రభుత్వం శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. చైనా–భారత్ సంబంధాలు మెరుగుపడితే ఇరు దేశాలకూ ప్రయోజనం చేకూరుతుందని మోదీతో జిన్‌పింగ్ చెప్పారని తెలియజేసింది. రెండు దేశాల మైత్రి ప్రాంతీయంగానే కాదు, ప్రపంచ శాంతికీ దోహదపడుతుందని జిన్‌పింగ్ స్పష్టం చేశారని వివరించింది. దీనిపై భారత ప్రభుత్వ వర్గాలు వెంటనే స్పందించాయి. మోదీ–జిన్‌పింగ్ మాటామంతీపై చైనా చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టాయి. ''భారత్‌తో ద్వైపాక్షిక సమావేశం కోసం చైనా విజ్ఞప్తి చేసింది. ఆ అభ్యర్థన ఇంకా పెండింగ్‌లోనే ఉంది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా జొహన్నెస్‌బర్గ్‌లో మోదీ, జిన్‌పింగ్ అనధికారికంగా మాట్లాడుకున్నారు'' అని తేల్చిచెప్పాయి.

ప్రపంచ దేశాల నాయకులకు మోదీ అపురూప బహుమానాలు

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాలో బ్రిక్స్ సదస్సుకు హాజరైన ప్రపంచ దేశాల అధినేతలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన కానుకలు వారి మనసుల్ని దోచుకున్నాయి. భారతీయ సాంస్కృతిక వైవిధ్యం, ఘనమైన వారసత్వం ఉట్టిపడే కళారూపాలు, సంప్రదాయ వస్తువుల్ని కానుకగా ఇచ్చారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాకు మన తెలంగాణలో తయారైన కళాకృతులైన కూజా ఆకారంలో ఉండే రెండు పింగాణి పాత్రలను (సురాహి) కానుకగా ఇచ్చారు. కర్ణాటకకు చెందిన బిద్రీ అనే లోహకళతో రూపొందించే ఈ పాత్రలపై వెండితో నగిషీలు చెక్కారు. సిరిల్ సతీమణికి నాగాలాండ్‌లో ఆదివాసీలు తయారు చేసిన శాలువాను బహుమానంగా ఇచ్చారు. ఇక బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాషియో లాలూ డా సిల్వాకు మధ్యప్రదేశ్‌కు చెందిన గోండ్ పెయింటింగ్స్‌ను కానుకగా ఇచ్చారు. గ్రీసు ప్రధాని కరియాకోస్‌కు ఛత్తీస్‌గఢ్ కళాకృతులైన ఇత్తడితో తయారు చేసిన డోక్రాను, ఆయన సతీమణికి మేఘాలయలో తయారైన శాలువాను కానుకగా ఇచ్చారు.

తోషఖానా కేసులో దిగువ కోర్టు తీర్పు తప్పు

ఇమ్రాన్ ఖాన్‌కు జైలు శిక్షపై ఇస్లామాబాద్ హైకోర్టు వ్యాఖ్య

ఇస్లామాబాద్: తోషఖానా అవినీతి కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌పై దిగువ కోర్టు ఇచ్చిన తీర్పులో తప్పులున్నట్లు ఇస్లామాబాద్ హైకోర్టు పేర్కొంది. ప్రభుత్వ ఖజానా 'తోషఖానా'కు అందిన ఖరీదైన బహుమతుల విక్రయంలో ప్రధానిగా ఉన్న ఇమ్రాన్ అవినీతికి పాల్పడ్డారంటూ పాకిస్తాన్ ఎన్నికల సంఘం(ఈసీపీ) వేసిన కేసుపై విచారణ జరిపిన ఇస్లామాబాద్ కోర్టు ఆయన్ను దోషిగా నిర్ధారించింది. ఇమ్రాన్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఈ నెల 5న తీర్పు వెలువరించింది. దీంతో, మరో అయిదేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయన అర్హత కోల్పోయారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఇమ్రాన్ వేసిన పిటిషన్‌ను శుక్రవారం ఇస్లామాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆమెర్ ఫరూఖ్ సారథ్యంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, విచారణకు ఈసీపీ తరఫు లాయర్ అనారోగ్య కారణాలతో హాజరుకాలేదు. విచారణను వాయిదా వేయాలని ఆయన సహాయక లాయర్లు ధర్మాసనాన్ని కోరారు. ధర్మాసనం వినతిని తోసిపుచ్చింది. 'ట్రయల్ కోర్టు తప్పు చేసింది. ఆ తప్పుల్ని మేం చేయదలుచుకోలేదు. పిటిషన్‌పై విచారణ కీలక దశలో ఉంది. అందుకే విచారణను సోమవారానికి మాత్రమే వాయిదాగలం. సోమవారం ఎవరూ రాకున్నా మా నిర్ణయాన్ని ప్రకటిస్తాం'అని స్పష్టం చేసింది. పాక్ సుప్రీంకోర్టు కూడా ఇమ్రాన్‌కు జైలు శిక్ష విధిస్తూ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పులో తప్పులున్నట్లు బుధవారం వ్యాఖ్యానించింది. ఇమ్రాన్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరుపుతున్నందున వేచి చూస్తామని తెలిపింది. ఇమ్రాన్ ఖాన్ ఇరవై రోజులుగా అటోక్ జైలులో ఉన్నారు.

ట్రంప్ అరెస్ట్.. విడుదల

2020 అధ్యక్ష ఎన్నికల్లో ఫలితాల తారుమారుకు యత్నించారని ఆరోపణలు

- ఫుల్టన్ కౌంటీ జైలులో 22 నిమిషాలున్న అమెరికా మాజీ అధ్యక్షుడు
- మగ్ షాట్ విడుదల చేసిన అధికారులు
- అనంతరం 2 లక్షల డాలర్ల బెయిల్‌తో బయటికి..

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చరిత్ర సృష్టించారు. ఫొటో సహా పోలీసుల రికార్డుల్లోకి ఎక్కిన తొలి మాజీ అధ్యక్షుడయ్యారు. 2020 అధ్యక్ష ఎన్నికల సమయంలో జార్జియాలో ఫలితాల తారుమారుకు యత్నించారన్న ఆరోపణల కేసులో ట్రంప్(77) గురువారం జార్జియాలోని ఫుల్టన్ కౌంటీ జైలులో అధికారుల ఎదుట లొంగిపోయారు. ఈ సమయంలో అధికారులు మగ్ షాట్ తీశారు. అమెరికా చరిత్రలో మాజీ అధ్యక్షుడి మగ్ షాట్ తీయడం ఇదే మొదటిసారి. ఆరడుగుల 3 అంగుళాల ఎత్తు, 97 కిలోల బరువు, స్ట్రాబెర్రీ రంగు జుట్టు, నీలం కళ్లు..అంటూ ట్రంప్ వివరాలను జైలు అధికారులు నమోదు చేశారు. ఆయనకు ఖైదీ నంబర్ పి01135809 కేటాయించారు. 22 నిమిషాలసేపు జైలులో గడిపిన ట్రంప్ రెండు లక్షల డాలర్ల బెయిల్ బాండ్‌పై విడుదలయ్యారు. అంతకుముందు, విమానంలో అట్లాంటా ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ట్రంప్‌ను భారీ బందోబస్తు మధ్య ఫుల్టన్ కౌంటీ కోర్టుకు తీసుకొచ్చారు. ఫెడరల్, రాష్ట్ర అధికారులు నమోదు చేసిన వివిధ నేరారోపణలకు గాను ట్రంప్ ఈ ఏడాదిలో ఇప్పటి వరకు నాలుగుసార్లు లొంగిపోయారు. మగ్ షాట్ తీయడం మాత్రం ఇదే తొలిసారి. మగ్ షాట్ ఫొటోను ట్రంప్ తన సొంత 'ట్రూత్ సోషల్'తోపాటు 'ఎక్స్'ఖాతాలో పోస్ట్ చేశారు. ఎన్నికల్లో జోక్యం..ఎన్నటికీ లొంగను అంటూ వ్యాఖ్యానించారు. ఫుల్టన్ కౌంటీ జైలు అధికారులు విడుదల చేసిన ట్రంప్ మగ్ షాట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. విడుదలైన అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. తానెలాంటి తప్పు చేయలేదని చెప్పుకున్నారు. అమెరికాకు ఇది చెడు దినమని వ్యాఖ్యానించారు.



పోలీసులు తీసిన ట్రంప్ మగ్‌షాట్

ఎన్సీపీలో చీలికే లేదు: పవార్

పుణె: ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తన నాలిక కు రెండు వైపులా పదునేనని నిరూపించారు. పార్టీలో అసలు చీలికే లేదని శుక్రవారం ఉదయం తన స్వస్థలం బారామతిలో అన్నారు. తిరుగుబాటు నేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌ను తమ పార్టీ నేతగా అభివర్ణించారు. అలా అన్న కొద్ది గంటల్లోనే, తానలా అనలేదంటూ మాట మార్చారు. ఎన్సీపీలో కొందరు నాయకులు భిన్న రాజకీయ వైఖరి కారణంగా ఎన్సీపీనీ వీడారని ఉదయం పవార్ మీడియాతో ఆన్నారు. దాన్ని చీలిక అనలేమన్నారు. అజిత్, మరో 8 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలు జూలైలో ఎన్సీపీని వీడి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన –బీజేపీ సంకీర్ణ సర్కారులో చేరడం తెలిసిందే. ఎన్సీపీలో చీలిక లేదని, అజిత్ తమ నాయకుడేనని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, పవార్ కూతురు సుప్రియ సులే గురువారం పేర్కొన్నారు. ఈ విషయాన్ని పవార్‌తో ప్రస్తావించగా,అది నిజమేనని స్పష్టం చేశారు. వాటిపై పార్టీలో, బయట సంచలనం రేగడంతో అలాంటిదేమీ లేదనేలా స్పష్టత ఇచ్చారు. భిన్న రాజకీయ వైఖరి తీసుకున్న వారు తమ నాయకులు కాలేరు అంటూ మాట మార్చారు. 'అజిత్ మా నాయకుడు కాదని అనడం లేదు. ఆయనకు సుప్రియ చెల్లెలు. కనుక అలా అనడం తప్పు కాదు. రాజకీయ అర్థాలు తీయాల్సిన అవసరం లేదు'అని చెప్పుకొచ్చారు. 'చీలిక అంటే ఏమిటి? మెజారిటీ గ్రూప్ పార్టీ నుంచి జాతీయ స్థాయిలో వేరుపడటం. కానీ ఎన్సీపీలో అలా ఏమీ జరగలేదు' అన్నారు.

మణిపూర్ కేసులు అస్సాంకు

న్యూఢిల్లీ: సీబీఐ దర్యాప్తు చేస్తున్న మణిపూర్ హింసాకాండ కేసులను అస్సాంకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. వాటి దర్యాప్తును ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు ఒకరిద్దరు న్యాయాధికారులను నియమించాల్సిదిగా గౌహతి హైకోర్టు ను నిర్దేశించింది. ఈ మేరకు ఇంకా పలు ఇతర ఆదేశాలు కూడా జారీ చేసింది. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, దారుణంగా లైంగిక హింసకు పాల్పడిన కేసులతో పాటు మొత్తం 17 కేసులు ఇందులో ఉన్నాయి. ఈ దశలో అన్ని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నేర విచారణ, న్యాయ ప్రక్రియ సజావుగా సాగేలా చూసేందుకు ఈ దిశగా పలు నిర్ణయాలు తీసుకున్నట్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం పేర్కొంది. న్యాయమూర్తులు జస్టిస్ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా అందులో సభ్యులుగా ఉన్నారు. సీబీఐ ఈ కేసులని అస్సాంకు బదిలీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ పలువురు లాయర్లు చేసిన వాదనను తోసిపుచ్చింది. కేంద్రం, మణిపూర్ ప్రభుత్వాల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన అభ్యర్థనను ఆమోదించింది. ' ప్రధానంగా ఇంటర్నెట్ కనెక్టివిటీ కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం. అస్సాంలో అది చాలా ఎక్కువగా ఉంది' అని పేర్కొంది. ' కుకీలు, మైతీలు రెండు తెగల వారూ ఎంతో నష్టపోయారు. కొండల్లో, లోయల్లో, అంతటా బాధితులు ఉన్నారు. అందుకే ఇరు వర్గాలకూ న్యాయంగా ఉండేలా తర్వాత ఆదేశాలిస్తాం' అని వివరించింది.


మణిపూర్ కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన పలు ఆదేశాలు...

- బాధితులు, సాక్షులను కోర్టుకు పిలవకుండా వీడియో కాన్ఫరెన్స్ తదితర మార్గాల్లో వర్చువల్‌గా విచారించాలి.
- ఫస్ట్ క్లాస్ లేదా గౌహతి, అస్సాం సెషన్స్ కోర్టులో పని చేస్తున్న ఒకరు, లేదా ఇద్దరు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్లను గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేయాలి.
- వారు మణిపూర్‌లో మాట్లాడే ఒకటి రెండు భాషలు తెలిసిన వారైతే మంచిది.
- నిందితుల హాజరు, రిమాండ్, కస్టడీ, దాని పొడిగింపు వంటి విచారణ ప్రక్రియలన్నీ ఆన్‌లైన్‌లో జరిపేందుకు అనుమతి.
- దూరం, భద్రత తదితర కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం.
- ప్రయాణ సమస్య కారణంగా నిందితులకు మణిపూర్ లోనే జ్యుడీషియల్ కస్టడీకి అనుమతి
- స్టేట్‌మెంట్ నమోదు తదితరాల కోసం మణిపూర్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఒకరు, లేదా ఇద్దరు మేజిస్ట్రేట్‌లను నియమించాలి.
- దోషుల గుర్తింపు పరేడ్‌లు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిపేందుకు అనుమతి.
- సోదాలు, అరెస్ట్ వారెంట్‌లను కూడా ఆన్‌లైన్‌లో జారీ చేయొచ్చు.
- జస్టిస్ గీత మిట్టల్, సారథ్యంలోని ముగ్గురు మహిళా న్యాయమూర్తుల ప్యానెల్ సజావుగా పని చేసేందుకు అనువైన ఆదేశాలను సెప్టెంబర్ 1న ఇస్తారు.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
శనివారం : 26 : ఆగస్టు : 2023

ట్రాఫిక్ సమస్యకు చెక్


బెంగళూరులో ట్రాఫిక్ రద్దీ


జపాన్ సాంకేతికతతో ట్రాఫిక్ నియంత్రణ ఊహా చిత్రం

- బెంగళూరులో జపాన్ సాంకేతికత వినియోగం
- నగరంలో 28 జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ
- అక్కడ స్వయం చాలిత సిగ్నల్స్
- వేచి చూసే సమయం గణనీయంగా తగ్గించే ప్రయత్నం

బనశంకరి: ప్రపంచంలో ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్న నగరాల్లో బెంగళూరు సిలికాన్ సిటీ కూడా ఒకటి. నిత్యం లక్షలాది వాహనాలు రోడ్డెక్కే బెంగళూరు నగరంలో ఒక చోటనుంచి మరోచోటకు వెళ్లాలంటే గంటలకొద్దీ సమయం తీసుకుంటుంది. దీంతో కార్యాలయాలకు, పాఠశాలలకు వెళ్లే ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు నానా అగచాట్లు పడుతున్నారు. అనేక పై వంతెనలు, మెట్రో రైలు ఏర్పాటు చేసినా రద్దీ తగ్గడం లేదు. దీంతో జపాన్ సాంకేతికతను వినియోగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు నగర భూరవాణా డైరెక్టరేట్(డల్ట్) మొగ్గు చూపింది. దేశంలోనే మొదటిసారిగా బెంగళూరులో మేనేజ్‌మెంట్ ఆఫ్ ఒరిజన్ డెస్టినేషన్ రిలేటెడ్ అడాప్టేషన్ ఫర్ ట్రాఫిక్ ఆప్టిమైజేషన్(మోడరెటో) అమలులోకి తేనుంది. సిగ్నల్ కోసం వేచిచూసే సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు ఈ విధానం ఎంతో ప్రయోజనకరమని తేలింది. బెంగళూరునగరంలోని ప్రధానమైన మూడు మార్గాల్లోని 28 జంక్షన్లలో మోడరెట్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ విధానంలో సిగ్నల్స్ స్వయం చాలితంగా పనిచేస్తాయి. అత్యవసర వాహనాల సంచారానికి అనుకూలమయ్యేలా మార్చడానికి కూడా అవకాశం కల్పించారు. జపానఖ నగోయా ఎలక్ట్రిక్ వర్క్స్ కంపెనీ ఈ సాంకేతిక విధానాన్ని నిర్వహిస్తోంది. మోడరిటో ఏరియా ట్రాఫిక్ కంట్రోల్‌సిస్టమ్(ఏటీసీఎస్) అమలు చేస్తున్నాయి. బెంగళూరు ట్రాఫిక్ పోలీసులతో సమాలోచన జరిపి 28 జంక్షన జాబితా సిద్ధం చేశామని డల్ట్ కమిషనర్ వీ.మంజుల తెలిపారు. 2014లోనే దీనిని అమలు చేయాలని నిర్ణయించారు. ఏ కారణాలతోనే వాయిదా పడుతోంది. చివరకు 2021 జూలైలో ఈ పథకం పనులు ప్రారంభం అయ్యాయి. 2022 అక్టోబరు నాటికి పనులు పూర్తి చేయాలని గడువు విధించారు. వచ్చే నెల నాటికి దీనిని పూర్తి స్థాయిలో అమలులోకి తెస్తారు.

ఉత్తమ నిర్ణయం


వాహనాల డిటెక్టర్ల సహకారంతో ట్రాఫిక్ రద్దీని గుర్తించి సిగ్నల్స్ పనిచేస్తాయి. జపాన్ సాంకేతిక పరిజ్ఞాన సంచారసమితి నియంత్రణ వ్యవస్థ అమలు స్వాగతనీయమని నిపుణులు అంటున్నారు. పై వంతెనల నిర్మాణం, లేదా రోడ్డు విస్తరణకు బదులుగా ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం అమలు చేయడం చాలా ఉత్తమ నిర్ణయమని ట్రాఫిక్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఎక్కడెక్కడ అమలు చేస్తారంటే...

ఎంజీ.రోడ్డు, హొసూరురోడ్డు, పాతమద్రాస్ రోడ్డు, 28 జంక్షన్లలో నూతన వ్యవస్థ అమలు చేస్తారు. క్వీన్స్ స్టాచ్యూ సర్కిల్, అనిల్‌కుంబ్లే సర్కిల్, కావేరి ఆర్ట్స్ క్రాఫ్ట్ సర్కిల్, మెయో హాల్, వెబ్స్‌సర్కిల్, ట్రినిటీ సర్కిల్, ట్రినిటీ చర్చ్‌రోడ్డు, బేగం మాల్, అడిగాస్‌జంక్షన్, మణిపాల్‌సెంటర్, కామరాజరోడ్డు, శివాజీనగర ఇంటర్‌సెక్షన్ జంక్షన్ , ఒపేరా జంక్షన్, ఆశీర్వాదం జంక్షన్, పాత పోలీస్‌స్టేషన్ జంక్షన్, ఆశోక్‌నగర జంక్షన్, మదర్ థెరిస్సా జంక్షన్ , డిసోజా సర్కిల్, గరుడామాల్ జంక్షన్, హస్మాట్ జంక్షన్, కెన్సింగ్‌టన్ ఓవల్ జంక్షన్, దామరైకణ్ణన్ జంక్షన్, అంజనేయ ఆలయ జంక్షన్, పాతమద్రాస్ రోడ్డు, ఆదర్శ థియేటర్ జంక్షన్, స్వామివివేకానందస్టేషన్, డబల్‌రోడ్డు జంక్షన్‌లో స్వయం చాలిత సిగ్నల్స్ వ్యవస్థ అమలులోకి వస్తుంది.

వరలక్ష్మీ నమోస్తుతే


విల్సన్ గార్డెన్‌లో మారియమ్మదేవికి విశేష అలంకరణ


అలంకరణలో బనశంకరీదేవి మూలవిరాట్


బనశంకరీదేవి ఆలయం వద్ద భక్తుల సందడి

బనశంకరి: వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో ఆచరించారు. సకలశుభాలు ప్రసాదించే వరమహాలక్ష్మీ దేవిని ఆహ్వానిస్తూ ప్రతి ఇంటా విశేష పూజలు, వ్రతాలు నిర్వహించారు. వేకువజామునే స్నానమాచరించి, ఇంటి గుమ్మానికి మామిడి తోరణాలు, పూలు కట్టి ఇంటి ముందు రంగువల్లులు వేసి వరమహాలక్ష్మీదేవికి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. తుమకూరు జిల్లా కొరటగెరె గురవనహళ్లి లక్ష్మీదేవి ఆలయంలో వరమహాలక్ష్మీ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. బెంగళూరునగరంలో బనశంకరీదేవి ఆలయం, బన్ని మహంకాళి, రాజరాజేశ్వరినగర ఆలయం, మహాలక్ష్మీలేఔట్‌లోని లక్ష్మీదేవి, విల్సన్ గార్డెన్‌లోని మారియమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బనశంకరీ ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రధాన అర్చకులు చంద్రమోహన్ వరమహాలక్ష్మీ అలంకరణచేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధనచేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.


తుమకూరులోని ఓ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

న్యూస్‌రీల్


వినాయక చవితి కోసం గణపయ్య విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. శుక్రవారం బెళగావిలో గణపయ్య ప్రతిమకు తుదిరూపు ఇస్తున్న కళాకారిణి

జలాశయాల్లో నీటి నిల్వలపై నివేదిక ఇవ్వండి

శివాజీనగర: కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని జలాశయాల్లో నీటి నిల్వలపై వాస్తవ నివేదిక సమర్పించాలని కావేరీ నీటి నిర్వహణ మండలికి సుప్రీంకోర్టు సూచించటం ద్వారా పిటిషన్ విచారణను సెప్టెంబర్ 1కి వాయిదా వేసింది. తమకు కేటాయించిన కావేరి జలాలను విడుదల చేసేలా కర్ణాటక ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని సుప్రీం కోర్టులో తమిళనాడు ప్రభుత్వం పిటిషన్ సమర్పించిన విషయం తెలిసిందే. న్యాయమూర్తి బీ.ఆర్.గవాయి నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పిటిషన్ విచారణ చేపట్టింది. కాగా కావేరి నదిపరీవాహక ప్రాంతంలో ఈ ఏడాది 42 శాతం వర్షం కొరత ఏర్పడిందని, ఈ విషయాన్ని కావేరి నీటి నిర్వహణా ప్రాధికార దృష్టికి తీసుకెళ్లామని, అయినప్పటికీ తమిళనాడు 36.76 టీఎంసీల నీరు కోరుతోందని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు దృష్టికి తెచ్చింది. దీంతో కావేరి నది పరీవాహక ప్రాంతంలోని నాలుగు జలాశయాల వాస్తవ పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని కావేరి నీటి నిర్వహణ మండలికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసి కేసు విచారణను వాయిదా వేసింది.

కరువుపై ప్రకటన చేయాలి

యశవంతపుర: వర్షాభావం నేపథ్యంలో కరువు తాలూకాల జాబితా విడుదల చేయాలని మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 120 తాలూకాల్లో కరవు ఏర్పడిందన్నారు. అనేక డ్యామ్‌ల్లో నీరు అడుగంటిందన్నారు. తక్షణం కరవు ప్రాంతాలను గుర్తించి ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వచ్చే నెలలో ప్రకటిస్తాం

శివాజీనగర: రాష్ట్రంలో వర్షం కొరతతో 130కి పైగా తాలూకాల్లో కరువు నెలకొందని, వచ్చే నెల మొదటి వారంలో కరువు ప్రాంతాలను అధికారికంగా ప్రకటిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి తెలిపారు. శుక్రవారం విధానసౌధలో శాఖాధికారులతో సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 79 శాతం విత్తనం పూర్తయిందని, అయితే వర్షం కొరతతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. వాతావరణ సూచన ప్రకారం సెప్టెంబర్‌లో వర్షం కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని, పంట చేతికి వచ్చే అవకాశాలు లేవన్నారు.

12 బైక్‌ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

శివమొగ్గ : బైక్ చోరీలకు పాల్పడుతున్న సొరబ తాలూకా కమనహళ్లికి మంజునాథ్(25), హిరెచౌట్ గ్రామానికి చెందిన ఆనీల్ (26) అనే దొంగలను సొరబ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులనుంచి రూ.4.85 లక్షల విలువైన 12 బైకులను స్వాధీనం చేసుకున్నారు.

బ్యాంక్ ఉద్యోగి చేతివాటం

దొడ్డబళ్లాపురం: ఖాతాదారులకు చెందిన రూ.40 లక్షల నగదును బ్యాంకు ఉద్యోగి స్వాహా చేశాడు. ఈఘటన హాసన్ జిల్లా చెన్నరాయపట్టణ తాలూకా ఆనెకెరెలో చోటుచేసుకుంది. గ్రామంలోని యూనియన్ బ్యాంక్‌లో దండిగనహళ్లికి చెందిన ఎంటీ జయరాం అనే వ్యక్తి 2019 నుంచి బిజినెస్ కరస్పాండెన్స్ (బీసీ)గా పనిచేస్తున్నాడు. గ్రామానికి చెందిన కాళప్ప అనే ఖాతాదారుడు తన పాస్‌బుక్ ఎంట్రీ చేయించగా రూ.50 వేలు డ్రా అయినట్టు తెలిసింది. స్టేట్‌మెంట్ రెఫరెన్స్ నంబర్ పరిశీలించగా జయరాం డివైస్ నుంచి నగదు డ్రా చేసినట్లు తేలింది. ఇలా 40 మంది ఖాతాల నుంచి డబ్బు డ్రా చేశారని వెలుగు చూడటంతో ఖాతాదారులు బ్యాంక్‌ను ముట్టడించారు. నగదు స్వాహాపై బ్యాంక్ మేనేజర్ భరణికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


శుక్రవారం బెంగళూరు గాంధీ భవన్‌లో జరిగిన కవి సిద్ధలింగయ్య సంస్మరణ కార్యక్రమంలో ఆయన విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

కావేరికి మేకెదాటు సరైన పరిష్కారం

యశవంతపుర: కర్ణాటక-తమిళనాడుల మధ్య కావేరి నీటి సమస్య పరిష్కారానికి మేకెదాటు పథకం ఒక్కటే సరైన పరిష్కారమని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ... సుప్రీంకోర్టు కావేరి నిర్వహణ ప్రాధికారాన్ని ఏర్పాటు చేసింది. ఇది సాంకేతిక సమితి, సాంకేతిక అంశాలపై సమితి దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టుకు కూడా సమాచారం ఇచ్చినట్లు డీసీఎం వివరించారు. ఈ పరిస్థితిలో మేకెదాటు యోజన ఒకటే పరిష్కార మార్గమన్నారు. మండ్యలో బీజేపీ నాయకులు మాత్రమే ఆందోళన చేసి నీటిని వదలద్దంటున్నారు. వారికి ఎక్కడ నష్టం వచ్చిందో చెప్పటం లేదన్నారు. రాష్ట్ర రైతులకు కావాల్సిన నీటిని అందించటంలో ప్రభుత్వం సఫలీకృతమైందని శివకుమార్ వివరించారు.

క్రిమినల్ కేసుల విచారణ వేగవంతం కావాలి

యశవంతపుర: సీఆర్‌పీసీ సెక్షన్ 309 కింద నమోదైన క్రిమినల్ కేసులను రోజువారీగా విచారణ చేయాలని హైకోర్టు కింది కోర్టులను ఆదేశించింది. కేసు విచారణ ఆలస్యం కావటంతో నిందితులు బెయిల్ కోసం హైకోర్టుకు రావటంపై న్యాయమూర్తి కె నటరాజన్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేసింది. చామరాజనగర జిల్లా గుండ్లుపేటలో జరిగిన ముగ్గురి హత్య కేసు నిందితుడు అన్ను అలియాస్ అన్సార్ బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా న్యాయమూర్తి విచారణ చేసి పిటిషన్‌ను మూడోసారి కొట్టివేశారు. సెషన్ కోర్టుల్లో క్రిమినల్ కేసుల విచారణలో ఆలస్యం జరుగుతుండటంతో న్యాయవాదులు హైకోర్టులో పిటిషన్లు వేస్తున్నారని, శంబానాథ్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సరైన కారణాలు చూపకుండా వాయిదా వేయవద్దని, సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తూ కేసుల విచారణ వేగవంతం చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు.

గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడి హత్య


నారాయణస్వామి (ఫైల్)

చిక్కబళ్లాపురం : శిడ్లఘట్ట తాలూకా బైర నాయకనహళ్లి గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడు నారాయణస్వామి (50) హత్యకు గురయ్యాడు. గురువారం రాత్రి గ్రామ సమీపంలో దుండగులు అతన్ని కొడవళ్లతో నరికి చంపారు. శిడ్లఘట్టకు వచ్చి స్వగ్రామానికి కారులో వెళ్తూ గ్రామ సమీపంలో వాహనం దిగి ఫోన్‌లో మాట్లాడుతుండగా దుండగులు అతని కళ్లలో కారం పొడి చల్లి అనంతరం కొడవళ్లతో నరికారు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దిబ్బూరహళ్లి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని శిడ్లఘట్ట ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. నారాయణస్వామి మృతితో గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ నాగేష్ తెలిపారు.

నేడు బెంగళూరుకు ప్రధాని

- ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించనున్న మోదీ


ప్రధాని నరేంద్రమోదీ

శివాజీనగర: అంతరిక్షంలో సరికొత్త శకాన్ని ఆవిష్కరించి, ప్రపంచంలో చిరస్థాయిగా గుర్తుండిపోయేలా విజయాన్ని అందుకున్న చంద్రయాన్-3 విజయవంతానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలను స్వయంగా అభినందించడానికి ప్రధాని మోదీ శనివారం బెంగళూరు రానున్నారు. ఇస్రో శాస్త్రవేత్తలను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం బెంగళూరులో పర్యటించనున్నారు. బెంగళూరుకు చేరుకొని ఇస్రోకు చెందిన టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ నెట్‌వర్క్ (ఇస్ట్రాక్)ను సందర్శించనున్నారు. అనంతరం ఇస్రో సైంటిస్టులతో మోదీ భేటీ కానున్నారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఆ తర్వాత ఉదయం 8.05 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి 8.35 గంటలకు ఢిల్లీకి చేరుకుంటారని తెలిపింది. ఈ క్రమంలోనే ప్రధాని పర్యటనకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ప్రధాని ప్రయాణించే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని బెంగళూరు సిటీ ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. ఈ క్రమంలోనే బెంగళూరుకు రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికేందుకు రాష్ట్ర బీజేపీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్.అశోక్ వెల్లడించారు. అదే విధంగా నగరంలో 10 వేల మందితో భారీ రోడ్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత ప్రధాని నరేంద్ర మోది తొలిసారిగా కర్ణాటకలో పర్యటించనున్నారు. ప్రధాని మోదీకి బెంగళూరులోని హెచ్‌ఏఎల్ ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన బీజేపీ, వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతోంది.

ప్రధాని రాక, నగరంలోట్రాఫిక్ ఆంక్షలు

నగరంలోని ఇస్రో కేంద్రానికి శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోది విచ్చేయనుండగా ఆయన ప్రయాణించే మార్గాల్లో భారీ ఆంక్షలు విధించారు. ఉదయం గ్రీస్ రాజధాని ఏథెన్స్ నుండి నేరుగా బెంగళూరుకు రానున్నారు. శనివారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఆయన ప్రయాణించే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నాయి. ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్డు, ఓల్డ్ మద్రాస్ రోడ్డు, ఎంజీ రోడ్డు, కబ్బన్ రోడ్డు, రాజభవన రోడ్డు, బళ్లారి రోడ్లలో రాకూడదని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. అంతే కాకుండా సీ.వీ.రామన్ రోడ్డు, యశ్వంతపుర ఫ్లై ఓవర్, తుమకూరు రోడ్డు (యశ్వంతపుర నుండి నాగసంద్ర వరకు) మాగడి రోడ్డు, రింగ్‌రోడ్డు (గొరగుంట పాళ్య జంక్షన్ నుండి సుమనహళ్లి) గుబ్బి తోటదప్ప రోడ్డు, జాలహళ్లి క్రాస్ రోడ్లలో సంచారం నిషేధించారు. కొన్ని మార్గాల సంచారం నిషేధించడమే కాకుండా నగరంలో 26న తెల్లవారు జామున 4 నుంచి ఉదయం 11 గంటల వరకు భారీ సరుకు రవాణా వాహనాలను పూర్తిగా నిషేధించారు.

ప్రధాని కార్యక్రమ వివరాలిలా

- ఉదయం 5.55 గంటలకు హెచ్.ఏ.ఎల్ విమానాశ్రయానికి చేరుకుంటారు
- ఉదయం 6.30 గంటలకు ఇస్రో కేంద్ర కార్యాలయంలో భేటీ
- ఉదయం 8 గంటల వరకు ఇస్రో కార్యాలయంలో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లతో సమావేశం
- ఉదయం 8.15 గంటలకు ఢిల్లీకి ప్రయాణం

క్లుప్తంగా

నీటిశుద్ధి కేంద్రం తనిఖీ


పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు

హొసపేటె: తాలూకాలోని పాపినాయకనహళ్లితో పాటు మొత్తం తొమ్మిది గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసే నీటి శుద్ధి కేంద్రాన్ని జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి సదాశివ ప్రభు శుక్రవారం తనిఖీ చేశారు. యూనిట్‌లో నీటిని శుద్ధి చేసే యూనిట్ నిర్వహణపై సమాచారం తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నీరు కలుషితం కాకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ట్యాంకులను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హొసపేటె రూరల్ డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీరేష్, అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్ తదితరులు యూనిట్ పని తీరు గురించి ఆయనకు పూర్తి వివరాలు అందించారు.

విద్యార్థిని బలవన్మరణం


పవిత్ర(ఫైల్)

రాయచూరు రూరల్: జిల్లాలోని దేవదుర్గలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దేవదుర్గ కిత్తూరు రాణి చెన్నమ్మ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతోన్న దేవదుర్గ తాలూకాలోని బీ.ఆర్.గుండా గ్రామానికి చెందిన పవిత్ర(15) అనే విద్యార్థిని మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్య చేసుకుందని డీఎస్పీ మంజునాథ్ తెలిపారు. ఘటనా స్థలిని సీఐ గుండూరావ్, సాంఘీక సంక్షేమ శాఖాధికారి రాజేంద్ర, తహసీల్దార్ చెన్నమల్లప్ప పరిశీలించారు. విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దేవదుర్గ సీఐ గుండూరావ్ తెలిపారు.

మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను సత్వరం ప్రారంభించండి

బనశంకరి: చిక్కనాగమంగల చెత్త సంస్కరణ కేంద్రంలో వినూత్నంగా ఏర్పాటు చేసిన లీచెట్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను సత్వరం ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు బీబీఎంపీ దక్షిణ వలయ కమిషనర్ జయరాం సూచించారు. శుక్రవారం చిక్కనాగమంగల చెత్త సంస్కరణ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చెత్తతో ఉత్పత్తిఅయ్యే లిచేట్‌ను ఆధునికంగా సంస్కరించే దృష్టితో వినూత్న తరహాలో ఈ ప్లాంట్‌ను పరిశుద్ధ వెంచర్స్ సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా లిచేట్ నీటిని సంస్కరణ చేపడుతున్నామని తెలిపారు. కర్ణాటక కాలుష్యనియంత్రణ మండలి క్లియరెన్స్ ఇచ్చిన అనంతరం ట్రీట్మెంట్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. లిచేట్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లో నిత్యం 50 వేల లీటర్ల నీటిని శుద్ధి చేసే సామర్థ్యం ఉందన్నారు. దీంతో సుమారు 30 వేల లీటర్ల స్వచ్ఛమైన నీరు ఉత్పత్తి అవుతుందని, లీచేట్ ప్లాంట్ పూర్తి స్థాయిలో ప్రారంభమైన అనంతరం లీచేట్‌ను సంస్కరణ చేపట్టి దీని ద్వారా లభించే మంచినీరు రైతులు లేదా కట్టడ నిర్మాణాల వారికి ఉచితంగా అందించాలని అధికారులకు సూచించారు. జాయింట్ కమిషనర్ కే.జగదీశ్, ఇంజనీర్, రాజేశ్, సంస్కరణ కేంద్రం మేనేజర్ అర్పితా పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి మృతి


మల్లేష్(ఫైల్)

రాయచూరు రూరల్: ట్రాక్టర్ ఢీకొని ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన శుక్రవారం తాలూకాలో చోటు చేసుకుంది. ఇడపనూరు నుంచి కొత్తదొడ్డికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి చిక్కబూదూరుకు చెందిన మల్లేష్(17) అనే విద్యార్థిని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతనిని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మల్లేష్ నగరంలోని ఎస్ఆర్ పీయూ కళాశాలలో ద్వితీయ పీయూసీ చదువుతున్నాడు. ఇడపనూరు ఎస్ఐ అవినాష్ కాంబ్లే కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీలంక నేరస్తులకు సాయం, ఇద్దరి అరెస్ట్


పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

యశవంతపుర: ముగ్గురు శ్రీలంక నేరస్తులకు సాయం చేసిన ఇద్దరిని బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నైకి చెందిన మన్సూర్, బెంగళూరు వివేకనగరకు చెందిన అన్బళగన్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మన్సూర్ వద్ద రూ.57 లక్షలు నగదు, 1.5 కోట్లు విలువైన డీడీని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులు శ్రీలంక నుంచి సముద్ర మార్గంలో తమిళనాడు సేలంకు వచ్చి అక్కడ నుంచి బెంగళూరుకు చేరుకున్నారు. జలాల్ అనే వ్యక్తి మార్గదర్శనలో మన్సూర్ పని చేసి పెట్టడానికి అధిక మొత్తంలో డబ్బులు చేరాయి. బెంగళూరుకు చెందిన అన్బళగన్ పాస్‌పోర్టు సిద్ధం చేయటానికి డబ్బులు తీసుకున్నట్లు పోలీసుల విచారణలో బయట పడింది. నేపాల్‌లో ఉంటున్న సంజీవ్ అనే వ్యక్తి దీనికంతటికి చక్రం తిప్పుతున్నట్లు పోలీసులు తెలిపారు. సింహళీభాషలో జరిగిన సంభాషణపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

సామూహిక వివాహాలతో బాసట

- గాలి లక్ష్మీఅరుణ నేతృత్వంలో పెళ్లిళ్లు
- ఒకే వేదికపై ఒక్కటైన 35 జంటలు


ఉచిత సామూహిక వివాహాలను ప్రారంభిస్తున్న అతిథులు


వధూవరులను ఆశీర్వదిస్తున్న కేఆర్‌పీపీ నాయకురాలు గాలి లక్ష్మీ అరుణ

సాక్షి,బళ్లారి: పేదలకు పెళ్లి చేసుకోవడం పెనుభారంగా మారుతున్న నేటి రోజుల్లో ఉచిత సామూహిక వివాహాలు జరిపించి వారికి బాసటగా నిలుస్తున్నారు గంగావతి ఎమ్మెల్యే, కేఆర్‌పీపీ వ్యవస్థాపకుడు గాలి జనార్దనరెడ్డి. శుక్రవారం వరమహాలక్ష్మి పర్వదినం రోజున నగరంలోని సిరుగుప్ప రోడ్డు హవంబావిలో తమ స్వగృహం పక్కనే క్యాంప్ హౌస్ ఆవరణలో ఆయన సతీమణి గాలి లక్ష్మీఅరుణ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహాలు ఘనంగా జరిగాయి. 35 జంటలు ఒకే వేదికపై ఒక్కటయ్యారు. అనంతరం గాలి లక్ష్మీఅరుణ మాట్లాడుతూ 1999 నుంచి వరుసగా 12 ఏళ్ల పాటు తన భర్త గాలి జనార్దనరెడ్డి సుమారు 50 వేల జంటలకు ఉచిత సామూహిక వివాహాలు జరిపించారని గుర్తు చేశారు. జాతీయ పార్టీలతో పోటీ పడి తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేసిన తనకు నగరంలో ఓట్లు వేసి ఆదరించిన దాదాపు 50 వేల మంది ఓటర్ల రుణం తీర్చుకుంటామన్నారు. రాజకీయాల్లో ప్రజాసేవే పరమావధిగా పని చేస్తామన్నారు. కమ్మరచేడు కళ్యాణ స్వామి, బ్రహ్మణి రాజీవ్‌రెడ్డి, కేఆర్‌పీపీ నాయకులు బీ.వీ.శ్రీనివాసరెడ్డి, రాజశేఖరగౌడ, కే.ఎస్,దివాకర్, దరప్ప నాయక్, ఉమారాజ్, వెంకటరమణ, కేఆర్‌పీపీ మహిళా విభాగం నాయకురాలు హంపీ రమణ, నగర కార్పొరేటర్లు కల్పనా వెంకటరామిరెడ్డి, కోనంకి తిలక్ తదితరులు పాల్గొన్నారు.

ఇకపై ఏటా సామూహిక వివాహాలు

తాను మంత్రిగా అధికార బాధ్యతలు నిర్వహించినప్పుడు రాజకీయాలకతీతంగా ఉమ్మడి బళ్లారి జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లానని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం వరమహాలక్ష్మీ పర్వదినం సందర్భంగా కేఆర్‌పీపీ ఆధ్వర్యంలో బళ్లారిలో నిర్వహించిన ఉచిత సామూహిక వివాహాల సందర్భంగా వధూవరులను వర్చువల్ ద్వారా ఆశీర్వదించి మాట్లాడారు. ఇకపై తమ ఊపిరి ఉన్నంత వరకు ప్రతి ఏటా వరమహాలక్ష్మీ పండుగ రోజున సామూహిక వివాహాలు జరిపిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో వరమహాలక్ష్మి పూజలు


అమ్మవారిని అలంకరించి పూజ చేస్తున్న భక్తులు

సాక్షి,బళ్లారి: మహిళలకు ఎంతో ఇష్టమైన పండుగల్లో ఒకటైన వరమహాలక్ష్మి పండుగను కన్నుల పండువగా జరుపుకున్నారు. శుక్రవారం వరమహాలక్ష్మి పర్వదినం సందర్భంగా నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా మహిళలు వరమహాలక్ష్మి దేవిని ఇంటింటా అలంకరించి భక్తిశ్రద్ధలతో పండుగను ఆచరించారు. నగరంలో కనక దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు.

ప్లాస్టిక్ కట్టడికి ప్రజలు సహకరించాలి


బట్టల సంచులను పంచుతున్న జడ్జి దయానంద్

రాయచూరు రూరల్: నగరంలో ప్లాస్టిక్‌ను కట్టడి చేసేందుకు ప్రజలు సహకరించాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి దయానంద్ బేలూరు పిలుపు ఇచ్చారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద జన శిక్షణ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బట్టల సంచులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. నగరంలో ఎక్కడ పడితే అక్కడ పుట్‌పాత్‌లపై ప్లాస్టిక్ కవర్లను అక్కడే పడేసి అపరిశుభ్రతకు కారణమవుతున్నారన్నారు. వ్యాపారులు, పూలు, పండ్లు, కూరగాయలు విక్రయించేవారు ప్లాస్టిక్ బదులు బట్టల సంచులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శివకుమార్, నగరసభ కమిషనర్ గురుసిద్ధయ్య, జన శిక్షణ సేవా సంస్థ సంచాలకుడు సదానంద, ప్రభు నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరను

శివాజీనగర: తాను బీజేపీ విడచి కాంగ్రెస్ పార్టీలో చేరనని, ఒకవేళ బీజేపీ విడచిపెట్టే పరిస్థితి వస్తే రాజకీయ సన్యాసం పుచ్చుకొంటానని మాజీ మంత్రి భైరతి బసవరాజ్ తెలిపారు. శుక్రవారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన ఆయన, తాను బీజేపీ విడచిపెట్టి కాంగ్రెస్ చేరుతారనే వదంతుల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలని తనకు ఎవరి నుంచి ఆహ్వానం రాలేదని, ఎవరూ సంప్రదించలేదన్నారు.

భర్త మరో మహిళతో వెళ్లాడని ఫిర్యాదు

మైసూరు : తన భర్త మరో మహిళతో వెళ్లాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మడికేరి నగరం, త్యాగరాజు కాలనీలో సతీష్, రేఖ దంపతులు నివాసం ఉంటున్నారు. సతీష్ దుకాణం ఏర్పాటు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల దుకాణంలో పని చేసేందుకు ఒక మహిళ నియమించుకున్నాడు. అయితే సతీష్ తన పిల్లలను తీసుకొని సదరు మహిళతో కలిసి వెళ్లాడని భార్య రేఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


చెన్నబసవ(ఫైల్), మృతుడు రాసిన డెత్‌నోట్

రాయచూరు రూరల్: విద్యార్థులకు పాఠాలు బోధించి ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలని కన్న కలలు సాకారం కాకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దేవదుర్గలో చోటు చేసుకుంది. దేవదుర్గ తాలూకా చిక్కబూదూరుకు చెందిన చెన్నబసవ(25) అనే యువకుడు దేవదుర్గలోని జ్ఞానగంగా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఉపాధ్యాయ పరీక్షల్లో 6, 8వ తరగతుల ఉపాధ్యాయ ఉద్యోగానికి ప్రాథమిక జాబితాలో ఎంపికైన చెన్నబసవ 2022లో జరిగిన తుది నియామకాల జాబితాలో చెన్నబసవ పేరు లేదు. మరోసారి పరీక్షలు రాసి పాసవ్వాలని మరింత కష్టపడి చదివినా ఫలితం దక్కలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది మనస్తాపంతో డెత్‌నోట్ రాసి పాఠశాల ఆవరణలో ఆత్మహత్య చేసుకున్నట్లు డీఎస్పీ మంజునాథ్ తెలిపారు. ఈ విషయంలో ఎవరిపైనా కేసు పెట్టరాదని డెత్‌నోట్‌లో చెన్నబసవ రాశాడని ఆయన తెలిపారు. ఘటనా స్థలికి తాలూకా విద్యా శాఖాధికారి సుఖదేవ్, తహసీల్దార్ చెన్నమల్లప్ప చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. దేవదుర్గ సీఐ గుండూరావ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎడమ కాలువలో నీటిమట్టం కాపాడండి


కాలువలో నీటిమట్టాన్ని పరిశీలించి మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువలో నీటిమట్టాన్ని కాపాడాలని రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖా మంత్రి ఎన్.ఎస్.బోసురాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మునిరాబాద్ సమీపంలోని ప్రభుత్వ అతిథిగృహంలో నీటిపారుదల శాఖ సీనియర్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో కూడా చర్చించినట్లు తెలిపారు. 49, 69, 104వ మైలు వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించాలన్నారు. పైభాగంలో జరుగుతున్న అక్రమ వాడకం, నీటి చౌర్యాన్ని అరికట్టాలన్నారు. 69వ మైలులో 12 మీటర్లు, 104వ మైలులో 10 మీటర్ల నీటిమట్టం ఉండేలా చేస్తే ఆయకట్టు చివరి భూములకు నీరందుతాయన్నారు. సమావేశంలో సీనియర్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ మంజప్ప, చీఫ్ ఇంజనీర్ బసవరాజ్, ఎస్ఈ సత్యనారాయణ, ఇంజినీర్లు బసనగౌడ పాటిల్, గోడేకర్‌లున్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అవసరం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లతా మల్లికార్జున్

కంప్లి: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తుందని హరపనహళ్లి ఎమ్మెల్యే ఎంపీ లతా మల్లికార్జున్ తెలిపారు. ఆమె శుక్రవారం హరపనహళ్లి తాలూకాలోని ప్రభుత్వ పాఠశాలలో గుడ్లు, అరటి పండ్లను పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. భావిభారత పౌరుల రక్షణ మనందరి కర్తవ్యం అన్నారు. దీనికి ప్రభుత్వం కూడా సహకారం అందిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

భర్తను దారిలో పెట్టేందుకు చోరీ నాటకం

యశవంతపుర : భర్తను దారిలో పెట్టబోయి భార్య చిక్కుల్లో పడిన ఘటన బెంగళూరులో జరిగింది. భర్త రోజూ ఏదో ఒక విషయంపై గొడవ చేసేవాడు. అతన్ని తన దారికి తెచ్చుకునేందుకు స్నేహితుడితో కలిసి పథకం వేసింది. బ్యాంక్‌లో ఉన్న బంగారు ఆభరణాలను విడిపించి నగలను స్కూటీలో ఉంచింది. పథకం ప్రకారం స్నేహితుడు వచ్చి స్కూటీ తీసుకెళ్లాడు. అనంతరం బంగారం చోరీ అయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇది భర్తపనే అనే అనుమానంతో పోలీసులు విచారణ చేపట్టారు. అనంతరం ఆమె సెల్‌ఫోన్ కాల్‌డేటాను పరిశీలించగా ఆమె తన స్నేహితుడికి పలు పర్యాయాలు ఫోన్ చేసినట్లు తేలింది. అనంతరం ఇద్దరిని పిలిచి విచారించగా భర్తను బెదిరించి తన దారికి తెచ్చుకోవటానికి ఇలా చేసినట్లు ఆమె అంగీకరించింది. మల్లేశ్వరం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వీధి దీపాలను అమర్చరూ


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగర వీధుల్లో విద్యుత్ దీపాలను అమర్చాలని అంబేడ్కర్ మూల నివాసి సంఘం సంచాలకుడు భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వీధుల్లో విద్యుత్ దీపాలు సరిగా వెలగడం లేదని ఆరోపించారు. నగరంలో ఎక్కడ పడితే అక్కడ ఆక్రమించిన ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి పాదచారులకు నడిచేందుకు వీలు కల్పించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

చంద్రయాన్-3 సక్సెస్‌పై జాతా


జాగృతి జాతా నిర్వహిస్తున్న దృశ్యం

కంప్లి: పట్టణంలోని శారదా ప్రభుత్వ పాఠశాల నుంచి శుక్రవారం చంద్రయాన్-3పై జాగృతి జాతా నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలోని షామియాచంద్ ప్రభుత్వ పాఠశాలలో విజ్ఞాన ఉపాధ్యాయులు డాక్టర్ సునీల్ చంద్రయాన్-3 ప్రాధాన్యతపై ఉపన్యసించారు. జేసీఐ సోనా కంప్లి అధ్యక్షులు సంతోష్ కొట్రప్ప సోగి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ గుడదూరు, ఉపన్యాసకులు డాక్టర్ కే.మహేష్, జేసీఐ సోనా కంప్లి మహిళా విభాగం అధ్యక్షురాలు అమృతా సంతోష్, కార్యదర్శి బీహెచ్ఎం అమరనాథ శాస్త్రి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కావేరి జలాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- శోభా కరంద్లాజె డిమాండ్

శివాజీనగర: కావేరి నదిలో ఏ స్థాయిలో నీరు ఉంది, జలాశయాల్లో నీటినిల్వలు, తాగునీటికి ఎంత నీరు అవసరమనే అంశాలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కేంద్ర మంత్రి శోభాకరంద్లాజె డిమాండ్ చేశారు. శుక్రవారం మల్లేశ్వరంలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మైసూరు, మండ్య, బెంగళూరు వాసులు కావేరి నది నీటిపైనే ఆధారపడ్డారన్నారు. వర్షాభావంతో జలాశయాల్లో నీటి నిల్వలు లేవన్నారు. ఇటువంటి సమయంలో ఐఎన్‌డీఐఏ నాయకులను తృప్తిపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడుకు నీటిని అందిస్తున్నారని ఆరోపించారు. తామేమి తమిళనాడుకు శత్రువులం కాదని, నీటి కొరత ఉన్నప్పుడు విడుదల చేయడమే తమ అభ్యంతరమన్నారు. కావేరి జలాల విషయంలోకి ప్రధాని మోదీని లాగి రాజకీయం చేయడం సీఎం సిద్దరామయ్యకు తగదన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

కోలారు: వాహ్యాళికి వెళుతున్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును దుండగుడు లాక్కెళ్లిన ఘటన నగరంలోని కాళమ్మగుడి వీధిలో చోటు చేసుకుంది. నగరంలోని కిలారిపేటకు చెందిన వరలక్ష్మి అనే వృద్ధురాలు ఉదయం వాహ్యాళికి బయలుదేరింది. కాళమ్మ గుడి వీధిలో వెళుతుండగా ద్విచక్రవాహనంలో వచ్చిన ఇద్దరు వ్యక్తులు అడ్రస్ అడిగే నెపంతో వృద్ధురాలి వద్దకు వెళ్లి మాటలు కలిపారు. ఇంతలో వెనుక కూర్చున్న వ్యక్తి వృద్ధురాలి మెడలో ఉన్న బంగారం గొలుసును లాక్కున్నాడు. వృద్ధురాలు తేరుకుని గట్టిగా అరిచినా ప్రయోజనం కలుగలేదు. బైక్‌పై ఇద్దరు దొంగలు చైన్‌తో ఉడాయించారు. చోరీ ఘటన దృశ్యం అక్కడే ఉన్న దుకాణపు సిసి కెమెరాలో నమోదైంది. నగర పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు సమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఇద్దరు దొంగల అరెస్టు

- రూ.10.5 లక్షల విలువ చేసే 21 బైక్‌ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

కోలారు: జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో దొంగిలించిన రూ.10.5 లక్షల విలువ చేసే 21 ద్విచక్ర వాహనాలను నగర పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. కోలారు షహీన్ షా నగర్‌కు చెందిన ముజమిల్, సాధిక్ పాషా అనే ఇద్దరు నిందితులు అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంలో తిరుగుతుండగా రాత్రి గస్తీ తిరుగుతున్న నగర పోలీసులు వారిని అడ్డుకుని ప్రశ్నించగా అసలు గుట్టు బయట పడింది. వీరు కోలారు నగరంతో పాటు చిక్కబళ్లాపుర, చింతామణి తదితర ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడినట్లు తెలిపారు. చోరీ చేసిన తరువాత వాటి ఛాసీ నెంబర్లను మార్చి తిరిగి విక్రయిస్తున్నట్లు విచారణలో అంగీకరించారు. వీరిపై బెంగళూరు నగరంతో పాటు కెజి హళ్లి ప్రాంతాల్లో కూడా కేసులు ఉన్నట్లు తెలిసింది.

హాస్టల్‌లో అధికారుల పరిశీలన


హాస్టల్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హొసపేటె: నగరంలో వివిధ శాఖల ప్రగతి సమీక్ష సమావేశం అనంతరం విద్యార్థి వసతిగృహాన్ని, స్టోర్ రూమ్‌ను ఇన్‌చార్జ్ కార్యదర్శి కేపీ మోహన్ రాజ్ పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, స్నాక్స్ తదితరాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభుతో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు.

ప్లాస్టిక్ అంగళ్లపై దాడులు


అంగళ్లలో తనిఖీ చేస్తున్న అధికారులు

కంప్లి: పట్టణంలోని వివిధ దుకాణాల్లో శుక్రవారం అధికారులు దాడులు జరిపి ప్రభుత్వం నిషేధించినా వాడుతున్న ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకొన్నారు. ఈసందర్భంగా ప్రొబేషనరీ తహసీల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ ఇకపై హోటళ్లు, కిరాణ అంగళ్లలో ప్లాస్టిక్ సంచులు వాడుతున్నట్లు తన దృష్టికి వస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కఠినంగా హెచ్చరించారు.

కోలారు వార్తలు...

అటవీ భూమిలో కొనసాగిన ఆక్రమణల తొలగింపు


మామిడి చెట్లను జేసీబీ సాయంతో తొలగిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: పట్టణ సమీపంలోని అటవీ భూమిలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని రెవిన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా జేసీబీల సహాయంతో కొనసాగించారు. మామిడి తోటలను తొలగించిన స్థానంలో గుంతలను తవ్వి ఆ స్థలంలో నేరేడు, వెదురు, వేప, శ్రీగంధం తదితర చెట్ల మొక్కలను అటవీ శాఖ నియమించిన కార్మికులు నాటారు. శుక్రవారం కూడా 120 ఎకరాల ఆక్రమిత అటవీ భూమిలోని ఆక్రమణలను తొలగించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఆక్రమణలను తొలగించిన స్థానంలో వివిధ రకాల మొక్కలను నాటుతున్నట్లు అధికారి కె మహేష్ తెలిపారు. పట్టణంలో నుంచి వాహనాలలో వచ్చి గుంపులుగా చేరిన నగర ప్రజలను పోలీసులు అక్కడి నుంచి పంపించి వేశారు.

మారికాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మారికాంబా దేవి

మాలూరు: పట్టణంలోని దొడ్డపేట మెయిన్ రోడ్డులోని పురాతన మారికాంబ ఆలయంలో వరలక్ష్మీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అలంకరణ చేసి అమ్మవారి మూల విగ్రహానికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, వేదమంత్ర పారాయణం తదితర పూజలను జరిపారు. పట్టణంతో పాటు తాలూకాలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకున్నారు.

భక్తిప్రపత్తులతో వరలక్ష్మీ వ్రతం ఆచరణ


వరలక్ష్మీ వ్రతం నిర్వహించిన దృశ్యం

కోలారు: జిల్లా వ్యాప్తంగా భక్తిప్రపత్తులతో శుక్రవారం వరమహాలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. జిల్లాలో ఈసారి వానలు లేక కరువు పరిస్థితి నెలకొంది. అయినా జిల్లా ప్రజలు వరలక్ష్మీ వ్రతాన్ని వేడుకగా జరిపారు. పూలు, పండ్ల ధరలు గణనీయంగా పెరిగినా ఉత్సాహంగా పండుగను నిర్వహించడం విశేషం. పండుగ సందర్భంగా వ్రత ఆచరణ కోసం పురోహితులకు డిమాండ్ అధికంగా ఉంది. పలువురు తెల్లవారు జామున 4 గంటల నుంచే పూజలు ప్రారంభిస్తే మరి కొంత మంది రాహుకాలం ప్రారంభానికి ముందు 10.30 గంటల్లోగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో కలశాన్ని ప్రతిష్ఠించి చక్కగా అలంకరణ చేసి సాంప్రదాయబద్ధంగా పండుగను ఆచరించారు. పిండి వంటలు తయారు చేసుకుని భోజనం చేశారు. ఆదిదేవత లక్ష్మీ దేవిని పూజించడం వల్ల అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయనే నమ్మకంతో మహిళలు ప్రత్యేక శ్రద్ధతో వ్రత ఆచరణ చేశారు. పండుగ సందర్భంగా సెలవు లేకున్నా మహిళా ఉద్యోగులు సెలవు పెట్టడంతో కార్యాలయాలు ఖాళీగా కనిపించాయి. నగరంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. నగరంలోని విద్యాగణపతి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ పూజను నెరవేర్చారు.

ప్రజలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ నారాయణ

కోలారు: తమపై జరిగిన దౌర్జన్యాలపై ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ ఎం.నారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి దళితుల గ్రీవెన్స్ డేకి అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలోని ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేయవచ్చని, ఎక్కడైనా పోలీసులు స్పందించకుంటే నేరుగా తన దృష్టికి తేవచ్చన్నారు. జిల్లాలో 2021–22వ సంవత్సరంలో దళితులపై 48 దౌర్జన్య కేసులు నమోదయ్యాయన్నారు. వీటిలో ఇప్పటికే రెండు కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయన్నారు. ఇంకా 46 కేసులు కోర్టులో విచారణ దశలో ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే చిన్న చిన్న గొడవలను అక్కడికక్కడే పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి నెల రెండో ఆదివారం ప్రతి పోలీస్ స్టేషన్‌లోను దళితుల ఫిర్యాదు స్వీకరణను నిర్వహించాలని ఆదేశించామన్నారు. జిల్లాలో దళితులపై జరిగే దౌర్జన్యాలపై నిర్లక్ష్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ భాస్కర్, డీఎస్పీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ సఫలంపై సంబరాలు


జాతీయ జెండా పట్టుకుని సంబరాలు చేస్తున్న రైతు సంఘం

శ్రీనివాసపురం: చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రుడిపై కాలుమోపడంతో రైతు సంఘం పదాధికారులు శుక్రవారం ముళబాగిలు పట్టణంలో జాతీయ జెండాను పట్టుకుని సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ చంద్రయాన్-3 చంద్రుడిపై కాలుమోపడంతో భారత దేశ కీర్తి పతాక దశదిశలా వ్యాపించిందన్నారు. చంద్రుడిపై భారత దేశం పరిశోధనలు ప్రారంభించడం భవిష్యత్తులో దేశ పురోగతికి నిదర్శనమన్నారు. చంద్రుడిపై కాలుమోపిన దేశాల్లో భారతదేశం నాలుగో దేశం కావడం దేశ ప్రజలకు గర్వకారణమన్నారు. భారత దేశ ఇస్రో శాస్త్రవేత్తలు భవిష్యత్తులో మరింత సాధన చేయాలన్నారు. రాష్ట్ర కార్యాధ్యక్షుడు బంగారి మంజు, రాజేష్, భాస్కర్, విజయపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పసుపు, కుంకుమ వితరణ



గౌరిబిదనూరు: తాలూకాలో ప్రసిద్ధి చెందిన విదురాశ్వత్థం అశ్వత్థ నారాయణస్వామి ఆలయంలో వరమహాలక్ష్మి పండుగ సందర్భంగా ముత్తైదువులకు పసుపు, కుంకుమ, పూలు, గాజులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిన్నప రెడ్డి, ఈఓ మరిరాజు పాల్గొన్నారు.

రాజలక్ష్మి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం



తామర పూలతో అమ్మవారికి అలంకరణ

గౌరిబిదనూరు: శుక్రవారం వరమహాలక్ష్మీ పండుగ సందర్భంగా నగర సమీపంలో చిక్కకురుగోడు రైల్వేగేట్ సమీపంలో వెలసిన శ్రీ చక్ర సహిత రాజలక్ష్మి ఆలయంలో వైభవంగా వ్రతాలు, పూజలు, ప్రాకారోత్సవం, అభిషేకాలు జరిగాయి. శ్రీ చక్రానికి అభిషేక పూజలను ప్రధాన అర్చకులు భూమరాజు నరేంద్ర శర్మ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మహిళకు ఏడేళ్ల జైలు

మైసూరు: వేశ్యావాటిక నిర్వహిస్తున్న మహిళకు మైసూరు నగరంలోని 3వ అదనపు జిల్లా కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష, రూ. 12 వేల జరిమానా విధించింది. మైసూరు మధురానగరలో నివాసం ఉంటున్న శోభ శిక్ష పడిన మహిళ. ఈమె బెంగాల్ నుంచి యువతులను తీసుకువచ్చి మైసూరులో వేశ్యా వాటికి నిర్వహిస్తోంది. స్థానిక పోలీసులు దాడి చేసి శోభాను అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీట్ సమర్పించారు. నేరం రుజువు కావడంతో నిందితురాలికి ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

మైసూరు: బైక్ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా పరియా పట్టణ తాలూకా సుంకదహళ్లి గ్రామంలో చోటుచేసుంది. వివరాలు.. గ్రామానికి చెందిన సుజాత (45) శుక్రవారం సుంకదహళ్లి గ్రామ ప్రధాన రహదారిలో నడుచుకుంటూ వస్తుండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొంది. తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చర్చిలో హుండీ చోరీ



హుండీని చోరీ చేస్తున్న దొంగ

గౌరిబిదనూరు : నగరంలోని నాగప్పా బ్లాక్ సమీపంలో ఉన్న చర్చిలో చోరీ జరిగింది. శుక్రవారం వేకువజామున దొంగ లోనికి ప్రవేశించి హుండీని తరలించేందుకు యత్నిస్తుండగా స్థానికులు గమనించి చర్చి కార్యదర్శి బాబురాజ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన తన భార్యతో కలిసి వెళ్లగా దొంగ రాడ్‌తో దాడి చేయడానికి ప్రయత్నించాడు. అనంతరం దొంగ హుండీతో ఉడాయించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరా పరిశీలించగా దుండగుడి కదలికలు కనిపించాయి. అనంతరం వేలిముద్రలు సేకరించి దొంగ కోసం గాలింపు చేపట్టగా చర్చి సమీపంలో ఖాళీ హుండీ లభించింది. కాగా హుండీలో రూ.10వేల నుంచి 15 వేల వరకు డబ్బు ఉంటుందని కార్యదర్శి బాబురాజ్ తెలిపారు.

అధిక కట్నం ఇస్తేనే పెళ్లి

● కానిస్టేబుల్‌పై యువతి ఫిర్యాదు

మైసూరు: నాలుగు సంవత్సరాలపాటు యువతి వెంటపడి ప్రేమించిన ఓ కానిస్టేబుల్ చివరకు పెళ్లి విషయంలో అధిక కట్నం కావాలని మొండికేశాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పిరియా పట్టణ తాలూకా ఆనలహళ్లికి చెందిన ఆదే గ్రామానికి రంగస్వామి టీ నరసీపుర పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన బీఎస్సీ చదువుతున్న యువతిని ప్రేమించాడు. ఇటీవల ఆ యువతికి పెళ్లి సంబంధం రాగా రంగస్వామి వెళ్లి అడ్డుకున్నాడు. ఆ యువతిని తానే వివాహం చేసుకుంటానని చెప్పాడు. దీంతో పెద్దలు ఆ ఇద్దరికి పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఇంటి స్థలం 100 గ్రాముల బంగారం, రూ.3 లక్షల నగదు కట్నంగా ఇచ్చేందుకు యువతి కుటుంబ సభ్యులు అంగీకరించారు. అయితే రూ. 5 లక్షలు ఇవ్వాలని, లేదంటే పెళ్లి జరగదని రంగస్వామి కుటుంబ సభ్యులు అడ్డం తిరిగారు. దీంతో బాధితురాలు మహిళా పోలీసు స్టేషన్‌లో రంగస్వామిపై ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రమాదకరంగా ఓఎఫ్‌సీ తీగలు

● సిలికాన్ సిటీ వాసులకు ప్రాణసంకటం
● అనధికార కేబుళ్లతో అవస్థలు





బెంగళూరు నగరంలో పెను ప్రమాదాలకు దారితీస్తున్న కేబుల్ వైర్లు

బనశంకరి: సిలికాన్ సిటీ రోడ్లు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, ఉద్యానవనాలు, సార్వజనిక స్థలాలు, ఫుట్‌పాత్ మార్గాల్లో జడల్లా వేలాడుతున్న ఓఎఫ్‌సీ కేబుల్స్ (ఆప్టికల్ ఫైబర్ కేబుల్)తో ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ప్రాణసంకటంగా మారింది. అనధికార కేబుల్స్ తొలగించాలని హైకోర్టు పలుమార్లు చీవాట్లు పెట్టినప్పటికీ బీబీఎంపీ అధికారులు మాత్రం మేల్కోలేదు. నగరంలో 13 టెలికాం కంపెనీలతో 84.23 లక్షల మీటర్ల కేబుల్, ఇంటర్నెట్ సేవలు కంపెనీల ద్వారా 13.15 లక్షల మీటర్ల కేబుల్ అమర్చారు. అనధికార కేబుల్ తొలగించాలని హైకోర్టు పాలికెకు గడువు ఇచ్చినప్పటికీ అధికారులు టెలికాం కంపెనీలతో కుమ్మక్కు కావడంతో కేబుల్ తొలగింపు సక్రమంగా సాగడం లేదు.

కోట్ల రూపాయల ట్యాక్స్ వంచన :

చెట్లపై వేలాడుతున్న కేబుల్ వైర్లు ప్రమాదకరం మారి ద్విచక్ర వాహనదారుల ప్రాణాలు తీసేస్తున్నాయి. భూమిలో అంచనాకు మించి ప్రమాణంలో ఓఎఫ్‌సీ కేబుల్ అక్రమంగా అమర్చారు. పాలికెను నియంత్రిస్తున్న మాఫియాలో ఓఎఫ్‌సీ కేబుల్ మాఫియా ఒకటి. టెలికాం సేవా కంపెనీలు 10 కిలోమీటర్లు పొడవు ఓఎఫ్‌సీ కేబుల్ అమర్చడానికి అనుమతి తీసుకుని, దీనికి పదిరెట్లు డక్ట్ అమర్చి కోట్లాది రూపాయలు ట్యాక్స్ వంచనకు పాల్పడుతున్నాయి. ఒక సంస్థ డక్ట్ అమర్చడానికి అనుమతి తీసుకుంటే ఇతర మూడు నాలుగు కంపెనీలు అక్రమంగా అందులో కేబుల్ అమరుస్తున్నారు. ఈ అక్రమాన్ని పరిశీలించే సాంకేతిక నైపుణ్యం పాలికె అధికారులకు లేదు. భూమిలో పాతే కేబుల్‌కు పాలికె అనుమతి ఇస్తుంది. రోడ్లు, ఫుట్‌పాత్, చెట్లు, విద్యుత్ స్తంభాలపై వేలాడుతూ కేబుల్ అమర్చడానికి అవకాశం లేదు. కానీ వేలాది కిలోమీటర్లు పొడవు మార్గంలో అనధికార కేబుల్ వైర్లు వేలాడుతున్నాయి.

12,274 కి.మీ ఓఎఫ్‌సీకి అనుమతి

నగరంలో 14 వేల కిలోమీటర్లు పొడవుగల రోడ్లు ఉన్నాయి. వీటిలో టెలికాం సంస్థలు కేబుల్ అమర్చాయి. భూమిలో అమర్చిన దానికంటే పైభాగంలో కేబుల్ అమర్చడం అధికం. టెలికాం కంపెనీలు 12,274 కిలోమీటర్ల మార్గంలో ఓఎఫ్‌సీ కేబుల్ అమర్చడానికి పాలికె నుంచి అనుమతి తీసుకుంది. ఓఎఫ్‌సీ కేబుల్స్ రోడ్లు, ఫుట్‌పాత్‌లు మాత్రమే కాదు రోడ్ల పక్కన డ్రైనేజీ, భూగర్భ డ్రైనేజీల్లో కూడా అమర్చారు.

కఠిన చర్యలు తీసుకోవడంలేదు

ఓఎఫ్‌సీ అమర్చే సమయంలో సంస్థలు పాటించే నిబంధనలు పెద్ద జాబితా ఉంది. కొత్తగా తారువేసిన రోడ్లలో కనీసం మూడు నాలుగేళ్ల వరకు ఓఎఫ్‌సీ కేబుల్ అమర్చడానికి వీలులేదు. అనుమతి తీసుకున్న రెండు నెలల్లో కేబుల్ పనులు పూర్తి చేయాలి. కేవలం రెండు కిలోమీటర్ల మార్గంలో హెచ్‌డీడీ తరహాలో కేబుల్ అమర్చడానికి అవకాశం ఇవ్వాలి. అనుమతి పొందకుండా రోడ్డు తవ్విన కంపెనీలకు రూ.25 లక్షలు జరిమానా విధించాలి. కానీ వీటిని పాటించడంలేదు.

వారం గడువు

బెంగళూరు నగరంలో విద్యుత్ స్తంభాలపై అనధికారికంగా అమర్చిన ఓఎఫ్‌సీ, డేటా, డిష్ కేబుల్ వారంలోగా తొలగించాలని కంపెనీలకు బెస్కాం ఆదేశించింది. తొలగించకపోతే సంబంధిత కంపెనీలపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ఐసీయూలో విద్యార్థిని

విద్యుత్ స్తంభానికి అమర్చిన కేబుల్ వైరు వాటర్ ట్యాంకర్ వాహనానికి తగులుకుని విద్యుత్ స్తంభం పడిన ఘటనలో క్రైస్ట్ కాలేజీ విద్యార్థిని ప్రియా నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతోంది. ఈ ప్రమాదానికి కారణమైన వాహనం డ్రైవరును ఆడుగోడి పోలీసులు అరెస్ట్ చేశారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

యశవంతపుర: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బెంగళూరు వీవీపుర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పార్వతీపుర గంగమ్మ ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న నాగరాజ్(37) మద్యానికి బానిసయ్యాడు. మద్యాన్ని మానుకోవాలని కుటుంబ సభ్యులు బుద్ధి చెప్పినా పెడచెవిన పెట్టేవాడు. ఈక్రమంలో గురువారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన ఆయన..చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కమీషన్ ఇస్తామని రూ. లక్షలు దోచేశారు

మైసూరు: ఆన్‌లైన్ మోసగాళ్లు చూపించిన కమీషన్‌కు ఆశపడి ఓ వ్యక్తి సుమారు రూ.18.62 లక్షలు పోగొట్టుకున్నాడు. యూట్యూబ్ వీడియోలు సబ్‌స్క్రైబ్ చేస్తే కమీషన్ ఇస్తానని టెలిగ్రాం యాప్ ద్వారా ఆరవిందనగరకు చెందిన సిద్దేశ్ సెల్‌కు కేటుగాళ్లు మెసేజ్ పంపారు. ఆ లింక్‌ను సిద్దేశ్ ఓపెన్ చేసి వారు చెప్పినట్లుగా వీడియోలు సబ్‌స్క్రైబ్ చేశాడు. అనంతరం కేటుగాళ్లు అతని బ్యాంకు ఖాతాకు వంద రూపాయాలు పంపారు. ఎక్కువ మొత్తంలో లాభాలు రావాలంటే కొంత డిపాజిట్ చేయాలని సూచించారు. దీంతో బాధితుడు విడతలవారీగా 18.62 లక్షలు కేటుగాళ్ల బ్యాంకు ఖాతాకు పంపాడు. అనంతరం సెల్‌ఫోన్ సిచ్ఛాఫ్ అని సమాధానం వచ్చింది. మోసం జరిగిందని గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మహిళకు లోన్‌యాప్ వేధింపులు

యశవంతపుర: లోన్ యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు చేస్తున్నా మార్పు రావడం లేదు. తాజాగా మంగళూరులో లోన్‌యాప్ తీసుకున్న మహిళ తీరని వేదన అనుభవించింది. వివరాలు...మంగళూరుకు చెందిన ఓ యువతి ఏప్రిల్ 15న లోన్ యాప్ ద్వారా రూ. 10 వేల రుణం కోసం దరఖాస్తు చేసింది. రూ. 7500 ఇచ్చారు. కొద్ది రోజుల వ్యవధిలోనే రూ. 10 వేలు చెల్లించింది. మళ్లీ రుణం తీసుకోమంటూ సందేశాలు వచ్చాయి. తిరిగి రూ. 14 వేలు రుణం తీసుకున్నారు. మళ్లీ ఆమె సమయానికి చెల్లించారు. అయితే యాప్ ని ర్వాహకులు ఆమె డబ్బులు చెల్లించలేదని వేధించారు. విడతల వారీగా రూ. 51 వేలు కట్టించుకున్నారు. అయినా వేధింపులు ఆపలేదు. ఆమె ఫొటోలను ఎడిట్ చేసి ఓ యువకుడితో ఉన్నట్లు పోస్టు పెట్టారు. దీంతో బాధితురాలు మంగళూరు సెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దళితులు ఐక్యతను ప్రదర్శించాలి

● మంత్రి హెచ్.సీ.మహదేవప్ప

శివాజీనగర: మాదిగ, మాల అనే బేధాలు లేకుండా అందరూ ఐక్యంగా ఉండాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఎస్సీ సామాజిక వర్గానికి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని గాంధీభవన్‌లో కర్ణాటక ఆది జాంబవ సాంస్కృతిక కమిటీ ఏర్పాటు చేసిన కవి సిద్ధలింగయ్య సంస్మరణ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, రాష్ట్రంలో అతి శ్రేష్ఠమైన కవి సిద్ధలింగయ్య, ఆయన తమకు స్ఫూర్తి. ఆయన కలలు నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య బడ్జెట్‌లో అనేక కార్యక్రమాలను రూపొందించారని అన్నారు. మాజీ మంత్రి ఆంజనేయ మాట్లాడుతూ... సిద్ధలింగయ్య జాతీయ కవి కావాల్సింది. అయితే కొన్ని వైఫల్యాల వల్ల అది సాధ్యపడలేదన్నారు. కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభించారు. సిద్ధలింగయ్య ప్రసాద పుస్తకాలను విడుదల చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజావాణి సంపాదకుడు రవీంద్ర భట్, సాహితీవేత్త డాక్టర్ కే.మరుళ సిద్దప్ప, సిద్ధలింగయ్య కుమార్తె డాక్టర్ మానస సిద్దలింగయ్య, అగ్రహార కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మునిస్వామిరాజుకు ఘన నివాళి

శివాజీనగర: తిరుమల విద్యానికేతన్ అధ్యక్షుడు కే.మునిస్వామిరాజు ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడపారని, విద్యారంగంలో బంగారు భవిష్యత్తుకు బాట వేశారని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు డాక్టర్ ఏ.రాధాకృష్ణరాజు అన్నారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో ఏర్పాటు చేసిన దివంగత మునిస్వామిరాజు శ్రద్ధాంజలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎం.ఎస్.ఇంజినీరింగ్ కళాశాల, విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ విశ్వవిద్యాలయం సంస్థాపకుల్లో ఒక్కరిగా ఎంతోమంది విద్యార్థులకు ప్రాథమిక విద్యనుండి ఇంజనీరింగ్ విద్య వరకు ఆయన బాసటగా నిలిచారని అన్నారు. సమావేశంలో తెలుగు విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మీరెడ్డి, మహిళా కార్యదర్శి లక్ష్మీ శరత్, ట్రస్ట్ కార్యదర్శి శేఖర్‌రాజు, తెలుగు ప్రముఖులు కే.శ్యామరాజు, బాలకృష్ణ, సీ.ఏ.వరదరాజు, గణేశ్ శేఖర్, కృష్ణయ్య, నరసింహమూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చంద్రయాన్-3తో దక్షిణ కన్నడ జిల్లాకు ఖ్యాతి

● ప్రాజెక్టు విజయవంతానికి శాస్త్రవేత్తల కృషి
● పాలుపంచుకున్న సైంటిస్టులు మానస విజయకుమార్, ఉబరడ్క వేణుగోపాల్, శంభయ్య



శాస్త్రవేత్తలు వీరే

యశవంతపుర: చంద్రయాన్-3ను విజయవంతం చేయడంలో దక్షిణ కన్నడ జిల్లా సుళ్యకు చెందిన ముగ్గురు శాస్త్రవేత్తలు కృషి చేశారు. శాస్త్రవేత్త మానస విజయకుమార్ ఇస్రో డిజిటల్ డిజైన్ విభాగంలో పని చేశారు. ఈమె మంగళూరు వర్సిటీలో మంగళగ్రహంపై పరిశోధన చేశారు. ఉపగ్రహం యాంటీనా తయారు చేసిన ఐదుగురి బృందంలో మానస జయకుమార్ ఒకరు. మరో శాస్త్రవేత్త ఉబరడ్క వేణుగోపాల్ చంద్రయాన-3లో పీసీబీ డిజైన్ టీంలో శాటిలైట్ విభాగంలో పని చేశారు. ఈయన బెంగళూరులో బీఇ చదివారు. అదేవిధంగా సీనియర్ శాస్త్రవేత్తగా సుళ్య తాలూకా నెల్లూరు కెమ్రాజె గ్రామం కొడపాలకు చెందిన శంభయ్య ఎల్‌పీఎస్ విభాగంలో సేవలందించారు. 1989 నుంచి శంభయ్య ఇస్రోలో పని చేస్తున్నారు. చంద్రయాన్-3 విజయవంతంలో తమ జిల్లా వాసులు ఉన్నారని తెలియడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిలిండర్ల దొంగల అరెస్ట్


యశవంతపుర: గ్యాస్ సిలిండర్లను చోరీ చేస్తున్న లోకేష్, హేమంత్ అనే దొంగలను గోవిందరాజనగర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులనుంచి రూ. 60 వేల విలువైన 20 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బైకులో తిరుగుతూ ఇళ్ల బయట పెట్టిన సిలిండర్లు చోరీ చేసేవారు. రాజాజీనగర, కామాక్షిపాళ్య, గోవిందరాజనగర, మాగడి రోడ్డుపోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన కేసులను ఛేదించారు.

దర్శన్ వివాదం సుఖాంతం

● మీడియాకు క్షమాపణ చెబుతూ లేఖ

శివాజీనగర: మీడియాపై అసభ్య పదజాలంలో దూషించారనే కారణంతో రెండు సంవత్సరాలుగా నటుడు దర్శన్‌పై అప్రకటిత నిర్బంధం ఉంది. ఆయన గురించి ఎలాంటి వార్తలను ప్రసారం, ప్రకటించరాదని మీడియా సంస్థలు నిర్ణయించాయి. ఈ విషయానికి సంబంధించి దర్శన్ క్షమాపణ కోరటంతో వివాదం సుఖాంతమైంది. ఈ మేరకు వరమహాలక్ష్మీ పండుగ రోజున లేఖ రాసిన దర్శన్, రాష్ట్ర ప్రజలకు తన సెలిబ్రిటీలకు, పాత్రికేయులకు వరమహాలక్ష్మీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రెండు సంవత్సరాలుగా తనకు, కన్నడ మీడియా మిత్రుల మధ్య ఆటంకం ఉంది. ఈ వరమహాలక్ష్మీ పండుగ ముందు రోజు మిత్రుడు రాక్‌లైన్ వెంకటేశ్ నేతృత్వంలో తాను, ప్రముఖ మీడియా సంపాదకుల మధ్య చర్చలు జరిపామని, ఈ విషయం ఇంతటితో సుఖాంతమైందని రాశారు. రెండేళ్ల క్రితం తన ఆడియో ఒకటి దురుద్దేశంతో వైరల్ అయింది. ఇదే వివాదానికి కారణమైంది. ఈ ఆడియోలోని మాటలతో బాధ కలిగిఉంటే మీడియా పెద్దలకు క్షమాపణ చెప్పటంలో తప్పులేదు. ఈ ఘటనపై మీడియా మిత్రులకు క్షమాపణ చెబుతున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

కెలమంగలం: పేకాట వ్యవహారంలో మిత్రుల మధ్య ఏర్పడిన గొడవల్లో వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ముగ్గురిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాలు...డెంకణీకోట తాలూకా కెలమంగలం పట్టణ పంచాయతీ తులసీనగర్‌కు చెందిన టిప్పర్ లారీ డ్రైవర్ సామువేల్ (26) అదే ప్రాంతానికి చెందిన మిత్రుడు జగన్ (28)ల మధ్య గత ఆదివారం రాత్రి పేకాట ఆడుతుండగా గొడవ జరిగింది. ఆవేశం చెందిన జగన్ తన అనుచరులతో కలిసి సోమవారం ఉదయం సామువేల్‌ను వెంబడించి వేటకొడవళ్లతో దాడి చేసి హత్యకు యత్నించారు. తీవ్రంగా గాయపడిన సామువేల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జగన్, విజయ్, తిరుమూర్తిలను పోలీసులు అరెస్ట్ చేశారు.

సకల సౌభాగ్యప్రదం వరలక్ష్మీ వ్రతం



మండ్యలో వరలక్ష్మీ ఆలయంలో భక్తులు



బొమ్మనహళ్లిలో మారెమ్మకు వరలక్ష్మీ అలంకరణ

మండ్య: శ్రావణమాసం రెండో శుక్రవారం వరమహాలక్ష్మీ పండుగను నగర వాసులు ఘనంగా ఆచరించారు. ఉదయం మహిళలు ఇళ్లల్లో వ్రతం ఆచరించి ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు పూజలు చేశారు. నగరంలోని పేటె వీధిలోని శ్రీ వరమహాలక్ష్మీ ఆలయానికి భక్తులు పోటెత్తారు.

మారమ్మ దేవికి లక్ష్మీదేవి అలంకరణ

బొమ్మనహళ్లి: వరమహాలక్ష్మి పండగ సందర్భంగా నగరంలోని బొమ్మనహళ్లి హెచ్ఎస్ఆర్ లేఔట్ వార్డు పరంగిపాళ్య గ్రామంలో వెలసిన గ్రామ దేవత మారమ్మ దేవి శుక్రవారం లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

హోసూరులో వ్రతాచరణ

హోసూరు, కెలమంగలం: క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల వారిని ఇంటికి రప్పించి వాయనాలను అందజేశారు. ఎక్కడ చూసినా పండుగ వాతావరణం నెలకొంది.

గోరవనహళ్లి ఆలయానికి భక్తుల తాకిడి

తుమకూరు: వరమహాలక్ష్మీ పండుగను పురస్కరించుకుని తుమకూరు జిల్లాలోని కొరటగెరె తాలూకాలోని గొరవనహళ్లిలోని చరిత్ర ప్రసిద్ధి చెందిన శ్రీ మహాలక్ష్మీ దేవి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునే భక్తులు ఆలయానికి చేరుకుని బారులు తీరారు. ఈ సందర్భంగా అమ్మవారిని అర్చకులు విశేషంగా అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

తుమకూరు: నగరంలో మహిళలు భక్తిశ్రద్ధలతో వరమహాలక్ష్మీ పండుగను ఆచరించారు. ఇళ్లల్లో అమ్మవారిని కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. వరలక్ష్మీ కటాక్షానికి వ్రతం ఆచరించి ఇరుగు పొరుగు మహిళలకు వాయనాలు సమర్పించారు.

మైసూరులో.. వరమహాలక్ష్మీ పండుగ శుక్రవారం మైసూరు నగరంతో పాటు జిల్లా వ్యాపంగా మహిళలు ఘనంగా ఆచరించారు. ఇళ్లల్లో మహిళలు వ్రతాలు ఆచరించి అమ్మవారిని కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఇరుగు పొరుగు వారిని ఇళ్లకు ఆహ్వానించి వాయనాలు సమర్పించారు.

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి అరికెరె వార్డు మాజీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మీ వరమహాలక్ష్మీ పండుగను పౌర కార్మికులతో కలిసి జరుపుకున్నారు. మహిళా పౌర కార్మికులకు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు అందజేశారు.

విజయపురలో:

విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలో మహిళలు వరలక్ష్మీ పండుగను ఘనంగా ఆచరించారు. అమ్మవారి విగ్రహాలను కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. ముత్తైదువులను పిలిచి వాయనాలు అందజేశారు.



తుమకూరు జిల్లా గొరవనహళ్లిలో లక్ష్మీదేవికి పూజలు



విజయపురలో వాయనాలు సమర్పిస్తున్న దృశ్యం



హోసూరులో వరలక్ష్మి ప్రతిమలకు విశేష అలంకరణ



మహిళా పౌర కార్మికులకు గాజుల పంపిణీ

హోసూరు వార్తలు..

ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం





పిల్లలకు అల్పాహారం వడ్డిస్తున్న కలెక్టర్, హోసూరులో అల్పాహారం అందజేస్తున్న మేయర్, కమిషనర్

హోసూరు: తమిళనాడు వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకు అల్పాహారం అందజేసే పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. అందులో భాగంగా క్రిష్ణగిరి జిల్లా బర్గూరు యూనియన్ సూలామలై గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జిల్లా కలెక్టర్ శరయు పిల్లలకు అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్, అదనపు కలెక్టర్ వందనాకార్గ్, జిల్లా విద్యాశాఖాధికారిణి మహేశ్వరి, జాకీర్ ఉస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరులో:

హోసూరు కార్పొరేషన్ కామరాజ్ కాలనీలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో మేయర్ ఎస్.ఏ.సత్య అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. కమిషనర్ స్నేహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ ఆనందయ్య, పారిశుద్ధ్య కమిటీ అధ్యక్షులు ఎన్.ఎస్.మాదేశ్వరన్, విద్యాశాఖాధికార్లు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అల్పాహారం అందజేసే పథకాన్ని ప్రారంభించారు.

తహసీల్దార్ నోటీసుపై ఆగ్రహం



రెవెన్యూ అధికారుల తీరును వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు

కెలమంగలం: పంచాయతీ అధ్యక్షుడి పొలం వెళ్లేందుకు రైతు పొలంలో 8 అడుగుల దారి రికార్డులో ఉందని సర్వే కోసం వెళ్లిన తహసీల్దార్‌ను గ్రామస్థులు తీవ్రంగా వ్యతిరేకించారు. హోసూరు సమీపంలోని నాగొండపల్లి పంచాయతీ చిన్నతాండ్రకుంట గ్రామానికి చెందిన రైతు శివప్పకు చెందిన 37 సెంట్ల స్థలం ఉంది. ఈ స్థలంలో శివప్ప వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం తహసీల్దార్, రెవెన్యూ అధికారులు చిన్నతాండ్రకుంట గ్రామ పొలిమేరల్లో ఉన్న ఆలయానికెళ్లేందుకు శివప్ప భూమిలో 8 అడుగుల దారి ఉందని, సర్వే చేసేందుకు నోటీసు జారీ చేశారు. విషయం తెలుసుకొన్న తహసీల్దార్ పంపిన నోటీసును వ్యతిరేకించారు. ఎన్నో ఏళ్లుగా శివప్పకు సొంతమైన పట్టాభూమి 37 సెంట్లు మాత్రమే ఉందని, గ్రామ పంచాయతీ అధ్యక్షుడు తన పొలంకు వెళ్లేందుకు రెవెన్యూ అధికారుల సహకారంతో రికార్డుల్లోని లేని రైతు శివప్పకు చెందిన పట్టాభూమిలో దారిని ఏర్పరుచుకొనేందుకు కుట్ర పన్నుతున్నారని, ఈ విషయం తెలియక తహసీల్దార్ రైతుకు నోటీసు జారీ చేయడం సమంజసం కాదని ఆరోపించారు.

టిప్పర్ లారీ స్వాధీనం

క్రిష్ణగిరి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని మత్తూరు పోలీసులు స్వాధీనం చేసుకుని డ్రైవర్‌తో పాటు ఇద్దరిని అరెస్ట్ చేశారు. మత్తూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ గౌతమ్, పోలీసులు గురువారం రాత్రి తొకరపల్లి ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ మార్గంలో వచ్చిన టిప్పర్ లారీని తనిఖీ చేయగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలింది. పోలీసులు బలరామన్, మణిలను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

కాంక్రీట్ యంత్రం ఢీ, చిన్నారి మృతి

హోసూరు: కాంక్రీట్ మిక్సింగ్ యంత్రం ఢీకొని ఏడాదిన్నర బాలిక మృతి చెందిన ఘటన సిప్‌కాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీర్జాపురి ప్రాంతానికి చెందిన దినేశ్, శాంత దంపతుల కూతురు రావిణి. వీరు హోసూరు పారిశ్రామికవాడ మత్తం అగ్రహారం ప్రాంతంలో నివాసముంటున్నారు. గురువారం అదే ప్రాంతంలో కాంక్రీట్ మిక్సింగ్ యంత్రంలో పనిచేస్తుండగా అకస్మాత్తుగా చిన్నారి అడ్డువచ్చింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలేర్పడిన చిన్నారి ఘటనా స్థలంలోనే మృతి చెందింది. సిప్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఏనుగుల దాడిలో రైతు మృతి



రాజప్ప మృతదేహం

కెలమంగలం: పొలం వద్దకు కాపలా వెళ్లిన రైతుపై ఏనుగులు దాడి చేసి చంపేసిన ఘటన గురువారం రాత్రి డెంకణీకోట సమీపంలో చోటు చేసుకొంది. వివరాలు... డెంకణీకోట తాలూకా అగళకోట సమీపంలోని కుమళత్తూరు గ్రామానికి చెందిన రాజప్ప (53) గురువారం రాత్రి పొలం వద్దకు కాపలా వెళ్లి ఉదయం ఇంటికి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం బంధువులు రాజప్ప కోసం గాలింపు చర్యలు చేపట్టగా పొలం సమీపంలోని అటవీ ప్రాంతంలో తీవ్రగాయాలతో విగతజీవిగా కనిపించాడు. అటవీశాఖాధికారులకు, తళి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా...

28న ఈసీఐ అధికారులతో వైఎస్సార్‌సీపీ ఎంపీల భేటీ

సాక్షి, న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) అధికారులతో వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఈ నెల 28 సాయంత్రం 4.30 గంటలకు సమావేశం కానున్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో నమోదైన దొంగ ఓట్లు, డబుల్ ఓట్లకు సంబంధించి అధికారులతో చర్చించనున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో 50 లక్షల ఓట్లు తొలగించిన అంశాన్ని ఎన్నికల సంఘం అధికారులకు వివరించనున్నారు.

బీసీల్లో చీడపురుగు అయ్యన్న: మారేష్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ మండిపడ్డారు. బీసీ జాతిలో పుట్టిన చీడపురుగు అయ్యన్నపాత్రుడు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. మారేష్ శుక్రవారం విజయవాడలోని బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తనకు సీటు దక్కదనే అభద్రతాభావంతో చంద్రబాబు, లోకేశ్‌ను ప్రసన్నం చేసుకోవడానికి అయ్యన్నపాత్రుడు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. గంజాయికి బానిసైన అయ్యన్న ప్రతిసారి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. రాజ్యాధికారంలో బీసీలకు 65 శాతంపైగా వాటా కల్పించిన సీఎం వైఎస్ జగన్‌ను అభినందించాల్సిందిపోయి పరుష పదజాలంతో విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు.

శాంతిభద్రతల విఘాతానికే లోకేశ్ కుట్ర

చట్టపరమైన చర్యలు తీసుకోండి

- రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో వైఎస్సార్‌సీపీ ఫిర్యాదులు
- ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు, సోషల్‌మీడియా కన్వీనర్లు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్ : విద్వేషపూరిత ప్రసంగాలతో వర్గ విభేదాలు రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్రపన్నిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ పోలీసు శాఖను కోరింది. ఈమేరకు వైఎస్సార్‌సీపీ నేతలు, సోషల్ మీడియా విభాగం ఇన్‌చార్జిలు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో శుక్రవారం ఫిర్యాదులు చేశారు. పాదయాత్ర కోసం పోలీసులు ఇచ్చిన అనుమతి నిబంధనలను ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘిస్తూ మరీ లోకేశ్, ఇతర టీడీపీ నేతలు విద్వేషపూరిత ప్రసంగాలు చేశారని, అసభ్య పదజాలంతో దూషించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం ప్రతిష్ఠకు భంగం కలిగించేలా దిగజారుడు రాజకీయాలకు



మంగళగిరి రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్‌కు ఫిర్యాదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు

పాల్పడ్డారని కూడా ఫిర్యాదు చేశారు. మంత్రులు, వైఎస్సార్‌సీపీ శాసన సభ్యులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటంతోపాటు వారి అంతుచూస్తామని బెదిరించడాన్ని కూడా ప్రముఖంగా ప్రస్తావించారు.

సమాజంలో వర్గ విభేదాలు రెచ్చగొట్టి రాష్ట్రవ్యాప్తంగా ఘర్షణలు, అలజడులు సృష్టించాలన్నది లోకేశ్ పన్నాగమని పేర్కొన్నారు. శాంతిభద్రతలను భగ్నం చేసేందుకు యత్నించిన లోకేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, పాదయాత్ర కోసం పోలీసులు ఇచ్చిన అనుమతి పత్రంలోని షరతులకు కట్టుబడేలా కట్టడి చేయాలని కోరారు.

ఏలూరు జిల్లా కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్ నేతృత్వంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. ఎవరిపై ఎన్ని ఎక్కువ పోలీసు కేసులు నమోదైతే వారికి తమ ప్రభుత్వం ఏర్పడ్డాక అంతటి ప్రాధాన్యం ఇస్తామంటూ ఘర్షణలను ప్రేరేపించేలా ప్రసంగిస్తున్నారని తెలిపారు. టీడీపీ మూకలను ఉగ్రవాదుల తరహాలో ప్రజలపై ఉసిగొల్పుతూ ప్రజల ప్రాణాలకు హాని కలిగించేలా లోకేశ్ ప్రసంగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకట్రామిరెడ్డి మంగళగిరి పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు పోలీస్ స్టేషన్‌లోనూ శుక్రవారం పలువురు ఫిర్యాదు చేశారు. పాతగుంటూరు పోలీసు స్టేషన్‌లోనూ చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడుపై ఫిర్యాదు చేశారు. విశాఖ పెందుర్తి పోలీస్ స్టేషన్‌లోనూ వైఎస్సార్‌సీపీ నాయకులు లోకేశ్, అచ్చెన్నాయుడిపై ఫిర్యాదు చేశారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని పలు నియోజకవర్గాల కన్వీనర్లు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నేతల దాడులపై పలు కేసులు నమోదు

హనుమాన్ జంక్షన్ : లోకేశ్ పాదయాత్ర సందర్భంగా కృష్ణా జిల్లా బాపులపాడు మండలం రంగన్నగూడెంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేసిన టీడీపీ నేతలపై వీరవల్లి పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తలారి ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీ నేతలు యార్లగడ్డ వెంకట్రావు, మొవ్వా వేణుగోపాలరావు, మొవ్వా శ్రీనివాసరావు, వెనిగళ్ల జ్ఞానశేఖర్, కనకవల్లి శేషగిరి, కనకవల్లి చిన్న యాకోబ్, కొలుసు రంగారావు, మందపాటి రాంబాబు, ఆళ్ల గోపాలకృష్ణ తదితరులపై 307, 324 రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్లు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత తలారి వినయరత్నంపై దాడికి పాల్పడ్డ ఘటనపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు, మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, టీడీపీ నేతలు మొవ్వా వేణుగోపాల్, పరసా కిరణ్, బెజవాడ కృష్ణ, పాలగాని వీరాంజనేయులు తదితరులపై ఐపీసీ సెక్షన్లు 323, 506 రెడ్ విత్ 34, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత కసుకుర్తి చైతన్య ధర్మేంద్ర (చిన్ను)పై జరిగిన దాడిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీ నేతలు యార్లగడ్డ వెంకట్రావు, మొవ్వా వేణుగోపాల్, మొవ్వా శ్రీనివాసరావు, వెనిగళ్ల జ్ఞానశేఖర్, కనకవల్లి శేషగిరిరావు, కనకవల్లి చిన్న యాకోబ్, కొలుసు రంగారావు, మందపాటి రాంబాబు, ఆళ్ల గోపాలకృష్ణపై ఐపీసీ సెక్షన్లు 447, 427, 323, 506, 290 రెడ్‌విత్ 34 కింద కేసులు నమోదయ్యాయి.

టీడీపీ నేతలు అయ్యన్న, బుద్దాపై కేసులు

ఉంగుటూరు : కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిన్న అవుటపల్లిలో ఇటీవల జరిగిన యువగళం బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేతలు అయ్యన్నపాత్రుడు, బుద్దా వెంకన్నలపై ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మాజీ మంత్రి పేర్ని నాని చేసిన ఫిర్యాదు మేరకు వారిపై విడివిడిగా కేసులు నమోదు చేశారు. అయ్యన్నపై 153ఏ, 354ఏ1 (4), 504, 505(2), 509 ఐపీసీ సెక్షన్ల కింద, బుద్దా వెంకన్నపై 153, 153ఏ, 505(2), 506 ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

24 మంది సభ్యులతో టీటీడీ నూతన పాలక మండలి

- కమిటీని ఖరారు చేసిన సీఎం జగన్
- ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పాలక మండలిలో స్థానం కోసం పలు రాష్ట్రాలు, వివిధ రంగాల నుంచి వినతులు
- రాష్ట్రం నుంచి నలుగురు బీసీలు, ఒక ఎస్సీ, ఎస్టీకి స్థానం

సాక్షి, అమరావతి : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలి నూతన సభ్యులను ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం పాలక మండలిలో చోటు కోసం పలు రాష్ట్రాలు, పలు రంగాల నుంచి అనేక వినతులు వచ్చాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటూనే మన రాష్ట్రానికి చెందిన నలుగురు బీసీలు, ఒక ఎస్సీ, ఒక ఎస్టీకి కూడా ప్రభుత్వం పాలక మండలిలో స్థానం కల్పించింది. టీటీడీ పాలక మండలి చైర్మన్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని ప్రభుత్వం ఈ నెల 5వ తేదీనే నియమించింది. ఆయన 10న బాధ్యతలు స్వీకరించారు. కాగా, శుక్రవారం పాలక మండలి సభ్యులుగా 24 మంది పేర్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఖరారు చేశారు. ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్ కుమార్, సామినేని ఉదయభాను, ఎం.తిప్పేస్వామిలకు కమిటీలో చోటు దక్కింది. సిద్దవటం యానాదయ్య, చందే అశ్వత్థ నాయక్, మేకా శేషబాబు, ఆర్.వెంకట సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డిగారి సీతారామ రెడ్డి, గాదిరాజు వెంకట సుబ్బరాజు, పెనక శరత్చంద్రారెడ్డి, రామిరెడ్డి సాముల, బాల సుబ్రమణియన్ పళనిస్వామి, ఎస్.ఆర్.విశ్వనాథ్ రెడ్డి, గడ్డం సీతారెడ్డి, కృష్ణమూర్తి వైద్యనాథన్, సిద్దా వీర వెంకట సుధీర్‌కుమార్, సుదర్శన్ వేణు, నెరుసు నాగసత్యం, ఆర్.వి.దేశ్‌పాండే, అమోల్ కాలే, డాక్టర్ ఎస్.శంకర్, మిలింద్ కేశవ్ నార్వేకర్, డాక్టర్ కేతన్ దేశాయ్, బోరా సౌరభ్ పాలక మండలి సభ్యుల జాబితాలో ఉన్నారు.



➡ ఎనిమిది రోజుల క్రితం చిత్తూరు జిల్లా, యాదమరి మండలం, కీనాటంపల్లికి చెందిన తవమణి (62) అనారోగ్య సమస్యతో మృతిచెందారు. ఈమె మూడేళ్లకు ముందు నేత్రదానానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు ఐ బ్యాంకు బృందం నాలుగు గంటల్లోపు అక్కడకు చేరుకుని నేత్రాలు సేకరించారు. ఇందుకు ఆ కుటుంబ సభ్యులు పూర్తిగా సహకరించారు.



➡ పుత్తూరు మండలం, వడమాలపేట గ్రామానికి చెందిన పీ.బాలాజీ (24) ట్రాక్టర్ డ్రైవర్. నాలుగేళ్ల క్రితం పెళ్లయ్యింది. ఈనెల 12వ తేదీన అనారోగ్యంతో చనిపోయాడు. బాలాజీ కుటుంబ సభ్యులు నేత్రదానానికి సహకరించారు. వెంటనే ఐ బ్యాంక్ సిబ్బందిని ఆశ్రయించారు. మృతి చెందిన 2 గంటల్లోపు నేత్రాలు దానం చేశారు.



➡ ఈనెల 15వ తేదీన కడుపు నొప్పితో చంద్రగిరి మండలానికి చెందిన హరి (22) మృతిచెందాడు. మృతుడి బంధువు శివ సహకారంతో కళ్లు దానం చేశారు.

చూపునిద్దాం!

జీవనశైలి మార్పులతో కంటిపై ప్రభావం

- చిన్నారుల్లో అధికమవుతున్న సమస్య
- చూపు కోల్పోతున్న వైనం
- పలువురికి పుట్టుకతోనే అంధకారం
- నేత్రదానం కోసం ముందుకొస్తున్న దాతలు
- ఆగస్టు 25 నుంచి నేత్రదాన పక్షోత్సవాలు

దానం చేసే కళ్లు మరొకరికి చూపునిస్తాయి. అంధకార జీవితంలో వెలుగులు నింపుతాయి. సమాజంలో తలెత్తుకునేలా చేస్తాయి. అవిటితనాన్ని తరిమికొడుతాయి. బతుకు బండిని ముందుకు నడిపిస్తాయి. కుటుంబానికి ఆసరాగా నిలుస్తాయి. ఈ నేపథ్యంలో శరీరం నుంచి జీవం విడిచి వెళ్లాక కళ్లు మరొకరికి దానం చేసి వెలుగునివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. కళ్లను మట్టిపాలుచేయడంకంటే దానం చేయడం ఉత్తమని భావిస్తోంది. ఇందులో భాగంగానే ఈ అంశంపై విస్తృత అవగాహన కల్పించేందుకు సంకల్పించింది. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో నేత్ర దానం ప్రాధాన్యం, ఆవశ్యతకను తెలియజేయడం, ఔత్సాహికులకు దిశానిర్దేశం చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. నేత్రదానం..సందేహాలు, నివృత్తిపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

సాక్షి, తిరుపతి డెస్క్: మానవుని అవయవాల్లో అత్యంత ప్రాధాన్యమైనవి కళ్లు. కంటికి ఏ చిన్న సమస్య వచ్చినా అల్లాడిపోతుంటారు. కళ్లు లేనివారు.. చూపు మందగించిన వారి సమస్యలు ఇక చెప్పనక్కర్లేదు. ఇలాంటి వారికి నేత్రదానంతో చూపునివ్వాలని నిపుణులు చూసిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు వివిధ కంటి సమస్యలతో ఆరువేల మందికి పైగా రోగులు ఆస్పత్రులకు వస్తుండగా.. అందులో వెయ్యి నుంచి రెండు వేల మంది వరకు కంటి శస్త్రచికిత్సలు చేసుకుంటున్నారు. ఇందులో కార్నియా దెబ్బతిని చూపు కోల్పోతున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది. ఇలాంటి వారి కోసం దాతల సాయంతో చూపునివ్వాలని ప్రభుత్వం



నేత్రదాన పక్షోత్సవాల అవగాహన ర్యాలీ (ఫైల్)

భావిస్తోంది. నేత్రదానంపై విస్తృత అవగాహన కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో గత మూడేళ్లలో 407 మంది నేత్రదానం చేయగా అందులో 264 మంది కళ్లు వాడుకున్నట్టు జిల్లా అంధత్వ నివారణశాఖ చెబుతోంది.

కార్నియా సమస్యలు ఇలా..

- కంటి కనుపాపపై ఉండే అద్దం లాంటి పొరే కార్నియా
- విటమిన్-ఏ లోపం, పౌష్టికాహార లేమి, ప్రమాదాలు, గాయాలు, శస్త్రచికిత్సలతో వచ్చే ఇన్ఫెక్షన్లతో కార్నియా అంధత్వానికి కారణం
- దీర్ఘకాలిక కాంటాక్ట్ లెన్స్ వాడే వారికి సైతం కార్నియా అంధత్వం వచ్చే అవకాశాలు
- ఏటా వందల మంది కార్నియా అంధులుగా మారుతున్నారు
- దీనికి కార్నియా మార్పిడే మార్గం
- వీరిలో వృద్ధులే కాకుండా యువతీయువకులు, ఐదు శాతం చిన్నపిల్లలు కూడా ఉన్నారు

నేత్రదానానికి అర్హులు వీరే

- 18 ఏళ్లు పైబడిన వారు
- ఏ వయస్సు వారైనా, కంటి అద్దాలు ధరించిన వారైనా దానం చేయొచ్చు
- షుగర్ వ్యాధిగ్రస్తులు, అధిక రక్తపోటు ఉన్న వారైనా మరణం తర్వాత కళ్లు ఇవ్వొచ్చు
- ప్రమాదవశాత్తు, గుండె జబ్బులు, దీర్ఘకాలిక జబ్బులు, సహజ మరణంతో చనిపోయిన వారు నేత్రదానం చేసేందుకు అర్హులు

అనర్హులు వీరే

- ఎయిడ్స్, హెపటైటిస్, రూబెల్లా, సిఫిలిస్ వంటి అంటువ్యాధులు ఉన్న వారు నేత్రదానానికి అనర్హులు
- బ్లడ్ క్యాన్సర్, ట్యూమర్లు ఉన్నవారు..
- విషం తీసుకుని మరణించిన వ్యక్తులు..

ఎప్పటిలోగా కళ్లు దానం చేయాలి

మరణించిన వ్యక్తి నుంచి కార్నియాను మాత్రమే తీసుకుంటారు. మొత్తం కంటిని కాదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఈ విషయంలో ప్రజలు అపోహ వీడాలి. మరణించిన వ్యక్తి నుంచి ఆరు గంటల్లోగా శరీరం నుంచి కార్నియాను సేకరించాల్సి ఉంటుంది. కళ్లను తొలగించిన వెంటనే సహజమైన కన్నుల మాదిరిగా కనిపించే కృత్రిమ కళ్లను వెంటనే మృతదేహానికి అమరుస్తారు. దీనివల్ల అంతిమ సంస్కారాలకు ఇబ్బంది ఉండదు.

ముందు చూపు ఉండాలి



చాలామంది కార్నియాతో ఇబ్బంది పడుతున్నారు. చివరికి చూపు కోల్పోతున్నారు. అలాంటి వారికి కోసం నేత్రదానం అనే ప్రక్రియను ప్రభుత్వం పటిష్ఠంగా నిర్వహిస్తోంది. ఏటా నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తోంది. వీలైనంతవరకు రిజిస్ట్రేషన్ల సంఖ్యను పెంచుతున్నాం. కొంతమంది స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. మేము సైతం అంధత్వ నివారణ లక్ష్యంగా పనిచేస్తున్నాం.

- డాక్టర్ మాధవి, చిత్తూరు జిల్లా అంధత్వ నివారణ అధికారి

నేత్రదానానికి అడ్డంకులు వద్దు



నేత్రదానంపై సమాజంలో చైతన్యం కలిగించాలి. నేత్రదానానికి ముందుకొచ్చిన వ్యక్తి చనిపోతే చాలామంది సమయానికి దానం చేయలేకపోతున్నారు. కొందరు బాధ, దుఃఖంలో మర్చిపోతున్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన కలిగి, సమయానికి దానం చేసేలా చూడాలి. దీనిపై అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తున్నాం. స్వచ్ఛందంగా నేత్రదానానికి ముఖ్యంగా యువకులు ముందుకు రావాలి. ఏటా రిజిస్ట్రేషన్ సంఖ్యను పెంచాలని చూస్తున్నాం.

-డాక్టర్ సాధన, కంటి విభాగాధిపతి, రుయా తిరుపతి

యువగళం ముసుగులో టీడీపీ గూండాల దాడి

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపైన, ఇద్దరు విలేకరులపైనా దాడి
- పాదయాత్రలో సీఎంపై లోకేశ్ అనుచిత వ్యాఖ్యలు
- సీఎం జగన్ ప్రజల కోసమే పనిచేస్తున్నారన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త
- లోకేశ్ సైగతో అతనిపై మూకుమ్మడిగా దాడి చేసిన టీడీపీ గూండాలు
- జనం లేక సమావేశాలన్నీ రద్దు చేసుకున్న లోకేశ్



తుక్కులూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి చేస్తున్న టీడీపీ గూండాలు

నూజివీడు: లోకేశ్ యువగళం పాదయాత్ర ముసుగులో టీడీపీ గూండాలు ఏలూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపైన, విలేకరులపైన దాడులకు పాల్పడ్డారు. శుక్రవారం నూజివీడు మండలం తుక్కులూరులో లోకేశ్ పాదయాత్ర చేశారు. ఉదయం 11.30 గంటల ప్రాంతంలో పాదయాత్రలో సైకో అంటూ ముఖ్యమంత్రి పట్ల అవమానకరంగా మాట్లాడటాన్ని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త యలమర్తి చిట్టిబాబు సహించలేకపోయారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలడుగు నాని ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్‌లో నుంచి వైఎస్సార్‌సీపీ జెండా ఊపుతూ మా ముఖ్యమంత్రి ప్రజల కోసం పనిచేస్తున్నారంటూ పెద్దగా అన్నారు. లోకేశ్ వెంటనే యువగళం టీంలో ఉన్న రౌడీ మూకకు సైగ చేయడంతో దాదాపు 20 మంది ఒక్కసారిగా చిట్టిబాబు వద్దకు పరుగెత్తుకెళ్లి దాడి చేశారు. అక్కడే ఉన్న రూరల్ సీఐ ఆర్.అంకబాబు, ఎస్ఐ తలారి రామకృష్ణ వెంటనే చిట్టిబాబును పక్కకు లాగేసి, టీడీపీ గూండాలను వెళ్లగొట్టారు. సీఐ, ఎస్ఐ స్పందించకపోతే చిట్టిబాబు ప్రాణాలకే ప్రమాదం ఏర్పడేది. పాలడుగు నాని పైనా టీడీపీ గూండాలు రాళ్లు విసిరారు. టీడీపీ గూండాల దాడులను వీడియో తీస్తున్న హెచ్ఎం టీవీ రిపోర్టర్ అక్కినేని ప్రసాద్, ఆర్ టీవీ రిపోర్టర్ గోగినేని నానిలను కూడా టీడీపీ వారు పిడిగుద్దులు గుద్దుతూ వారి ఫోన్‌లు లాక్కోవడానికి తీవ్ర ప్రయత్నం చేశారు. విలేకరులిద్దరూ ఎదురు దాడికి దిగడం, అంతలో పోలీసులు రావడంతో యువగళం రౌడీమూక వెళ్లిపోయింది. వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలడుగు నాని ఇంటిపైనా రాళ్లు రువ్వారు. టీడీపీ గూండాల దాడిపై యలమర్తి చిట్టిబాబు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు చిట్టిబాబును చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ద్వారకా కాంప్లెక్స్ వద్ద కవ్వించిన టీడీపీ కార్యకర్తలు

సాయంత్రం 5 గంటలకు తుక్కులూరు వద్ద లోకేశ్ పాదయాత్ర ద్వారకా సెంటర్ వద్దకు వచ్చింది. అదే సమయంలో ద్వారకా కాంప్లెక్స్ పైభాగాన స్థానికులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఉన్నారు. లోకేశ్‌కు ముందు నడుస్తున్న టీడీపీ వారు కాంప్లెక్స్ వద్ద ఆగి, పైన ఉన్న వారిని రెచ్చగొట్టేలా చేతులు, కర్రలు ఊపుతూ ఖాళీ మంచి నీటి సీసాలను విసిరారు.

జనం లేక అన్ని కార్యక్రమాలు రద్దు

లోకేశ్ పాదయాత్రలో జనం లేకపోవడంతో ముందుగా ప్రకటించిన అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. గొల్లపల్లిలో గ్రామస్తులతో, మొర్సపూడిలో ముస్లిం మైనారిటీలతో, తుక్కులూరులో ఎస్సీ వర్గీయులతో భేటీలు ఉంటాయని ప్రకటించారు. అయితే, జనం నుంచి కనీస స్పందన లేకపోవడంతో ఈ కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకొని మధ్యాహ్నం 12 గంటల కల్లా లోకేశ్ శిబిరంలోకి వెళ్లిపోయారు. సాయంత్రం 5 గంటల నుంచి పట్టణంలో నిర్వహించిన పాదయాత్ర కూడా వెలవెలబోయింది.

రౌడీ రాజకీయాలను ప్రేరేపిస్తున్న బాబు, లోకేశ్

ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ధ్వజం



తిరుపతి సిటీ: చంద్రబాబు, లోకేశ్ పాదయాత్రల పేరుతో చంపుతాం.. అంతు చూస్తాం.. అంటూ ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం రౌడీ రాజకీయాలను ప్రేరేపించడమేనని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన శుక్రవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి మేలు చేస్తామని ఒక్క మాట కూడా లోకేశ్ తన పాదయాత్రలో మాట్లాడకపోవడం దారుణమన్నారు. పుంగనూరులో టీడీపీ కుట్ర ప్రజలకు అర్థమైందన్నారు. కులపిచ్చి, వెన్నుపోటు రాజకీయాలు తప్ప ప్రజాప్రభుత్వం రావాలనే ఆకాంక్ష టీడీపీ వారికి లేదన్నారు. రామోజీ గ్రూపునకు చెందిన మార్గదర్శి సంస్థ మోసాలను సీఎం వైఎస్ జగన్ బయటపెట్టడంతో వారు జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. పదవులు పోవడంతో మతిభ్రమించి బొండా ఉమ, అయ్యన్నపాత్రుడు రాక్షసుల్లాగా మాట్లాడుతున్న తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఉచ్చపోయిస్తాం.. అంటున్న లోకేశ్ లెట్రిన్, బాత్‌రూమ్‌లు కట్టే పనిలో ఉన్నారా.. అని ప్రశ్నించారు. లోకేశ్ అందుకు కూడా పనికిరాడని ఎద్దేవా చేశారు.

సహకార వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మొబైల్ ఏటీఎం వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

నెల్లూరు (వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రాథమిక సహకార సొసైటీలను అభివృద్ధి చేసి రైతాంగానికి అన్ని రకాలుగా అండగా ఉండేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన డీసీసీబీ సీఈవోల రెండురోజుల సమావేశం నెల్లూరు డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై మంత్రి మాట్లాడారు. అనంతరం నెల్లూరు డీసీసీబీ నూతనంగా ఏర్పాటు చేసిన రెండు మొబైల్ ఏటీఎం వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా 15 స్వయం సహాయక గ్రూపులకు రూ.2.50 కోట్ల రుణాల చెక్కులను మంత్రి అందజేశారు.

టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలంటూ పిల్

సాక్షి, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్ల జారీలో అక్రమాలు జరిగాయంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. అక్రమాలకు బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలంటూ తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జి వలవల మల్లికార్జునరావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్‌ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ధర్మాసనం విచారణ జరిపింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, డీటీసీపీ డైరెక్టర్, జిల్లా కలెక్టర్‌తో పాటు స్థల యజమానులైన దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, హేమంత్‌కుమార్, తిరుమలబాబు తదితరులకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది.

మూడు వ్యవస్థలూ సమన్వయంతో ముందుకు

వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు ఎంపీ విజయసాయిరెడ్డి సూచన



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

వేమూరు: ప్రజా ప్రయోజనాలు, సంక్షేమమే లక్ష్యంగా వలంటీర్లు, గృహ సారథులు, జగనన్న సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, దక్షిణ కోస్తా జిల్లాల పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి సూచించారు. మూడు వ్యవస్థలూ సంక్షేమ ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. వేమూరు నియోజకవర్గం చుండూరు మండలం వలివేరులో మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ మోపిదేవి వెంకటరమణ తదితరులతో కలసి శుక్రవారం నిర్వహించిన సమావేశంలో విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించి సందేహాలను నివృత్తి చేశారు. గృహ సారథులకు ఇన్సూరెన్స్‌తో పాటు ఏ విధంగా న్యాయం చేయాలనే అంశాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. తమ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకుంటే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 87%కి పైగా గృహాలు ప్రభుత్వం నుంచి ఏదో ఒక రూపంలో లబ్ధి పొందుతున్నాయని చెప్పారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పార్టీ మేనిఫెస్టోలో పెట్టిందని, పార్లమెంట్‌లో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిందని చెప్పారు. గ్రామస్థాయి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించే దిశగా సీఎం జగన్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను సీఎం జగన్ అందచేస్తున్నారని మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అమలు చేసేందుకు దేశంలోని ఇతర రాష్ట్రాలు సిద్ధమవుతున్నాయని ఎంపీ మోపిదేవి వెంకటరమణ తెలిపారు.

దిండ్లుపాలెం గ్రామాభివృద్ధికి రూ.25 లక్షల గ్రాంట్

చుండూరు మండలం దిండ్లుపాలెం గ్రామంలో డ్రైనేజీ పనుల నిమిత్తం తన ఎంపీ లాడ్స్ నిధుల నుంచి రూ.25 లక్షలు గ్రాంట్‌ను మంజూరు చేస్తున్నట్లు ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. గ్రామానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి మేరుగు నాగార్జున, సర్పంచ్ భగవద్గీత కోరడంతో ఈమేరకు ఆయన సానుకూలంగా స్పందించారు.

సీఎం జగన్ ముమ్మాటికీ దళిత బంధువే

- అసైన్డ్ భూములపై హక్కులు కల్పించిన ఘనత సీఎం జగన్‌దే: జూపూడి
- తెలుగు రాష్ట్రాల్లో రామోజీ శకుని పాత్ర



సాక్షి, అమరావతి: ఈనాడు అధినేత రామోజీరావు తెలుగు రాష్ట్రాల మధ్య శకుని పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకర్ రావు విమర్శించారు. దేశ స్వాతంత్ర్యమంత వయసు కలిగిన రామోజీరావు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణలో కేసీఆర్ దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నంత మాత్రాన మిగతా రాష్ట్రాల ముఖ్యమంత్రులంతా దళిత వ్యతిరేకులని రామోజీ భావిస్తున్నారా? అని ప్రశ్నించారు. అసైన్డ్ భూములను ఆక్రమించి ఫిలింసిటీని నిర్మించుకున్నది రామోజీరావు అయితే అసైన్డ్ భూములపై బడుగు, బలహీన వర్గాలకు హక్కులు కల్పించిన ధీరోదాత్తుడు వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. దళితులు కళ్లు తెరిస్తే ఫిల్మ్‌సిటీని దున్నేస్తారని హెచ్చరించారు. పేదోడి బిడ్డలకు ఇంగ్లిష్ మీడియం చదువులను అడ్డుకున్న దురహంకారి రామోజీ అని మండిపడ్డారు. ఏపీలో అమలవుతున్న అమ్మ ఒడి తెలంగాణలో ఉందా? అని ప్రశ్నించారు. సీఎం జగన్ పట్ల దళితులకున్న ప్రేమను చంద్రబాబు బృందం ఎప్పటికీ కొనలేదని స్పష్టం చేశారు. దళితుల కష్టాలు టీడీపీ నేతలకు, ఈనాడు రామోజీరావుకు తెలియవన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై తప్పుడు కథనాలు ప్రచురించటాన్ని ఖండించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఇవేమిటి మరి?

పేదల జీవన ప్రమాణాలను పెంపొందిస్తూ నాలుగేళ్లలో పారదర్శకంగా రూ.2.31 లక్షల కోట్లు డీబీటీ ద్వారా అందించిన సీఎం జగన్ ఖచ్చితంగా దళిత బంధువు అవుతారని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్ 31 లక్షల ఇళ్ల స్థలాలిస్తే లబ్ధిదారుల్లో దళిత కుటుంబాలే అధికంగా ఉన్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఐదు లక్షల కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలా మెరుగైన స్థితికి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని ఇటీవల సర్వే ద్వారా కేంద్రమే గుర్తించిందని తెలిపారు. దళితుల ఆత్మ గౌరవానికి ప్రతీకగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డులో ఏర్పాటు చేస్తున్న సీఎం జగన్ ముమ్మాటికీ దళిత బంధువేనని స్పష్టంచేశారు.

రాజకీయాల్లో రెండో ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నా

సీడబ్ల్యూసీ సభ్యుడు ఎస్.రఘువీరారెడ్డి



మడకశిర: రాజకీయాల్లో తన రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తున్నానని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు ఎస్.రఘువీరారెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడిగా ఎంపికైన తర్వాత రఘువీరారెడ్డి శుక్రవారం తొలిసారిగా శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకు వచ్చారు. కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం కోసం కాంగ్రెస్ బలోపేతం కావాలన్నారు. రాజకీయాల్లో ఇకనుంచి చురుగ్గా పాల్గొంటానని తెలిపారు. రాజకీయ ద్వేషంతో రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయించారని ఆరోపించారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలను అమలు చేయిస్తామని తెలిపారు. పీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు జంగా గౌతమ్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, జిల్లా మాజీ అధ్యక్షుడు కోటా సత్యం, కేటీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శనివారం ॥ 26-8-2023

అంతర్భాగం

వడ్డించేవారు మనవారే



● తన సిబ్బందితో సోనమ్...



● రెస్టరెంట్‌లో సైన్ లాంగ్వేజ్‌లో ఆర్డర్ తీసుకుంటున్న వెయిటర్

డౌన్ సిండ్రోమ్, ఆటిజమ్, మూగ, బధిర... వీరిని 'మనలో ఒకరు' అని అందరూ అనుకోరు. వీరికి ఉద్యోగం ఇవ్వాలంటే 'వాళ్లేం చేయగలరు' అని విడిగా చూస్తారు. కాని ప్రతి ఒక్కరూ ఈ సమాజంలో అంతర్భాగమే అంటుంది డాక్టర్ సోనమ్ కాప్సే. కేవలం దివ్యాంగులనే స్టాఫ్‌గా చేసుకుని ఆమె నడుపుతున్న రెస్టరెంట్ పూణెలో విజయవంతంగా నడుస్తోంది. 'ఇక్కడంతా వడ్డించేవారు మనవారే' అంటుంది సోనమ్.

పుణెలో ఆంకాలజిస్ట్‌గా, కేన్సర్ స్పెషలిస్ట్‌గా పని చేస్తున్న సోనమ్ కాప్సేకు బాల్యం నుంచి రకరకాల వంట పదార్థాలను రుచి చూడటం ఇష్టం. 'మా అమ్మానాన్నలతో విదేశాలకు వెళ్లినప్పుడు హోటళ్ల లో రకరకాల ఫుడ్ తినేదాన్ని. మంచి రెస్టరెంట్ ఎప్పటికైనా నడపాలని నా మనసులో ఉండేది' అంటుంది సోనమ్. అయితే ఆ కల వెంటనే నెరవేర లేదు. కేన్సర్ స్పెషలిస్ట్‌గా బిజీగా ఉంటూ ఆమె ఆ విషయాన్నే మర్చిపోయింది.

యూరప్‌లో చూసి

'నేను ట్రావెలింగ్‌ని ఇష్టపడతాను. యూరప్‌కు వెళ్లినప్పుడు ఒక బిస్ట్రో (కాకా హోటల్ లాంటిది)లో ఏదైనా తిందామని వెళ్లాను. ఆశ్చర్యంగా అక్కడ సర్వ్ చేస్తున్నవాళ్లంతా స్పెషల్ వ్యక్తులే. అంటే బుద్ధి మాంద్యం, వినికిడి లోపం, అంగ వైకల్యం, మూగ... ఇలాంటి వాళ్లు. వాళ్లంతా సైన్ లాంగ్వేజ్‌లో ఆర్డర్ తీసుకుంటున్నారు. కస్టమర్లు వారికి ఎంతో సహకరిస్తున్నారు. ఇటువంటి వారి జీవితం మర్యాదకరంగా గడవాలంటే వారిని ఉపాధి రంగంలో అంతర్భాగం చేయడం సరైన మార్గం అని తెలిసొచ్చింది. మన దేశంలో సహజం గానే ఇలాంటివారికి పని ఇవ్వరు. అందుకే మన దేశంలో కూడా ఇలాంటి రెస్టరెంట్లు విరివిగా ఉండా లనుకున్నాను. ఇప్పటికే కొన్నిచోట్ల ఉన్నాయి కానీ, నేను కూడా ఇలాంటి రెస్టరెంట్ ఒకటి ఎందుకు మొదలు పెట్టకూడదు... అని ఆలోచించాను. అలా పుట్టినదే 'టెర్రసిన్' రెస్టరెంట్. టెర్రసిన్ అంటే భూమి రుచులు అని అర్థం. పొలం నుంచి నేరుగా వంటశాలలకు చేర్చి వండటం అన్నమాట' అందామె.

> దురదృష్టవశాత్తు దివ్యాంగులుగా జన్మిస్తే వివిధ కారణాల వల్ల శారీరక దురవస్థలు ఏర్పడితే ఇక వారిని విడిగా పెట్టడం... వారిని ఉపాధికి దూరం చేయడం సరికాదు. వీలైనంత వరకూ వారిని అంతర్భాగం చేసుకోవాలనే ఉద్యమాలు అనేకచోట్ల నడుస్తున్నాయి.

2021లో ప్రారంభం

పూణెలో బిజీగా ఉండే ఎఫ్.సి.రోడ్‌లో స్పెషల్ వ్యక్తులే సిబ్బందిగా 2021లో కోటిన్నర రూపాయల ఖర్చుతో 'టెర్రసిన్' పేరుతో రెస్టరెంట్ ప్రారంభిం చింది సోనమ్. ఇందు కోసం స్పెషల్ వ్యక్తులను ఎంపిక చేసి వారికి ట్రయినింగ్ ఇచ్చింది. 'వారితో మాట్లాడటానికి మొదట నేను ఇండియన్ సైన్ లాంగ్వేజ్ నేర్చుకున్నాను. ఆర్డర్ తీసుకోవడం, సర్వ్ చేయడం వంటి విషయాల్లో ట్రయినింగ్ ఇచ్చాం. కస్టమర్లు సైన్ లాంగ్వేజ్‌లో ఆర్డర్ చెప్పొచ్చు లేదా మెనూలో తాము ఎంచుకున్న ఫుడ్‌ను వేలితో చూపించడం ద్వారా చెప్పొచ్చు. అయితే ఆటిజమ్ వంటి బుద్ధిమాంద్యం ఉన్నవాళ్లను ఉద్యోగంలోకి పంపడానికి కుటుంబ సభ్యులు మొదట జంకారు. వారిని ఒప్పించడం కష్టమైంది. ఒకసారి వారు పనిలోకి దిగాక ఆ కుటుంబ సభ్యులే చూసి సంతోషించారు. మా హోటల్‌ను బిజీ సెంటర్‌లో పెట్టడానికి కారణం మా సిబ్బంది నలుగురి కళ్లల్లో పడి ఇలాంటివారికి ఉపాధి కల్పించాలనే ఆలోచన ఇతరులకు రావడానికే. మా హోటల్ బ్రేక్ ఈవెన్ సాధించింది. ఇప్పుడు ఆదాయంలో ఉంది. త్వరలో దేశంలో మరో ఐదుచోట్ల ఇలాంటి హోటల్స్ పెట్టాలనుకుంటున్నాను' అని తెలిపింది సోనమ్.

వారూ మనవారే

సమాజ ఫలాలకు అందరూ హక్కుదారులే. దురదృష్టవశాత్తు దివ్యాంగులుగా జన్మిస్తే వివిధ కారణాల వల్ల శారీరక దురవస్థలు ఏర్పడితే ఇక వారిని విడిగా పెట్టడం, ఉపాధికి దూరం చేయడం సరికాదు. వీలైనంత వరకూ వారిని అంతర్భాగం చేసుకోవాలి. ఇలాంటి ఉద్యమాలు అనేకచోట్ల నడుస్తున్నాయి. కొందరు పదిలో రెండు ఉద్యోగాలైనా ఇలాంటివారికి ఇస్తున్నారు. సోనమ్ లాంటి వారు పూర్తి అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ రంగంలో ఇంకా ఎంతో జరగాల్సి ఉంది.

● ఎకో ఫ్రెండ్లీ

ఎర్రమట్టి రాఖీలు

ఎకో ఫ్రెండ్లీ వినాయకుడిని చేశాం. ఎకో ఫ్రెండ్లీ ఆభరణాలను చూశాం. ప్రకృతి– పర్యావరణాల బంధానికి... ఇకపై... ఎకో ఫ్రెండ్లీ రక్షాబంధనం. బంధాల అల్లిక రాఖీ పండుగకు... అనుబంధాల లతలల్లింది శ్రీలత.



నిజామాబాద్‌కు చెందిన శ్రీలత సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లమో చేశారు. పెళ్లి తర్వాత కుటుంబ బాధ్యతల వల్ల ఉద్యోగం మానేయాల్సి వచ్చింది. గృహిణిగా ఇంటి నాలుగ్గోడలే జీవితం అనుకోలేదామె. నాలుగు గోడలను సృజనాత్మకతతో తీర్చిదిద్దారు.

శ్రీలత తన ఇంట్లో సోఫాలో కూర్చుని ఏ గోడను చూసుకున్నా తాను చేసిన ఫ్లవర్ వాజ్, కార్నర్ స్టాండ్, తలమీద కుండలు పేర్చుకుని భవనంలోకి అడుగుపెడుతున్న ఎంబ్రాయిడరీ గొల్లభామ, రాధాకృష్ణుల వాల్ హ్యాంగింగ్‌లు కనిపిస్తాయి. తలెత్తి చూస్తే షాండ్లియర్ కనువిందు చేస్తుంది. బీరువా తెరిస్తే తాను పెయింటింగ్ చేసుకున్న చీరలు. ఏక్‌తార మీటుతున్న భక్త మీరాబాయి ఆమె కుంచెలో ఒదిగిపోయి చీర కొంగులో జాలువారి ఉంది. మెడలో ధరించిన టెర్రకోట ఆభరణంలో రాధాకృష్ణులు వయ్యారాలొలికిస్తుంటారు. మరోది పక్కన వర్లి జానపద మహిళలు కొలువుదీరిన మినీ టేబుల్ స్టాండ్. డాబా మీదకెళ్తే మొక్కల పచ్చదనం, చుట్టూ ఎర్రటి పిట్టగోడల మీద తెల్లటి చుక్కల ముగ్గులు... ఖాళీ సమయాన్ని ఇంత ఉపయుక్తంగా మార్చుకోవచ్చా... అన్న విస్మయం, అందరికీ రోజుకు ఇరవై నాలుగ్గంటలే కదా ఉంటాయి... ఇన్ని రకాలెలా సాధ్యం అనే ఆశ్చర్యం ఏకకాలంలో కలుగుతాయి. ఇప్పుడామె రాబోతున్న రాఖీ పండుగకు పర్యావరణహితమైన టెర్రకోట రాఖీల తయారీకి సిద్ధమయ్యారు. తన కళాభిరుచిని సాక్షితో పంచుకున్నారు శ్రీలత.



రంగు... బ్రష్ ఉంటే చాలు!

''మా సొంతూరు దోమకొండ. మా చిన్నప్పుడే నిజామాబాద్‌కి వచ్చేశాం. అత్తగారిల్లు బాన్సువాడ, కానీ మావారి వ్యాపారరీత్యా నిజామాబాద్‌లోనే స్థిరపడ్డాం. అత్తగారిల్లు ఉమ్మడి కుటుంబం, ఇంటి బాధ్యతల కోసం పూర్తి సమయం కేటాయించాల్సిన అవసరం ఉండేది. దాంతో ఉద్యోగం మానేయక తప్పలేదు. అయితే నిజామాబాద్‌కి వచ్చిన తర్వాత ఖాళీ సమయం ఎక్కువగా ఉంటోంది. పిల్లలు ముగ్గురూ స్కూళ్లకు, కాలేజీకి, మా వారు బయటకు వెళ్లిన తర్వాత రోజంతా ఖాళీనే. టీవీ చూస్తూ గడిపేయడం నాకు నచ్చేది కాదు. చిన్నప్పుడు మా అమ్మ చేస్తూ ఉంటే చూసి నేర్చుకున్న కళలన్నీ గుర్తుకు వచ్చాయి. నా క్రియేటివ్ జర్నీ అలా మొదలైంది. వీటన్నింటినీ చేయడానికి ముడిసరుకు కోసం మార్కెట్‌కెళ్లే పనే ఉండదు. ఇంటికి వచ్చిన పెళ్లి పత్రిక, చాక్లెట్ బాక్సులు, కేక్ కట్ చేసిన తర్వాత మిగిలిన అట్టముక్క... దేనినీ వదలను. రంగులు, బ్రష్‌లు కొంటే చాలు ఇక నాకు చేతినిండా పని. నా మెదడు చివరికి ఎంతగా ట్యూన్ అయిపోయిందంటే... ఉపయోగంలో లేని ఏ వస్తువును చూసినా దాంతో ఏమి చేయవచ్చు... అనే ఆలోచనలు తిరుగుతూనే ఉంటాయి. ఆలోచనలకు ఒక రూపం వచ్చిందంటే పని మొదలు పెట్టడమే. వచ్చిన ఐడియాని మర్చిపోతానేమోనని ఒక్కోసారి ఒకటి పూర్తికాక ముందే మరొకటి మొదలు పెడతాను.

మట్టితో రాఖీ!

కోవిడ్ లాక్‌డౌన్ సమయం నాకు బాగా కలిసి వచ్చింది. ఒక్క రోజు కూడా బోరు కొట్టలేదు. అప్పటి వరకు ఇంటి అలంకరణ వస్తువులు, ఆభరణాలు మాత్రమే చేసిన నేను రాఖీల తయారీ కూడా మొదలు పెట్టాను. మొక్కల కోసం తెప్పించుకునే ఎర్రమట్టిని రాఖీలు, ఆభరణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకుంటాను. మట్టిని నీటిలో నానబెట్టి కరిగిన తరవాత సన్నని చిల్లులున్న జల్లెడలో వేసి బకెట్‌లోకి వడపోయాలి. రాళ్లు, నలకలు, పుల్లల వంటివి జల్లెడ పైన ఉండిపోతాయి. ఓ గంట సేపటికి బకెట్‌లో నీరు పైకి తేలుతుంది. అడుగుకు చేరిన మట్టిని తీసి ఎండబెట్టాలి. తేమ ఆరిపోతూ ముద్దగా ఉన్నప్పుడు ఆభరణాలు తయారుచేసి ఎండబెట్టాలి. ఎండిన తర్వాత కొబ్బరి పీచు, వరిపొట్టులో వేసి కాల్చాలి. ఇటుకలు కాల్చినట్లేనన్నమాట. వేడి చల్లారిన తర్వాత రంగులు వేసి, దారాలు చుడితే రాఖీ రెడీ. లాకెట్‌లు, చెవుల జూకాలు కూడా ఇలాగే చేస్తాను.

మొక్క నాటుతాం!

రాఖీలను మొదట్లో మా ఇంట్లో వరకే చేశాను. ఇప్పుడు నా రాఖీలు కావాలని బంధువులు, స్నేహితులు అడుగుతున్నారు. ఓ వంద రాఖీలు అవసరమవుతున్నాయి. అందుకే ఈ ఏడాది ఆగస్టు మొదటివారం నుంచే పని మొదలుపెట్టాను. పర్యావరణ పరిరక్షణ పట్ల ఆసక్తి కలిగినప్పటి నుంచి మట్టి వినాయకుడి బొమ్మనే తెచ్చుకుంటున్నాం. పండుగ తరవాత గణపతిని పూలకుండీలో పెట్టి నీరు పోసి కరిగిన తరవాత మొక్క నాటుతాను. మరో విషయం... మా ఇంట్లో ఏటా పుట్టినరోజులు, పెళ్లిరోజుకు కొత్త మొక్కను నాటుతాం'' అని చెప్తూ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియచేశారు శ్రీలత.

– వాకామంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



జిడ్డుతత్వం ఉన్న చర్మానికి గ్రేప్స్ ప్యాక్ బాగా పనిచేస్తుంది. ఈ ప్యాక్ వేసుకుంటే అధికంగా ఉన్న జిడ్డు పోతుంది. పది నల్ల ద్రాక్ష పండ్లను పేస్టులా చేసుకోవాలి. ఈ పేస్టులో టేబుల్ స్పూను ముల్తాని మట్టి, టీస్పూను రోజ్ వాటర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి అరగంటపాటు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

***

కొన్ని నల్ల ద్రాక్షపళ్లను బాగా పిసికి గుజ్జు తీయాలి. దానికి చెంచా పంచదార, చిటికెడు పసుపు కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి సున్నితంగా మర్దన చేయాలి. 20 నిమిషాల తర్వాత కడిగేయాలి. వారానికి ఒకటి లేదా రెండుసార్లు ఇలా చేస్తే ముఖంపై మృత కణాలన్నీ తొలగిపోతాయి. 5 వారాలపాటు క్రమం తప్పకుండా చేస్తే ముఖం కాంతిమంతంగా.. యంగ్‌లుక్‌తో కనిపిస్తుంది.

***

ఒక కప్పు ద్రాక్ష పళ్లు తీసుకుని చేతులతో పిసికి గుజ్జులా చేయాలి. వాటిలో రెండు చెంచాల పాలు, చెంచా తేనె కలిపి ముఖానికి రాసుకోవాలి. 15 నిమిషాల తర్వాత చల్లని నీటితో ముఖం కడుక్కోవాలి. ఇలా తరచూ చేస్తుంటే ముఖంపై ఉండే మొటిమలు తాలూకు మచ్చలు పోయి చర్మం మృదువుగా మెరుపులీనుతుంటుంది.

***

చిన్న టొమాటో తీసుకుని ముక్కలుగా తరగాలి. ఈ ముక్కలకు ఆరు ద్రాక్షపండ్లను జోడించి మెత్తని పేస్టులా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమాన్ని పెదవులు, కళ్లకు అంటకుండా ముఖానికి, మెడకు అప్లై చేసి ఇరవై నిమిషాలపాటు ఆరనివ్వాలి. తరువాత చల్లని నీటితో కడిగేయాలి.

మక్రామీ

చీకటిని తరిమికొట్టిన దారి దీపం



● సంప్రీత్ కౌర్



'ఇదేమీ జీవితం' అనే మాట సంప్రీత్ కౌర్ నోటి నుంచి ఎన్నోసార్లు వచ్చేది. నరకాన్ని తలపించే ప్రదేశంలో ఆమె బందీగా లేదు. ఎప్పటిలాగే, అదే ఇంట్లో అదే కుటుంబ సభ్యుల మధ్య ఉంది. 'ఇదేమీ జీవితం నుంచి ఎందుకీ జీవితం' వరకు కౌర్ ఆలోచనలు వెళుతున్న చీకటి కాలంలో ఆమె ముందు ఒక వెలుగు కిరణం పడింది. దాని పేరు... మక్రామీ!



● మక్రామీ ఆర్ట్

స్కూల్ నుంచి కాలేజీ వరకు స్టార్ స్టూడెంట్‌గా పేరు తెచ్చుకుంది హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన సంప్రీత్‌కౌర్. ప్రెగ్నెన్సీ సమయంలో తొమ్మిదేళ్ల కెరీర్‌కు గుడ్‌బై చెప్పింది. ఎన్నో ప్రసిద్ధ సంస్థల్లో క్రియేటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన కౌర్‌కు ఖాళీగా కూర్చోవడం అంటే ఇష్టం ఉండదు. కాని అనివార్య పరిస్థితులలో ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది.

డెలివరీ తర్వాత కౌర్ ప్రసూతి వైరాగ్యానికి అంటే పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌కు గురైంది.

తాను తనలాగా ఉండలేకపోయేది.

ఏవేవో ప్రతికూల ఆలోచనలు.

ఎప్పుడూ సందడిగా ఉండే కౌర్‌కు ఎవరితో మాట్లాడాలనిపించే కాదు. 'మనసుంటే మార్గం ఉంటుంది' అంటారు. అయితే ఆమె మనసు చీకట్లో కొట్టుమిట్టాడుతోంది. అయినప్పటికీ ఆ మనసు ఒక మార్గాన్ని వెలుతురుగా ఇచ్చింది... అదే మక్రామీ ఆర్ట్.

ఆ ఆర్ట్‌కు దగ్గరవుతున్నకొద్దీ తనలోని డిప్రెషన్ మూడ్స్ దూరంగా వెళ్లిపోయేవి. చివరికి అవి కనిపించకుండా పోయాయి. కౌర్ గతంలోలాగే చురుగ్గా ఉండడం మొదలుపెట్టింది.

'మక్రామీ'లో నేర్పు సాధించిన కౌర్ ఆ కళను గాలికి వదిలేయలేదు. తాను ఎంటర్‌ప్రెన్యూర్ కావడానికి దాన్ని ఒక దారిగా చేసుకుంది

'అబ్బాయి పుట్టిన తరువాత, తరచుగా డిప్రెసివ్ మూడ్స్ వచ్చేవి. నా కాలేజి చదువు కోసం తల్లిదండ్రులు ఎంతో ఖర్చు చేశారు. ఉద్యోగ జీవితాన్ని మిస్ అవుతున్నాననే బాధ ఉండేది. ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించాను. ఇప్పుడు ఇలా ఖాళీగా ఉండడం ఏమిటీ అని ఆలోచించేదాన్ని. గుంపులో ఉన్నా ఒంటరిగానే ఫీలయ్యేదాన్ని. పిల్లాడితో ఆడుకుంటూ ఆనందించడం కంటే, పిల్లాడు ఎప్పుడు నిద్రపోతాడా అని ఎదురు చూసేదాన్ని. పిల్లాడు నిద్రపోగానే ఒంటరిగా కూర్చొని ఏవేవో ఆలోచించేదాన్ని. 'పిల్లాడి మీద శ్రద్ధ పెట్టు. వృథాగా ఆలోచించకు' అని అమ్మ మందలించేది. ఎప్పుడూ సరదాగా ఉండే నేను సీరియస్‌గా మారిపోవడం చూసి మా ఆయన అయోమయానికి గురయ్యేవారు. ఆయనకు ఏం అర్థమయ్యేది కాదు. ఒకరోజు యూట్యూబ్‌లో పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌కు సంబంధించిన వీడియో చూశాను. తల్లి మూడ్‌స్వింగ్స్ పిల్లాడిపై ప్రభావం చూపుతాయనే విషయం విన్న తరువాత భయమేసింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని నా సమస్యకు నేనే పరిష్కారాన్ని వెదుక్కున్నాను' గతాన్ని గుర్తు చేసుకుంటుంది కౌర్.

'జస్ట్ ఏ హాబీ'గా పరిచయం అయిన మక్రామీ ఆర్ట్ కౌర్‌ను పూర్తిగా మార్చివేసింది. మునపటి చురుకుదనాన్ని, హాస్యచతురతను తెచ్చి ఇచ్చింది.

'మక్రామీ ఆర్ట్ ద్వారా అర్థం లేని ఆలోచనకు అడ్డుకట్ట పడింది. మనసు చాలా తేలిక అయింది. కొన్ని ఫ్లవర్ పాట్ హోల్డర్స్‌ను తయారుచేసి వాటి ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాను. ఒక ఫ్రెండ్ ఇది చూసి తనకు ఆరు పీస్‌లు కావాలని అడిగింది. ఆమె నా ఫస్ట్ కస్టమర్. నా హాబీ అనేది విజయవంతమైన వ్యాపారంగా మారడానికి ఎంతో కాలం పట్టలేదు. ఆర్థికంగా ఒకరి మీద ఆధారపడడం ఇష్టంలేని నాకు ఇది చాలా గర్వంగా అనిపించింది' అంటుంది కౌర్.

కౌర్ ఆర్ట్‌వర్క్‌కు ఎంతో మంది అభిమానులు ఏర్పడ్డారు. వారిలో ఒకరు... రెగ్యులర్ కస్టమర్ అయిన అర్చన.

'కౌర్ ఆర్ట్‌వర్క్ అంటే నాకు ఎంతో ఇష్టం. అత్యంత కఠిన సమయంలో ఆర్ట్ ద్వారా ఎలా బయటపడిందో తెలుసుకున్నాక ఆమె మీద అభిమానం రెట్టింపు అయింది. గోరంత సమస్యనే కొండంత చేసుకొని బాధపడే వారికి కౌర్ గురించి చెబుతుంటాను. ఆమె ఆర్ట్ వర్క్‌లో క్వాలిటీ, చూడగానే ఆకట్టుకునే సృజన నాకు ఇష్టం' అంటుంది అర్చన.

బాలీవుడ్ నటి తాప్సీ పన్ను నుంచి కౌర్‌కు పెద్ద ఆర్డర్ వచ్చింది. విదేశాల నుంచి కూడా ఆర్డర్లు రావడం మొదలైంది. దేశ, విదేశాల నుంచి ప్రతి నెల పదిహేను వందలకు పైగా ఆర్డర్లు వస్తున్నాయి.

'నాలాగే సమస్యలు ఎదుర్కొంటున్న తల్లుల దగ్గరకు వెళ్లి నేను పడిన ఆందోళన, దానినుంచి బయటపడడానికి చేసిన కృషి గురించి చెప్పి మామూలు స్థితికి తీసుకువచ్చే దాన్ని. ఎంటర్‌ప్రెన్యూర్‌గా సాధించిన విజయం కంటే వారిలో మార్పు తీసుకువచ్చాననే సంతృప్తి ఎక్కువ సంతోషాన్ని ఇచ్చింది' అంటుంది సంప్రీత్ కౌర్.

నిజాయితీగా, విరామం లేకుండా కృషి చేస్తే విజయం తప్పక సాధిస్తామని నమ్మే ట్రీ టీచర్... అతిపెద్ద థార్ ఎడారిని సస్యశ్యామలం చేసేందుకు నిర్విరామంగా కృషిచేస్తున్నాడు. ఇసుకమేటలను పచ్చని అడవులుగా మార్చేందుకు తను తాపత్రయపడుతూ.. అందరిలో అవగాహన కల్పిస్తున్నాడు. ''ప్రకృతిని తన కుటుంబంలో ఒకరిగా చూసుకుంటూ భూమాతను కాపాడుకుందాం రండి'' అంటు పచ్చదనం పాఠాలు చెబుతున్నాడు ట్రీ టీచర్ భేరారం భాఖర్.

ఎడారిలో... పచ్చదనం పాఠాలు

రాజస్థాన్‌లోని బార్మర్ జిల్లా కుగ్రామం ఇంద్రోయ్‌కుచెందిన భేరారం భాఖర్ స్కూల్లో చదివే రోజుల్లో .. విద్యార్థులందర్నీ టూర్‌కు తీసుకెళ్లారు. ఈ టూర్‌లో యాభై మొక్కలను నాటడం ఒక టాస్క్‌గా అప్పగించారు పిల్లలకు. తన స్నేహితులతో కలిసి భేరారం కూడా మొక్కలను ఎంతో శ్రద్ధగా నాటాడు. అలా మొక్కలు నాటడం తనకి బాగా నచ్చింది. టూర్ నుంచి ఇంటికొచ్చిన తరువాత మొక్కలు నాటి, వాటిని పరిరక్షించడం వల్ల ప్రకృతి బావుంటుంది అని తెలిసి భాఖర్‌కు చాలా సంతోషంగా అనిపించింది. మిగతా పిల్లలంతా మొక్కలు నాటడాన్ని ఒక టాస్క్‌గా తీసుకుని మర్చిపోతే భేరారం మాత్రం దాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాడు.''ప్రకృతిని ఎంత ప్రేమగా చూసుకుంటే అది మనల్ని అంతగా ఆదరిస్తుంది. పర్యావరణాన్ని జాగ్రత్తగా చూసుకోవడం మన బాధ్యత''అని నిర్ణయించుకుని అప్పటి నుంచి మొక్కలు నాటడం మొదలు పెట్టాడు.

ట్రీ టీచర్‌గా...

మొక్కలు నాటుతూ చదువుకుంటూ పెరిగిన భాఖర్‌కు ప్రభుత్వ స్కూల్లో టీచర్ ఉద్యోగం వచ్చింది. దీంతో తనకొచ్చిన తొలిజీతాన్ని మొక్కల నాటడానికే కేటాయించాడు.'మొక్క నాటండి, జీవితాన్ని కాపాడుకోండి' అనే నినాదంతో తన తోటి టీచర్లను సైతం మొక్కలు నాటడానికి ప్రేరేపించాడు. ఇతర టీచర్ల సాయంతో బర్మార్ జిల్లా సరిహద్దుల నుంచి జైసల్మేర్, జోధర్, ఇంకా ఇతర జిల్లాల్లో సైతం మొక్కలు నాటుతున్నాడు. ఒకపక్క తన విద్యార్థులకు పాఠాలు చెబుతూనే, మొక్కల ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ప్రకృతిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాడు. మొక్కలను ఉచితంగా సరఫరా చేస్తూ మొక్కలు నాటిస్తున్నాడు. తన స్కూలు విద్యార్థులకేగాక, ఇతర స్కూళ్లకు కూడా తన మోటర్ సైకిల్ మీద తిరుగుతూ మొక్కలు నరకవద్దని చెబుతూ ట్రీ టీచర్‌గా మారాడు భేరారం.



అడవి కూడా కుటుంబమే...

బర్మార్‌లో పుట్టిపెరిగిన భాఖర్‌కు అక్కడి వాతావరణ పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. సరిగా వర్షాలు కురవకపోవడం, నీళ్లు లేక పంటలు పండకపోవడం, రైతుల ఆవేదనను ప్రత్యక్షంగా చూసి ఎడారిలో ఎలాగైనా పచ్చదనం తీసుకురావాలని కంకణం కట్టుకున్నాడు. ఈ క్రమంలోనే... 'ఫ్యామిలీ ఫారెస్ట్రీ' పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. మొక్కను మన కుటుంబంలో ఒక వ్యక్తిగా అనుకుంటే దానిని కచ్చితంగా కాపాడుకుంటాము. అప్పుడు మొక్కలు పచ్చగా పెరిగి ప్రకృతితోపాటు మనమూ బావుంటాము అని పిల్లలు, పెద్దల్లో అవగాహన కల్పిస్తున్నాడు. భేరారం మాటలతో స్ఫూర్తి పొందిన యువతీ యువకులు వారి చుట్టుపక్కల ఖాళీస్థలాల్లో మొక్కలు నాటుతున్నారు.

నాలుగు లక్షలకుపైగా...

అలుపెరగకుండా మొక్కలు నాటుకుంటూ పోతున్న భేరారం ఇప్పటిదాకా నాలుగు లక్షలకు పైగా మొక్కలు నాటాడు. వీటిలో పుష్పించే మొక్కలు, పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలతో సహా మొత్తం లక్షన్నర ఔషధ మొక్కలు కూడా ఉన్నాయి. ఇక్కడి మట్టిలో చక్కగా పెరిగే మునగ మొక్కలు ఎక్కువగా ఉండడం విశేషం. రాజస్థాన్‌లోని ఎనిమిది జిల్లాల్లో పన్నెండు లక్షల విత్తనాలను నాటాడు. 28వేల కిలోమీటర్లు బైక్ మీద తిరుగుతూ లక్షా ఇరవైఐదు వేలమందికి మొక్కల నాటడం తోపాటు, వాటి ప్రాముఖ్యం గురించి అవగాహన కల్పించాడు. మొక్కలే కాకుండా 25 వేల పక్షులకు వసతి కల్పించి వాటిని ఆదుకుంటున్నాడు. గాయపడిన వన్యప్రాణులను సైతం చేరదీస్తూ పర్యావరణాన్ని పచ్చగా ఉంచేందుకు కృషిచేస్తున్నాడు.

చంద్రయాన్ మిషన్ విజయవంతమైనట్టుగా.. భేరారం కృషితో ఎడారి ప్రాంతం కూడా పచ్చదనంతో కళకళలాడాలని కోరుకుందాం.

లైఫ్@360





చాలా మంది ముఖవర్చసును మెరుగుపరుచుకునేందుకు ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తుంటారు గానీ, శరీరంలోని ఇతర అవయవాలపై అంత శ్రద్ధ చూపరు. ముఖంతోపాటు చేతులు, కాళ్లు కూడా శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటేనే ఆ అందానికి అర్థం. ఆరోగ్యానికి ఆరోగ్యం కూడా... పాదాల పరిరక్షణకు, గోళ్ల అందానికి చేసే పెడిక్యూర్ సంరక్షణనే పెడిక్యూర్, మేనిక్యూర్ అంటారు. వాటి గురించి తెలుసుకుందాం.

క్యూర్ చేసుకుంటున్నారా?



రోజువారి స్నానంలో పాదాలను చాలా మంది అశ్రద్ధ చేస్తుంటారు. ఫలితంగా వివిధ రకాల ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి. పెడిక్యూర్ చేయించుకోవడం వల్ల ఈ ఇన్ఫెక్షన్‌లు దూరమవుతాయి. స్త్రీలకు సర్వసాధారణం గా ఎదురయ్యే పాదాల పగుళ్లను పెడిక్యూర్ నివారిస్తుంది. గోళ్లకు రక్తప్రసరణ బాగా జరగడం వల్ల అవి ఆరోగ్యంగా పెరుగుతాయి. గోళ్లకు కూడా పుష్కలంగా పోషకాలు అందడం వల్ల పెరుగుదల బాగుండి అందంగా మెరుపులీనుతాయి.

- పెడిక్యూర్ విధానంలో పాదాలకు మంచి మర్దన (మసాజ్) లభిస్తుంది. దీనివల్ల పాదాల్లో రక్తప్రసరణ బాగా జరుగుతుంది. దీంతో ఎటువంటి నొప్పులు, ఆర్థ్రైటీస్, వెరికోస్ వెయిన్స్ వంటివి తలెత్తవు.
- పాదాలకు చేసే మసాజ్‌తో శరీరం మొత్తం ఒకేరకమైన ఉష్ణోగ్రతలు కొనసాగడంతోపాటు, లింఫ్‌నోడ్స్‌లోని టాక్సిన్స్ బయటకు వెళ్లిపోతాయి.

పాదాలకు మసాజ్ చేయడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. మసాజ్‌తో ఒత్తిడి తగ్గి మనస్సు ఉత్సాహంగా ఉంటుంది. దీంతో మనలో ఆత్మవిశ్వాసం పెరిగి నూతనోత్సాహంతో మరిన్ని విజయాలు సాధించవచ్చు.

- ఇన్ని ప్రయోజనాలు ఉండబట్టే బ్యూటీ పార్లర్లు, స్పాలు అందించే క్యూర్‌లపై చాలామంది ఆసక్తి కనబరుస్తుంటారు.

పెడిక్యూర్

మర్దన ద్వారా పాదాలను కాపాడుకోవడమే పెడిక్యూర్. రోజంతా పనిచేసి అలసిపోయిన మోకాళ్లు, పాదాలు, మడమలు, కాలివేళ్లు, గిలకలకు మసాజ్ ద్వారా ఉపశమనం కలిగించడం పెడిక్యూర్‌లో ఒక భాగం. ఈ విధానంలో ప్యూమిస్ స్టోన్, మసాజ్ క్రీమ్, నెయిల్ బ్రష్, నెయిల్ కట్టర్, టబ్‌లను ఉపయోగిస్తారు.

ఇలా క్యూర్ చేస్తారు...

ముందుగా కాలిగోళ్లకు అంతకుముందే ఉన్న పాలిష్‌ను, మురికిని తొలగిస్తారు. తరువాత గోళ్లను నీట్‌గా కట్ చేస్తారు. ఆ తరువాత ఒక టబ్‌లో గోరువెచ్చని నీళ్లు తీసుకుని దానిలో చిటికెడు ఉప్పు, సుగంధ తైలం, నిమ్మరసం షాంపు వేసి 30 నిమిషాల పాటు పాదాలను నానబెడతారు. నానిన తరువాత ప్యూమిస్ స్టోన్ లేదా గరుకుగా ఉండే పిండితో మడమలను, అరికాళ్లను మురికి పోయేలా శుభ్రంగా రుద్దుతారు. ఈ ప్రక్రియంతా పూర్తయిన తరువాత మసాజ్ ఆయిల్ లేదా మాయిశ్చరైజర్‌తో పాదాలను అవసరానికి తగ్గట్టు మృదువుగా లేదా గట్టిగా మసాజ్ చేస్తారు. ఆ తరువాత పాదాలను శుభ్రంగా తుడవడంతో పెడిక్యూర్ పూర్తవుతుంది. ఈ విధంగా నెలకు రెండుసార్లు పెడిక్యూర్ చేసుకుంటూ ఉంటే పాదాలు ఆరోగ్యంగా, అందంగా ఉంటాయి. పెడిక్యూర్‌కు కావాల్సిన పరికరాలు మన దగ్గర ఉంటే ఇంట్లో కూడా చేసుకోవచ్చు.

మెనీక్యూర్ ఎలాగంటే...

ముందుగా చేతిగోళ్లకు ఉన్న పాత నెయిల్ పెయింట్‌ను తుడిచివేస్తారు. తర్వాత గోళ్లను నచ్చిన ఆకృతిలో అందంగా ట్రిమ్ చేస్తారు. ఇలా రెండు చేతుల గోళ్లను ట్రిమ్ చేశాక, ఒక గిన్నెలో సోప్ వాటర్‌ను తీసుకుని దానిలో హైడ్రోజన్ పెరాక్సైడ్, గ్లిజరిన్, నిమ్మరసం వేసి రెండు చేతుల వేళ్లు మునిగేలా అందులో ముంచి 10 నిమిషాలు ఉంచుతారు. ఇలా చేయడం వల్ల గోళ్లలో ఉండే మలినాలు, సూక్ష్మజీవులు నశించి గరుకుగా ఉంటే క్యూటికల్స్ మెత్తగా అవుతాయి. గోరు చుట్టూ ఉండే చర్మం కూడా మెత్తబడుతుంది. తరువాత అరిచేతుల నుంచి మోచేతుల వరకు శుభ్రంగా క్లీన్ చేస్తారు. ఆపై రెండు చేతులను తుడుస్తారు. క్యూటికల్ రిమూవర్‌తో గోరు చుట్టూ ఇంకా ఏమైనా క్యూటికల్ బిట్స్ ఉంటే తీస్తారు. దీనివల్ల గోరు పెద్దదిగాను అందంగాను కనిపిస్తుంది. తరువాత చేతులను శుభ్రంగా తుడిచి మాయిశ్చరైజర్‌తో చేతులకు వేళ్లకు మర్దన చేస్తారు. ఇలా 15 రోజులకొకసారి చేయడం వల్ల చేతులు అందంగా ఆరోగ్యంగా కనిపిస్తాయి. ఖర్చులు భరించగలిగినవారైతే నిపుణులతో పెడిక్యూర్, మెనీక్యూర్ చేయించుకుంటే మరిన్ని మంచి ఫలితాలను పొందే అవకాశం ఉంది.

పాదాలను, గోళ్లను అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్ద డాన్నే పెడిక్యూర్ అంటారు. లాటిన్‌లో పెస్ లేదా పెడ్ అంటె పాదం, క్యూర్ అంటే రక్షణ అని అర్థం. అలాగే చేతులు, చేతివేళ్లు, గోళ్లను అందంగా తీర్చిదిద్దే పద్ధతే మెనీక్యూర్. నిజానికి మెనీక్యూర్ కూడా లాటిన్ పదమే. మానస్ అంటే చేయి, క్యూర్ అంటే జాగ్రత్త అని అర్థం. పెడిక్యూర్‌లో పాదాల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే... మెనీక్యూర్‌లో చేతుల ఆరోగ్యం పై ఫోకస్ చేస్తారు.

దీర్ఘాయుష్మాన్ భవ



మీరు ఎక్కువ కాలం జీవించాలనుకుంటున్నారా? అయితే, మీరు మీ జీవనశైలిలో కొన్ని సర్దుబాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే, ప్రపంచంలో ఎక్కువ కాలం జీవించే వ్యక్తులు ఆరోగ్యకరమైన తిండి, నిద్రవేళలను కచ్చితంగా కలిగి ఉంటారని అధ్యయనాలు చెబుతున్నాయి.

- ఆరోగ్యకరమైన జీవనశైలికి మంచి నిద్ర ప్రణాళిక అవసరం. ప్రతిరోజూ ఒకే సమయంలో పడుకోవడం, మేల్కొనడం వంటి స్థిరమైన నిద్ర షెడ్యూల్‌ను పాటించడం మీకు ఎక్కువ కాలం జీవించడంలో ఉపకరిస్తుంది. అలాగని ఎప్పుడు పడితే అప్పుడు పడుకోవద్దు. ప్రతిరోజు ఒక షెడ్యూల్ ఫిక్స్ చేసుకుని అదే సమయంలో కచ్చితంగా నిద్రించాలి. అంతేకాదు, రోజూ ఒకే సమయంలో నిద్ర నుంచి మేలుకోవాలి.
- కొన్ని అధ్యయనాల ప్రకారం, దీర్ఘకాలం జీవించాలనుకుంటే, మీ మెదడు, శరీరాన్ని పునరుద్ధరించడానికి ప్రతి రాత్రి 8 గంటల నిద్ర అవసరం. తగినంత నిద్ర మీ మెదడు పనితీరు, రోగనిరోధక శక్తి, శక్తి స్థాయిలను మెరుగుపరుస్తుంది. చెదిరిన లేదా కలత నిద్ర మీ మెదడు పనితీరును, ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది.
- విశ్రాంతి తీసుకోవడానికి సమయాన్ని వెచ్చించాలి. దీనివల్ల మీ మనస్సుకే కాదు, శరీరానికి కూడా రోజంతా హాయిగా ఉండేందుకు అవసరమైన విరామం లభిస్తుంది. మీరు దీన్ని ఎలా చేస్తారు? మీరు ఎక్కడ నివసిస్తున్నారనేది వ్యక్తి నుండి వ్యక్తికి మారుతూ ఉంటుంది.
- ప్రపంచంలోని చాలా మంది ప్రజలు మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవడం అలవాటు చేసుకుంటారు. వారు క్రమం తప్పకుండా నడవడం, పుస్తకం చదవడం, వెచ్చని చామంతి టీ తాగడం వంటివి చేస్తారు. ఆనందంగా ఉండటమే.. ఎక్కువ కాలం జీవించేందుకు కారణం.
- సుదీర్ఘ జీవితాన్ని గడపడంలో మీ ఆహారం కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యంగా తినొద్దు. సరైన సమయంలో తగినంత తినడం శరీర బరువును ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. మీరు అల్పాహారం, మధ్యాహ్న భోజనం మీకు నచ్చినట్లుగా తినవచ్చు. రాత్రి భోజనాన్ని మితంగా తీసుకోవచ్చు.
- కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ సంతోషంగా భోజనం చేయడం వల్ల ఎక్కువ కాలం జీవించవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి.

లాలన.. పాలన

ఇలా దారికి తెచ్చుకోవాలి



ఈకాలం పిల్లలు తల్లిదండ్రుల మాట వినడం కష్టమే. ఇది చేయకు, అది చేయకు, అలా, ఇలా ఉండకూడదు అని చెబితే అస్సలు వినరు. పెద్దవాళ్లు చెప్పేది తమ మంచికే అన్న స్పృహ ఉండదు వారికి. అయినా పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తపన పడుతుంటారు తల్లిదండ్రులు. మాట వినకుండా పెంకిగా ప్రవర్తించే పిల్లలను ఇలా మీ దారిలోకి తెచ్చుకోండి. అప్పుడు ఇక పిల్లలతోపాటు మీరూ సంతోషంగా ఉంటారు.

- మాట వినడం లేదని పిల్లలను తిట్టకూడదు. నువ్వు చెడ్డదానివి లేదా చెడ్డవాడివి అని వారిని నిందించకూడదు. నువ్వు పెద్దదానివి లేదా పెద్దవాడివు అవుతున్నావు కదా... అందుకే ఇలా చేస్తే బాగుంటుంది... అని లాలనగా చెప్పాలి.
- కోపంలో మనం అనే కొన్ని రకాల మాటలు పిల్లల మనసుకు గాయం చేసి, వారి మనసును విరిచేస్తాయి. కొన్నిసార్లు వారి ఆత్మవిశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తాయి. అందుకే వీలైనంత వరకు వారికి ఓపికగా అర్థమయ్యేలా వివరించి చెప్పాలి.
- పిల్లలు ఎంత విసిగించినప్పటికీ పెద్దగా అరవకూడదు. పైన చెప్పుకున్నట్టు సున్నితంగా పదేపదే చెబుతూ బుజ్జగించాలి. ఎంత చెప్పినా వినకుండా ఉంటే ముందు వాళ్ల కోపం తగ్గించాలి. తరువాత పిల్లలు వినక్కోకుండా జాగ్రత్తగా చెప్పాలి.
- చెప్పేది ఏదైనా ప్రేమగా చెబితే ఎంత మొండి చేసేవారైనా తప్పకుండా వింటారు. నచ్చిన డ్రెస్ వేసుకోనివ్వడం, హోం వర్క్ అయిన తరువాత టీవీ చూడనివ్వడం, డాడీతో కలిసి బయటకు వెళ్లడానికి అనుమతించడం వంటివి. ఇలా పిల్లలకు తల్లిదండ్రుల మీద నమ్మకం కలిగించి, తరువాత వారికి మంచి చెడులు వివరించాలి.
- ప్లీజ్, థ్యాంక్యూ, యూ ఆర్ వెల్‌కమ్ వంటి మర్యాదలు నేర్పించాలి. తల్లిదండ్రులు ఏం మాట్లాడతారో పిల్లలు అదే నేర్చుకుంటారు. అందుకే మీరు మాట్లాడేటప్పుడు ఆచితూచి జాగ్రత్తగా మాట్లాడాలి.
- పిల్లలు వారికి హాని జరిగే పనులు కొన్నిసార్లు చేస్తుంటారు. వెంటనే కేకలేసి, లెక్చర్ ఇవ్వకూడదు. కాస్త దెబ్బలు తగిలినప్పటికీ... వాళ్లు తేరుకున్నాక, మీ మాటలు వినే మూడ్‌లో ఉన్నప్పుడు మాత్రమే దాని గురించి వివరించాలి. అప్పుడు వారు మరోసారి అటువంటి పనులు చేయరు.

సినిమా

రీల్స్

ఆ రోజు పుష్పగాడి రూల్?


● అల్లు అర్జున్

పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ మాంచి జోష్‌లో ఉన్నారు. 'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ నటనకు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సంబరాలు పూర్తి స్థాయిలో పూర్తి కాకుండానే 'పుష్ప' సినిమాకు సంబంధించిన ఓ వార్త తెరపైకి వచ్చింది. 'పుష్ప' చిత్రంలోని మలి భాగం 'పుష్ప: ది రూల్' చిత్రీకరణ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా విడుదల విషయంలో మేకర్స్ ఓ క్లారిటీకి వచ్చారని, వచ్చే ఏడాది మార్చి 22న 'పుష్ప: ది రూల్'ను విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నారని టాక్. విడుదల తేదీపై అతి త్వరలో అధికారిక ప్రకటన రానుందని తెలిసింది. 'ఆర్య', 'ఆర్య 2' చిత్రాల తర్వాత హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో 'పుష్ప' చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీ వల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

ఎమోషనల్ వారియర్


● మోహన్‌లాల్

మోహన్‌లాల్, రోషన్ మేకా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ద్విభాషా (తెలుగు, మలయాళం) చిత్రం 'వృషభ'. 'ది వారియర్ అరైజ్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో జహ్రా ఖాన్, శనయ కపూర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. నంద కిషోర్ దర్శకత్వంలో అభిషేక్ వ్యాస్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా, శ్యామ్ సుందర్, ఏక్తా కపూర్, శోభా కపూర్, వరుణ్ మథూర్, సౌరభ్ మిశ్రా నిర్మాతలు. ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తయింది. ''తండ్రీకొడుకుల మధ్య సాగే ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం ఉంటుంది. 'మన్యం పులి' తర్వాత మోహన్‌లాల్, పీటర్ హెయిన్స్ కాంబినేషన్‌లో ఆ తరహా యాక్షన్ సీన్స్ అలరిస్తాయి. హాలీవుడ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నిక్ తుర్లో మా సినిమాకు వర్క్ చేస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది. శ్రీకాంత్ మేకా, రాగిణి ద్వివేది తదితరులు కీలక పాత్రల్లో తెలుగు, మలయాళ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రం హిందీ, కన్నడ, తమిళ భాషల్లో 2024లో రిలీజ్ కానుంది.

వాస్తవ ప్రేమకథ


● ఆముద శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్

ఆముద శ్రీనివాస్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'నా.. నీ ప్రేమకథ'. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా నటించారు. పోత్నాక్ శ్రవణ్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో ఆముద శ్రీనివాస్ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కించిన చిత్రం ఇది. పేపర్‌బాయ్, డాక్టర్‌ల ప్రేమకథ ఈ చిత్రం. ప్రేమ ఎలా అయినా పుట్టొచ్చు అనే అంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం'' అన్నారు. ''చాలా మంచి సినిమా. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు పోత్నాక్ శ్రవణ్‌కుమార్. ఈ కార్యక్రమంలో నిర్మాతలు ప్రసన్న కుమార్, ప్రతాని రామకృష్ణ గౌడ్, శోభారాణి మాట్లాడారు.

వినాయక చవితికి...


● విశాల్

విశాల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మార్క్ ఆంటోని'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్. ఎస్‌జే సూర్య, సునీల్, సెల్వ రాఘవన్ ముఖ్య పాత్రలు పోషించారు. ఎస్. వినోద్ కుమార్ నిర్మించిన ఈ సినిమా వినాయక చవితి కానుకగా సెప్టెంబర్ 15న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఐ లవ్ యూ నే..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటను రామ్ మిరియాల పాడారు. ''హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'మార్క్ ఆంటోని'. ఈ చిత్రంలో విశాల్ లుక్ సరికొత్తగా ఉంటుంది. 'ఐ లవ్ యూ నే..' పాటలో హీరోహీరోయిన్ల మాస్ స్టెప్స్, అందుకు తగ్గట్టుగా వస్తున్న ఫాస్ట్ బీట్ ఆకట్టుకుంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

ఇది ప్రజలు గెల్చుకున్న అవార్డు – నిర్మాత అభిషేక్ అగర్వాల్



''ది కశ్మీర్ ఫైల్స్' సినిమాకి 69వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో రెండు అవార్డులు దక్కినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది ప్రజల సినిమా.. దేశ ప్రజలు ఈ అవార్డు గెలుచుకున్నారు'' అని నిర్మాత అభిషేక్ అగర్వాల్ అన్నారు. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, దర్శన్ కుమార్, పల్లవీ జోషి కీలక పాత్రల్లో వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వం వహించిన చిత్రం 'ది కశ్మీర్ ఫైల్స్'. గత ఏడాది మార్చి 11న ఈ సినిమా విడుదలైంది. 69వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ జాతీయ సమగ్రతా చిత్రం, ఉత్తమ సహాయ నటిగా పల్లవి జోషి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా చిత్రనిర్మాతల్లో ఒకరైన అభిషేక్ అగర్వాల్ విలేకరులతో మాట్లాడుతూ– ''వివేక్ అగ్నిహోత్రిగారికి, పల్లవి జోషీగారికి, 'ది కశ్మీర్ ఫైల్స్' కోసం పని చేసిన అందరికీ ధన్యవాదాలు. ఈ చిత్రాన్ని ప్రజలు గొప్పగా ఆదరించారు. దేశ ప్రజలకు, కశ్మీర్ పండిట్లందరికీ ఈ పురస్కారాల్ని అంకితమిస్తున్నాం. అలాగే జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్‌గారు ఎంపికవడం చాలా ఆనందంగా ఉంది. 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాకి ఆరు అవార్డులు, బుచ్చిబాబు సన, చంద్రబోస్ గారికి అవార్డులు రావడం హ్యాపీ. ప్రస్తుతం రవితేజగారితో మేం నిర్మిస్తున్న 'టైగర్ నాగేశ్వర రావు' చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అక్టోబర్ 20న విడుదల చేస్తాం. ఈ చిత్రానికి కూడా జాతీయ అవార్డు రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు.


● జాన్వీ

డీ గ్లామరస్ ఎంట్రీ

ఇక్కడున్న జాన్వీ కపూర్ ఫోటో చూశారుగా.. ఎంత గ్లామరస్‌గా ఉన్నారో కదా. ఈ బ్యూటీ తెలుగు తెరపై కనిపించే సమయం ఆసన్నమైంది. అయితే ఆమె తెలుగు ఎంట్రీ ఇక్కడ ఫొటోలో కనిపించేంత గ్లామరస్‌గా మాత్రం ఉండదట. ఇంతకీ విషయం ఏంటంటే... 'దేవర' చిత్రంతో జాన్వీ తెలుగు చలన చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో మత్స్యకారుల కుటుంబానికి చెందిన యువతిగా, డీ గ్లామరస్‌గా జాన్వీ పాత్ర ఉంటుందని ప్రచారం జరుగుతోంది. కాగా జాన్వీ పాత్రలో కొద్దిపాటి యాక్షన్ సన్నివేశాలు కూడా ఉన్నాయని తెలిసింది. 'దేవర' షూటింగ్‌లో ఆల్రెడీ జాన్వీ కపూర్ పాల్గొన్నారు. ఆ షెడ్యూల్‌లో ఆమెపై చిన్నపాటి యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరిగిందని సమాచారం. మళ్లీ సెప్టెంబరులో జరిగే 'దేవర' షెడ్యూల్‌లో పాల్గొననున్నట్లుగా జాన్వీ కపూర్ ఇటీవల ఓ సందర్భంలో పేర్కొన్నారు. ఇక 'జనతా గ్యారేజ్' తర్వాత ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ తెరకెక్కిస్తున్న 'దేవర' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని కె. హరికృష్ణ, కల్యాణ్‌రామ్, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్నారు.

ఘోస్ట్.. డేట్ ఫిక్స్


● శివ రాజ్‌కుమార్

కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ అక్టోబర్‌లో 'ఘోస్ట్' సినిమాతో థియేటర్లకు రానున్నారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'ఘోస్ట్'. శ్రీని (బీర్బల్) దర్శకత్వంలో సందేశ్ నాగరాజ్ పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో అక్టోబర్ 19న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ''హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా 'ఘోస్ట్' రూపొందింది. అక్టోబర్ రెండో వారం నుంచి దేశవ్యాప్తంగా ఈ సినిమా స్పెషల్ ప్రీమియర్స్ ప్లాన్ చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

యాక్షన్ థ్రిల్లర్


● విక్రాంత్

విక్రాంత్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'స్పార్క్ ఎల్.ఐ.ఎఫ్.ఈ'. మెహరీన్, రుక్సార్ థిల్లాన్ హీరోయిన్లుగా నటించారు. విక్రాంత్ డెఫ్ ఫ్రాగ్ ప్రొడక్షన్స్‌పై రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా హీరో–డైరెక్టర్ విక్రాంత్ మాట్లాడుతూ– ''సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. భావోద్వేగాలు, ప్రేమ, భారీ ఫైట్స్‌తో ఈ మూవీ రూపొందింది. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ అనుభూతినిచ్చే సినిమా ఇది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో నవంబర్ 17న ఈ సినిమాని రిలీజ్ చేస్తాం'' అన్నారు.

జీవితం ఇంతందంగా ఉంది


● తన్వి, దీపక్

బాలనటుడిగా పలు సినిమాల్లో నటించిన దీపక్ సరోజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. ఈ చిత్రాన్ని వి. యశస్వి దర్శకత్వంలో జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మిస్తున్నారు. రధన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'లైఫ్ ఈజ్ దిస్ బ్యూటిఫుల్..' (జీవితం ఇంతందంగా ఉంది) అంటూ సాగే పాటని నిర్మాత 'దిల్' రాజు విడుదల చేసి, పాట బాగుందని యూనిట్‌ని అభినందించారు. వి. యశస్వి సాహిత్యం అందించిన ఈ పాటని కార్తీక్, శ్రీనిషా జయశీలన్ పాడారు. తన్వి నేగి, నందిని, ఆనంద్, కల్యాణీ నటరాజన్, మాథ్యూ వర్గీస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె. నాయుడు, లైన్ ప్రొడ్యూసర్: బి. శ్యామ్ కుమార్.

గల్లీ క్రికెట్


● సరోజ్‌కుమార్

బండి సరోజ్ కుమార్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించనున్న చిత్రం 'పరాక్రమం'. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందనున్న ఈ చిత్రం ప్రీ టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ– ''గోదావరి జిల్లాలో లంపకలోవ గ్రామంలోని లోవరాజు అనే యువకుడి జీవితంలో జరిగే గల్లీ క్రికెట్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ప్రేమ, నాటక రంగ జీవితం, రాజకీయం.. వంటి అంశాలు ఉంటాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లో షూటింగ్ పూర్తి చేసి, వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న సినిమా రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కథ, ఎడిటర్, సంగీతం, నిర్మాణం–దర్శకత్వం: బండి సరోజ్ కుమార్.

సాక్షి బిజినెస్

శనివారం
26-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 366	64,887
నిఫ్టీ ▽ 121	19,266

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,483	△	18
డోజోన్స్	34,211	△	111
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,339	△	5
డాక్స్	15,632	△	10
షాంఘై	3,083	△	1
నికాయ్	31,624	▽	663

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (24 క్యారెట్)	58,200
బంగారం (22 క్యారెట్)	55,430
వెండి (కేజీ)	79,500

పేటీఎమ్‌లో వాటా విక్రయం

20.21 శాతానికి తగ్గిన యాంట్ గ్రూప్ వాటా

న్యూఢిల్లీ: చైనా ఫిన్‌టెక్ దిగ్గజం యాంట్ గ్రూప్ తాజాగా దేశీ డిజిటల్ పేమెంట్స్ దిగ్గజం వన్97 కమ్యూనికేషన్స్‌లో 3.58 శాతం వాటాను విక్రయించింది. అనుబంధ సంస్థ ద్వారా మొత్తం 2,27,54,823 షేర్లను దశలవారీగా అమ్మివేసింది. కంపెనీ ఈక్విటీలో 3.58 శాతం వాటాకు సమానమైన వీటిని ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 895.2 సగటు ధరలో విక్రయించింది. వెరసి యాంట్‌ఫిన్(నెదర్లాండ్స్) హోల్డింగ్ బీవీ ద్వారా పేటీఎమ్ బ్రాండు కంపెనీ వన్97లో రూ. 2,037 కోట్ల విలువైన వాటాను సొమ్ము చేసుకుంది. తాజా లావాదేవీ కారణంగా పేటీఎమ్‌లో యాంట్ గ్రూప్ వాటా 23.79 శాతం నుంచి 20.21 శాతానికి తగ్గింది.

బీఎస్‌ఈలో పేటీఎమ్ షేరు 0.5 శాతం క్షీణించి రూ. 899 వద్ద ముగిసింది.

జియో ఫిన్‌లో మోతీలాల్‌కు వాటా

3.72 కోట్ల షేర్ల కొనుగోలు

న్యూఢిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లను తాజాగా మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ కొనుగోలు చేసింది. వారాంతాన ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 3.72 కోట్ల షేర్లను సొంతం చేసుకుంది. ఇందుకు షేరుకి రూ. 202.8 సగటు ధరలో రూ. 754.41 కోట్లు వెచ్చించింది. ఎన్ఎస్ఈ బల్క్ డీల్ గణాంకాల ప్రకారం జియో ఫైనాన్షియల్ ఈక్విటీలో 0.6 శాతం వాటాను మోతీలాల్ ఓస్వాల్ ఫండ్ కొనుగోలు చేసింది. లిస్టింగ్ నాటి (సోమవారం) నుంచి వరుస నష్టాలను చవిచూస్తున్న జియో ఫైనాన్సియల్ సర్వీసెస్ షేరు తొలిసారి శుక్రవారం స్వల్ప లాభంతో గట్టెక్కింది. ట్రేడింగ్‌లో వరుసగా అయిదో రోజూ 5% నష్టపోయి రూ.203 వద్ద లోయర్ సర్క్యూట్‌ను తాకింది. అయితే చివర్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో కోలుకొని అరశాతం స్వల్ప లాభంతో రూ.214.50 వద్ద నిలిచింది.

జీఆర్‌టీ జ్యువెలర్స్‌కు ప్రతిష్టాత్మక గుర్తింపు

జీజేఈపీసీ ఇండస్ట్రీ లెజెండ్ అవార్డు

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలర్స్ సంస్థ జీఆర్‌టీ జ్యువెలర్స్‌ను ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. జ్యువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) ఇండస్ట్రీ లెజెండ్ అవార్డు లభించింది. గత అరవై ఏళ్లుగా శ్రేష్టమైన, సృజనాత్మక ఆభరణాల కోసం అలుపెరగకుండా మేము చేస్తున్న కృషికి దక్కిన గౌరవం ఈ అవార్డు అని సంస్థ ఎండీ ఆనంద్ అనంత్ పద్మనాభన్ అన్నారు. "వినియోగదారులు ఆనందంగా ఉంటే విజయం తప్పక లభిస్తుంది అని నమ్మి, అది సాధించడానికి మనసుపెట్టి పనిచేసిన దానికి ఇది రుజువు. మా కస్టమర్లకు, జీఆర్‌టీ కుటుంబ సభ్యులకు అవార్డును అంకితం చేస్తున్నాము" అని కంపెనీ మరో ఎండీ జీఆర్ రాధాకృష్ణన్ తెలిపారు.



ధరల కట్టడికే కేంద్రం ప్రాధాన్యత

ఆర్థిక మంత్రి సీతారామన్



బీ20 సదస్సుకు విచ్చేసిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో బీ20 ఇండియా చెయిర్, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, సీఐఐ ప్రెసిడెంట్ ఆర్ దినేష్

న్యూఢిల్లీ: సుస్థిర ఆర్థిక వృద్ధి సాధించే దిశగా ధరలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఆగస్టు 31న విడుదల కాబోయే తొలి త్రైమాసిక జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) గణాంకాలు మెరుగ్గా ఉండగలవని ఆశిస్తున్నట్లు బీ20 సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆమె చెప్పారు. టమాటాలు, ఇతర కూరగాయల ధరలు ఎగియడంతో జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 15 నెలల గరిష్ట స్థాయి 7.44 శాతానికి చేరిన నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, ఆర్థిక సంస్కరణల అమలును ప్రభుత్వం వేగవంతం చేస్తోందని నిర్మలా సీతారామన్ చెప్పారు. పెట్టుబడులకు ప్రభుత్వం బడ్జెట్‌లో గణనీయంగా కేటాయింపులు చేయడంతో ప్రైవేట్ రంగం నెమ్మదిగా ఇన్వెస్ట్ చేయడం ప్రారంభిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు.

ఏఐతో మరిన్ని ఉద్యోగాలు: చంద్రశేఖరన్

పైస్థాయి ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు అంతగా లేని వారికి కూడా కృత్రిమ మేధ (ఏఐ) తగు సాధికారత కల్పించగలదని బీ20 ఇండియా చెయిర్, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ చెప్పారు. ఏఐ నియంత్రణకు సంబంధించి లక్ష్యాలు, సూత్రాలపై స్పష్టత అవసరమని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్ అభిప్రాయపడ్డారు. ఏఐతో ఉత్పాదకత మరింత పెరగగలదని ఐబీఎం సీఈవో అరవింద్ కృష్ణ చెప్పారు. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జీఏ) ప్రయోజనాలను పూర్తి స్థాయిలో కనుగొనేందుకు వాటిని ఉపయోగించే సంస్థలు స్వీయ నియంత్రణను పాటించాల్సి ఉంటుందని మాస్టర్‌కార్డ్ సీఈవో మీబాక్ అభిప్రాయపడ్డారు. భారత్ తీర్చిదిద్దిన డిజిటల్ మౌలిక సదుపాయాలకు తాను అభిమానిగా మారానని ఎడోబ్ సీఈవో శంతను నారాయణ్ చెప్పారు.

ఎలక్ట్రిక్ కార్ తెస్తున్నాం: సజ్జన్ జిందాల్

జేఎస్‌డబ్ల్యు గ్రూప్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ విభాగంలోకి ఎంట్రీ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం ఎంజీ మోటార్ ఇండియాతో చర్చలు జరుపుతోంది. ఈ ప్రణాళిక కార్యరూపంలోకి రాకపోతే సొంతంగానూ ఎలక్ట్రిక్ కార్లను అభివృద్ధి చేయడానికి కసరత్తు చేస్తున్నట్టు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ బీ20 సమ్మిట్‌లో పేర్కొన్నారు.

19,300 దిగువకు నిఫ్టీ

- సెన్సెక్స్ నష్టం 366 పాయింట్లు
- వడ్డీ రేట్ల పెంపు ఆందోళనలు



ముంబై: వడ్డీ రేట్ల పెంపు ఆందోళనలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన ప్రతికూలతల ప్రభావంతో స్టాక్ సూచీలు రెండో రోజూ నష్టపోయాయి. జాక్సన్ హోల్ ఎకనామిక్ సింపోజియంలో యూఎస్ ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగానికి ముందు అప్రమత్తత చోటు చేసుకుంది. ఉదయం సెన్సెక్స్ 251 పాయింట్ల నష్టంతో 65,001 వద్ద, నిఫ్టీ 90 పాయింట్ల పతనమై 19,297 వద్ద మొదలయ్యాయి. సూచీలు రోజంతా నష్టాల్లోనే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 519 పాయింట్లు క్షీణించి 64,732 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ సైతం 157 పాయింట్లు కోల్పోయి 19,297 స్థాయికి దిగివచ్చింది. సెన్సెక్స్ 366 పాయింట్లు నష్టపోయి 64,887 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121 పాయింట్లు క్షీణించి 19,266 వద్ద నిలిచింది. ఇన్వెస్టర్లు రూ.1,414 కోట్ల షేర్లను కొన్నారు. రూపాయి విలువ 13 పైసలు క్షీణించి 82.69 స్థాయి వద్ద స్థిరపడింది. వరుసగా అయిదో వారమూ సూచీలు నష్టాలు మూటగట్టుకున్నాయి. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 61 పాయింట్లు, నిఫ్టీ 44 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.

- కంపెనీ ఎండీ, సీఈవో వేణుగోపాల్ జీ నాయర్ రాజీనామా ప్రకటనతో బీఎస్ఈలో షాపర్స్ స్టాప్ షేరు 13% నష్టపోయి 709 వద్ద ముగిసింది. రాజీనామా ఈ ఆగస్టు 31 తర్వాత నుంచి అమల్లోకి రానుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-8-2023	
విశాఖ	480-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
25-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	435-00
వరంగల్	437-00
రిటైల్ ధర	4.95

30 శాతానికి మార్కెట్ వాటా

తెలుగు రాష్ట్రాల్లో గోద్రెజ్ ఇంటీరియో ప్రణాళిక



దేవ్ సర్కార్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫర్నిచర్, ఇంటీరియర్స్ సర్వీసుల సంస్థ గోద్రెజ్ ఇంటీరియో 2026 ఆర్థిక సంవత్సరానికల్లా తెలుగు రాష్ట్రాల్లో తమ మార్కెట్ వాటాను 30 శాతానికి, ఆదాయాన్ని రూ. 100 కోట్లకు పెంచుకోవాలని నిర్దేశించుకుంది. ప్రస్తుతం మార్కెట్ వాటా 25 శాతంగాను, ఆదాయాలు సుమారు రూ. 70 కోట్లుగాను ఉన్నాయి. అలాగే అప్పటికల్లా దక్షిణాది మార్కెట్లో ఆదాయాన్ని రూ. 275 కోట్ల నుంచి రూ. 350 కోట్లకు పెంచుకోనున్నట్లు సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (బీ2సీ విభాగం) దేవ్ సర్కార్ విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 40 ఔట్‌లెట్స్ ఉండగా, రాబోయే ఆరు నెలల్లో మరో 25 పైచిలుకు స్టోర్స్‌ను తెరవనున్నట్లు ఆయన చెప్పారు. పలు రియల్ ఎస్టేట్ సంస్థలతో కూడా జత కట్టినట్లు పేర్కొన్నారు. ఫర్నిచర్ కోసం తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్‌లో ఆర్డరు చేసే ధోరణి గణనీయంగా ఉంటోందన్నారు.

యూనికార్న్‌గా జెప్టో



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆన్‌లైన్ గ్రాసరీ కంపెనీ జెప్టో తాజాగా రూ.1,653 కోట్ల నిధులను సమీకరించింది. యూఎస్‌కు అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ స్టెప్‌స్టోన్ గ్రూప్, గుడ్ వాటర్ క్యాపిటల్, ప్రస్తుత ఇన్వెస్టర్ల నుంచి ఈ మొత్తాన్ని అందుకుంది. తాజా డీల్ ద్వారా జెప్టోను రూ.11,580 కోట్లుగా విలువ కట్టారు. తద్వారా యూనికార్న్ జాబితాలో జెప్టో చేరిపోయింది. ఈ జాబితాలో 2023లో చోటు సంపాదించుకున్న తొలి స్టార్టప్ ఇదే. భారత కంపెనీల్లో 11 నెలల విరామం తరువాత యూనికార్న్‌గా జెప్టో అవతరించింది.

ఐహెచ్‌హెచ్ చేతికి గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్

డీల్ విలువ రూ.740 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల్లో ఉన్న గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్ పూర్తిగా ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్ పరం కానుంది. రవీంద్రనాథ్ జీఈ మెడికల్ అసోసియేట్స్‌లో రవీంద్రనాథ్ కంచర్ల, ఇతరులకు ఉన్న మిగిలిన వాటాను కొనుగోలు చేసేందుకు మలేషియాకు చెందిన హాస్పిటల్స్ చెయిన్ ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్ అనుబంధ కంపెనీ గ్లెనీగల్స్ డెవలప్‌మెంట్ చేతులు కలిపింది. డీల్ విలువ రూ.740 కోట్లు. డిసెంబరుకల్లా కొనుగోలు ప్రక్రియ పూర్తి కానుంది. ఐహెచ్‌హెచ్ 2015లో రూ.1,284 కోట్లు వెచ్చించి గ్లోబల్ హాస్పిటల్స్‌లో 73.4 శాతం వాటాను దక్కించుకుంది. డాక్టర్ రవీంద్రనాథ్ 1999లో గ్లోబల్ హాస్పిటల్స్‌ను ప్రారంభించారు. సంస్థకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబైలో మొత్తం ఆరు ఆసుపత్రులు ఉన్నాయి. పడకల సామర్థ్యం 1,500 ఉంది. ఐహెచ్‌హెచ్ 10 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.

సాక్షి స్పోర్ట్స్

ఆసియా క్రీడలకు 634 మంది

చైనాలో హాంగ్జౌలో సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు జరిగే ఆసియా క్రీడలకు భారత్ 634 మందితో భారీ బృందాన్ని పంపించనుంది. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ 38 క్రీడాంశాల్లో ఈ బృందానికి అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. 2018లో జకార్తాలో జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ నుంచి 572 మంది పాల్గొన్నారు.

14 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు గెలిచిన పతకాల సంఖ్య. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు (1 స్వర్ణం, 2 రజతాలు, 2 కాంస్యాలు), సైనా నెహ్వాల్ (1 రజతం, 1 కాంస్యం), పురుషుల సింగిల్స్‌లో ప్రకాశ్ పదుకొనే (1 కాంస్యం), సాయిప్రణీత్ (1 కాంస్యం), కిడాంబి శ్రీకాంత్ (1 రజతం), లక్ష్య సేన్ (1 కాంస్యం), గుత్తా జ్వాల-అశ్విని పొన్నప్ప (1 కాంస్యం), సాత్విక్-చిరాగ్ శెట్టి (1 కాంస్యం) ఈ జాబితాలో ఉన్నారు. ప్రణయ్ సెమీస్‌లో ఓడితే కాంస్య పతకం దక్కుతుంది. ఫైనల్ చేరి గెలిస్తే స్వర్ణ పతకం, ఓడితే రజత పతకం లభిస్తుంది. 2011 నుంచి ప్రతి ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు పతకాలు సాధిస్తుండటం విశేషం.

నీరజ్ మెరిసె...

మొదటి ప్రయత్నంలోనే ఫైనల్ బెర్త్ ఖరారు

పారిస్ ఒలింపిక్స్‌కూ అర్హత ● మనూ, కిశోర్ కూడా ఫైనల్‌కు
తొలిసారి ఒకే ఈవెంట్ ఫైనల్లో ముగ్గురు భారత అథ్లెట్లు



మనూ



కిశోర్



నీరజ్

బుడాపెస్ట్ (హంగేరి): కొన్నేళ్లుగా అంతర్జాతీయ అథ్లెటిక్స్ వేదికపై భారత ముఖచిత్రంగా మారిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మరోసారి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయలేదు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకమే లక్ష్యంగా బరిలోకి దిగిన నీరజ్ చోప్రా తొలి అడ్డంకిని విజయవంతంగా అధిగమించాడు. శుక్రవారం జరిగిన క్వాలిఫయింగ్‌లో నీరజ్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. తన మొదటి ప్రయత్నంలోనే ఈటెను ఏకంగా 88.77 మీటర్ల దూరం విసిరిన నీరజ్ ఆదివారం జరిగే ఫైనల్‌కు అర్హత సాధించాడు. అంతేకాకుండా పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణాన్ని (85.50 మీటర్లు) కూడా దాటేసి వచ్చే ఏడాది జరిగే విశ్వ క్రీడలకు బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. శుక్రవారం జరిగిన క్వాలిఫయింగ్‌లో 12 మంది బరిలో ఉన్న గ్రూప్ 'ఎ'లో నీరజ్ పోటీపడ్డాడు. మైదానంలోని అభిమానులు ఉత్సాహపరుస్తుండగా నీరజ్ జావెలిన్‌ను 88.77 మీటర్ల దూరం విసిరి ఒక్క త్రోతో రెండు లక్ష్యాలను సాధించాడు. జావెలిన్‌ను 83 మీటర్ల దూరం విసిరిన వారు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తారు లేదా టాప్-12లో నిలిచిన వారికి ఫైనల్ చేరే అవకాశం లభిస్తుంది. నీరజ్ తప్ప గ్రూప్ 'ఎ' నుంచి మరెవరూ నేరుగా ఫైనల్ చేరలేకపోయారు. గ్రూప్ 'ఎ'లోనే పోటీపడ్డ మరో భారత అథ్లెట్ డీపీ మనూ (81.31 మీటర్లు)... గ్రూప్ 'బి'లో బరిలో నిలిచిన కిశోర్ కుమార్ జేనా (80.55 మీటర్లు) కూడా ఫైనల్‌కు చేరారు. ఓవరాల్‌గా మనూ ఆరో స్థానంలో, కిశోర్ తొమ్మిదో స్థానంలో నిలిచారు. ఫలితంగా ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో తొలిసారి ఒకే ఈవెంట్‌లో ముగ్గురు భారత అథ్లెట్లు ఫైనల్లో పోటీపడనున్నారు. నీరజ్‌తోపాటు అర్షద్ నదీమ్ (పాకిస్తాన్; 86.79 మీటర్లు), జాకుబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్; 83.50 మీటర్లు) మాత్రమే క్వాలిఫయింగ్ మార్క్‌ను అధిగమించి నేరుగా ఫైనల్ చేరారు. డిఫెండింగ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా; 78.49 మీటర్లు) ఓవరాల్‌గా 16వ స్థానంలో నిలిచి ఫైనల్ చేరలేకపోయాడు.

ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్, ఆసియా చాంపియన్‌షిప్, టోక్యో ఒలింపిక్స్, డైమండ్ లీగ్ మీట్ లాంటి ప్రతిష్టాత్మక ఈవెంట్స్‌లో స్వర్ణ పతకాలు గెలిచిన 25 ఏళ్ల నీరజ్ ఖాతాలో ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణ పతకం మాత్రమే చేరాల్సి ఉంది. గత ఏడాది అమెరికాలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఈ హరియాణా జావెలిన్ త్రోయర్ రెండో స్థానంలో నిలిచి రజత పతకం గెల్చుకున్నాడు. అంతా అనుకున్నట్లు జరిగితే ఆదివారం జరిగే ఫైనల్లో నీరజ్‌ను ఈసారి విశ్వవిజేతగా చూడవచ్చు.

ప్రణయ్ ప్రతాపం

ప్రపంచ నంబర్‌వన్, వరల్డ్ చాంపియన్, ఒలింపిక్స్ విజేత అక్సెల్‌సన్‌పై సంచలన విజయం
తొలిసారి సెమీస్‌లోకి ● ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పతకం ఖరారు

దశాబ్దకాలంగా భారత అగ్రశ్రేణి షట్లర్‌గా కొనసాగుతున్న హెచ్‌ఎస్ ప్రణయ్ ఎట్టకేలకు విశ్వవేదికపై తన సత్తా చాటుకున్నాడు. అత్యంత ప్రతిభావంతుడైనప్పటికీ నిలకడలేమితో ఇన్నాళ్లూ అందని ద్రాక్షగా ఊరించిన ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం తొలిసారి ప్రణయ్ మెడలో పడనుంది. 2021, 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగి పతకానికి చేరువై దూరమైన ఈ కేరళ స్టార్ మూడో ప్రయత్నంలో మాత్రం అసాధారణ ఆటతీరుతో సక్సెస్ సాధించాడు. ప్రపంచ నంబర్‌వన్, టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, ప్రపంచ చాంపియన్, యూరోపియన్ చాంపియన్ అయిన డెన్మార్క్ స్టార్ విక్టర్ అక్సెల్‌సన్‌ను అతని సొంతగడ్డపైనే ఓడించి ప్రణయ్ తన కెరీర్‌లోనే చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. ఈ మెగా ఈవెంట్‌లో తొలిసారి సెమీఫైనల్ చేరిన ప్రణయ్ కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకున్నాడు.



ప్రణయ్



అక్సెల్‌సన్

కోపెన్‌హాగెన్ (డెన్మార్క్): ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ మరో అద్భుతం చేశాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకున్నాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 13-21, 21-15, 21-16తో టాప్ సీడ్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)ను ఓడించాడు. నేడు జరిగే సెమీఫైనల్లో కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్)తో ప్రణయ్ ఆడతాడు.

అక్సెల్‌సన్‌తో 68 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో ప్రణయ్ తొలి గేమ్‌ను చేజార్చుకున్నా నిరాశపడకుండా పట్టుదలతో ఆడి వరుసగా రెండు గేమ్‌లు గెలిచి ముందంజ వేశాడు. సొంతగడ్డపై జరుగుతున్న మెగా ఈవెంట్‌లో ప్రణయ్ ధాటికి అక్సెల్‌సన్‌కు అనూహ్య పరాజయం తప్పలేదు. తొలి గేమ్ కోల్పోయిన ప్రణయ్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, మరో కోచ్ గురుసాయిదత్ సూచనలతో తన వ్యూహం మార్చుకున్నాడు. సుదీర్ఘ ర్యాలీలు ఆడుతూ, అడపాదడపా కళ్లు చెదిరే స్మాష్‌లతో ప్రణయ్ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టి అనవసర తప్పిదాలు చేసేలా చేశాడు. రెండో గేమ్‌లో స్కోరు 13-10 వద్ద ప్రణయ్ వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి 17-10తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే ఊపులో రెండో గేమ్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచాడు. మూడో గేమ్‌లోనూ ప్రణయ్ దూకుడు కొనసాగిస్తూ అక్సెల్‌సన్‌పై ఒత్తిడి పెంచాడు. స్కోరు 7-6 వద్ద ప్రణయ్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి 13-6తో ముందంజ వేశాడు. ఆ తర్వాత అక్సెల్‌సన్ తేరుకునే ప్రయత్నం చేసినా ప్రణయ్ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఆడుతూ విజయం అందుకున్నాడు.

సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి

పురుషుల డబుల్స్ విభాగం నుంచి ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) నిష్క్రమించింది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 18-21, 19-21తో ప్రపంచ 11వ ర్యాంక్ జంట కిమ్ అస్ట్రుప్-ఆండెర్స్ స్కారప్ రస్ముసెన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడిపోయింది. గత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గి చరిత్ర సృష్టించిన సాత్విక్-చిరాగ్ ద్వయం ఈసారి అలాంటి ఫలితాన్ని పునరావృతం చేయలేకపోయింది.

'ఇంకా ఎన్నో గెలవాలి'

ప్రజ్ఞానంద ప్రదర్శనపై తల్లి వ్యాఖ్య



బాకు (అజర్‌బైజాన్): ప్రపంచకప్‌లో ఫైనల్ చేరిన సంచలనం సృష్టించిన భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద ప్రదర్శనపై అతని తల్లి నాగలక్ష్మి సంతోషం వ్యక్తం చేసింది. అతని కెరీర్ ఆరంభం నుంచి అన్నింటా తోడుగా ఉంటూ వచ్చిన నాగలక్ష్మి వరల్డ్ కప్‌లోనూ ప్రజ్ఞానంద వెన్నంటే నిలిచింది. అతను ఫైనల్ చేరడంతో పాటు క్యాండిడేట్స్ టోర్నీకి కూడా అర్హత సాధించడం గొప్పగా అనిపిస్తోందన్న ఆమె... తన కొడుకు ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని వ్యాఖ్యానించింది. 'ప్రపంచకప్‌లో ప్రజ్ఞానంద ఫైనల్ వరకు రావడం చాలా సంతోషంగా ఉంది. పైగా క్యాండిడేట్స్‌కు అర్హత సాధించడం దానిని రెట్టింపు చేసింది. అతను మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలి. అర్జున్‌తో క్వార్టర్ ఫైనల్ జరుగుతున్నప్పుడు ప్రజ్ఞ ఏం చేస్తున్నాడనే ఉత్కంఠతోనే అలా చూస్తూ ఉండిపోయాను. అప్పుడే నాకు తెలియకుండా కొందరు నా ఫోటోలు తీశారు. అవే జనంలోకి వెళ్లాయి. చివరకు ఆ మ్యాచ్‌లో మా అబ్బాయి గెలిచాడు' అని నాగలక్ష్మి గుర్తు చేసుకుంది.

ఫైనల్లో కోస్టల్ రైడర్స్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌లో కోస్టల్ రైడర్స్ జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్ జట్ల మధ్య క్వాలిఫయర్-1 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దాంతో లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచిన కోస్టల్ రైడర్స్ జట్టు ఫైనల్ చేరింది. రాయలసీమ కింగ్స్, గోదావరి టైటాన్స్ మధ్య నేడు జరిగే క్వాలిఫయర్-2లో గెలిచిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో కోస్టల్ రైడర్స్ జట్టుతో ఆడుతుంది. శుక్రవారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్ ఏడు వికెట్లతో ఉత్తరాంధ్ర లయన్స్‌పై నెగ్గింది.

ఒక్కో అంతర్జాతీయ మ్యాచ్‌కు రూ.4.20 కోట్లు!

బీసీసీఐ టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులు చేజిక్కించుకున్న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్

ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఖాతాలో కొత్త టైటిల్ స్పాన్సర్‌షిప్ ద్వారా వచ్చే మూడేళ్లలో రూ. 235 కోట్లు చేరనున్నాయి. ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్ అయిన 'ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్' బోర్డు మ్యాచ్‌ల టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులు సొంతం చేసుకుంది. బీసీసీఐ నిర్వహించబోయే అంతర్జాతీయ (సీనియర్ పురుషుల, మహిళల) మ్యాచ్‌లతో పాటు దేశవాళీ టోర్నీలు, అండర్-19, అండర్-23 టోర్నీలకు ఈ హక్కులు వర్తిస్తాయి. కొత్త ఒప్పందం ప్రకారం ఐడీఎఫ్‌సీ ఒక్కో అంతర్జాతీయ మ్యాచ్‌కు బీసీసీఐకి రూ. 4 కోట్ల 20 లక్షలు చెల్లిస్తుంది. మూడేళ్ల వ్యవధిలో మొత్తం 56 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరుగుతాయి. వచ్చే నెలలో ఆస్ట్రేలియాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌తో మొదలయ్యే ఒప్పందం 2026 ఆగస్టు వరకు అమల్లో ఉంటుంది. తాజా ఒప్పందానికి ముందు వరకు 'మాస్టర్ కార్డ్' ఒక్కో మ్యాచ్‌కు రూ.3 కోట్ల 80 లక్షలు చెల్లించింది.

భారత షూటర్లకు 4 పతకాలు

బాకు: ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో శుక్రవారం భారత్‌కు నాలుగు పతకాలు దక్కాయి. మహిళల 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో టియానా, సాక్షి సూర్యవంశీ, కిరణ్‌దీప్ కౌర్‌లతో కూడిన భారత బృందం 1573 పాయింట్లతో పసిడి పతకం గెలిచింది. వ్యక్తిగత విభాగంలో టియానా 533 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెల్చుకుంది. పురుషుల 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో రవీందర్ సింగ్, విక్రమ్ షిండే, కమల్జీత్ బృందం 1646 పాయింట్లతో కాంస్యం కైవసం చేసుకుంది. వ్యక్తిగత విభాగంలో రవీందర్ సింగ్ 556 పాయింట్లతో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు.

క్లుప్తంగా...

నేడు, రేపు వానలు

- కోస్తాంధ్రలో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం
- రాష్ట్రంపై నైరుతి, పశ్చిమ గాలుల ప్రభావం



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వర్షాలు కురవడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. ప్రస్తుతం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు ఉన్న ఉత్తర–దక్షిణ ద్రోణి బలహీనపడింది. మరోవైపు దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో శనివారం ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రలో అనేకచోట్ల, ఆదివారం కొన్నిచోట్ల, రాయలసీమలో శని, ఆదివారాల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం రాత్రి నివేదికలో తెలిపింది. అదే సమయంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు కూడా సంభవించవచ్చని పేర్కొంది. కాగా.. శుక్రవారం ఉత్తరాంధ్రలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. విజయనగరం జిల్లా వెలివాడలో 9.8 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో 8.5, సంతబొమ్మాళిలో 7.9, గరికిపాలెంలో 7.1, తులుగులో 6.8, ఎచ్చెర్లలో 6.3, గొట్టా బ్యారేజి (శ్రీకాకుళం) వద్ద 6.1, విజయనగరం జిల్లా పూసపాటిరేగలో 6.2, విజయనగరంలో 5.3, విశాఖ జిల్లా భీమునిపట్నంలో 4.6, ఆనందపురంలో 4.1 సెం.మీ. చొప్పున వర్షం కురిసింది.

హత్య కేసులో నలుగురికి యావజ్జీవం

- మరో ఆరుగురికి మూడేళ్ల జైలుశిక్ష



అద్దంకి: గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రత్యర్థిని హత్య చేసిన కేసులో నలుగురికి యావజ్జీవ కారాగార శిక్ష, ఆరుగురికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ప్రకాశం జిల్లా ఒంగోలు ఎనిమిదో ఏడీజే కోర్టు న్యాయమూర్తి డి.అమ్మనరాజా శుక్రవారం తీర్పు వెలువరించారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటనలో వివరాలు విడుదల చేశారు. 2009 ఏప్రిల్ నెల 23న ఎన్నికల సందర్భంగా బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని పేరాయిపాలెం గ్రామంలో ఓటు వేసే విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవలో చెన్నుపాటి రమేష్ అనే వ్యక్తిపై ప్రత్యర్థి పార్టీకి చెందిన జాగర్లమూడి సత్యనారాయణ, జాగర్లమూడి శ్రీను, జాగర్లమూడి నాగేశ్వరరావు, మన్నం రామాంజనేయులు, కొర్రపాటి వెంకటేశ్వర్లు, చెన్నుపాటి చిన్న శ్రీనివాసరావు, అనపర్తి నెల్సన్‌రావు, పుట్టా శ్రీనివాసరావు, వలేటి శ్రీనివాసరావు, వలేటి సుబ్బారావు మూకుమ్మడిగా దాడిచేసి హత్య చేశారు. ఘటనపై మర్రిపూడి ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అద్దంకి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అదే ఏడాది ఏప్రిల్ 28న నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. కోర్టులో నిందితులపై నేరం రుజువు కావడంతో పదిమంది నిందితుల్లో జాగర్లమూడి సత్యనారాయణ, జాగర్లమూడి శ్రీను, జాగర్లమూడి నాగేశ్వరరావు, మన్నం రామాంజనేయులకు జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా, మిగిలిన ఆరుగురికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి డి.అమ్మనరాజా తీర్పునిచ్చారు.

రాష్ట్రానికి ప్రతిష్టాత్మక జైవిక్ ఇండియా అవార్డు

పెద్ద ఎత్తున ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్నందుకు గుర్తింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వానికి మరో ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రకృతి సాగు, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నందుకు జైవిక్ ఇండియా అవార్డు దక్కింది. ఈ మేరకు ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ (ఐసీసీవోఏ) సంస్థ 2023కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి జైవిక్ ఇండియా అవార్డును ప్రకటించింది. జాతీయ స్థాయిలో 10 విభాగాల్లో 51 అవార్డులను వెల్లడించగా.. ఇందులో రాష్ట్రానికి 3 అవార్డులు దక్కడం విశేషం. పల్నాడు జిల్లా అమరావతి మండలం అత్తలూరుకు చెందిన అత్తలూరుపాలెం ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (ఎఫ్‌పీవో)తో పాటు బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం చిమటావారిపాలెంకు చెందిన గనిమిశెట్టి పద్మజ కూడా జైవిక్ ఇండియా అవార్డులకు ఎంపికయ్యారు. వీటిని సెప్టెంబర్ 7న ఢిల్లీలో జరిగే 'బయోఫాక్ ఇండియా నేచురల్స్ ఎక్స్‌పో'లో ప్రదానం చేయనున్నారు.

ప్రకృతి సాగులో ఏపీ బహు బాగు..



అవార్డు పొందిన మహిళా రైతు పద్మజ

కాగా రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ఉద్యమంలా సాగుతోంది. 700 గ్రామాల్లో 40 వేల మంది రైతులతో మొదలైన ఈ ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం పుష్కలంగా లభిస్తోంది. దీంతో ప్రకృతి సాగు ప్రస్తుతం 3,730 పంచాయతీల పరిధిలో విస్తరించింది. 9.40 లక్షల ఎకరాల్లో 8.5 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలో భాగస్వాములవుతున్నారు. ప్రకృతి, సేంద్రియ సాగులను ప్రోత్సహించేందుకు ఏపీ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీకి అనుబంధంగా ఏపీ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అలాగే ప్రస్తుత సీజన్ నుంచే గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (జీఏపీ) సర్టిఫికేషన్ జారీ చేయనుంది.

మహిళా రైతుకు జాతీయ అవార్డు..

ఉత్తమ ప్రకృతి వ్యవసాయ మహిళా కేటగిరీలో బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం చిమటావారిపాలెంకు చెందిన గనిమిశెట్టి పద్మజ జైవిక్ అవార్డుకు ఎంపికైంది. ఆమె గత నాలుగేళ్లుగా సేంద్రియ సమీకృత వ్యవసాయం చేస్తోంది. పద్మజ సేవలను గుర్తించి ఇటీవల రైతు సాధికార సంస్థ ఆమెను మోడల్ మేకర్‌గా ఎంపిక చేసింది. ఆమె తనకున్న ఎకరంలో ఏటా రూ.లక్షన్నర ఆదాయం ఆర్జిస్తోంది. అలాగే పశువుల పెంపకం ద్వారా రూ.60 వేలు, కషాయాల విక్రయాల ద్వారా మరో రూ.5 వేలు సంపాదిస్తోంది.

అత్యుత్తమ ఎఫ్‌పీవోగా.. అత్తలూరుపాలెం

రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీవో) కేటగిరీలో పల్నాడు జిల్లా అమరావతి మండలం అత్తలూరుకు చెందిన 'అత్తలూరుపాలెం ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (ఎఫ్‌పీవో)'కు జైవిక్ ఇండియా అవార్డు దక్కింది. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి మార్కెటింగ్ చేయడంలో ప్రావీణ్యం సంపాదించిన ఈ ఎఫ్‌పీవో పరిధిలో 400 మంది రైతులు ప్రకృతి సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో తమ గ్రామాల పరిధిలో ఇతర రైతులకు అవసరమయ్యే జీవ ఎరువులను అందజేస్తున్నారు. అంతేకాకుండా వారు పండించిన కూరగాయలు, అపరాలు, చిరు ధాన్యాలు, బియ్యం, వంట నూనెలు, పొడులు, పచ్చళ్లను మార్కెటింగ్ చేస్తున్నారు. అలాగే 70 దేశీ ఆవులతో ప్రత్యేకంగా ఆవుల పెంపకం కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఆవు పాలు, నెయ్యి, మజ్జిగలను కూడా మార్కెటింగ్ చేస్తున్నారు. రైతులు మార్కెట్ ధర కంటే అధిక ఆదాయం పొందేలా ఎఫ్‌పీవో కృషి చేస్తోంది. అంతేకాకుండా ప్రకృతి సాగు చేసే రైతులకు అవసరమయ్యే శిక్షణ కూడా అందిస్తోంది. అలాగే ఆర్గానిక్ ఫుడ్స్ పేరుతో గుంటూరు విద్యానగర్‌లో హోటల్‌ను సైతం నడుపుతోంది. గుంటూరు, విజయవాడల్లో ప్రత్యేక స్టోర్‌ల ద్వారా ఆర్గానిక్ ఉత్పత్తులను కూడా విక్రయిస్తోంది.

ఆదర్శంగా తీసుకున్న పలు రాష్ట్రాలు..



ఏపీలో ఉద్యమంలా సాగుతున్న ప్రకృతి సాగును కేంద్ర ప్రభుత్వంతోపాటు పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయి. ప్రకృతి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు రైతు బజార్లలో ప్రభుత్వం ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేసింది. అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో వీక్లీ మార్కెట్ల ద్వారా కూడా ప్రోత్సాహం అందజేస్తోంది. ఈ క్రమంలో ప్రకృతి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు ముందుకొచ్చిన అమూల్ ఆర్గానిక్స్‌తో త్వరలో అవగాహన ఒప్పందం కూడా కుదుర్చుకోనుంది. ఇలా దేశవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వాల కోటాలో ఏపీ ఉత్తమ ప్రభుత్వంగా నిలిచి జైవిక్ ఇండియా అవార్డుకు ఎంపికైంది.

రామోజీ చట్టాలకు అతీతుడా?

ఆయనకు రాజ్యాంగం వర్తించదా?

- 'చిట్‌ఫండ్స్, ఆర్థిక సంస్థల మోసాలు నివారణ' సదస్సులో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరావు
- మార్గదర్శి అక్రమాలకు కవచంలా ఈనాడు: ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు
- మార్గదర్శి కోసం సహకార వ్యవస్థను దెబ్బతీశారు: శిష్టా ధనలక్ష్మి
- సీఐడీ దర్యాప్తు చేయకూడదని ఎలా అంటారు?: ఆడిటర్ హనుమంతరావు
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేంద్రంగా నల్లధనం చలామణి: సైకం భాస్కరరావు
- మార్గదర్శిపై కఠిన చర్యలెందుకు తీసుకోలేకపోతున్నాం: అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు

సాక్షి, అమరావతి/ గాంధీనగర్ (విజయవాడ): కేంద్ర చిట్‌ఫండ్ చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ఈనాడు రామోజీరావుకు రాజ్యాంగం వర్తించదా? ఆయన చట్టాలకు అతీతుడా అని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ప్రశ్నించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల ప్రయోజనాలను కాపాడేందుకు సీఐడీతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా తక్షణం జోక్యం చేసుకోవాలని కోరారు. 'చిట్‌ఫండ్స్ సంస్థలు, ఆర్థిక సంస్థల మోసాలు – నివారణ చర్యలు' అనే అంశంపై ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్, ఫోరం ఫర్ బెటర్ సొసైటీ సంయుక్తంగా శుక్రవారం విజయవాడలో నిర్వహించిన అవగాహన సదస్సులో కొమ్మినేని శ్రీనివాసరావు ప్రసంగిస్తూ.. అన్ని రాష్ట్రాల్లో చిట్‌ఫండ్స్ సంస్థల మోసాలపై దర్యాప్తు సంస్థలు కఠిన చర్యలు తీసుకుంటుంటే తెలుగు రాష్ట్రాల్లో మాత్రం మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను ఎందుకు ఉపేక్షించాలని ప్రశ్నించారు. కేంద్ర చట్టాలు మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు వర్తించవా అని సామాన్యులకు సందేహం కలుగుతుండటం న్యాయ వ్యవస్థకు కూడా అపఖ్యాతి తెస్తుందని అన్నారు. రామోజీరావు తప్పు చేయలేదని భావిస్తే సీఐడీ దర్యాప్తునకు ఎందుకు సహకరించడంలేదని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ ఇలాంటి వాటిని నిశితంగా పరిశీలించి అడ్డుకట్ట వేయాలని కోరారు.

■ ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు మాట్లాడుతూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో సీఐడీ విచారణకు రామోజీరావు ఎందుకు హాజరుకాలేదని ప్రశ్నించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు రామోజీరావు ఈనాడు పత్రికను కవచంగా వాడుకుంటున్నారని విమర్శించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ వ్యాపార ప్రయోజనాల కోసం రాష్ట్రంలో సహకార వ్యవస్థను కుట్రపూరితంగా దెబ్బతీశారని శారదాంబ మహిళా సహకార బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ శిష్టా ధనలక్ష్మి చెప్పారు. ఆర్‌బీఐ ఆడిటింగ్ నిర్వహించే పటిష్ట వ్యవస్థ కలిగిన సహకార బ్యాంకులపై ఈనాడు పత్రిక ద్వారా దుష్ప్రచారం చేయించారన్నారు.

■ ప్రముఖ ఆడిటర్ మండలి హనుమంతరావు మాట్లాడుతూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ చట్ట విరుద్ధంగా డిపాజిట్లు సేకరిస్తోందని విమర్శించారు. చట్టాల అమలుకు అథారిటీ పోలీసు శాఖే అని, ఆ శాఖ ఆధ్వర్యంలోని సీఐడీ దర్యాప్తు చేయకూడదని అనడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దీనిపై మేధావులు ప్రజల్ని చైతన్య పరచాలన్నారు. కృష్ణా జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు సైకం భాస్కరరావు మాట్లాడుతూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేంద్రంగా నల్లధనం భారీగా చలామణి చేస్తున్నారని విమర్శించారు. నగదులోనే లావాదేవీలు నిర్వహిస్తూ ఆ పూర్తి మొత్తానికి కూడా రశీదులు ఇవ్వరని చెప్పారు.

■ న్యాయవాది అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్గదర్శి తరహాలోనే విజయవాడలో 15 ఏళ్ల క్రితం అక్రమాలకు పాల్పడిన సిరి గోల్డ్ వంటి సంస్థలను మూసివేయించారన్నారు. అంతకంటే భారీ మోసాలకు పాల్పడుతున్న మార్గదర్శిపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోలేకపోతున్నామో విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో ఫోరం ఫర్ బెటర్ సొసైటీ కో కన్వీనర్ ఎం.కోటేశ్వరరావు, పలువురు న్యాయవాదులు, ఆడిటర్లు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దొంగ ఓట్ల పాపం చంద్రబాబుదే

- టీడీపీ హయాంలో 60 లక్షల దొంగ ఓట్లు నమోదు
- వాటిని కాపాడుకోవడానికే చంద్రబాబు డ్రామా
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం

మడకశిర/హిందూపురం: రాష్ట్రంలో దొంగ ఓట్ల పాపం చంద్రబాబుదేనని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆయన శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా మడకశిరలో స్థానిక మాజీ ఎమ్మెల్యే దివంగత వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ 2018లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల దొంగ ఓట్లు నమోదయ్యాయని తెలిపారు. వారి హయాంలో నమోదు చేసిన దొంగ ఓట్లను కాపాడుకోవడానికే చంద్రబాబు ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. వీటిపై తాము కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఎంపీల బృందంతో పాటు రాష్ట్ర మంత్రుల బృందం కూడా ఢిల్లీకి వెళ్లి దొంగ ఓట్లపై ఈసీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మడకశిర ప్రాంతంలో వన్యప్రాణుల మృతిపై విచారణ చేయిస్తామని తెలిపారు. వన్యప్రాణుల మృతికి కారకులపై చర్యలు తీసుకుంటామన్నారు.



హిందూపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం, హిందూపురమూ మనవే: పెద్దిరెడ్డి

'కలసికట్టుగా పనిచేస్తే సాధించలేనిది ఏదీ లేదు. వచ్చే ఎన్నికల్లో కుప్పం మనదే. హిందూపురమూ మనదే...' అని పెద్దిరెడ్డి అన్నారు. హిందూపురంలోని బైపాస్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. టీఎన్ దీపిక, ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ మాట్లాడారు. ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, సిద్దారెడ్డి, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ రామచంద్ర, మునిసిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ పాల్గొన్నారు.

40 కోట్ల టన్నుల ఇసుక అక్రమ తవ్వకాలు

- మీడియా సమావేశంలో చంద్రబాబు



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్లలో రూ.40 వేల కోట్ల విలువైన ఇసుక దోపిడీకి పాల్పడ్డారని ప్రతిపక్ష నేత చంద్రబాబు ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇసుక దోపిడీపై పక్కా ఆధారాలతో ప్రశ్నిస్తున్నానని, 48 గంటల్లో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ ప్రభుత్వ ఇసుక దోపిడీపై పూర్తిగా విచారణ చేసి తప్పు చేసిన అధికారులను శిక్షిస్తామన్నారు. తమ హయాంలో ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువస్తే దానిని రద్దు చేశారని విమర్శించారు. ఇసుక తవ్వకాలను వైఎస్సార్‌సీపీ నేతలే జిల్లాల వారీగా సాగిస్తున్నారని తెలిపారు. ఏడాదికి 2 కోట్ల టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతించిన ఈ ప్రభుత్వం, యథేచ్ఛగా రీచ్‌లలో దోపిడీ చేసిందన్నారు. అధికారికంగా 110, అనధికారికంగా 500కిపైగా రీచ్‌లలో ఇసుక దోపిడీ జరిగిందని చెప్పారు. మొత్తంగా 40 కోట్ల టన్నులు తవ్వేశారని, టన్నుకి వెయ్యి చొప్పున రూ.40 వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించారు. సీఎం ఇంటికి కూతవేటు దూరంలో, రాజధాని ప్రాంతంలో చుట్టూ జనావాసాల మధ్యలో గుండిమెడలో 3 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ఈసీ లేకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కొన్ని వందల డంప్‌లలో లక్షలాది టన్నుల ఇసుకను అక్రమంగా నిల్వచేశారని తెలిపారు. ఎన్జీటీ స్పష్టంగా చెప్పినా, సుప్రీంకోర్టు ఆదేశించినా... ఎక్కడా ఇసుక తవ్వకాలు ఆగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలందరినీ ఇసుక డీలర్లుగా మార్చి, హోల్‌సేల్ దోపిడీకి తెరతీశారన్నారు. ఇసుకతోపాటు భూములు, గ్రానైట్, సిలికా, ఇతర ఖనిజ సంపదలన్నింటినీ ఊడ్చేస్తున్నారని విమర్శించారు. ఈ నెల 28వ తేదీన తాను ఢిల్లీ వెళుతున్నానని, ఎన్నికల సంఘాన్ని కలిసి రాష్ట్రంలో ఓట్ల తొలగింపులో జరుగుతున్న అక్రమాలపై విచారణ కోరతానని చంద్రబాబు తెలిపారు.

ఫారెస్ట్ అధికారిపై చర్యలకు ఓకే చెప్పిన హైకోర్టు

రంపపు కోత మిల్లుల వ్యవహారంలో చర్యలకు అనుమతి



సాక్షి, అమరావతి: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు స్థానిక సంస్థలపైనా ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమని, అడవులు, సరస్సులు, నదులు, అన్ని జీవరాశులను కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులు, ప్రభుత్వాలపై ఉందని పేర్కొంది. రంపపు కోత మిల్లులను అటవీ ప్రాంత పరిధి నుంచి తరలించే విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన నేపథ్యంలో కర్నూలు ఫారెస్ట్ రేంజ్ అధికారిగా పనిచేసిన చాణిక్యరాజు అనే అధికారిపై చట్ట ప్రకారం చర్యలు ప్రారంభించేందుకు ప్రభుత్వానికి హైకోర్టు అనుమతి ఇచ్చింది. చాణిక్యరాజుకు ఊరటనిస్తూ ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ (ఏపీఏటీ) 2017లో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ కుంభజడల మన్మథరావు ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారానికి ఆరు నెలల్లో తార్కిక ముగింపు తీసుకురావాలని సూచించింది.

భూముల జప్తుతో ప్రాజెక్టు ముందుకు సాగడంలేదు

- ఇది రెండు దేశాలకు సంబంధించిన ప్రాజెక్టు
- సుప్రీంకోర్టుకు వివరించిన వాన్‌పిక్



సాక్షి, న్యూఢిల్లీ : ఆస్తుల జప్తు కారణంగా రెండు దేశాలకు సంబంధించిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు దశాబ్దంన్నర నుంచి ముందుకు సాగడంలేదని వాన్‌పిక్ సంస్థ సుప్రీం కోర్టుకు తెలిపింది. ప్రాజెక్టు భూములన్నింటినీ ఈడీ అటాచ్ చేయడం తగదని తెలిపింది. వాన్‌పిక్‌కు చెందిన 1416.9 ఎకరాల పట్టా భూమి (వాన్‌పిక్ పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 561.19 ఎకరాలు, వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 855.71 ఎకరాలు)ని జప్తు నుంచి రిలీజ్ చేయాలని తెలంగాణ హైకోర్టు గత ఏడాది ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం శుక్రవారం విచారించింది. ప్రతివాది వాన్‌పిక్ సంస్థకు నోటీసులు జారీ చేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. అయితే వాన్‌పిక్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఇది రాష్ట్ర ప్రభుత్వం, రస్ అల్‌ఖైమాతో సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రాజెక్టు అని తెలిపారు. ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్ ఉంటే విచారణ చేయాలి కానీ భూములు అటాచ్ చేయడం తగదని వివరించారు. దీంతో తదుపరి విచారణ వరకు ప్రాజెక్టుపై యథాతథ స్థితి కొనసాగించాలని ధర్మాసనం పేర్కొంది. వాన్‌పిక్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణ వాయిదా వేసింది.

ఓబుళాపురం కేసులో శ్రీలక్ష్మికి సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఓబుళాపురం మైనింగ్ కేసులో ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో శ్రీలక్ష్మిపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలను ఇటీవల తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. శ్రీలక్ష్మికి నోటీసులు జారీ చేస్తూ ధర్మాసనం విచారణ వాయిదా వేసింది.

ఐదేళ్లలో 5,178 బాల్య వివాహాల నివారణ

- అయినా 8,496 మందికి 18 ఏళ్లలోపే గర్భం
- బాల్య వివాహాల నివారణకు మరింత సమర్థంగా చర్యలు తీసుకోండి
- కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో బాల్య వివాహాల నివారణకు చర్యలు తీసుకుంటున్నా ఇంకా 18 ఏళ్లు నిండని బాలికలు గర్భం దాల్చుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బాల్య వివాహాల నివారణకు మరింత సమర్థంగా చర్యలు తీసుకోవాలని శుక్రవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో 5,178 బాల్య వివాహాలను నివారించినప్పటికీ ఇంకా 8,496 మంది యుక్తవయసు బాలికలు గర్భం దాల్చినట్టు గర్భిణుల రిజిస్ట్రేషన్లలో తేలిందన్నారు. అమ్మాయిలకు 18 ఏళ్లు నిండాక, 21 ఏళ్లు నిండిన అబ్బాయిలతో పెళ్లిళ్లు చేస్తేనే వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద లబ్ధి చేకూరుతుందనే విషయాన్ని క్షేత్రస్థాయిలోకి మరింత బలంగా తీసుకెళ్లాలని సీఎస్ సూచించారు. ఏ గ్రామంలోనైనా బాల్య వివాహం జరిగితే సంబంధిత గ్రామ, వార్డు కార్యదర్శులను బాధ్యులను చేసి వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎస్ ఆదేశించారు.

ప్రకృతి సేద్య విశ్వవిద్యాలయం ఏర్పాటు దిశగా చర్యలు

రాష్ట్రంలో ప్రకృతి సేద్య విధానాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సీఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ప్రకృతి సేద్యం విస్తరణ, నిధుల సమీకరణ, ప్రకృతి సేద్యానికి సంబంధించి ప్రత్యేకంగా విశ్వ విద్యాలయం ఏర్పాటు అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. రైతులు ప్రకృతి సేద్యం విధానాన్ని పాటిస్తూ ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గిస్తే ప్రధాన మంత్రి ప్రాణం పథకం కింద పెద్ద ఎత్తున సబ్సిడీ పొందొచ్చన్నారు. రాష్ట్రంలో ప్రకృతి సేద్యానికి సంబంధించి ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్, రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాల కృష్ణ ద్వివేది తదితరులు పాల్గొన్నారు. కాగా, కాకినాడ–శ్రీకాకుళం మధ్య ఏర్పాటు చేస్తున్న నాచురల్ గ్యాస్ పైపులైను పనులు వేగవంతం చేయాలని సీఎస్ ఆదేశించారు. సచివాలయంలో ఈ అంశంపై ఆయన అధికారులతో సమీక్షించారు.

జేఎల్ పదోన్నతుల సాధనకు ఉద్యమం

- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులకు దక్కాల్సిన పదోన్నతుల సాధనకు ఉద్యమాన్ని నిర్మించనున్నట్లు నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ప్రకటించింది. సంఘం సమావేశాన్ని శుక్రవారం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావులు మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ భవిష్యత్తులో ఉపాధ్యాయుల పాలిట గొడ్డలి పెట్టు గా మారుతుందన్నారు. రిక్రూట్మెంట్ ద్వారా నియామకాలు జరగాలని, 70 శాతం పదోన్నతులు 30 శాతం రిక్రూట్మెంట్ జరగాల్సి ఉందన్నారు. ఎన్‌సీటీఈ నిబంధనల మేరకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ తో పాటు బీఈడీ ఉండాలన్నారు. కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణపై పునఃపరిశీలన చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఏయూతో యూకే యూనివర్సిటీ ఎంవోయూ



ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న ఏయూ, యూకే వర్సిటీ అధికారులు

ఎంవీపీకాలనీ (విశాఖపట్నం): ఆంధ్ర విశ్వవిద్యాలయంతో యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ హైలాండ్స్ అండ్ ఐస్‌లాండ్స్ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ ఈసీ హాల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, సౌత్ ఇండియా బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్ సమక్షంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, యూకే ఇంటర్నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ సనమ్ అరోరా ఈ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఒప్పందంలో భాగంగా ఎంబీఏ, ఎమ్మెస్సీ అప్లయిడ్ డేటా ప్రాసెస్ కోర్సుల్లో రెండు యూనివర్సిటీలు సంయుక్త సహకారంతో ముందుకెళ్తాయని చెప్పారు. ఏయూ ద్వారా రాష్ట్రంలోని ఏ విద్యార్థి అయినా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. యూకే ఇండియా ఎడ్యుకేషన్ పాలసీ ద్వారా ఈ కోర్సులు చేసే విద్యార్థులకు 10 శాతం ఫీజు రాయితీతో పాటు స్కాలర్‌షిప్ అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోని టాప్ వర్సిటీల్లో ఏపీ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలకు అనుగుణంగా ఆంధ్రా యూనివర్సిటీ విదేశాల్లోని ప్రఖ్యాత వర్సిటీలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, బీమ్ గ్లోబల్ సొసైటీ సీఈవో నవిందర్ కెప్లేష్, ఏయూ ఇంటర్నేషనల్ అఫైర్ అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ఏయూ మీడియా రిలేషన్స్ డైరెక్టర్ ఆచార్య చల్లా రామకృష్ణ పాల్గొన్నారు.

ఈసెట్ ద్వారా 10 వేల సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా పూర్తి చేసి ఈసెట్ ద్వారా అర్హత సాధించిన విద్యార్థులకు రాష్ట్ర సాంకేతికవిద్య విభాగం శుక్రవారం తుది కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తిచేసింది. ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించి మొత్తం 10,496 సీట్లు భర్తీ చేసినట్టు వెల్లడించింది. 170 ఇంజనీరింగ్ కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాయని, 11,855 సీట్లు అందుబాటులో ఉన్నాయని, తుది కౌన్సెలింగ్ తర్వాత ఇంకా 1,359 సీట్లు మిగిలిపోయాయని తెలిపింది. ఫార్మసీలో 1,228 సీట్లు అందుబాటులో ఉండగా 77 సీట్లు భర్తీ చేశారు. ఇంకా 1,151 సీట్లు మిగిలిపోయాయి. సీట్లు పొందిన విద్యార్థులు శనివారం నుంచి ఈ నెల 29లోగా సంబంధిత కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొంది. తుదిదశ కౌన్సెలింగ్ ముగిసే నాటికి సివిల్ ఇంజనీరింగ్ సీట్లు 99.74%, మెకానికల్ 95.27% భర్తీ అయ్యాయి. కంప్యూటర్ కోర్సుల్లో 84.75% విద్యార్థులకు సీట్లు వచ్చాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 26 : ఆగస్టు : 2023

న్యూస్‌రీల్


వినాయక చవితి కోసం గణపయ్య విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. శుక్రవారం బెళగావిలో గణపయ్య ప్రతిమకు తుదిరూపు ఇస్తున్న కళాకారిణి

జలాశయాల్లో నీటి నిల్వలపై నివేదిక ఇవ్వండి

శివాజీనగర: కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని జలాశయాల్లో నీటి నిల్వలపై వాస్తవ నివేదిక సమర్పించాలని కావేరి నీటి నిర్వహణ మండలికి సుప్రీంకోర్టు సూచించటం ద్వారా పిటిషన్ విచారణను సెప్టెంబర్ 1కి వాయిదా వేసింది. తమకు కేటాయించిన కావేరి జలాలను విడుదల చేసేలా కర్ణాటక ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని సుప్రీం కోర్టులో తమిళనాడు ప్రభుత్వం పిటిషన్ సమర్పించిన విషయం తెలిసిందే. న్యాయమూర్తి బీ.ఆర్.గవాయి నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పిటిషన్ విచారణ చేపట్టింది. కాగా కావేరి నదిపరీవాహక ప్రాంతంలో ఈ ఏడాది 42 శాతం వర్షం కొరత ఏర్పడిందని, ఈ విషయాన్ని కావేరి నీటి నిర్వహణా ప్రాధికార దృష్టికి తీసుకెళ్లామని, అయినప్పటికీ తమిళనాడు 36.76 టీఎంసీల నీరు కోరుతోందని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు దృష్టికి తెచ్చింది. దీంతో కావేరి నది పరీవాహక ప్రాంతంలోని నాలుగు జలాశయాల వాస్తవ పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని కావేరి నీటి నిర్వహణ మండలికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసి కేసు విచారణను వాయిదా వేసింది.

కరువుపై ప్రకటన చేయాలి

యశవంతపుర: వర్షాభావం నేపథ్యంలో కరువు తాలూకాల జాబితా విడుదల చేయాలని మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 120 తాలూకాల్లో కరవు ఏర్పడిందన్నారు. అనేక డ్యామ్‌ల్లో నీరు అడుగంటిందన్నారు. తక్షణం కరవు ప్రాంతాలను గుర్తించి ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వచ్చే నెలలో ప్రకటిస్తాం

శివాజీనగర: రాష్ట్రంలో వర్షం కొరతతో 130కి పైగా తాలూకాల్లో కరువు నెలకొందని, వచ్చే నెల మొదటి వారంలో కరువు ప్రాంతాలను అధికారికంగా ప్రకటిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి తెలిపారు. శుక్రవారం విధానసౌధలో శాఖాధికారులతో సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 79 శాతం విత్తనం పూర్తయిందని, అయితే వర్షం కొరతతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. వాతావరణ సూచన ప్రకారం సెప్టెంబర్‌లో వర్షం కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని, పంట చేతికి వచ్చే అవకాశాలు లేవన్నారు.

12 బైక్‌ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

శివమొగ్గ : బైక్ చోరీలకు పాల్పడుతున్న సొరబ తాలూకా కమనహళ్లికి మంజునాథ్(25), హిరెచౌట్ గ్రామానికి చెందిన అనీల్ (26) అనే దొంగలను సొరబ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులనుంచి రూ.4.85 లక్షల విలువైన 12 బైకులను స్వాధీనం చేసుకున్నారు.


బ్యాంక్ ఉద్యోగి చేతివాటం

దొడ్డబళ్లాపురం: ఖాతాదారులకు చెందిన రూ.40 లక్షల నగదును బ్యాంకు ఉద్యోగి స్వాహా చేశాడు. ఈఘటన హాసన్ జిల్లా చెన్నరాయపట్టణ తాలూకా ఆనెకెరెలో చోటుచేసుకుంది. గ్రామంలోని యూనియన్ బ్యాంక్‌లో దండిగనహళ్లికి చెందిన ఎంటీ జయరాం అనే వ్యక్తి 2019 నుంచి బిజినెస్ కరస్పాండెన్స్ (బీసీ)గా పనిచేస్తున్నాడు. గ్రామానికి చెందిన కాళప్ప అనే ఖాతాదారుడు తన పాస్‌బుక్ ఎంట్రీ చేయించగా రూ.50 వేలు డ్రా అయినట్టు తెలిసింది. స్టేట్‌మెంట్ రెఫరెన్స్ నంబర్ పరిశీలించగా జయరాం డివైస్ నుంచి నగదు డ్రా చేసినట్టు తేలింది. ఇలా 40 మంది ఖాతాల నుంచి డబ్బు డ్రా చేశారని వెలుగు చూడటంతో ఖాతాదారులు బ్యాంక్‌ను ముట్టడించారు. నగదు స్వాహాపై బ్యాంక్ మేనేజర్ భరణికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


శుక్రవారం బెంగళూరు గాంధీ భవన్‌లో జరిగిన కవి సిద్దలింగయ్య సంస్మరణ కార్యక్రమంలో ఆయన విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

ట్రాఫిక్ సమస్యకు చెక్


బెంగళూరులో ట్రాఫిక్ రద్దీ


జపాన్ సాంకేతికతతో ట్రాఫిక్ నియంత్రణ ఊహా చిత్రం

- బెంగళూరులో జపాన్ సాంకేతికత వినియోగం
- నగరంలో 28 జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ
- అక్కడ స్వయం చాలిత సిగ్నల్స్
- వేచి చూసే సమయం గణనీయంగా తగ్గించే ప్రయత్నం

బనశంకరి: ప్రపంచంలో ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్న నగరాల్లో బెంగళూరు సిలికాన్ సిటీ కూడా ఒకటి. నిత్యం లక్షలాది వాహనాలు రోడ్డెక్కే బెంగళూరు నగరంలో ఒక చోటనుంచి మరోచోటకు వెళ్లాలంటే గంటలకొద్దీ సమయం తీసుకుంటుంది. దీంతో కార్యాలయాలకు, పాఠశాలలకు వెళ్లే ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు నానా అగచాట్లు పడుతున్నారు. అనేక పై వంతెనలు, మెట్రో రైలు ఏర్పాటు చేసినా రద్దీ తగ్గడం లేదు. దీంతో జపాన్ సాంకేతికతను వినియోగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు నగర భూరవాణా డైరెక్టరేట్(డల్ట్) మొగ్గు చూపింది. దేశంలోనే మొదటిసారిగా బెంగళూరులో మేనేజ్‌మెంట్ ఆఫ్ ఒరిజన్ డెస్టినేషన్ రిలేటెడ్ అడాప్టేషన్ ఫర్ ట్రాఫిక్ ఆప్టిమైజేషన్(మోడరెటో) అమలులోకి తేనుంది. సిగ్నల్ కోసం వేచిచూసే సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు ఈ విధానం ఎంతో ప్రయోజనకరమని తేలింది. బెంగళూరునగరంలోని ప్రధానమైన మూడు మార్గాల్లోని 28 జంక్షన్లలో మోడరెట్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ విధానంలో సిగ్నల్స్ స్వయం చాలితంగా పనిచేస్తాయి. అత్యవసర వాహనాల సంచారానికి అనుకూలమయ్యేలా మార్చడానికి కూడా అవకాశం కల్పించారు. జపానఖ నగోయా ఎలక్ట్రిక్ వర్క్స్ కంపెనీ ఈ సాంకేతిక విధానాన్ని నిర్వహిస్తోంది. మోడరిటో ఏరియా ట్రాఫిక్ కంట్రోల్‌సిస్టమ్(ఏటీసీఎస్) అమలు చేస్తున్నాయి. బెంగళూరు ట్రాఫిక్ పోలీసులతో సమాలోచన జరిపి 28 జంక్షన జాబితా సిద్ధం చేశామని డల్ట్ కమిషనర్ వీ.మంజుల తెలిపారు. 2014లోనే దీనిని అమలు చేయాలని నిర్ణయించారు. ఏ కారణాలతోనే వాయిదా పడుతోంది. చివరకు 2021 జూలైలో ఈ పథకం పనులు ప్రారంభం అయ్యాయి. 2022 అక్టోబరు నాటికి పనులు పూర్తి చేయాలని గడువు విధించారు. వచ్చే నెల నాటికి దీనిని పూర్తి స్థాయిలో అమలులోకి తెస్తారు.

ఉత్తమ నిర్ణయం

వాహనాల డిటెక్టర్ల సహకారంతో ట్రాఫిక్ రద్దీని గుర్తించి సిగ్నల్స్ పనిచేస్తాయి. జపాన్ సాంకేతిక పరిజ్ఞాన సంచారసమితి నియంత్రణ వ్యవస్థ అమలు స్వాగతనీయమని నిపుణులు అంటున్నారు. పై వంతెనల నిర్మాణం, లేదా రోడ్డు విస్తరణకు బదులుగా ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం అమలు చేయడం చాలా ఉత్తమ నిర్ణయమని ట్రాఫిక్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఎక్కడెక్కడ అమలు చేస్తారంటే...

ఎంజీ.రోడ్డు, హొసూరురోడ్డు, పాతమద్రాస్ రోడ్డు, 28 జంక్షన్లలో నూతన వ్యవస్థ అమలు చేస్తారు. క్వీన్స్ స్టాచ్యూ సర్కిల్, అనిల్‌కుంబ్లే సర్కిల్, కావేరి ఆర్ట్స్ క్రాఫ్ట్ సర్కిల్, మెయోహాల్, వెబ్స్‌సర్కిల్, ట్రినిటీ సర్కిల్, ట్రినిటీ చర్చ్‌రోడ్డు, బేగం మాల్, అడిగాస్‌జంక్షన్, మణిపాల్‌సెంటర్, కామరాజరోడ్డు, శివాజీనగర ఇంటర్‌సెక్షన్ జంక్షన్ , ఒపేరా జంక్షన్, ఆశీర్వాదం జంక్షన్, పాత పోలీస్‌స్టేషన్ జంక్షన్, ఆశోక్‌నగర జంక్షన్, మదర్ థెరిస్సా జంక్షన్ , డిసోజా సర్కిల్, గరుడామాల్ జంక్షన్, హస్మాట్ జంక్షన్, కెన్సింగ్‌టన్ ఓవల్ జంక్షన్, దామరైకణ్ణన్ జంక్షన్, అంజనేయ ఆలయ జంక్షన్, పాతమద్రాస్ రోడ్డు, ఆదర్శ థియేటర్ జంక్షన్, స్వామివివేకానందస్టేషన్, డబల్‌రోడ్డు జంక్షన్‌లో స్వయం చాలిత సిగ్నల్స్ వ్యవస్థ అమలులోకి వస్తుంది.

కావేరికి మేకెదాటు సరైన పరిష్కారం

యశవంతపుర: కర్ణాటక-తమిళనాడుల మధ్య కావేరి నీటి సమస్య పరిష్కారానికి మేకెదాటు పథకం ఒక్కటే సరైన పరిష్కారమని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ... సుప్రీంకోర్టు కావేరి నిర్వహణ ప్రాధికారాన్ని ఏర్పాటు చేసింది. ఇది సాంకేతిక సమితి, సాంకేతిక అంశాలపై సమితి దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టుకు కూడా సమాచారం ఇచ్చినట్లు డీసీఎం వివరించారు. ఈ పరిస్థితిలో మేకెదాటు యోజన ఒకటే పరిష్కార మార్గమన్నారు. మండ్యలో బీజేపీ నాయకులు మాత్రమే ఆందోళన చేసి నీటిని వదలద్దంటున్నారు. వారికి ఎక్కడ నష్టం వచ్చిందో చెప్పటం లేదన్నారు. రాష్ట్ర రైతులకు కావాల్సిన నీటిని అందించటంలో ప్రభుత్వం సఫలీకృతమైందని శివకుమార్ వివరించారు.

గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడి హత్య


నారాయణస్వామి (ఫైల్)

చిక్కబళ్లాపురం : శిడ్లఘట్ట తాలూకా బైర నాయకనహళ్లి గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడు నారాయణస్వామి (50) హత్యకు గురయ్యాడు. గురువారం రాత్రి గ్రామ సమీపంలో దుండగులు అతన్ని కొడవళ్లతో నరికి చంపారు. శిడ్లఘట్టకు వచ్చి స్వగ్రామానికి కారులో వెళ్తూ గ్రామ సమీపంలో వాహనం దిగి ఫోన్‌లో మాట్లాడుతుండగా దుండగులు అతని కళ్లలో కారం పొడి చల్లి అనంతరం కొడవళ్లతో నరికారు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దిబ్బూరహళ్లి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని శిడ్లఘట్ట ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. నారాయణస్వామి మృతితో గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ నాగేష్ తెలిపారు.

నేడు బెంగళూరుకు ప్రధాని

- ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించనున్న మోదీ


ప్రధాని నరేంద్రమోదీ

శివాజీనగర: అంతరిక్షంలో సరికొత్త శకాన్ని ఆవిష్కరించి, ప్రపంచంలో చిరస్థాయిగా గుర్తుండిపోయేలా విజయాన్ని అందుకున్న చంద్రయాన్-3 విజయవంతానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలను స్వయంగా అభినందించడానికి ప్రధాని మోదీ శనివారం బెంగళూరు రానున్నారు. ఇస్రో శాస్త్రవేత్తలను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం బెంగళూరులో పర్యటించనున్నారు. బెంగళూరుకు చేరుకొని ఇస్రోకు చెందిన టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ నెట్‌వర్క్ (ఇస్ట్రాక్)ను సందర్శించనున్నారు. అనంతరం ఇస్రో సైంటిస్ట్‌లతో మోదీ భేటీ కానున్నారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఆ తర్వాత ఉదయం 8.05 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి 8.35 గంటలకు ఢిల్లీకి చేరుకుంటారని తెలిపింది. ఈ క్రమంలోనే ప్రధాని పర్యటనకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ప్రధాని ప్రయాణించే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని బెంగళూరు సిటీ ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. ఈ క్రమంలోనే బెంగళూరుకు రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికేందుకు రాష్ట్ర బీజేపీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్.అశోక్ వెల్లడించారు. అదే విధంగా నగరంలో 10 వేల మందితో భారీ రోడ్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత ప్రధాని నరేంద్ర మోది తొలిసారిగా కర్ణాటకలో పర్యటించనున్నారు. ప్రధాని మోదీకి బెంగళూరులోని హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన బీజేపీ, వచ్చే ఏడాది జరగనున్న లోకసభ ఎన్నికలకు సిద్ధమవుతోంది.

ప్రధాని రాక, నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

నగరంలోని ఇస్రో కేంద్రానికి శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోది విచ్చేయనుండగా ఆయన ప్రయాణించే మార్గాల్లో భారీ ఆంక్షలు విధించారు. ఉదయం గ్రీస్ రాజధాని ఏథెన్స్ నుండి నేరుగా బెంగళూరుకు రానున్నారు. శనివారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఆయన ప్రయాణించే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నాయి. ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్డు, ఓల్డ్ మద్రాస్ రోడ్డు, ఎంజీ రోడ్డు, కబ్బన్ రోడ్డు, రాజభవన రోడ్డు, బళ్లారి రోడ్లలో రాకూడదని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. అంతే కాకుండా సీ.వీ.రామన్ రోడ్డు, యశ్వంతపుర ఫ్లై ఓవర్, తుమకూరు రోడ్డు (యశ్వంతపుర నుండి నాగసంద్ర వరకు) మాగడి రోడ్డు, రింగ్‌రోడ్డు (గొరగుంట పాళ్య జంక్షన్ నుండి సుమనహళ్లి) గుబ్బి తోటదప్ప రోడ్డు, జాలహళ్లి క్రాస్ రోడ్లలో సంచారం నిషేధించారు. కొన్ని మార్గాల సంచారం నిషేధించడమే కాకుండా నగరంలో 26న తెల్లవారు జామున 4 నుంచి ఉదయం 11 గంటల వరకు భారీ సరుకు రవాణా వాహనాలను పూర్తిగా నిషేధించారు.

ప్రధాని కార్యక్రమ వివరాలిలా

- ఉదయం 5.55 గంటలకు హెచ్.ఏ.ఎల్ విమానాశ్రయానికి చేరుకుంటారు
- ఉదయం 6.30 గంటలకు ఇస్రో కేంద్ర కార్యాలయంలో భేటీ
- ఉదయం 8 గంటల వరకు ఇస్రో కార్యాలయంలో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లతో సమావేశం
- ఉదయం 8.15 గంటలకు ఢిల్లీకి ప్రయాణం

వరలక్ష్మీ నమోస్తుతే


విల్సన్ గార్డెన్‌లో మారియమ్మదేవికి విశేష అలంకరణ


అలంకరణలో బనశంకరీదేవి మూలవిరాట్


బనశంకరీదేవి ఆలయం వద్ద భక్తుల సందడి

బనశంకరి: వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో ఆచరించారు. సకలశుభాలు ప్రసాదించే వరమహాలక్ష్మీ దేవిని ఆహ్వానిస్తూ ప్రతి ఇంటా విశేష పూజలు, వ్రతాలు నిర్వహించారు. వేకువజామునే స్నానమాచరించి, ఇంటి గుమ్మానికి మామిడి తోరణాలు, పూలు కట్టి ఇంటి ముందు రంగువల్లులు వేసి వరమహాలక్ష్మీదేవికి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. తుమకూరు జిల్లా కొరటగెరె గురవనహళ్లి లక్ష్మీదేవి ఆలయంలో వరమహాలక్ష్మీ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. బెంగళూరునగరంలో బనశంకరీదేవి ఆలయం, బన్ని మహంకాళి, రాజరాజేశ్వరినగర ఆలయం, మహాలక్ష్మీలేఔట్‌లోని లక్ష్మీదేవి, విల్సన్ గార్డెన్‌లోని మారియమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బనశంకరీ ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రధాన అర్చకులు చంద్రమోహన్ వరమహాలక్ష్మీ అలంకరణచేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధనచేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.


తుమకూరులోని ఓ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

క్రిమినల్ కేసుల విచారణ వేగవంతం కావాలి

యశవంతపుర: సీఆర్‌పీసీ సెక్షన్ 309 కింద నమోదైన క్రిమినల్ కేసులను రోజువారీగా విచారణ చేయాలని హైకోర్టు కింది కోర్టులను ఆదేశించింది. కేసు విచారణ ఆలస్యం కావటంతో నిందితులు బెయిల్ కోసం హైకోర్టుకు రావటంపై న్యాయమూర్తి కె నటరాజన్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేసింది. చామరాజనగర జిల్లా గుండ్లుపేటలో జరిగిన ముగ్గురి హత్య కేసు నిందితుడు అన్సు అలియాస్ అన్సార్ బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా న్యాయమూర్తి విచారణ చేసి పిటిషన్‌ను మూడోసారి కొట్టివేశారు. సెషన్ కోర్టులో క్రిమినల్ కేసుల విచారణలో ఆలస్యం జరుగుతుండటంతో న్యాయవాదులు హైకోర్టులో పిటిషన్లు వేస్తున్నారని, శంబానాథ్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సరైన కారణాలు చూపకుండా వాయిదా వేయవద్దని, సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తూ కేసుల విచారణ వేగవంతం చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు.

సీఎం హామీతో రైతుల ధర్నా విరమణ



ధర్నాలో మాట్లాడుతున్న రైతు నేత మాధవరెడ్డి

బళ్లారిఅర్బన్: రైతులు బ్యాంకులో తీసుకున్న రుణాలను 50 శాతం రద్దు చేయాలంటూ 246 రోజులుగా అహోరాత్రి ధర్నాతో పాటు ఇటీవల రైతులు చేపట్టిన భారీ ర్యాలీ, ధర్నాల అనంతరం ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలవగా ఆయన రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతుల ధర్నాను తాత్కాలికంగా విరమించుకున్నట్లు కర్ణాటక రాష్ట్ర హసిరుసేన, రైతు సంఘం జిల్లాధ్యక్షుడు కరూరు మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం గాంధీనగర్ కర్ణాటక గ్రామీణ బ్యాంక్ ప్రధాన శాఖ ముందు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక గ్రామీణ బ్యాంకు(కేజీబీ)లో రైతులు తీసుకున్న రుణాలపై వడ్డీలపైన వడ్డీలు వేస్తూ చక్రవడ్డీలను విధిస్తూ ఒక్కొక్క రైతు నుంచి సొమ్ములు వసూలు చేయడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. ఈనేపథ్యంలో బ్యాంక్ అధికారులతో చర్చించి సీఎం సిద్దరామయ్య తక్షణమే 50 శాతం సొమ్ము చెల్లించుకునేలా మాట్లాడుతానని హామీ ఇవ్వడంతో తాము చేపట్టిన నిరాహార దీక్షను విరమించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతు నాయకులు చాగనూరు మల్లికార్జున రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తిమ్మనగౌడ, ప్రధాన కార్యదర్శి లేపాక్షి తదితర వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

వరమివ్వమ్మా..మహాలక్ష్మీ


వ్రతాన్ని ఆచరించి సంప్రదాయాలను కొనసాగిస్తున్న దృశ్యం


బళ్లారి కనకదుర్గమ్మకు బంగారు ఆభరణాల అలంకరణ


పటేల్ నగర్ చిన్నదుర్గమ్మ విశేష అలంకరణ


సంతోషిమాతకు విశేష అలంకరణ


ఓ ఇంట్లో వరమహాలక్ష్మీ పూజలు చేసిన దృశ్యం

బళ్లారిఅర్బన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా వరమహాలక్ష్మీ వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఇంట్లో మహిళలు తమ పూజ గదుల్లో లక్ష్మీదేవిని కలశ రూపంలో ప్రతిష్టించి పూజలను నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు పసుపు కుంకుమను అలంకరించి ముత్తైదు మహిళలను ఆహ్వానించి వరమహాలక్ష్మీ వత్ర పూజలను ఆచరించారు. ముఖ్యంగా బళ్లారి నగర ప్రజల ఆరాధ్య దైవమైన కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి బంగారు ఆభరణాలతో అలంకరణ పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పటేల్ నగర్ చిన్న దుర్గమ్మ ఆలయంలో, మిల్లర్ పేట్ మల్నాడు దుర్గమ్మ ఆలయంలో, వాసవీ కన్యాపరమేశ్వరి దేవి ఆలయంలో, చిన్న మార్కెట్ శాంభవి దేవి ఆలయంలో, రేణుక యల్లమ్మ ఆలయంలో, కొల్హాపూర్ మహాలక్ష్మీ ఆలయంలో, సంతోషిమాత ఆలయంలో, ఆదిశక్తి ఆలయంలో, ఏళుమక్కళతాయి ఆలయంలో, రాజరాజేశ్వరి ఆలయం తదితర అమ్మవారి ఆలయాలతో పాటు శివాలయాలు, వివిధ ఆలయాల్లో శ్రావణమాస పూజలు జరుపుకున్నారు.

క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి



దుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కేతిరెడ్డి దంపతులు

బళ్లారి రూరల్: వరమహాలక్ష్మి వ్రత పర్వదినాన్ని పురస్కరించుకొని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి దంపతులు శుక్రవారం నగరంలోని దుర్గమ్మను దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కేతిరెడ్డి దంపతులిద్దరూ ఆలయ ప్రాంగణంలోని నాగాలమ్మను దర్శించుకొన్నారు. దుర్గమ్మ ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కొంతసేపు కూర్చొని పూజారులతో ఆలయంలో నిర్వహించే పూజలు, సమయం, అమ్మవారి విశిష్టతను తెలుసుకొన్నారు. ఆయన అభిమానులు కేతిరెడ్డితో కలిసి ఫోటోలు తీసుకొన్నారు. ఆయన వెంట ప్రముఖులు జయరామరెడ్డి, నాగరాజు, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థిని బలవన్మరణం



పవిత్ర(ఫైల్)

రాయచూరు రూరల్: జిల్లాలోని దేవదుర్గలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దేవదుర్గ కిత్తూరు రాణి చెన్నమ్మ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతోన్న దేవదుర్గ తాలూకాలోని బీ.ఆర్.గుండా గ్రామానికి చెందిన పవిత్ర(15) అనే విద్యార్థిని మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్య చేసుకుందని డీఎస్పీ మంజునాథ్ తెలిపారు. ఘటనా స్థలిని సీఐ గుండూరావ్, సాంఘిక సంక్షేమ శాఖాధికారి రాజేంద్ర, తహసీల్దార్ చెన్నమల్లప్ప పరిశీలించారు. విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దేవదుర్గ సీఐ గుండూరావ్ తెలిపారు.

వీధి దీపాలను అమర్చరూ



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగర వీధుల్లో విద్యుత్ దీపాలను అమర్చాలని అంబేద్కర్ మూల నివాసి సంఘం సంచాలకుడు భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వీధుల్లో విద్యుత్ దీపాలు సరిగా వెలగడం లేదని ఆరోపించారు. నగరంలో ఎక్కడ పడితే అక్కడ ఆక్రమించిన ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి పాదచారులకు నడిచేందుకు వీలు కల్పించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.


ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి మృతి



మల్లేష్(ఫైల్)

రాయచూరు రూరల్: ట్రాక్టర్ ఢీకొని ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన శుక్రవారం తాలూకాలో చోటు చేసుకుంది. ఇడపనూరు నుంచి కొత్తదొడ్డికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి చిక్కబూదూరుకు చెందిన మల్లేష్(17) అనే విద్యార్థిని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతనిని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మల్లేష్ నగరంలోని ఎస్ఆర్ పీయూ కళాశాలలో ద్వితీయ పీయూసీ చదువుతున్నాడు. ఇడపనూరు ఎస్ఐ అవినాష్ కాంబ్లే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎడమ కాలువలో నీటిమట్టం కాపాడండి



కాలువలో నీటిమట్టాన్ని పరిశీలించి మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువలో నీటిమట్టాన్ని కాపాడాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎన్.ఎస్.బోసురాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మునిరాబాద్ అతిథిగృహంలో నీటి పారుదల శాఖ సీనియర్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో కూడా చర్చించినట్లు తెలిపారు. 49, 69, 104వ మైలు వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించాలన్నారు. పైభాగంలో జరుగుతున్న అక్రమ వాడకం, నీటి చౌర్యాన్ని అరికట్టాలన్నారు. 69వ మైలులో 12 మీటర్లు, 104వ మైలులో 10 మీటర్ల నీటిమట్టం ఉండేలా చేస్తే ఆయకట్టు చివరి భూములకు నీరందుతాయన్నారు. సమావేశంలో సీనియర్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ మంజప్ప, చీఫ్ ఇంజనీర్ బసవరాజ్, ఎస్ఈ సత్యనారాయణ, ఇంజినీర్లు బసనగౌడ పాటిల్, గోడేకర్‌లున్నారు.

సామూహిక వివాహాలతో బాసట

- గాలి లక్ష్మీఅరుణ నేతృత్వంలో పెళ్లిళ్లు
- ఒకే వేదికపై ఒక్కటైన 35 జంటలు



ఉచిత సామూహిక వివాహాలను ప్రారంభిస్తున్న అతిథులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న కేఆర్‌పీపీ నాయకురాలు గాలి లక్ష్మీ అరుణ

సాక్షి,బళ్లారి: పేదలకు పెళ్లి చేసుకోవడం పెనుభారంగా మారుతున్న నేటి రోజుల్లో ఉచిత సామూహిక వివాహాలు జరిపించి వారికి బాసటగా నిలుస్తున్నారు గంగావతి ఎమ్మెల్యే, కేఆర్‌పీపీ వ్యవస్థాపకుడు గాలి జనార్దనరెడ్డి. శుక్రవారం వరమహాలక్ష్మి పర్వదినం రోజున నగరంలోని సిరుగుప్ప రోడ్డు హవంబావిలో తమ స్వగృహం పక్కనే క్యాంప్ హౌస్ ఆవరణలో ఆయన సతీమణి గాలి లక్ష్మీఅరుణ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహాలు ఘనంగా జరిగాయి. 35 జంటలు ఒకే వేదికపై ఒక్కటయ్యారు. అనంతరం గాలి లక్ష్మీఅరుణ మాట్లాడుతూ 1999 నుంచి వరుసగా 12 ఏళ్ల పాటు తన భర్త గాలి జనార్దనరెడ్డి సుమారు 50 వేల జంటలకు ఉచిత సామూహిక వివాహాలు జరిపించారని గుర్తు చేశారు. జాతీయ పార్టీలతో పోటీపడి తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేసిన తనకు నగరంలో ఓట్లు వేసి ఆదరించిన దాదాపు 50 వేల మంది ఓటర్ల రుణం తీర్చుకుంటామన్నారు. రాజకీయాల్లో ప్రజాసేవే పరమావధిగా పని చేస్తామన్నారు. కమ్మరచేడు కళ్యాణ స్వామి, బ్రహ్మణి రాజీవ్‌రెడ్డి, కేఆర్‌పీపీ నాయకులు బీ.వీ.శ్రీనివాసరెడ్డి, రాజశేఖరగౌడ, కే.ఎస్.దివాకర్, దరప్ప నాయక్, ఉమారాజ్, వెంకటరమణ, కేఆర్‌పీపీ మహిళా విభాగం నాయకురాలు హంపీ రమణ, నగర కార్పొరేటర్లు కల్పనా వెంకటరామిరెడ్డి, కోనంకి తిలక్ తదితరులు పాల్గొన్నారు.

ఇకపై ఏటా సామూహిక వివాహాలు

తాను మంత్రిగా అధికార బాధ్యతలు నిర్వహించినప్పుడు రాజకీయాలకతీతంగా ఉమ్మడి బళ్లారి జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లానని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం వరమహాలక్ష్మీ పర్వదినం సందర్భంగా కేఆర్‌పీపీ ఆధ్వర్యంలో బళ్లారిలో నిర్వహించిన ఉచిత సామూహిక వివాహాల సందర్భంగా వధూవరులను వర్చువల్ ద్వారా ఆశీర్వదించి మాట్లాడారు. ఇకపై తమ ఊపిరి ఉన్నంత వరకు ప్రతి ఏటా వరమహాలక్ష్మీ పండుగ రోజున సామూహిక వివాహాలు జరిపిస్తామన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



చెన్నబసవ(ఫైల్), మృతుడు రాసిన డెత్‌నోట్

రాయచూరు రూరల్: విద్యార్థులకు పాఠాలు బోధించి ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలని కన్న కలలు సాకారం కాకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దేవదుర్గలో చోటు చేసుకుంది. దేవదుర్గ తాలూకా చిక్కబూదూరుకు చెందిన చెన్నబసవ(25) అనే యువకుడు దేవదుర్గలోని జ్ఞానగంగా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఉపాధ్యాయ పరీక్షల్లో 6, 8వ తరగతుల ఉపాధ్యాయ ఉద్యోగానికి ప్రాథమిక జాబితాలో ఎంపికైన చెన్నబసవ 2022లో జరిగిన తుది నియామకాల జాబితాలో చెన్నబసవ పేరు లేదు. మరోసారి పరీక్షలు రాసి పాసవ్వాలని మరింత కష్టపడి చదివినా ఫలితం దక్కలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది మనస్తాపంతో డెత్‌నోట్ రాసి పాఠశాల ఆవరణలో ఆత్మహత్య చేసుకున్నట్లు డీఎస్పీ మంజునాథ్ తెలిపారు. ఈ విషయంలో ఎవరిపైనా కేసు పెట్టరాదని డెత్‌నోట్‌లో చెన్నబసవ రాశాడని ఆయన తెలిపారు. ఘటనా స్థలికి తాలూకా విద్యా శాఖాధికారి సుఖదేవ్, తహసీల్దార్ చెన్నమల్లప్ప చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. దేవదుర్గ సీఐ గుండూరావ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉంతకల్లు వద్ద శవమై తేలిన బళ్లారి బాలుడు



నవాజ్ (ఫైల్)

బొమ్మనహాళ్: బళ్లారిలోని హెచ్చెల్సీ కాలువలో సరదాగా స్నానానికి వెళ్లిన ఓ బాలుడు గురువారం గల్లంతై శుక్రవారం బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద శవమై తేలాడు. బళ్లారి రూరల్ ఏఎస్ఐ హనుమంతప్ప, మృతుడి బంధువులు తెలిపిన వివరాలు.. బళ్లారిలోని మిల్లర్ పేటకు చెందిన సాజిదాబాను, దాదాపీర్ దంపతుల కుమారుడు నవాజ్ (16) అనే బాలుడు పట్టణంలోని గుగ్గరహట్టిలో నివాసం ఉంటున్న తన స్నేహితుడు ఫరూక్‌తో కలిసి గుగ్గరహట్టి సమీపంలోని హెచ్చెల్సీ కాలువలో స్నానానికి వెళ్లాడు. అయితే నవాజ్ ప్రమాదవశాత్తు కాలువ నీటిలో గల్లంతయ్యాడు. దీంతో ఫరూక్ వెంటనే నవాజ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు బళ్లారి రూరల్ పోలీసుల సాయంతో గాలించారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని ఉంతకల్లు గ్రామ శివారులోని హెచ్చెల్సీ 1వ డిస్ట్రిబ్యూటరీ వద్ద నవాజ్ శవమై కనిపించాడు. అక్కడి స్థానికులు గమనించి ఇచ్చిన సమాచారంతో బళ్లారి రూరల్ పోలీసులు, బంధువులు వెళ్లి నవాజ్ శవాన్ని పరిశీలించి గుర్తించారు. బళ్లారి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం బళ్లారి విమ్స్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి తండ్రి దాదాపీర్ గత కొంతకాలంగా పక్షపాతంతో బాధపడుతున్నాడు. మృతుడు నవాజ్ టైల్స్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడటంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్



స్వాధీనపరచుకున్న చోరీ సొత్తుతో పోలీసులు

రాయచూరు రూరల్: పలు చోరీ కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించారు. గురువారం సాయంత్రం నేతాజీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయచూరు, యాదగిరి, తెలంగాణలోని పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడిన ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా కల్యాణదుర్గం మండలం కోడిపల్లికి చెందిన ప్రశాంత్ కుమార్ అనే వ్యక్తి ధర్మవరం యరగుంట కాలనీలో నివాసం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.8.55 లక్షల విలువ చేసే 120 తులాల బంగారు,16 తులాల వెండి వస్తువులు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చంద్రయాన్-3 సక్సెస్‌పై జాతా



జాగృతి జాతా నిర్వహిస్తున్న దృశ్యం

కంప్లి: పట్టణంలోని శారదా ప్రభుత్వ పాఠశాల నుంచి శుక్రవారం చంద్రయాన్-3పై జాగృతి జాతా నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలోని షామియాచంద్ ప్రభుత్వ పాఠశాలలో విజ్ఞాన ఉపాధ్యాయులు డాక్టర్ సునీల్ చంద్రయాన్-3 ప్రాధాన్యతపై ఉపన్యసించారు. జేసీఐ సోనా కంప్లి అధ్యక్షులు సంతోష్ కొట్రప్ప సోగి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ గుడదూరు, ఉపన్యాసకులు డాక్టర్ కే.మహేష్, జేసీఐ సోనా కంప్లి మహిళా విభాగం అధ్యక్షురాలు అమృతా సంతోష్, కార్యదర్శి బీహెచ్ఎం అమరనాథ శాస్త్రి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్‌లో అధికారుల పరిశీలన



హాస్టల్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హొసపేటె: నగరంలో వివిధ శాఖల ప్రగతి సమీక్ష సమావేశం అనంతరం విద్యార్థి వసతిగృహాన్ని, స్టోర్ రూమ్‌ను ఇన్‌చార్జ్ కార్యదర్శి కేపీ మోహన్‌రాజ్ పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, స్నాక్స్ తదితరాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభుతో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు.

ప్లాస్టిక్ అంగళ్లపై దాడులు



అంగళ్లలో తనిఖీ చేస్తున్న అధికారులు

కంప్లి: పట్టణంలోని వివిధ దుకాణాల్లో శుక్రవారం అధికారులు దాడులు జరిపి ప్రభుత్వం నిషేధించినా వాడుతున్న ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకొన్నారు. ఈసందర్భంగా ప్రొబేషనరి తహసీల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ ఇకపై హోటళ్లు, కిరాణ అంగళ్లలో ప్లాస్టిక్ సంచులు వాడుతున్నట్లు తన దృష్టికి వస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కఠినంగా హెచ్చరించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అవసరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లతా మల్లికార్జున్

కంప్లి: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తుందని హరపనహళ్లి ఎమ్మెల్యే ఎంపీ లతా మల్లికార్జున్ తెలిపారు. ఆమె శుక్రవారం హరపనహళ్లి తాలూకాలోని ప్రభుత్వ పాఠశాలలో గుడ్లు, అరటి పండ్లను పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. భావిభారత పౌరుల రక్షణ మనందరి కర్తవ్యం అన్నారు. దీనికి ప్రభుత్వం కూడా సహకారం అందిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయం గర్వకారణం



సంబరాల్లో పాల్గొన్న పట్టణ ప్రముఖులు

కంప్లి: చంద్రయాన్-3 విజయం యావత్ ప్రపంచానికే గర్వకారణమని, ప్రత్యేకించి మన దేశ ప్రజలు కన్న కలలు నిజం కావడం మన పుణ్యఫలమని కంప్లి క్షేత్ర బీజేపీ మండల అధ్యక్షులు అళ్లళ్లి వీరేష్, పీ.బ్రహ్మయ్య, జీ.సుధాకర్ తెలిపారు. చంద్రయాన్-3 విజయంపై శుక్రవారం అంబేద్కర్ సర్కిల్‌లో బీజేపీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా వెలిగించి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు పురుషోత్తం, సిద్దప్ప, వీఎల్ బాబు, కొడిదల రాజు హొన్నూర్‌సాబ్, రమేష్, సుదర్శనరెడ్డి, డాక్టర్ వెంకటేష్ బర్మక్కనవర్, డాక్టర్ అశోక్ ఆంద్రాళ్, గోవిందరాజు, రామాంజిని, హూగార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

రాయచూరు రూరల్: ప్రతిభాన్విత విద్యార్థులను ప్రోత్సహించాలని ఏడీసీ దురుగేష్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయంలలో క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభాన్విత విద్యార్థులకు చెక్‌లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ఆరుగురు విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసానికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. అధికారులు శివలింగయ్య, గిరీష్, దొడ్డప్ప, ముత్తప్ప, బూదెప్ప, రాజశేఖర్‌లున్నారు.

అటవీ భూమిలో కొనసాగిన ఆక్రమణల తొలగింపు



మామిడి చెట్లను జేసీబీ సాయంతో తొలగిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: పట్టణ సమీపంలోని అటవీ భూమిలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని రెవిన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా జేసీబీల సహాయంతో కొనసాగించారు. మామిడి తోటలను తొలగించిన స్థానంలో గుంతలను తవ్వి ఆ స్థలంలో నేరేడు, వెదురు, వేప, శ్రీగంధం తదితర చెట్ల మొక్కలను అటవీ శాఖ నియమించిన కార్మికులు నాటారు. శుక్రవారం కూడా 120 ఎకరాల ఆక్రమిత అటవీ భూమిలోని ఆక్రమణలను తొలగించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఆక్రమణలను తొలగించిన స్థానంలో వివిధ రకాల మొక్కలను నాటుతున్నట్లు అధికారి కె మహేష్ తెలిపారు. పట్టణంలో నుంచి వాహనాలలో వచ్చి గుంపులుగా చేరిన నగర ప్రజలను పోలీసులు అక్కడి నుంచి పంపించి వేశారు.

మారికాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మారికాంబా దేవి

మాలూరు: పట్టణంలోని దొడ్డపేట మెయిన్ రోడ్డులోని పురాతన మారికాంబ ఆలయంలో వరలక్ష్మీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అలంకరణ చేసి అమ్మవారి మూల విగ్రహానికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, వేదమంత్ర పారాయణం తదితర పూజలను జరిపారు. పట్టణంతో పాటు తాలూకాలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకున్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన కేంద్ర బృందం



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న తనూజా ఠాకూర్ తదితరులు

హొసపేటె: తాలూకాలోని బుక్కసాగర గ్రామ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి తనూజా ఠాకూర్, ఆర్థిక మంత్రిత్వ శాఖ సలహాదారులు, ఎంజీఎన్ఈఆర్ఏ అధికారుల బృందం పరిశీలించారు. నరేగ ప్రాజెక్టు కింద చేపట్టిన మహిళ సమాఖ్య భవనం, వెంకటాపురంలోని 76వ గోదాము భవనం, అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మలపనగుడిలో నరేగ పథకం కింద తోటల పెంపకం పనులను పరిశీలించారు. ఈసందర్భంగా జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి సదాశివ ప్రభు, డిప్యూటీ సెక్రటరీ భీమప్ప, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉమేష్, అసిస్టెంట్ డైరెక్టర్ షమీమ్ బాను పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

- రూ.10.5 లక్షల విలువ చేసే 21 బైక్‌ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

కోలారు: జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో దొంగిలించిన రూ.10.5 లక్షల విలువ చేసే 21 ద్విచక్ర వాహనాలను నగర పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. కోలారు షహీన్ షా నగర్‌కు చెందిన ముజమిల్, సాధిక్ పాషా అనే ఇద్దరు నిందితులు అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంలో తిరుగుతుండగా రాత్రి గస్తీ తిరుగుతున్న నగర పోలీసులు వారిని అడ్డుకుని ప్రశ్నించగా అసలు గుట్టు బయట పడింది. వీరు కోలారు నగరంతో పాటు చిక్కబళ్లాపుర, చింతామణి తదితర ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడినట్లు తెలిపారు. చోరీ చేసిన తరువాత వాటి ఛాసీ నెంబర్లను మార్చి తిరిగి విక్రయిస్తున్నట్లు విచారణలో అంగీకరించారు. వీరిపై బెంగళూరు నగరంతో పాటు కెజి హళ్లి ప్రాంతాల్లో కూడా కేసులు ఉన్నట్లు తెలిసింది.

భక్తిశ్రద్ధలతో వరమహాలక్ష్మి పూజలు



అమ్మవారిని అలంకరించి పూజ చేస్తున్న భక్తులు

సాక్షి,బళ్లారి: మహిళలకు ఎంతో ఇష్టమైన పండుగల్లో ఒకటైన వరమహాలక్ష్మి పండుగను కన్నుల పండువగా జరుపుకున్నారు. శుక్రవారం వరమహాలక్ష్మి పర్వదినం సందర్భంగా నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా మహిళలు వరమహాలక్ష్మి దేవిని ఇంటింటా అలంకరించి భక్తిశ్రద్ధలతో పండుగను ఆచరించారు. నగరంలో కనక దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు.

ప్లాస్టిక్ కట్టడికి ప్రజలు సహకరించాలి



బట్టల సంచులను పంచుతున్న జడ్జి దయానంద్

రాయచూరు రూరల్: నగరంలో ప్లాస్టిక్‌ను కట్టడి చేసేందుకు ప్రజలు సహకరించాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి దయానంద్ బేలూరు పిలుపు ఇచ్చారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద జన శిక్షణ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బట్టల సంచులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. నగరంలో ఎక్కడ పడితే అక్కడ ఫుట్‌పాత్‌లపై ప్లాస్టిక్ కవర్లను అక్కడే పడేసి అపరిశుభ్రతకు కారణమవుతున్నారన్నారు. వ్యాపారులు, పూలు, పండ్లు, కూరగాయలు విక్రయించేవారు ప్లాస్టిక్ బదులు బట్టల సంచులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శివకుమార్, నగరసభ కమిషనర్ గురుసిద్దయ్య, జన శిక్షణ సేవా సంస్థ సంచాలకుడు సదానంద, ప్రభు నాయక్ పాల్గొన్నారు.

నీటిశుద్ధి కేంద్రం తనిఖీ



పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు

హొసపేటె: తాలూకాలోని పాపినాయకనహళ్లితో పాటు మొత్తం తొమ్మిది గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసే నీటి శుద్ధి కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు శుక్రవారం తనిఖీ చేశారు. యూనిట్‌లో నీటిని శుద్ధి చేసే యూనిట్ నిర్వహణపై సమాచారం తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నీరు కలుషితం కాకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ట్యాంకులను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హొసపేటె రూరల్ డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీరేష్, అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్ తదితరులు యూనిట్ పని తీరు గురించి ఆయనకు పూర్తి వివరాలు అందించారు.

భక్తిప్రపత్తులతో వరలక్ష్మీ వ్రతం ఆచరణ



వరలక్ష్మీ వ్రతం నిర్వహించిన దృశ్యం

కోలారు: జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో శుక్రవారం వరమహాలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. జిల్లాలో ఈసారి వానలు లేక కరువు పరిస్థితి నెలకొంది. అయినా జిల్లా ప్రజలు వరలక్ష్మీ వ్రతాన్ని వేడుకగా జరిపారు. పూలు, పండ్ల ధరలు గణనీయంగా పెరిగినా ఉత్సాహంగా పండుగను నిర్వహించడం విశేషం. పండుగ సందర్భంగా వ్రత ఆచరణ కోసం పురోహితులకు డిమాండ్ అధికంగా ఉంది. పలువురు తెల్లవారు జామున 4 గంటల నుంచే పూజలు ప్రారంభిస్తే మరికొంత మంది రాహుకాలం ప్రారంభానికి ముందు 10.30 గంటల్లోగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో కలశాన్ని ప్రతిష్ఠించి చక్కగా అలంకరణ చేసి సాంప్రదాయబద్ధంగా పండుగను ఆచరించారు. పిండి వంటలు తయారు చేసుకుని భోజనం చేశారు. ఆదిదేవత లక్ష్మీ దేవిని పూజించడం వల్ల అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయనే నమ్మకంతో మహిళలు ప్రత్యేక శ్రద్ధతో వ్రత ఆచరణ చేశారు. పండుగ సందర్భంగా సెలవు లేకున్నా మహిళా ఉద్యోగులు సెలవు పెట్టడంతో కార్యాలయాలు మాత్రం ఖాళీగా కనిపించాయి. నగరంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. నగరంలోని విద్యాగణపతి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ పూజను నెరవేర్చారు.

ప్రజలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

కోలారు: తమపై జరిగిన దౌర్జన్యాలపై ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ ఎం.నారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి దళితుల గ్రీవెన్స్ డేకి అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలోని ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేయవచ్చని, ఎక్కడైనా పోలీసులు స్పందించకుంటే నేరుగా తన దృష్టికి తేవచ్చన్నారు. జిల్లాలో 2021–22వ సంవత్సరంలో దళితులపై 48 దౌర్జన్య కేసులు నమోదయ్యాయన్నారు. వీటిలో ఇప్పటికే రెండు కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయన్నారు. ఇంకా 46 కేసులు కోర్టులో విచారణ దశలో ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే చిన్న చిన్న గొడవలను అక్కడికక్కడే పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి నెల రెండో ఆదివారం ప్రతి పోలీస్ స్టేషన్‌లోను దళితుల ఫిర్యాదు స్వీకరణను నిర్వహించాలని ఆదేశించామన్నారు. జిల్లాలో దళితులపై జరిగే దౌర్జన్యాలపై నిర్లక్ష్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ భాస్కర్, డీఎస్పీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యతో ఆపద దూరం



ఆత్మరక్షణ విద్య కరాటేను ప్రదర్శిస్తున్న దృశ్యం

హొసపేటె: మహిళల ఆత్మరక్షణ కోసం కరాటే, జూడో, మార్షల్ ఆర్ట్స్‌పై ప్రాథమిక అవగాహన ఉండాలని, వాటితో ఆపద నుంచి బయట పడవచ్చని జిల్లా సెషన్స్ జడ్జి అబ్దుల్ రహమాన్ ఏ.నందగి అన్నారు. ఆయన శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో బాలిక స్వీయ రక్షణ చర్యలు అనే అంశంపై నిర్వహించిన ఆత్మరక్షణ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళల రక్షణకు అనేక చట్టాలకు తోడు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనే ధైర్యం మహిళలకు ఉండాలన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో మహిళలు ఆపద నుంచి ఎలా బయట పడాలో తెలియజేయాలనేదే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ప్రధాన సివిల్ జడ్జి కిషన్, టీబీ డ్యాం స్టేషన్ ఎస్ఐ శిల్పా మూగనగౌడ్ర, ప్రధాన సివిల్ సీనియర్ జడ్జి హేమలత, సివిల్ జడ్జి రమేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.